అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శనివారం 05-10-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 277 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



2036 ఒలింపిక్స్ లక్ష్యంగా
స్పోర్ట్స్ పాలసీ

వివక్షకు తావులేకుండా నగదు ప్రోత్సాహకాలు

క్రీడా పాలసీ సమీక్షా మావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్

కొత్త రాష్ట్రంలో పదేండ్లుగా క్రీడా రంగాన్ని నిర్లక్ష్యం చేశారని, కనీసం క్రీడా పాలసీని సైతం తీసుకురాలేదని.. 2036 ఒలింపిక్స్‌లో తెలంగాణ క్రీడాకారులు పతకాలు సాధించటమే లక్ష్యంగా నూతన క్రీడా పాలసీని రూపొందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. స్పోర్ట్స్ పాలసీ ముసాయిదాపై రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కే. కేశవరావు, ఏపీ జితేందర్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్) చైర్మన్ కే. శివసేనారెడ్డి, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్ సహా ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వివిధ దేశాలు, ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను సీఎంకు ఉన్నతాధికారులు వివరించారు.

ప్రయివేటు భాగస్వామ్యంతో.. : దక్షిణ కొరియా చిన్న దేశం. కానీ ఒలింపిక్స్‌లో పతకాలు కొల్లగొడుతుంది. అక్కడ జాతీయ స్పోర్ట్స్ యూనివర్శిటీ సహకారంతో తెలంగాణలో స్పోర్ట్స్ యూనివర్శిటీ నెలకొల్పాలి. క్రీడా విశ్వవిద్యాలయాన్ని యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్శిటీగా తీర్చిదిద్దాలి. యంగ్‌ఇండియా స్కిల్ యూనివర్శిటీ తరహాలోనే ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంతో (పీపీపీ) ఏర్పాటు చేయాలి. యూనివర్శిటీకి ప్రత్యేక బోర్డుతో పాటు స్వయం ప్రతిపత్తి ఉండాలి. క్రికెట్, హాకీ, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, స్విమ్మింగ్, టెన్నిస్, బ్యాడ్మింటన్, షూటింగ్, బాక్సింగ్, రెజ్లింగ్, టేబుల్ టెన్నిస్, అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, అక్వాటిక్స్ వంటి 14 క్రీడలతో యూనివర్శిటీలో స్పోర్ట్స్ హబ్‌ను తయారు చేయాలి. గచ్చిబౌలి క్రీడా ప్రాంగణంలో 70 ఎకరాల స్థలం అందుబాటులో ఉంది. హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌తో పాటు గచ్చిబౌలి స్టేడియాన్ని స్పోర్ట్స్ యూనివర్శిటీ ఏర్పాటుకు పరిగణనలోకి తీసుకుని ప్రణాళికలు సిద్ధం చేయాలి. తెలంగాణ భౌగోళిక పరిస్థితులతో పాటు ఇక్కడి యువత ఆసక్తి కనబరిచే క్రీడలకు విశ్వవిద్యాలయంలో ప్రాధాన్యత ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

వివక్షకు తావులేని ప్రైజ్‌మనీ : జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన తెలంగాణ క్రీడాకారులకు వివక్షకు తావులేకుండా నగదు ప్రోత్సాహకాలు, రాష్ట్ర ప్రభుత్వం నేరుగా ఉద్యోగాలు అందించేందుకు పారదర్శకంగా స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. ఎల్బీ స్టేడియం, గచ్చిబౌలి స్టేడియం, హకీంపేట స్పోర్ట్స్ స్కూల్, కోట్ల విజయభాస్కరరెడ్డి ఇండోర్ స్టేడియం, సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం, ఓయూ సైక్లింగ్ వెలోడ్రమ్ వంటి క్రీడా కేంద్రాలను ఒకే గొడుకు కిందకు తీసుకొచ్చి అక్కడి మౌళిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు.

వాతావరణ మార్పులతో
జనాభా అవసరాలు తీర్చలేకపోతున్న పంట దిగుబడులు
అన్నదాత బెంబేలు
వెంటాడుతున్న ప్రకృతి వైపరీత్యాలు

ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన ఓ నివేదిక తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. గత సంవత్సరం దేశంలో 70 కోట్ల మందికి పైగా ప్రజలకు తినడానికి పట్టెడన్నం సైతం కరువైందట. ఇక ప్రపంచ జనాభా విషయానికి వస్తే మూడో వంతు మందికి ఆరోగ్యకరమైన ఆహారం లభించడం లేదట. ఈ నేపథ్యంలో ఆహారధాన్యాల ఉత్పత్తిని గణనీయంగా పెంచే వంగడాలపై శాస్త్రవేత్తలు తక్షణమే దృష్టి సారించాల్సిన అవసరం ఏర్పడింది. భారీ వర్షాలు, కరువు కాటకాలు వంటి ప్రకృతి వైపరీత్యాల కారణంగా దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పడిపోతోంది. ఫలితంగా పెరుగుతున్న జనాభా అవసరాలకు తగిన తిండి గింజలు అందుబాటులో ఉండడం లేదు. దేశంలో వినిపిస్తున్న ఆకలి కేకలకు ఒక కారణమే

నూతన వంగడాల సృష్టి తప్పనిసరి

70 కోట్ల మంది పేదలకు పట్టెడన్నం కరువు




న్యూఢిల్లీ : వాన రాకడ, ప్రాణం పోకడ ఎవరికీ తెలియదని ఓ సామెత. సకాలంలో వర్షాలు పడితే అన్నదాతలు తమ పొలాలలో విత్తనాలు వేసుకుంటారు. అసాధారణ రీతిలో కుంభవృష్టి కురవడం, అంతలోనే కొద్ది రోజుల పాటు ఎండలు మండిపోవడం ఇప్పుడు సర్వసాధారణమై పోయింది. ఇలాంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులలో పంట ఎప్పుడు వేసుకోవాలో తెలియక రైతు అయోమయంలో పడిపోతున్నాడు. గతంలో వర్షాకాలం ప్రారంభం కాగానే తొలకరి జల్లులు పలకరించేవి. రైతులు ఉత్సాహంగా ఏరువాక పనులు మొదలు పెట్టేవారు. కానీ ఇప్పుడా వాతావరణం లేదు. అప్పుడప్పుడూ కురుస్తున్న వర్షాలను చూసి విత్తనాలు వేసుకున్నా అవి మొలకెత్తడం లేదు. ఎడతెరిపి లేకుండా వానలు పడడమో లేదా రోజుల తరబడి పొడి వాతావరణం నెలకొని ఉండడమో దీనికి కారణం.

అందుబాటులో మేలైన రకాలు

ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకొని మంచి దిగుబడులను అందించే మేలైన విత్తనాల ఉత్పత్తికి శాస్త్రవేత్తలు నిరంతరం కృషి చేస్తూనే ఉన్నారు. నూతన వంగడాలతో పలువురు రైతులు తమ వ్యవసాయ క్షేత్రాలలో ప్రయోగాలు చేస్తూ మంచి ఫలితాలు పొందుతున్నారు. తక్కువ నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, క్రిమికీటకాల బెడద అధికంగా ఉన్నప్పటికీ వాటిని తట్టుకొని అధిక దిగుబడులు అందించే వంగడాలు ఇప్పుడు రైతులకు అందుబాటులోకి వచ్చాయి. అయితే ఇప్పటికీ కొన్ని పాత రకాలకు మార్కెట్‌లో డిమాండ్ ఉంటోంది. రైతులు వాటినే ఎక్కువగా విశ్వసిస్తున్నారు.

పరిశోధనా సంస్థల చేయూత

ప్రపంచంలో అత్యధికంగా వరి, గోధుమలు పండించే దేశాలలో భారత్ కూడా ఒకటి. ప్రపంచంలోని ఇతర దేశాలలోని పరిశోధనా సంస్థలకు మాదిరిగానే మన దేశంలోని సంస్థలు కూడా చీడపీడలను తట్టుకొని, మంచి ఫలితాలు అందించే వంగడాల ఉత్పత్తి కోసం కృషి చేస్తున్నాయి. కొన్ని వంగడాలు నీటి ఎద్దడిని కూడా సమర్థవంతంగా తట్టుకుంటాయి. వాతావరణంలో వస్తున్న అనూహ్య మార్పుల కారణంగా ఇలాంటి రకాల అవసరం మరింత పెరుగుతోంది. ఆహారోత్పత్తిలో స్వయంసమృద్ధి సాధించే దిశగా ఆ సంస్థలు తమ వంతు ప్రయత్నాలు సాగిస్తూనే ఉన్నాయి. అమెరికా...13లో



తిరుపతి లడ్డూ వివాదంపై
స్వతంత్ర సిట్
సుప్రీంకోర్టు ఆదేశం

సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో దర్యాప్తు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తిరుమల శ్రీవారి లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి వినియోగించారన్న ఆరోపణల నేపథ్యంలో ఐదుగురు సభ్యులతో స్వతంత్ర ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటుకు సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ సిట్‌లో...6లో



టీజీపీఎస్సీ వద్ద గ్రూప్-1
పోస్టర్ల కలకలం
తెలుగు అకాడమీ ముందు కూడా...

అభ్యర్థుల్లో ఆందోళన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ నాంపల్లిలోని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కార్యాలయం వద్ద గ్రూప్-1 పోస్టర్లను అంటించడం కలకలం రేపింది. అక్కడ గోడలు, గేట్లకు అవి వెలిశాయి. హిమాయత్‌నగర్‌లోని తెలుగు అకాడమి కార్యాలయం వద్ద కూడా ఆ పోస్టర్లను అంటించారు. దీనిపై అభ్యర్థుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. 'తెలుగు...13లో

పేదల ఇండ్లు కూల్చితే ఊరుకోం
వ్యాపార ప్రయోజనాలు, కమీషన్ల కోసమే మూసీ సుందరీకరణ

- ఎన్నికలప్పుడు, రాజకీయ స్వలాభం కోసం మాత్రమే బూర్జువా పార్టీలు పేదల వద్దకు వస్తాయి
- ఆపదలో అండగా నిలిచేది ఎర్రజెండానే
- సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య



మూసీ పరివాహక ప్రాంతంలో పర్యటన

నవతెలంగాణ-సిటీబ్యూరో

"మూసీ సుందరీకరణ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు పేద, మధ్యతరగతి ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. వ్యాపార ప్రయోజనాలు, కమీషన్ల కోసమే.. పేదల ఇండ్లను కూల్చితే ఊరుకునేది లేదు.. ప్రతిఘటించి తీరుతాం.." అని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రామంతాపూర్‌లో మూసీని ఆనుకొని ఉన్న బాలకృష్ణ నగర్, కేటీఆర్‌నగర్‌లో శుక్రవారం సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి పి.సత్యం, నాయకులతో కలిసి వారు పర్యటించారు. మూసీ...13లో

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్
36 మంది మావోయిస్టుల మృతి

అంబుజ్‌మాడ్ అడవుల్లో ఎదురు కాల్పులు



నవతెలంగాణ-చర్ల

ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్-దంతెవాడ జిల్లా సరిహద్దు అంబుజ్‌మాడ్ దండకారణ్యంలో శుక్రవారం మధ్యాహ్నం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. పోలీసులకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో 36 మంది మావోయిస్టులు మృతి చెందారు. బస్తర్ ఐజీ సుందర్ రాజ్ పి ఆదేశాల మేరకు నారాయణపూర్ ఎస్పీ ప్రభాత్ కుమార్ నేతృత్వంలో అంబుజ్‌మాడ్ దండకారణ్యంలో సెర్చ్ ఆపరేషన్‌కు భద్రతా బలగాలు వెళ్లాయి. ఈ క్రమంలో మావోయిస్టు గెరిల్లాలకు, భద్రతా బలగాలకు మధ్య హెూరాహెూరీగా కాల్పులు జరిగాయి. సాయంత్రం వరకు జరిగిన కాల్పుల్లో 36 మంది మావోయిస్టులు చనిపోయినట్టు ఎస్పీ ప్రభాత్ కుమార్ ధృవీకరించారు. సంఘటనా స్థలం నుంచి ఏకే 47, ఎస్ఎల్ఆర్ తదితర ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. అంబుజ్‌మాడ్ ప్రాంతం మావోయిస్టులకు సేఫ్ జోన్ కావడంతో భద్రతా బలగాలు వ్యూహ ప్రతివ్యూహాలతో వారి సర్వశక్తులను ఒడ్డుతూ మావోయిస్టుల శిబిరాలను చుట్టుముట్టాయి. కాగా, ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న సైనికులందరూ సురక్షితంగా ఉన్నారని, కాల్పులు ఇంకా కొనసాగుతున్నాయని పోలీసు అధికారులు తెలిపారు.

సాహిత్యమే సమాజానికి దీపస్తంభం
సోషల్‌మీడియా క్రాస్‌రోడ్డులో ప్రజలు

వారిని చైతన్యపర్చాల్సిన బాధ్యత యువ రచయితలదే

రచనల్లో శాస్త్రీయ దృక్పథాన్ని జొప్పించాలి

భాషా, సాంస్కృతిక శాఖ కార్యదర్శి మామిడి హరికృష్ణ

తెలంగాణ సాహితీ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో యూత్ లిటరరీ ఫెస్ట్

3లో..



ఎలాంటి మినహాయింపులొద్దు
నా ఫామ్‌హౌస్ బఫర్ జోన్‌లో ఉంటే నేనే కూల్చేస్తా

సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ ఎంపీ కేవీపీ లేఖ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

చెరువులు, కుంటలను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రాకు మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు అండగా నిలిచారు. హైడ్రాను ముందుకు తీసుకు పోవడంతోపాటు పార్టీ ఆదేశాలను పాటిస్తూ...13లో



దొడ్డు వడ్లకూ రూ.500 బోనస్ చెల్లించాలి
సన్న వడ్లకే బోనస్ అన్న ప్రభుత్వ ప్రకటనపై ఆగ్రహం

ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్

సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ లేఖ

వివరాలు 5లో..



రూ.2 లక్షల రుణమాఫీ ఏమాయే?

ఎన్నికల హామీల్లో భాగంగా రూ.2లక్షల రుణమాఫీ ఏమాయే... ఎంపీ ఎన్నికల్లో ఎక్కడికి వెళ్లినా దేవుళ్లపై ఒట్టు పెట్టి ఆగస్టు 15లోపు ప్రతి రైతుకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన మాటలు ఎక్కడికి పోయాయి అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ప్రశ్నించారు. గురువారం మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణ కేంద్రంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో కలిసి రుణమాఫీ కానీ రైతులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు, ప్రజలంటే పట్టింపు లేదని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయకుండా మోసం చేస్తున్నారని విమర్శించారు.

రైతులు, ప్రజలంటే సీఎంకు పట్టింపే లేదు | రాష్ట్ర మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

రైతులతో కలిసి తొర్రూర్ పట్టణ కేంద్రంలో ధర్నా



నవతెలంగాణ- తొర్రూర్ రూరల్

రుణమాఫీ కాని రైతుల పరిస్థితిపై ఇప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి స్పష్టతా ఇవ్వలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఆరోపించారు. కుంటి సాకులతో రైతుల రుణమాఫీ ఆపారని అన్నారు. రైతులు, మహిళలు, వృద్ధులు, ఉద్యోగులు, నిరుద్యోగులు నేడు రేవంత్ రెడ్డిని మోసగాడని అంటు న్నారని తెలిపారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న ఒక్కో రాష్ట్రంలో ఒక్కో రకమైన మోసపూరితమైన హామీలను ఇస్తున్నారని చెప్పారు. కౌలు రైతులకు రూ.15,000 రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు రూ.12,000 హామీ ఏమైందని ప్రశ్నించారు. వీటన్నింటిపై రాహుల్ గాంధీ.. కనీసం అడగడం లేదా అని ప్రశ్నించారు. నేడు రాష్ట్రంలో రౌడీ రాజ్యం నడుస్తున్నదని, హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో పేదల ఇండ్లను కూలగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి ఇండ్లను కూలిస్తే తాము చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. రూ.2లక్షల రుణమాఫీ, దసరా లోపు రైతులకు రైతుబంధు డబ్బులు ఎకరానికి రూ.7,500 బ్యాంక్ ఖాతాలో జమచేయాలని కోరారు. ఇప్పటికే మహబూబాబాద్...13లో



అనేక కష్టనష్టాలు చూశా
పీసీసీ పదవితో వడ్డీతో సహా దక్కింది

కష్టపడిన వారందరికీ పదవులు..

సీఎం రేవంత్ టీమ్‌లో

మంచి మంత్రులున్నారు

మోడీ దేవుళ్ళ పేర రాజకీయంతో ఓట్ల బిక్షాటన చేస్తున్నారు

అప్పులు చేసి కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు పరిమితమయ్యారు

స్వాగత సభలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

వివరాలు 6లో

విద్యావిధానంలో మార్పు రావాలి

- ఎస్టీయూ కార్యవర్గ సమావేశంలో విద్యా కమిషన్ చైర్మెన్ ఆకునూరి మురళి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలంటే తెలంగాణ విద్యా విధానంలో మార్పు రావాలని విద్యా కమిషన్ చైర్మెన్ ఆకునూరి మురళి అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని కాచిగూడలో ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో వివిధ సమస్యలున్నాయనీ, అవి తన దృష్టికి వచ్చాయని చెప్పారు. ఉపాధ్యాయులు, విద్యావేత్తలతో సమస్యలపై సంప్రదింపులు చేపడతామని అన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం పర్వత్‌రెడ్డి, జి సదానందంగౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల మ్యానిఫెస్టోలోని అంశాలను అమలు చేయాలని కోరారు. ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల సప్లిమెంటరీ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

సర్వీసు నిబంధనలను సాధించి, ఎంఈవో, డిప్యూటీఈవో, డైట్, జూనియర్ లెక్చరర్ పోస్టులకు పదోన్నతులు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు.

317 జీవోపై నియమించిన క్యాబినెట్ సబ్ కమిటీ ద్వారా త్వరితగతిన ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు బదిలీ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. డీఎస్సీ నియామకాలు పూర్తయిన వెంటనే, బదిలీ అయిన ఎస్జీటీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని చెప్పారు. ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీల్లో పనిచేస్తున్న సీఆర్టీ ఉపాధ్యాయులకు అన్ని రకాల సెలవులతోపాటు, మినిమం టైం స్కేల్‌ను మంజూరు చేయాలని అన్నారు. పీఆర్సీ గడువు ముగిసి ఏడాది గడిచిందనీ, వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలనీ, సీపీఎస్ రద్దు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పరిష్కారానికి కృషి చేస్తామని వివరించారు. ఈ సమావేశంలో ఎస్టీయూటీఎస్ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఆట సదయ్య, నాయకులు ఎల్ఎం ప్రసాద్, జుట్టు గజేందర్, పోల్ రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఎం శంకర్, శీతల్ చౌహాన్, శిరీష, రంగారావు, బి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా కె.శ్రీనివాసులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా కె.శ్రీనివాసులు ఎన్నికయ్యారు. శుక్రవారం ప్రధాన ఎన్నికల అధికారి శ్యామ్, ఉప ఎన్నికల అధికారి డాక్టర్ రామారావు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు సంబంధించి సెప్టెంబర్ 23న నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. తాజా ఎన్నికల్లో అసోసియేట్ అధ్యక్షులుగా ఎస్ రామాంజనేయులు, జనరల్ సెక్రెటరీగా సునీల్ రాజ్ , కోశాధికారిగా నామాల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా మంచాల రవీందర్ తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

వీరికి రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు ధ్రువపత్రాలను అందజేసి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాసులు మాట్లాడుతూ తనను ఎన్నుకున్న సభ్యులకు, రాష్ట్ర నాయకత్వానికి కతజ్ఞతలు తెలిపారు. కేంద్ర సంఘం ఆదేశాల మేరకు సమస్యలపై పోరాడుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు కలిముద్దీన్ హైమద్ తదితరులు పాల్గొన్నారు.

6న ఆప్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బతుకమ్మ పండుగ వేడుకలను ఈ నెల 6న హైదరాబాద్ నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ మహిళా విభాగం తెలిపింది. శుక్రవారం హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆ విభాగం అధ్యక్షురాలు హేమ జిల్లోజు, ప్రధాన కార్యదర్శి నర్సింగ్ యమున గౌడ్ మాట్లాడారు. కులమతాలకతీతంగా నిర్వహిస్తున్న వేడుకల్లో మహిళందరూ పాల్గొని ఏకత్వస్ఫూర్తిని చాటుతారని వారు తెలిపారు. ఈ సమావేశంలో ఆప్ డాక్టర్స్ వింగ్ అధ్యక్షురాలు డాక్టర్ లాక్ష్యా, జిల్లా నాయకులు ఫర్హాత్ ఉన్నిసా, మౌనికా తదితరులు పాల్గొన్నారు.

ఐసెట్ ప్రత్యేక విడత సీట్ల కేటాయింపు

- ఎంబీఏలో 25,690 మంది, ఎంసీఏలో 5,878 మంది
- కాలేజీల్లో రిపోర్టు చేసే గడువు 7

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఐసెట్ ప్రత్యేక విడత కౌన్సెలింగ్‌లో సాంకేతిక విద్యాశాఖ సీట్లు కేటాయించింది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఐసెట్ ప్రవేశాల కన్వీనర్ శ్రీదేవసేన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐసెట్‌లో 71,647 మంది అర్హత సాధించారని తెలిపారు. 40,532 మంది ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారనీ, వారిలో 9,967 మంది వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని వివరించారు. రాష్ట్రంలో 268 ఎంబీఏ కాలేజీల్లో 28,623 సీట్లు, 89 ఎంసీఏ కాలేజీల్లో 6,966 సీట్లు కలిపి 35,589 సీట్లున్నాయని తెలిపారు. ఐసెట్ ప్రత్యేక విడత కౌన్సెలింగ్‌లో ఎంబీఏలో 25,690 మంది, ఎంసీఏలో 5,878 మంది కలిపి 31,568 (88.7) మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. ఎంబీఏలో 2,933 సీట్లు, ఎంసీఏలో 1,088 సీట్లు కలిపి మొత్తం 4,021 (11.3 శాతం) సీట్లు మిగిలాయని వివరించారు.

వంద కాలేజీల్లో వంద శాతం సీట్లు భర్తీ అయ్యాయని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన తరగతులు (ఈడబ్ల్యూఎస్) కోటా కింద 1,289 మందికి సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేసేందుకు శనివారం వరకు గడువుందని తెలిపారు. కేటాయించిన కాలేజీల్లో ఈనెల ఏడో తేదీ వరకు రిపోర్టు చేయాలనీ, ఒరిజినల్ టీసీ, ఇతర ధ్రువపత్రాలను సమర్పించాలని సూచించారు. ఇతర వివరాల కోసం https://tgicet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

హైడ్రా కేసులో ముందస్తు బెయిల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిజాంపేట ప్రగతినగర్‌లోని ఎర్రకుంట చెరువు బఫర్‌జోన్, ఎఫ్టీఎల్‌ల్లో ఆక్రమ నిర్మాణాలకు పర్మిషన్లు ఇచ్చారని హైడ్రా అభియోగాలకు అనుగుణంగా పోలీసులు నమోదు చేసిన కేసులో హెచ్‌ఎండీఏ అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ సుధీర్‌కుమార్‌కు ముందస్తు బెయిల్ మంజూరైంది. ఈ మేరకు జస్టిస్ శ్రీదేవి పలు షరతులతో ముందస్తు బెయిల్ ఇచ్చారు. ఇదే తరహాలో ముందస్తు బెయిల్ కావాలంటూ పిటిషన్ వేసిన జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ ఎస్ సుధాంశు వేసిన పిటిషన్‌ను దసరా సెలవుల తర్వాత విచారించనుంది.

యువ కథా రచయితలకు ప్రోత్సాహం

తెలంగాణ సాహితీ డీవైఎఫ్ఐ సంయుక్త స్వీయ కథా విశ్లేషణలో వక్తలు

నవతెలంగాణ - ముషీరాబాద్



యువ కథా రచయితలను ప్రోత్సహించడానికి వేదికను ఏర్పాటు చేయడం హర్షణీయమని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం తెలంగాణ సాహితి, డీవైఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో స్వీయ కథా విశ్లేషణ నిర్వహించారు. రచయితలు, కవులు కేపీ లక్ష్మీనరసింహ, ఎండ్లూరి మానస, కె.వి మన్ ప్రీతం, బుద్ధి గణేష్, సుదర్శన్, సాయి వంశీ, రవీంద్ర రావెళ్ల, ఊహశ్రీ, పెద్దపల్లి తేజస్విని, సలీమా, ముక్కమల్ల జానకిరామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువ కథా రచయితలు, కవులు స్వీయ కథ విశ్లేషణలో భాగంగా వాళ్ల వాళ్ల అస్తిత్వాల నుంచి.. పరిశీలన నుంచి తెలుసుకున్న అంశాలను కథల రూపంలో వెలువర్చేందుకు ప్రయత్నించామని చెప్పుకొచ్చారు. వాళ్ల కథ నేపథ్యాన్ని వివరిస్తూ కథ రాయడానికి ఎదురైన సందర్భాలను, మన చుట్టూ సామాజిక స్పృహ లోతుగా అధ్యయనం చేయడం, సమాజంలో జరుగుతున్న ఆటుపోట్లను వివరించడం కంటతడి పెట్టించే విధంగా ఉందన్నారు. యువ రచయితలకు అవకాశం ఇచ్చి వారి మనసు నుంచి వచ్చిన భావాలనే కథ రూపంలో వివరించి.. వాటిని విశ్లేషణ చేసి సమాజానికి అందించడం, యువ కథకులను ప్రోత్సహించడం ఎంతో హర్షించదగ్గ విషయం అని తెలిపారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

రాత్రి జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో అజయ్ మంగినపల్లి క్రియేటివ్ థియేటర్స్ తరపున 'ఓటు రైట్' అనే నాటికను ప్రదర్శించారు. ప్రజానాట్యమండలి నగర కమిటీ ఆధ్వర్యంలో 'హెచ్చరిక' నాటికను ప్రదర్శించారు. శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం, కమిటీ కుర్రాళ్ళు సినిమా హీరో శ్యామ్ కళ్యాణ్, ఫూ ఫ్లేర్స్ ఆఫ్ సీఈవో నవీన్ కృష్ణ గోశాల, సినీ హీరో రాజీవ్ సిద్ధార్థ, రాజు స్వరూప్, డైరెక్టర్ వినయ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓటు రైట్ నాటిక సమాజంలో ఎంతో అవసరమని, ఓటు ప్రాధాన్యత కండ్లకు కట్టినట్టు చూపించారని అన్నారు. ఒక్క ఓటు ద్వారా సమాజాన్ని మార్చవచ్చనే అంశాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలని, అసలైన నాయకున్ని ఎన్నుకోవడానికి ఓటు ఒక ఆయుధంగా ఉపయోగపడుతుందని అన్నారు. 'హెచ్చరిక' నాటిక ప్రస్తుత సమాజాన్ని మేలుకొలుపుతుందని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు బానిసగా మారుతున్నారని.. వాటి వల్ల ఎటువంటి అనర్థాలు జరుగుతాయో ఈ నాటిక ద్వారా తెలుస్తుందన్నారు. యువత సన్మార్గంలో నడవాలని డ్రగ్స్ రహిత సమాజానికి పాటుపడాలని కోరారు. మత్తు తాత్కాలిక ఆనందాన్నిస్తుందని, పుస్తకం జీవితకాల ఆనందాన్నిస్తుందని ఇది గ్రహించినప్పుడు సమాజం మార్పు దిశగా అడుగులు వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోటి రమేష్, హైదరాబాద్ నగర కార్యదర్శి ఎండి.జావీద్, హష్మీ బాబు, తెలంగాణ సాహితి రాష్ట్ర నాయకులు తంగిరాల చక్రవర్తి, రేఖ, శరత్ సుదర్శి, శరత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

విమర్శ

సాయంత్రం విమర్శపై సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రచయితలు, విమర్శకులు బండారు రాజ్ కుమార్, బోలా యాదయ్య, డా.ఎస్ చంద్రయ్య, శివరాత్రి సుధాకర్మాణిక్యం గిద్ద కింద, గిరీశం హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విమర్శ అనే దానికి వేదికలు ఇవ్వడం చాలా అరుదుగా జరుగుతున్న సందర్భం అని, కానీ తెలంగాణ సాహితి, డీవైఎఫ్ఐ సంయుక్తంగా నిర్వహించిన యూత్ లిటరరీ ఫెస్ట్ విమర్శకు కూడా పెద్దపీట వేసిందని కొనియాడారు. ఈ వేదిక ద్వారా విమర్శ లోటుపాట్లను లోతుగా వెళ్లి చర్చించొచ్చన్నారు. సమాజంలో ఏదైనా పుస్తకాన్ని, కవిత్వాన్ని, నవలను ఏ విధంగా విశ్లేషణ, విమర్శ చేయాలో లోతుగా చర్చించినప్పుడే తెలుస్తుందని, కథలోని సారాంశాన్ని లోటుపాట్లను ఎత్తిచూపొచ్చని అన్నారు. తద్వారా కవి తాను తీసుకున్న అంశాన్ని ఏ మేరకు కథాంశంగా మార్చడంలో సఫలమయ్యారో తెలుసుకోవచ్చన్నారు. కథకు ప్రశంస ఎంత గొప్పదో విమర్శ కూడా అంతే గొప్పదిగా చూడాలని అలాంటప్పుడే కథనానికి సంపూర్ణత్వం వస్తుందని తెలిపారు.

కోర్టు జోక్యం తగదు

- అభ్యంతరాల స్వీకరణ తర్వాతే గ్రూప్ -1 ఫలితాలు
- హైకోర్టులో టీజీపీఎస్సీ వాదనలు
- పిటిషనర్లు, టీఎస్‌పీఎస్సీ వాదనలు విన్న హైకోర్టు
- గ్రూప్-1 పిటిషన్లపై తీర్పు రిజర్వు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు సిద్ధం చేశామనీ, ఇప్పటికే మెయిన్స్‌కు అభ్యర్థులను ప్రకటించామనీ, ఇలాంటి సమయంలో కోర్టు జోక్యం చేసుకోవడం కరెక్ట్ కాదంటూ టీజీపీఎస్సీ కోర్టుకు విజ్ఞప్తి చేసింది. గ్రూప్-1 నోటిఫికేషన్‌పై హైకోర్టులో పిటీషన్లు దాఖలైన సంగతి తెలిసిందే. 2022లో జారీ చేసిన గ్రూప్-1 నోటిఫికేషన్‌ను రద్దు చేయకుండా మరో నోటిఫికేషన్ జారీ చేయడం చెల్లదని పేర్కొంటూ దామోదర్‌రెడ్డితో పాటు వికారాబాద్, యాదాద్రి, హనుమకొండ, వరంగల్ జిల్లాలకు చెందిన మరో అయిదుగురు ఈ పిటీషన్లను దాఖలు చేశారు. అంతేకాకుండా తాజాగా నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ప్రాథమిక కీలో తప్పులున్నాయనీ, వాటిని సవరించాలన్న అభ్యంతరాలను పట్టించుకోకపోవడాన్ని సవాల్ చేస్తూ పలువురు అభ్యర్థులు రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ పుల్లా కార్తీక్ విచారణ చేపట్టారు. విచారణ సమయంలో ప్రభుత్వం తరపు న్యాయవాది కీలక విషయాలను ధర్మాసనానికి తెలియజేశారు. గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షల కీపై అభ్యంతరాలు స్వీకరించామనీ, వాటిని ఆయా సబ్జెక్టుల వారీగా నిపుణుల కమిటీకి పంపి, వారు ఆమోదించిన తర్వాతే ఫలితాలు విడుదల చేసినట్టు టీజీపీఎస్సీ హైకోర్టుకు నివేదించింది. మెయిన్స్ కోసం క్వాలిఫై అయిన వారికి త్వరలో మెయిన్స్ పరీక్షలు జరగనున్నాయని తెలిపింది. ఈ దశలో కోర్టులు జోక్యం చేసుకోరాదనీ, దీనివల్ల అభ్యర్థులకు తీవ్ర నష్టం కలుగుతుందని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది రాహుల్‌రెడ్డి, టీజీపీఎస్సీ తరవున ఎం.రాంగోపాల్‌రావులు వాదనలు వినిపించారు.

గ్రూప్-1 పరీక్షలు రాసిన 3 లక్షల మంది నుంచి ప్రిలిమ్స్ కీపై భౌతికంగా 721, ఆన్‌లైన్ ద్వారా 6,470 అభ్యంతరాలు వచ్చినట్టు న్యాయవాదులు తెలిపారు. వాటిని నిపుణుల కమిటీ పరిశీలించి, కొన్ని సిఫార్సులు చేసింది. వీటిని పరిగణనలోకి తీసుకుని రెండు ప్రశ్నలను తొలగించి కీని విడుదల చేశామని వివరించారు. ప్రస్తుతం పిటిషన్ దాఖలు చేసిన ఐదుగురిలో ఒక్కరే కమిషన్‌కు అభ్యంతరాలు తెలియజేసినట్టు తెలిపారు. మిగిలినవారు ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయకుండా కోర్టును ఆశ్రయించారన్నారు. రెండోసారి నోటిఫికేషన్ జారీని సవాల్ చేసిన అభ్యర్థితో పాటు కీని సవాల్ చేసిన పిటిషనర్లలో ముగ్గురు మెయిన్స్‌కు అర్హత సాధించినట్టు వెల్లడించారు.

ప్రశ్నలకు విశ్లేషణాత్మకంగా ఆలోచించి సమాధానం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఒకరిద్దరికి అర్థం కానంత మాత్రాన అవి తప్పులైనట్టు కాదన్నారు. పరీక్షలను నిష్పాక్షికంగా నిర్వహిస్తున్నామనీ, ఈ పిటిషన్లను కొట్టివేయాలని న్యాయమూర్తిని కోరారు. గురు, శుక్రవారాల్లో కోర్టులో వాదనలు జరిగాయి. శుక్రవారం వాదనలు విన్న తర్వాత కోర్టు తీర్పును రిజర్వు చేసింది.

ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సింగిల్ జడ్జి తీర్పును రద్దు చేయండి

- అసెంబ్లీ సెక్రెటరీ అప్పీల్ దాఖలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ నుంచి ఎన్నికై కాంగ్రెస్ తీర్థం తీసుకున్న ఎమ్మెల్యేలపై దాఖలు చేసిన అనర్హత పిటిషన్‌లపై గత నెల 9న సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు అమలును నిలిపివేయాలని కోరుతూ అసెంబ్లీ కార్యదర్శి వి.నరసింహాచార్యులు హైకోర్టులో అప్పీళ్లు దాఖలు చేశారు. అనర్హత పిటిషన్‌లపై విచారణ నిమిత్తం షెడ్యూలు ఖరారు నిమిత్తం పిటిషన్‌లను స్పీకర్ ముందుంచాలనీ, అనంతరం నిర్ణయించిన షెడ్యూలును హైకోర్టుకు నివేదించాలని సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ వేర్వేరుగా రెండు అప్పీళ్లు దాఖలు చేశారు. పార్టీలు ఫిరాయించిన ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్‌లపై నిర్ణయం తీసుకోలేదంటూ ఊహాజనిత అంశాలతో కౌశిక్‌రెడ్డి, కె.పి.వివేకానంద, ఎ.మహేశ్వర్‌రెడ్డిలు కోర్టును ఆశ్రయించారు. స్పీకర్‌పై తప్పుడు ఆరోపణలు చేశారు. స్పీకర్‌పై వాడిన భాష కూడా హుందాగా లేదు. స్పీకర్ హోదాకు కూడా గౌరవం ఇవ్వలేదు. రాజకీయ ప్రయోజనాల కోసం ఆరోపణలు చేశారు. అనర్హత పిటిషన్‌లను సమర్పించిన వెంటనే స్పీకర్ నిర్ణయం తీసుకునేందుకు కూడా గడువు ఇవ్వకుండా హైకోర్టుకు వచ్చారు.

రాజ్యాంగంలోని 10వ షెడ్యూలు ప్రకారం స్పీకర్ ఓ విధానం ప్రకారం నిర్ణయం తీసుకుంటారు. సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం స్పీకర్ నిర్ణయం తీసుకోకముందే కోర్టుల జోక్యానికి ఆస్కారం లేదు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న గత 10 ఏళ్లలో అనుసరించినట్టే ఇప్పుడు కూడా అనర్హత పిటిషన్‌లపై నిర్ణయం తీసుకోరని భావించి పిటిషన్‌లు వేశారు. అనర్హత పిటిషన్‌లలో తమ వాదనలను పరిగణనలోకి తీసుకోకుండా సింగిల్ జడ్జి ఇచ్చిన ఆర్డర్‌ను రద్దు చేయండి.. అని అప్పీల్ పిటిషన్లల్లో అసెంబ్లీ సెక్రటరీ పేర్కొన్నారు.

అప్పీళ్లపై విచారణ పూర్తయ్యేదాకా సింగిల్ జడ్జి తీర్పు అమలును నిలిపివేయాలని కోరారు. లేని పక్షంలో స్పీకర్ రాజ్యాంగంలో పేర్కొన్నట్టుగా విధులను నిర్వహించే అవకాశం ఉండదన్నారు. వీటిపై అత్యవసరంగా విచారించి తేల్చాలని అభ్యర్థించారు. వాదనలను విన్న ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేస్తూ పార్టీ ఫిరాయించిన దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావులపై దాఖలైన అనర్హత పిటిషన్‌లపై విచారణ షెడ్యూలును నిర్ణయించడానికి ఫైళ్లను స్పీకర్ ముందుంచాలని అసెంబ్లీ కార్యదర్శికి సింగిల్ జడ్జి ఆదేశాలు జారీ చేశారని తెలిపింది. అనంతరం నిర్ణయించిన షెడ్యూలును కోర్టుకు సమర్పించాలని ఆదేశించారని చెప్పింది. కేశం మెగాచంద్ర సింగ్ వర్సెస్ మణిపూర్ స్పీకర్ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పరిగణనలోకి తీసుకుని సింగిల్ జడ్జి ఈ ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొంది. ప్రస్తుత అప్పీళ్లలో నిర్దీత కాలవ్యవధిలో అనర్హత పిటిషన్‌లపై నిర్ణయం తీసుకోవాలంటూ స్పీకర్‌కు ఆదేశాలిచ్చే పరిధి ఈ కోర్టుకు ఉందా? లేదా అన్న వివాదంపై తేల్చాల్సి ఉందని పేర్కొంది. వీటిపై ఈనెల 24న తుది విచారణ చేపడతామనీ, ఈలోగా ఏవైనా చర్యలు తీసుకుంటున్నట్లయితే కోర్టును ఆశ్రయించవచ్చని సూచించింది. చర్యలు చేపట్టినట్లయితే ధర్మాసనం ముందు ప్రస్తావించే అవకాశాన్ని ఇస్తున్నామని తెలిపింది. ఇందులో ప్రతివాదులైన పాడి కౌశిక్‌రెడ్డి, కె.పి.వివేకానంద, ఎ.మహేశ్వర్‌రెడ్డిలతోపాటు కడియం శ్రీహరి, దానం నాగేందర్, తెల్లం వెంకట్రావులకు నోటీసులు జారీ చేస్తూ విచారణను 24కు వాయిదా వేసింది.

నల్లగొండ బీఆర్ఎస్‌కు ఊరట

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నల్లగొండ బీఆర్ఎస్ బిల్డింగ్ నిర్మాణానికి అనుమతులు లేవంటూ నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఇచ్చిన కూల్చివేత నోటీసుల విషయంలో స్టేటస్‌కో (యథాతథస్థితి ఉత్తర్వుల)ను హైకోర్టు జారీ చేసింది. నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ బిల్డింగ్ రెగ్యులరైజేషన్ చేసేందుకు కార్పొరేషన్ తిరస్కరించింది. కూల్చివేత నోటీసులను రెండుసార్లు బీఆర్ఎస్ నేత రమావత్ రవీందర్ సవాల్ చేయడంతో ఆగ్రహించిన సింగిల్ జడ్జి వాటిని కొట్టివేయడమే కాకుండా లక్ష రూపాయల జరిమానా విధించారు. వీటిని సవాలు చేస్తూ రవీందర్ అప్పీల్ పిటిషన్ వేయగా చీఫ్ జస్టిస్ అలోక్ అరాథే బెంచ్ శుక్రవారం విచారించింది. ఇదే తరహాలో మరో అప్పీల్ పిటిషన్ ఈ నెల 21న విచారణ జరగనుందనీ, ఈ అప్పీల్‌ను కూడా అప్పుడే విచారిస్తామంది. అప్పటి వరకు బీఆర్ఎస్ బిల్డింగ్ వ్యవహారంపై స్టేటస్‌కో ఉత్తర్వులను అమలు చేయాలని ఆదేశించింది.

సునీల్‌యాదవ్‌కు బెయిల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో రెండో నిందితుడైన యాదాటి సునీల్‌యాదవ్‌కు తెలంగాణ హైకోర్టు షరతులతో బెయిలు మంజూరు చేసింది. రూ.25 వేలు వ్యక్తిగత బాండ్‌తోపాటు అంతే మొత్తానికి మరో ఇద్దరి పూచీకత్తులను సీబీఐ కోర్టుకు సమర్పించాలని సునీల్‌యాదవ్ ను ఆదేశించింది. ప్రతి శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5లోగా పులివెందుల పోలీసు స్టేషన్‌లో హాజరుకావాలని ఆదేశించింది. సాక్షులను ప్రభావితం చేయడానికి ప్రయత్నించరాదనీ, విచారణ ప్రక్రియలో జోక్యం చేసుకోరాదని పేర్కొంది. పాస్‌పోర్టును స్వాధీనం చేయాలని కోర్టు అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లరాదంది. సీబీఐ కోర్టులో ఈ కేసు సత్వర విచారణ ప్రక్రియకు సహకరించాలని ఆదేశించింది. సాక్షులను ప్రభావితం చేయడానికి ప్రయత్నించినా, విచారణ ప్రక్రియలో జోక్యం చేసుకున్నా బెయిలు రద్దుకు పిటిషన్ దాఖలు చేయడానికి సీబీఐకి అనుమతించింది. వివేకానందరెడ్డి హత్య కేసులో రెండో నిందితుడైన యాదాటి సునీల్‌యాదవ్ దాఖలు చేసిన బెయిలు పిటిషన్‌పై సుదీర్ఘ వాదనలను విన్న జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం తీర్పు వెలువరించారు. విచారణ ప్రక్రియను సునీల్‌యాదవ్ ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారని సీబీఐతోపాటు సునీతారెడ్డిల ప్రధాన ఆరోపణ అని పేర్కొన్నారు. అయితే దీనికి విరుద్ధంగా ఎలాంటి పిటిషన్‌ను కింది కోర్టులో దాఖలు చేయలేదనీ, సీబీఐ విచారణకు హాజరయ్యాననీ, దీన్నిబట్టి చూస్తే విచారణ జాప్యానికి కారణం సునీల్‌యాదవ్ అంటూ సీబీఐ నెపం వేస్తోందన్నారు. ఈ కేసులో సునీల్‌యాదవ్‌కు వ్యతిరేకంగా అయిదుగురు కీలక సాక్షులున్నారనీ, వారి సాక్ష్యాలు నమోదు చేసేదాకా బెయిలు మంజూరు చేయరాదని సీబీఐ అభ్యర్థించిందన్నారు. అయితే మొత్తం 300 మంది సాక్షులుండగా సీబీఐ పేర్కొన్న అయిదుగురు సాక్షుల్లో 218 సాక్షి వాంగ్మూలం నమోదు చేయడానికి చాలా సమయం పడుతుందన్నారు. సాక్షులను బెదిరిస్తారన్నది సీబీఐ ప్రధాన ఆరోపణ అనీ, అలా జరిగితే బెయిలు రద్దు కోరవచ్చనీ, అంతేగానీ ఈ కారణంగా నిర్బంధంలో ఉంచడం సరికాదంటూ షరతులతో బెయిలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నువ్వా-నేనా?

నేడు హర్యానాలో పోలింగ్

- ప్రభుత్వ వ్యతిరేక పవనాలపై కాంగ్రెస్ ఆశలు
- ఆప్ ఒంటరి పోరు



చండీఘర్ : హర్యానా శాసనసభలోని 90 స్థానాలకు శనివారం పోలింగ్ జరుగుతుంది. 101 మంది మహిళలు సహా 1,031 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. రెండు కోట్ల మందికి పైగా ఓటర్లు వారి భవితవ్యాన్ని తేల్చబోతున్నారు. వీరిలో 8,821 మంది ఓటర్ల వయసు సెంచరీ దాటేయడం గమనార్హం. 2019లో జరిగిన శాసనసభ ఎన్నికలలో బీజేపీకి 40 స్థానాలు లభించగా కాంగ్రెస్ 31 స్థానాలకే పరిమితమైంది. మెజారిటీకి ఆరు స్థానాలు తక్కువ పడిన బీజేపీ, జేజేపీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే ఈ మార్చిలో అధికార కూటమి విడిపోయింది. మనోహర్ లాల్ ఖట్టర్ స్థానంలో నయాబ్ సింగ్ సైనీను ముఖ్యమంత్రిగా బీజేపీ నియమించడంతో కూటమికి జేజేపీ గుడ్‌బై చెప్పింది.

హోరాహోరీగా ప్రచారం

ఇప్పుడు ఆజాద్ సమాజ్ పార్టీతో పొత్తు పెట్టుకొని బీజేపీ ఎన్నికల బరిలో దిగింది. బీజేపీ, కాంగ్రెస్‌తో పాటు ఆప్, ఐఎన్ఎల్‌డీ-బీఎస్పీ కూటమి పోటీలో నిలిచాయి. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల టిక్కెట్లు లభించకపోవడంతో పలువురు స్వతంత్రులుగా పోటీ చేస్తున్నారు. మరోసారి అధికారాన్ని చేజిక్కించుకునేందుకు బీజేపీ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షాతో పాటు 40 మంది కేంద్ర మంత్రులు, ఎంపీలు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హర్యానాలో మోహరించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మరోవైపు ప్రభుత్వ వ్యతిరేక పవనాలను అనుకూలంగా మార్చుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పలువురు మాజీ సీఎంలు, సిట్టింగ్ ఎంపీలు ప్రచారాన్ని హోరెత్తించారు. తీహార్ జైలు నుంచి విడుదలైన వెంటనే ఆప్ అధినేత కేజ్రీవాల్ కూడా హర్యానాలో ప్రచారం నిర్వహించారు.

హామీలు సేమ్ టూ సేమ్

రాష్ట్రంలో మొత్తం 36 బిరాదరీల మద్దతు తనకే ఉన్నదని కాంగ్రెస్ తెలిపింది. ముఖ్యంగా గ్రామీణ ఓట్లపై ఆ పార్టీ ఆశలు పెట్టుకుంది. హర్యానాలోని మొత్తం ఓటర్లలో 69 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లోని వారే. రైతుల ఆందోళన, వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ సరిహద్దుల వద్ద గతంలో జరిగిన నిరసనలు, ఒలింపియన్ రెజ్లర్ల ఉద్యమం, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి అంశాలపై కాంగ్రెస్ ఎక్కువగా ప్రచారం సాగించింది. బీజేపీ మాత్రం జాతీయ అంశాలకే పరిమితమైంది. రెండు పార్టీల మేనిఫెస్టోలు ఒకేలా ఉండడం గమనార్హం. ఐదు వందల రూపాయలకే సిలిండర్ ఇస్తామని, పేదలకు వంద చదరపు గజాల నివాస స్థలం కల్పిస్తామని, మహిళలకు ఆర్థిక సాయం అందిస్తామని, ప్రభుత్వోద్యోగాలను భర్తీ చేస్తామని, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని... ఇలా ఈ రెండు పార్టీలు హామీల వరద పారించాయి. 24 పంటలకు కనీస మద్దతు ధరలు అందిస్తామని బీజేపీ తెలుపగా ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది.

కుల సమీకరణలు

అభ్యర్థుల ఎంపికలో రెండు పార్టీలు కుల సమీకరణలు పాటించాయి. కాంగ్రెస్ పార్టీ 28 మంది జాట్ అభ్యర్థులను, నలుగురు జాట్-సిక్కులను నిలిపింది. బీజేపీ 16 మంది జాట్లకు టిక్కెట్లు ఇచ్చింది. కాంగ్రెస్ పార్టీ 20 మంది ఓబీసీలను నిలపగా బీజేపీ 21 మందిని నిలబెట్టింది. కాంగ్రెస్ ఐదుగురు బ్రాహ్మణులకు, బీజేపీ 11 మంది బ్రాహ్మణులకు టిక్కెట్లు ఇచ్చాయి. కాంగ్రెస్ ఐదుగురు ముస్లింలను నిలపగా బీజేపీ ఇద్దరికి టిక్కెట్లు ఇచ్చింది. ఎన్నికల బరిలో పలువురు స్వతంత్రులు నిలవడంతో బీజేపీ వ్యతిరేక ఓట్లు చీలతాయేమోనని కాంగ్రెస్ అనుమానిస్తోంది. దుష్యంత్ చౌతాలా నేతృత్వంలోని జేజేపీపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. 2019లో బీజేపీకి వ్యతిరేకంగా ఓట్లు అడిగి, ఆ తర్వాత ఆ పార్టీతో అంటకాగిందని వారు మండిపడుతున్నారు. అంతేకాక వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఏడాది పాటు ఆందోళన జరిగితే ఆ పార్టీ పదవులను పట్టుకొని వేలాడిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అభయ్ చౌతాలా నేతృత్వంలోని ఐఎన్ఎల్‌డీ ఈ సారి మంచి ఫలితాలు వస్తాయని ఆశతో ఉంది. పొరుగున ఉన్న ఢిల్లీ, పంజాబ్‌లో అధికారంలో ఉన్నందున హర్యానా శాసనసభలో ప్రవేశించి, సత్తా చాటతానని ఆప్ ధీమాగా ఉంది. ఆ పార్టీ మొత్తం 90 స్థానాలలోనూ అభ్యర్థులను నిలిపింది.

చివరి ప్రయత్నాలు

ప్రభుత్వ వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని గ్రహించిన బీజేపీ, గాంధీ జయంతి రోజున డేరా సచ్ సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌ను 20 రోజుల పెరోల్‌పై విడుదల చేసింది. నెల రోజుల వ్యవధిలో ఆయనను రెండుసార్లు విడుదల చేయడంపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. రాష్ట్రంలోని 17-20 స్థానాల్లో డేరా ప్రభావం కన్పిస్తోంది. మరోవైపు దళిత నేత, బీజేపీ స్టార్ క్యాంపెయినర్ అశోక్ తన్వర్‌ను కాంగ్రెస్ అక్కున చేర్చుకుంది. సిర్సాలోని తొమ్మిది శాసనసభ స్థానాలలో తన్వర్‌కు మంచి పలుకుబడి ఉంది. కాంగ్రెస్‌కే చెందిన మరో దళిత నేత కుమారి సెల్జా సార్వత్రిక ఎన్నికలలో సిర్సా స్థానంలో 2.68 లక్షల మెజారిటీతో విజయం సాధించారు. అప్పుడు సెల్జా ప్రత్యర్థి తన్వరే.

సైకిలిస్టుల కోసం ఏం చేస్తున్నారు?

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలేమిటి?

- పర్యావరణాన్ని కాపాడేది ఇలానేనా?
- కేంద్రానికి ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసు



న్యూఢిల్లీ : దేశంలో సైకిలిస్టుల హక్కుల పరిరక్షణకు ఏం చేస్తున్నారని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) కేంద్రాన్ని ప్రశ్నించింది. రోడ్డు ప్రమాదాలలో సైకిలిస్టులు ప్రాణాలు కోల్పోవడం, గాయపడడం వంటి ఘటనలు జరుగుతున్నాయని గుర్తు చేస్తూ వాటి నివారణకు తీసుకుంటున్న చర్యలేమిటో చెప్పాలని ఆదేశించింది. ఈ మేరకు రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ కార్యదర్శికి నోటీసు జారీ చేసింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా సైకిలిస్టులు, పర్యావరణ ప్రేమికులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని ఎన్‌హెచ్‌ఆర్‌సీ గుర్తు చేసింది.

మానవ హక్కుల కార్యకర్త రాధాకాంత త్రిపాఠి దాఖలు చేసిన పిటిషన్‌ను పురస్కరించుకొని ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ఆరు వారాలలోగా నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులకు సూచించింది. దేశంలోని రోడ్లు ప్రాణాంతకంగా మారాయని, ప్రమాదాల కారణంగా అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని, పలువురు గాయపడ్డారని పిటిషనర్ తన దరఖాస్తులో ప్రస్తావించారు. అందరికీ సురక్షితమైనవిగా ఉండేలా భారతీయ రోడ్లను రూపకల్పన చేయాలని కోరారు.

స్థిరమైన రోడ్లు, స్పీడ్ లైన్లు, మధ్యలో విరామాలతో పాటు పాదచారుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పిటిషనర్ సూచించారు. సైకిలిస్టుల భద్రత, రక్షణ విషయంలో తగిన యంత్రాంగం లేదని, ప్రభుత్వ వైఫల్యం కన్పిస్తోందని త్రిపాఠీ విమర్శించారు. పలు రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేస్తున్నప్పటికీ వారికి హెల్మెట్లు ఇవ్వడం లేదు. రోడ్డు భద్రతకు అనుగుణంగా సైకిళ్లు ఎలా నడపాలన్న విషయంపై విద్యార్థులకు అవగాహన కల్పించడం లేదు. హైవేలలోని రోడ్లపై బ్లాక్‌స్పాట్లు, ప్రమాద జోన్లను సరిగా గుర్తించడం లేదు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో సైకిలిస్టుల కోసం రోడ్లపై ప్రత్యేకంగా లైన్లు అనేవి లేవు. అంతేకాదు...వారి కోసం ప్రత్యేక చట్టాలు, నిబంధనలు, మార్గదర్శకాలు కూడా లేవు. రోడ్లన్నీ ఆక్రమణ లకు గురవుతు న్నాయి. మందుబాబులు తప్పతాగి రోడ్లపై వాహనాలు నడుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.

2022లో మన దేశంలో రోడ్డు ప్రమాదాల కారణంగా ప్రతి రోజూ సగటున పది మంది సైకిలిస్టులు ప్రాణాలు కోల్పోయారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) అందించిన వివరాల ప్రకారం అదే సంవత్సరం దేశంలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాలలో 3,435 మంది చనిపోయారు. మరో 6,426 మంది గాయపడ్డారు. ఆ ఏడాది ఉత్తరప్రదేశ్‌లో అత్యధిక సంఖ్యలో సైకిలిస్టులు మరణించారు. 2021లో బీహార్‌లో ఎక్కువ మంది సైకిలిస్టులు ప్రాణాలు కోల్పోగా 2018-20 మధ్యకాలంలో తమిళనాడులో అత్యధిక మరణాలు సంభవించాయి. 2015, 2016లో మహారాష్ట్రలో సైకిలిస్టుల మరణాలు ఎక్కువగా జరిగాయి. భారతదేశంలో వేగాన్ని అదుపు చేసే సమగ్ర చట్టాలేవీ లేవని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎత్తిచూపింది. సైకిలిస్టుల కోసం రోడ్లపై ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేస్తే ప్రమాదాలను నివారించవచ్చు. కానీ దురదృష్టవశాత్తూ మన దేశంలో చాలా రోడ్లపై అలాంటి లైన్లు కానీ, ట్రాక్స్ కానీ లేవు.

సైకిల్‌ను ఉపయోగించడం, సైకిలిస్టుల భద్రతను పరిరక్షించడం వల్ల పర్యావరణం ఆరోగ్యకరంగా ఉండడమే కాకుండా ఇంధనాన్ని ఆదా చేయవచ్చు. సైకిలిస్టులు కూడా ఆరోగ్యవంతులుగా ఉంటారు. ఈ నేపథ్యంలో సైకిలిస్టులకు రోడ్డు అధికారులు తగిన స్థలాన్ని కేటాయించకపోవడం, ట్రాఫిక్ పోలీసులు వారి భద్రతను పట్టించుకోకపోవడం తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘన కిందికే వస్తుందని పిటిషనర్ త్రిపాఠీ ఆరోపించారు. ప్రభుత్వ అధికారుల ఉదాశీనత, చర్యలు తీసుకోకపోవడం, నిర్లక్ష్యం మానవ హక్కులపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని ఆయన అన్నారు. సైకిలిస్టుల పరిస్థితిపై కేంద్రం, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుండి నివేదికలు కోరాలని ఆయన ఎన్‌హెచ్‌ఆర్‌సీని అభ్యర్థించారు.



సాహిత్యమే.. సమాజానికి దీపస్తంభం

- సోషల్ మీడియా క్రాస్‌రోడ్డులో ప్రజలు
- వారిని చైతన్యపర్చాల్సిన బాధ్యత యువ రచయితలదే
- రచనల్లో శాస్త్రీయ దృక్పథాన్ని జొప్పించాలి : తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ కార్యదర్శి మామిడి హరికృష్ణ
- ఆకట్టుకున్న రైట్ టూ ఓట్, హెచ్చరిక నాటికలు
- స్ఫూర్తి నింపిన నవలా యువ రచయితల స్వీయ విశ్లేషణ
- ఆలోచింపజేసిన కథా విశ్లేషణలు, కవితలు

ఎస్వీకేలో తెలంగాణ సాహితీ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో యూత్ లిటరరీ ఫెస్ట్ ప్రారంభం

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

సాహిత్యమనేది మెరుగైన సమాజానికి దిశానిర్దేశం చేసే, దారిచూపే దీపస్తంభం లాంటిదనీ, సాహిత్య రచన వైపు యువత రావాలని తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ కార్యదర్శి మామిడి హరికృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సాహితీ, డీవైఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో యూత్ లిటరరీ ఫెస్ట్‌ను ప్రారంభించారు. తెలంగాణ సాహితీ ఉపాధ్యక్షులు అనంతోజు మోహన్‌కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హరికృష్ణ మాట్లాడుతూ.. సమాజంలో ఒక్కరోజులోనే మార్పు రావాలని కోరుకోవటం అత్యాశే అవుతుందన్నారు. అధ్యయనమే సమాజ మార్పునకు మార్గమని స్పష్టం చేశారు. శాస్త్రీయ కోణంలో సాహిత్య విశ్లేషణలు ఉండాలని ఆకాంక్షించారు. ఆ దిశగా యువ రచయితలు ముందడుగు వేయాలని సూచించారు. దేనినైనా చేయగలిగే దృఢ సంకల్పం యువతలో ఉంటుందనీ, సాహిత్యంలో అనేక ప్రయోగాలు చేస్తూ ముందుకెళ్లడం మంచిన పరిణామం అని ప్రశంసించారు. దారితప్పుతున్న సమాజాన్ని తమ సాహిత్యం ద్వారా బాగు చేయాల్సిన బాధ్యత యువతపై ఉందని నొక్కిచెప్పారు. అనేక కొత్త ఒరవడులు పుట్టుకొస్తున్న తరుణంలో సాహిత్యంలో శాస్త్రీయ దృక్పథాన్ని జొప్పించాలనీ, శాస్త్రీయ కోణంలో విశ్లేషణలు చేయాలని సూచించారు. సాహిత్యమనేది సిబ్బి అయితే దాని మీద పొరలుగా పొందికగా సాహిత్యాన్ని (నవల, కథ, విమర్శ, కవిత, పాట) పేర్చడం బతుకమ్మ అవుతుందన్నారు. ఓయూ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. రఘు మాట్లాడుతూ.. రచనకు కావాల్సిన వస్తువును ఎంపిక చేసుకోవడం, బాధ్యతాయుతమైన లక్ష్యం వైపు అడుగులు వేయడం లాంటి గురుతర బాధ్యత యువ రచయితలపై ఉందన్నారు. యువతలో పుస్తక పఠనం తగ్గటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. సాహిత్య అధ్యయనాన్ని ప్రోత్సహించడానికిగానూ తమిళనాడులో అక్కడి ప్రభుత్వం 35వేల పాఠశాలల్లో ప్రత్యేక గ్రంథలయాలను ఏర్పాటు చేయడాన్ని అభినందించారు. మన రాష్ట్రంలోనూ పుస్తక పఠనాన్ని ఒక కార్యక్రమంగా చేపట్టాల్సిన అవసరం రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని నొక్కి చెప్పారు. ఉన్నతమైన రచనలు శతాబ్దాన్ని, యుగాన్ని ప్రభావితం చేసే చోదక శక్తులుగా ఉంటాయన్నారు. రచయితలు ఎదుటివారు చెప్పే ప్రతి విషయాన్ని ఓపికగా వినే లక్షణాన్ని అలవర్చుకోవాలని సూచించారు. తెలంగాణ సాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనందాచారి మాట్లాడుతూ.. ఎక్కువ మంది అమ్మాయిలు రచనారంగం వైపు రావటం మంచి పరిణామం అన్నారు. సమాజం సంక్లిష్ట పరిస్థితుల్లో ఉన్న తరుణంలో యువత రచనలపై దృష్టి సారించడం ప్రవాహానికి ఎదురు ఈదడమేనని చెప్పారు. తనకేంటి లాభం అని ఆశిస్తున్న కాలంలో సమాజంలోని ప్రజలను చైతన్యపర్చడానికి యువ రచయితలు ముందుకురావడం అభినందనీయమన్నారు. మంచి లక్ష్యం, సృజనాత్మకతతో కూడుకున్న రచనలు ఎల్లకాలం నిలబడి ఉంటా యని చెబుతూ పలు ఉదహరణలు చెప్పారు. ప్రతి రచనకూ భాష ముఖ్యమైనదనీ, రచనలెప్పుడూ ప్రజల భాషలో ఉండేలా యువ రచయితలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి రచనలోనూ ప్రాపంచిక దృక్పథం ఉండాలని నొక్కి చెప్పారు. గొంతులేని సామాన్య ప్రజానీకానికి ఉపయోగపడేలా రచనలు ఉండాలని ఆకాంక్షించారు. కవి, నవలా రచయిత నస్రీన్‌ఖాన్ మాట్లాడుతూ.. విరామం లేని ప్రయత్నాలే యువ రచయితల విజయానికి సోపానాలు అన్నారు. సోషల్ మీడియా మీద అతిగా ఆధారపడవద్దనీ, ఏది మంచి? ఏది చెడు? అని విశ్లేషించుకుని ముందుకు సాగాలని సూచించారు. ప్రతి రచయితా తనదైనశైలిలో ప్రత్యేకతను చాటుకోవాలన్నారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ మాట్లాడుతూ..ట్రెండ్ సెట్ చేస్తున్న రచనలు యువత నుంచి ఎక్కువ రావడం మంచి పరిణామం అన్నారు. యువ రచయితలను ప్రోత్సహించడంలో తమ సంఘం ఎప్పుడూ ముందు వరుసలో ఉంటుందని హామీనిచ్చారు.

ఆలోచింపజేసిన నాటికలు

అజయ్ మంకెనపల్లి రచన, దర్శకత్వంలో రూపొందించిన రైటు టూ ఓట్ అనే నాటికను క్రియేటివ్ థియేటర్ బృందం ప్రదర్శించింది. ఈ నాటిక ఓటు అనే ఆయుధాన్ని ఎలా వాడుకోవాలి? ఇప్పుడేం జరుగుతున్నది? యువత చైతన్యమై మార్పు తీసుకురావాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పింది. కె.శాంతారావు రచన, దర్శకత్వం వహించిన హెచ్చరిక నాటికను పీఎన్ఎం బృందం ప్రదర్శించింది.

కొత్త కోణాన్ని చూపెట్టిన స్వీయ నవలా, కథా విశ్లేషణలు

బ్లాస్కార్ఫ్ నవలా రచయిత మందుల విప్లవకుమార్ అధ్యక్షతన జరిగిన స్వీయ నవలా విశ్లేషణ సాహిత్య ప్రక్రియలో కొత్త కోణాన్ని చూపెట్టింది. గడ్డం మోహనరావు మాట్లాడుతూ..తాను రాసిన కొంగవాలు కత్తి నవలను రాసిన సందర్భం, ఆ శీర్షికకు ఉన్న చారిత్రక నేపథ్యం, చిందుల జీవన చిత్రాన్ని కండ్లకు కట్టినట్టు వివరించారు. డాక్టర్ నర్రాప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ..పొత్తి నవలకు ఎంచుకున్న వస్తువును, తెలంగాణ ఉద్యమ సమయంలో పల్లెల్లో, వర్సిటీల్లో నెలకొన్న సామాజిక పరిస్థితులు, కులాంతర వివాహాల ఆవశ్యకతను తన నవలతో సాక్షాత్కారింపజేశానని తెలిపారు. వరకుమార్ గుండెపంగు మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాలు, సమాజంలో వివక్షకు గురైన వారి జీవన చిత్రాలనే తన రచనా వస్తువులుగా మలుచుకున్నానని చెప్పారు. 12 మంది రచయితలు తాము రాసిన నేపథ్యాన్ని వివరించారు. తమ అనుభవాలను పంచుకుని సభికుల్లో ఉత్తేజాన్ని నింపారు. యువ రచయితలకు ప్రేరణగా నిలిచారు.

ఏడు రంగుల వాన పుస్తకావిష్కరణ

ముక్కామల జానకీరామ్ రాసిన ఏడు రంగుల వాన పిల్లల కథల పుస్తకాన్ని తెలంగాణ సాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఆనందాచారి ఆవిష్కరించారు.

మంత్రుల ముఖాముఖి సోమవారానికి వాయిదా

టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రతి శుక్రవారం గాంధీభవన్‌లో పార్టీ నిర్వహిస్తున్న మంత్రుల ముఖాముఖి కార్యక్రమం అనివార్య కారణాల వల్ల సోమవారానికి వాయిదా వేసినట్టు టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు. నిజామాబాద్ పర్యటనలో ఉన్న కారణంగా వాయిదా వేస్తున్నట్టు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల విజ్ఞప్తులను గాంధీభవన్‌లో సోమవారం స్వీకరించాలని ఆయన మంత్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని గమనించాలని పార్టీ కార్యకర్తలకు, శ్రేణులకు, ప్రజలను కోరారు.

స్పామ్ కాల్స్‌తో ఇబ్బందులు

ప్రజల సమయాన్ని వృథా చేస్తున్న వైనం

- ట్రాయ్ నిబంధనలూ దాటవేత
- కొత్త దారులను ఆశ్రయిస్తున్న కంపెనీలు, కాల్‌సెంటర్లు
- జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్న నిపుణులు, పోలీసులు

న్యూఢిల్లీ : దేశంలో స్పామ్ కాల్స్ సంఖ్య తీవ్రంగా పెరుగుతున్నది. క్రెడిట్ కార్డ్, పర్సనల్ లోన్ అంటూ ఇలా పలు రకాల కాల్స్‌తో ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అయితే, ప్రజల ఫోన్ నెంబర్లు కంపెనీల వద్దకు ఎలా చేరుతున్నాయి? ఈ సమాచారమంతా వారికి ఎలా అందుతున్నది? అనే ప్రశ్నలు సాధారణ ప్రజల్లో తలెత్తుతున్నాయి. టెలికాం ఆపరేటర్లు, టెలి మార్కెటర్లు డేటా గోప్యత, జవాబుదారీతనం విషయంలో నిబంధనలు పాటిస్తున్నారా అనే అనుమానాలు సైతం వారిలో కలుగుతున్నాయి. ముఖ్యంగా, ప్రభుత్వం వ్యక్తిగత గోప్యతకు కఠిన చర్యలు తీసుకుంటున్నదా? అనే ప్రశ్నలు పలువురి నుంచి వినిపిస్తున్నాయి.

గోప్యతనే కాకుండా.. ప్రజల విలువైన సమయాన్నీ వృథా చేస్తూ, ఈ స్పామ్ కాల్స్ వారికి చికాకు తెప్పిస్తున్నాయి. లోకల్ సర్వే ప్రకారం.. సర్వే చేసిన 60 వేల మంది భారతీయులలో 60 శాతం మంది గతేడాది సగటున రోజుకు మూడు లేదా అంతకంటే ఎక్కువ స్పామ్ కాల్స్‌ను పొందారు. ఇలాంటి స్పామ్ కాల్స్‌ను ఎదుర్కోవటానికి డీఎన్‌డీ, ఇతర అప్లికేషన్లు ఉనికిలో ఉన్నప్పటికీ.. కంపెనీలు ఇతర మార్గాలను అన్వేషిస్తున్నాయని నిపుణులు చెప్తున్నారు. దీంతో తమ పనుల్లో బిజీగా ఉండే ప్రజలకు ఇది ఇబ్బందికరంగా మారుతున్నదని అంటున్నారు. ఇక కొన్ని సందర్భాల్లో ల్యాండ్‌లైన్ నెంబర్లు, మొబైల్ నెంబర్ల మధ్య తేడా కనిపెట్టలేని రీతిలో స్పామ్ కాల్స్ వస్తున్నాయి. ఫలితంగా ప్రజలు స్పామ్ కాల్స్‌ను అంచనా వేయలేకపోతున్నారని నిపుణులు చెప్తున్నారు.

మెరుగైన మార్కెట్ రీచ్ కోసం కొన్ని కంపెనీలు, కాల్ సెంటర్లు ఇప్పుడు వర్చువల్ నెంబర్లను ఎంచుకుంటున్నాయని అంటున్నారు. వర్చువల్ నెంబర్లు వాస్తవ ఫోన్ నెంబర్లు కానీ, నిర్దిష్ట పరికరాలు, చిరునామాలతో ముడిపడి ఉండవు. కాల్ కోసం ఫిక్స్‌డ్ ల్యాండ్‌లైన్ నెంబర్ లేదా వర్చువల్ నంబర్ ఉపయోగించబడుతుందో లేదో చెప్పలేరు. ఉదాహరణకు, డెలివరీ ఏజెంట్ నుంచి వచ్చిన కాల్, స్పామర్ నుంచి వచ్చిన కాల్స్ రెండూ స్థానిక ఎస్టీడీ కోడ్‌ను కలిగి ఉండొచ్చని నిపుణులు చెప్తున్నారు. వర్చువల్ నెంబర్ల విషయంలో వర్చువల్ నెట్‌వర్క్ ఆపరేటర్లు (వీఎన్‌ఓ) వస్తాయి. వీఎన్‌ఓలు నెట్‌వర్క్ మౌలిక సదుపాయాలను కలిగి లేని టెలిఫోన్ క్లౌడ్ సర్వీస్ ప్రొవైడర్లు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికాం (డీఓటీ) ద్వారా యూనిఫైడ్ లైసెన్స్‌లు మంజూరు చేసిన తర్వాత.. వారు క్లయింట్లకు వర్చువల్ నెంబర్లను అందిస్తారు. వీఎన్‌ఓలు మార్కెట్‌ను విస్తరించేందుకు వ్యాపారాలు తమకు నచ్చిన లోకల్ ఏరియా కోడ్‌లను ఉపయోగించుకునేలా చేస్తాయి.

ఇక చాలా కంపెనీలు మాన్యువల్ డయలింగ్‌ను నివారించటానికి అప్లికేషన్‌లను ఉపయోగిస్తున్నాయి. కంపెనీ ప్రధాన కార్యాలయం మహారాష్ట్రలో ఉండగా.. జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌లోని తమ కార్యాలయం నుంచి కాల్స్ జరుగుతున్నాయని ఒక నమోదిత టెలీమార్కెటర్ తెలిపారు. "బల్క్ ల్యాండ్‌లైన్ నెంబర్‌లను పొందటానికి టెలికాం ఆపరేటర్‌తో టెలిమార్కెటింగ్ వ్యాపారాన్ని నమోదు చేసుకోవాలి. వారు తమ ఆధారిత ప్రాంతంలో ఎక్స్ఛేంజ్ (సర్వీస్ ప్రొవైడర్) నుంచి రెండు ఎంబీపీఎస్ ప్రైమరీ రేట్



ఇంటర్‌ఫేస్ (పీఆర్‌ఐ)ని అద్దెకు తీసుకోవచ్చు. 20-30 లేదా అంతకంటే ఎక్కువ ల్యాండ్‌లైన్ నెంబర్‌లను పొందవచ్చు. ఈ లైన్లన్నిటినీ కలుపుతూ ఒక జంక్షన్ బాక్స్ ఉంటుంది. కొన్నిసార్లు పీఆర్‌ఐలు ఔట్‌గోయింగ్ కాల్స్ కోసం మాత్రమే ప్రోగ్రాం చేయబడతాయి" అని కొన్ని విశ్వసనీయ వర్గాలు చెప్తున్నాయి.

దేశంలో చట్టవిరుద్ధమైన కాల్ సెంటర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. అయితే, ఈ సమస్య ప్రతి చోటా, ముఖ్యంగా అభివృద్ధి చెందిన నగరాల్లో ఉన్నది. ఇలాంటి కాల్ సెంటర్లు స్పామ్ చేస్తూ ప్రజలను మోసగించటంలో బిజీగా ఉన్నాయి. వీటి విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు. స్పామర్లలో కేవలం నమోదుకాని టెలిమార్కెటర్లు (యూటీఎంలు) మాత్రమే కాకుండా.. కస్టమర్ల సమ్మతి లేకుండా అయాచిత వాణిజ్య కమ్యూనికేషన్లలో (యూసీసీలు)ని రిజిస్టర్డ్ టెలీమార్కెటర్లు కూడా ఉంటారు. ట్రాయ్ మార్గదర్శకాలు యూసీసీలను ప్రారంభించకుండా కంపెనీలను నిషేధించాయి. ట్రాయ్ డీఎన్‌డీ యాప్, ఫిర్యాదుల హెల్ప్‌లైన్ వంటి చర్యలను తీసుకుంటున్నప్పటికీ.. కంపెనీల నుంచి స్పామ్ కాల్స్ కొనసాగుతున్నాయని నిపుణులు చెప్తున్నారు.

రిజిస్టర్డ్ టెలిమార్కెటర్ల ద్వారా స్పామ్ చేయటం కొంత వరకు అరికట్టబడినప్పటికీ.. దాని ప్రయత్నాలు పూర్తిగా విజయవంతం కాలేదని ట్రాయ్ గతంలో గుర్తించింది. ఈ ఏడాది ఆగస్టులో విడుదల చేసిన ట్రాయ్ సమాచారం ప్రకారం.. గత నాలుగేండ్లలో నమోదిత టెలిమార్కెటర్లపై ఫిర్యాదుల సంఖ్య తగ్గింది. యూటీఎంలకు వ్యతిరేకంగా వచ్చిన ఫిర్యాదులు నాలుగు రెట్లు పెరిగాయి. " చాలా సంస్థలు 10 అంకెల మొబైల్, ల్యాండ్‌లైన్ నెంబర్లను ఉపయోగించి ప్రమోషనల్ కాల్స్‌ను చేయటం ప్రారంభించాయి. ఈ సంస్థలు కమర్షియల్ కమ్యూనికేషన్‌ల కోసం ఆటో డయలర్, రోబో కాల్‌ల వినియోగాన్ని కూడా ఆశ్రయిస్తున్నాయి. నియంత్రణ నిబంధనలను దాటేస్తున్నాయి. దాదాపు ప్రతి ఒక్కరినీ ఇబ్బందికి గురి చేస్తున్నాయి" అని ట్రాయ్ తెలిపింది. ట్రాయ్ సమాచారం ప్రకారం.. ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో 7.9 లక్షల ఫిర్యాదులతో యూటీఎంల నుంచి కాల్స్ గణనీయంగా పెరిగాయి. స్పామ్ కాలర్లపై చర్యలో భాగంగా 2.75 లక్షల టెలిఫోన్ నెంబర్లు డిస్‌కనెక్ట్ అయ్యాయి. 50 ఎంటీటీలు బ్లాక్ అయ్యాయి. ట్రాయ్ ఇప్పటికే టెలికాం ఆపరేటర్లతో సహా అన్ని సర్వీస్ ప్రొవైడర్లకు, నమోదు కాని మూలాల నుంచి ముందస్తుగా రికార్డ్ చేయబడిన, ప్రచార కాల్స్‌ను నిలిపివేయాలని ఆదేశాలను జారీ చేసింది.

దర్యాప్తు దారులపై దర్యాప్తు

సంపాదకీయం

ఎన్నికల బాండ్ల వ్యవహారంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పలువురు బీజేపీ జాతీయ, కర్నాటక రాష్ట్ర సీనియర్ నేతలపై బెంగళూరులో ఇటీవల నమోదైన కేసు బీజేపీ వ్యవస్థీకృత అవినీతికి మచ్చుతునక. నిర్మలమ్మ అధికార దుర్వినియోగానికి పాల్పడి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇ.డి.)తో పారిశ్రామికవేత్తలను బెదిరించి ఎలక్టోరల్ బాండ్ల ద్వారా బీజేపీకి నిధులు సమకూర్చారన్నది అభియోగం. దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన ఈ కేసు నమోదు వెనుక జనధికార సంఘర్ష పరిషత్‌కు చెందిన ఆదర్శ్ ఆర్ అయ్యర్ మడమ తిప్పని పోరాటం చెప్పుకోతగ్గది. ఈ ఏడాది మార్చి 30న తిలక్‌నగర్ పోలీసులను ఆయన ఆశ్రయించగా పట్టించుకోలేదు. బెంగళూరు సౌత్ డిసిపి దగ్గరకెళ్లినా ఫలితం లేదు. దాంతో ఎంపీలు, ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసుల కోసం కర్నాటకలో ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయస్థానంలో ఏప్రిల్‌లో ఫిర్యాదు చేయగా విచారణ జరిపి ఎఫ్ఐఆర్ నమోదుకు కోర్టు శుక్రవారం ఆదేశించిచడంతో అదే తిలక్‌నగర్ పోలీసులు శనివారం కేసు నమోదు చేయాల్సి వచ్చింది. కేసులో మొదటి నిందితులు (ఎ1) నిర్మలా సీతారామన్ కాగా ఎ2 ఇ.డి, ఎ3 బీజేపీ కేంద్ర పదాధికారులు, ఎ4 బీజేపీ కర్నాటక రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు నళిన్‌కుమార్ కటీల్, ఎ5 ప్రస్తుత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బివై విజయేంద్ర, ఎ6 రాష్ట్ర బీజేపీ పదాధికారులు. నిందితుల జాబితాలో కేంద్రమంత్రి జెపి నడ్డా పేరు కూడా ఉందని బయటికొచ్చింది.



> బెంగళూరు కేసుతో ఎలక్టోరల్ బాండ్లపై సుప్రీంకోర్టు, ప్రతిపక్షాలు వ్యక్తపర్చిన భయాందోళనలు వాస్తవమేనని రూఢీ అయింది. ఎస్‌బిఐ, ఇసి వివరాల మేరకు ఎలక్టోరల్ బాండ్ల అమ్మకాల ద్వారా రూ.16 వేల కోట్ల విరాళాలు పార్టీలకు అందితే వాటిలో సింహభాగం బీజేపీ గల్లాలో పడ్డాయి. దీన్నిబట్టే ఎలక్టోరల్ బాండ్లు ఎవరికి ఉపయోగపడ్డాయో అర్థమవుతుంది. పార్టీ నిధుల కోసం కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగించడం స్వతంత్ర భారతదేశంలో మోడీ ప్రభుత్వంలోనే చోటుచేసుకుంది.

కేంద్రంలో బీజేపీ పాలనలోకొచ్చాక కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయాలకు ఎంతగా బరితెగించి వాడుకుంటున్నారో చూస్తున్నాం. సిబిఐ, ఇడి వంటి వాటిని ప్రయోగించి ప్రత్యర్థి పార్టీల కీలక నాయకులను భయపెట్టి లొంగదీసుకునేందుకు ప్రయత్నించడం, దారికి రాని వారిపై కక్ష కట్టి మరీ వేధించడం, అక్రమ కేసులకు, అరెస్టులకు పాల్పడటం మోడీ ప్రభుత్వానికి నిత్యకృత్యమైపోయింది. అలాంటి నీతిబాహ్యమైన చర్యలతో పార్టీ నిధులనూ పోగేసుకుం టున్నారని తాజాగా బెంగళూరు కేసుతో ధ్రువపడింది. పారిశ్రామికవేత్తలపైనా, కార్పొరేట్ కంపెనీల అధిపతులపైనా, సిఇఓలు, మేనేజింగ్ డైరెక్టర్లు, టాప్ ఎగ్జిక్యూటివ్‌లపై ఇ.డి.తో దాడులు చేయించి, ఆస్తులు స్వాధీనం చేసుకొని, వివిధ పద్ధతుల్లో బెదిరించి, పార్టీ పేరిట ఎలక్టోరల్ బాండ్లను కొనిపించి రూ.8వేల కోట్లకుపైన లూటీ చేశారన్న ఫిర్యాదు దారుని అభియోగాలను చూస్తే బీజేపీ నైజమేంటో బోధపడుతుంది. ఈ దోపిడీకి కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఇ.డి.ని సాధనంగా ఉపయోగించారు. ఇది అధికార దుర్వినియోగం, క్విడ్‌ప్రోకో, రాజకీయ అవినీతి కాక ఇంకేమిటి?

బీజేపీ ప్రభుత్వం 2017లో ఎలక్టోరల్ బాండ్స్ స్కీం తెచ్చినప్పుడే విపక్షాలు సందేహించాయి. సీపీఐ(ఎం) మరికొన్ని పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఎలక్టోరల్ బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని, సమాచార హక్కు చట్ట ఉల్లంఘనేనని, క్విడ్‌ప్రోకోకు దారి తీస్తుందని సుప్రీంకోర్టు ఈ ఏడాది ఫిబ్రవరి 15న ఆ స్కీంను రద్దు చేసింది. ఎలక్టోరల్ బాండ్ల వివరాలను వెబ్‌సైట్‌లో ప్రజలకు బహిర్గతం చేయాలని ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. అయినప్పటికీ సార్వత్రిక ఎన్నికలు ముగిసే వరకు వివరాలు బయట పెట్టకుండా ఉండేందుకు ఎస్‌బిఐని, ఇ.సిని మోడీ సర్కారు ఎంతగా ప్రభావితం చేసిందో యావత్ దేశం గమనించింది. బెంగళూరు కేసుతో ఎలక్టోరల్ బాండ్లపై సుప్రీంకోర్టు, ప్రతిపక్షాలు వ్యక్తపర్చిన భయాందోళనలు వాస్తవమేనని రూఢీ అయింది. ఎస్‌బిఐ, ఇసి వివరాల మేరకు ఎలక్టోరల్ బాండ్ల అమ్మకాల ద్వారా రూ.16 వేల కోట్ల విరాళాలు పార్టీలకు అందితే వాటిలో సింహభాగం బీజేపీ గల్లాలో పడ్డాయి. దీన్నిబట్టే ఎలక్టోరల్ బాండ్లు ఎవరికి ఉపయోగపడ్డాయో అర్థమవుతుంది. పార్టీ నిధుల కోసం కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగించడం స్వతంత్ర భారతదేశంలో మోడీ ప్రభుత్వంలోనే చోటుచేసుకుంది. తమది నిఖార్సయిన అవినీతి రహిత సచ్ఛీల పార్టీ, ప్రభుత్వం అని డబ్బా కొట్టుకొనే బీజేపీ నేతలకు, మోడీకి బెంగళూరు కేసు తిరుగులేని సవాల్. ఎఫ్ఐఆర్‌తోనే అంతా అయిపోలేదు. నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి వాస్తవాలు వెలికితీసి అసలైన దోషులకు శిక్ష పడితేనే ప్రజాస్వామ్యానికి మనుగడ.

బహుముఖ ప్రజ్ఞాశాలి ఏ.జీ.నూరానీ



సిద్ధార్థ వరదరాజన్

న్యాయ నిపుణుడు, స్కాలర్ అయిన అబ్దుల్ గఫూర్ నూరానీ, ఏ.జీ.నూరానీగా ఏడు దశాబ్దాలకు పైగా ఆయన వ్యాసాలు, పుస్తకాలు పాఠకులకు సుపరిచితం. 94 ఏళ్ల వయసులో ఆగస్ట్ 29న ఆయన ముంబైలో మరణించాడు. ఆయన మరణంతో, భారతదేశం ఒక నడుస్తున్న విజ్ఞాన సర్వస్వాన్ని (ఎన్సైక్లోపీడియా) కోల్పోయి నట్లయింది. తన మిత్రులకు గఫూర్‌గా సుపరిచితుడైన నూరానీ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అయినా ఇప్పటికీ దిగజారిపోతున్న ఆరోగ్య పరిస్థితి అనుమతించినంత వరకు ఆయన, సుప్రీంకోర్టు దారుణమైన బాబ్రీ మసీదు తీర్పుపై పనిచేస్తూనే ఉన్నాడు. మరణం ఆయన తలుపు తడుతుందని ఆయనకు తెలుసు కానీ తన రాతప్రతిని పూర్తి చేయడం ఆయనకు అవసరం. బహుశా పుస్తకం అసంపూర్తిగానే మిగిలిపోయింది. కానీ ఆయన, సమర్థ వంతుడైన స్కాలర్, లేక ప్రచురణకర్త కోసం తగినంత పని వదిలి వెళ్లి ఉంటాడని ఆశిద్దాం.

స్వాతంత్ర్య భారతదేశం ఎంతో అత్యుత్తమ మేధావుల్ని తయారు చేసింది. కానీ వారిలో నూరానీ ప్రత్యేకమైన మేధావి: న్యాయ పండితుడు, రాజకీయ విశ్లేషకుడు, మానవ హక్కుల సమర్థకుడు - అన్నీ ఒకే వ్యక్తిలో ఉన్నాయి. చైనా, పాకిస్థాన్‌లతో భారతదేశ సంబంధాలు, జమ్ముకాశ్మీర్ సమస్య, భారత రాజ్యాంగం, బ్రిటీష్ రాజ్యాంగ చరిత్ర, చట్టం యొక్క శాస్త్రీయ అధ్యయనం, హైదరాబాద్, ఇస్లాం, మానవ హక్కులు, రాజకీయ పరీక్షలు, భారత స్వాతంత్ర్య పోరాటం, బాబ్రీ మసీదు, హిందూత్వపై ఆయన పుస్తకాలు, వ్యాసాలు, పుస్తక సమీక్షలలో ప్రతిబింబించే ఆయన పాండిత్యం చాలా విస్తారమైనది. ఆయన, లార్డ్ డెన్నింగ్, ఇజ్రాయిల్ సుప్రీంకోర్టు జడ్జి వినోగ్రాడ్ లేదా భారతీయ న్యాయ వ్యవస్థ గురించి ఇంట్లోనే చర్చిస్తున్నాడు. ఆయన ప్రతీ పుస్తకం, సాధారణ పాఠ కులకు, స్కాలర్లకు విలువైన ఆధార గ్రంథాలుగా మారాయి. ఒక స్కాలర్‌గా గఫూర్ భాయ్‌కి కంప్యూటర్లు, ఇంటర్నెట్ గురించి ఏమీ తెలి యదు. ఆయనకు టైప్ రైటర్ ఎలా ఉపయోగించాలో కూడా తెలిసేది కాదు. తన వ్యాసాలు మొత్తం చేతితోనే రాశాడు. ఆయన ప్రాథమిక పరిశోధనకు అవసరమైన విషయాలపై అనేక వార్తాపత్రికల కటింగ్స్ ఉన్నాయి. ఆయన ఈ అలవాటును 1940ల నుంచే పాఠశాల విద్యార్థిగా అలవాటు చేసుకొని, దానిని కొన్ని దశాబ్దాల పాటు కొనసాగించాడు. ఆయన విస్తృతంగా అధ్యయనం చేసి, నోట్స్ తయారు చేసుకునేవాడు. సంస్థాగతంగా ఆయనకెలాంటి నేపథ్యం లేదు. బొంబాయిలోని నేపియన్ సీ రోడ్‌లో ఆయన పరిశోధనా అభిరుచి విస్తృతం కావడంతో ఆయన ఫ్లాట్ ఇరుకుగా మారింది. అందుకే ఉపయోగం లేదనుకున్న న్యాయ సంబంధిత పుస్తకాలను ఆయన వదిలేశాడు.

> నూరానీ న్యాయవాదిగా శిక్షణ పొందిన తరువాత బొంబాయి హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో పనిచేశాడు. అయితే వాస్తవం చెప్పాలంటే, ఆయన క్రియాశీలకంగా ఉన్న రోజుల్లో కూడా ఎక్కువ కేసుల్ని చేపట్టలేదు. కాలమిస్ట్‌గా, స్కాలర్‌గానే ఎక్కువగా పని చేశాడు. ఆయన న్యాయవాద వృత్తిని నిర్వహించే క్రమంలో, 1960లో షేక్ అబ్దుల్లాను నిర్బంధంలో ఉంచినపుడు ఆయనకు న్యాయ వాదిగా పనిచేశాడు. నూరానీ కూడా కొంత కాలం జైలు జీవితం గడిపాడు. ఆయన రాజ్యాంగ విరుద్ధత గురించి రాసినందుకు నిర్బంధ నిరోధక నిబంధనల ప్రకారం జైల్లో పెట్టారు. నాలుగు దశాబ్దాలకుపైగా నూరానీ పాత్రికేయ ప్రపంచానికి చాలా దగ్గరయ్యాడు.

విదేశాంగ విధానం, కాశ్మీర్‌పై ఆయన వార్తాపత్రికల సరియైన సమాచారాన్ని కలిగి ఉండడం వల్ల, ప్రకటనలు, గెజిట్ నోటిఫికేషన్లకు సంబంధించిన అధికారిక పత్రాలను సేకరించడంలో అవిశ్రాంత కృషిచేశాడు. కొన్ని సందర్భాల్లో సౌత్ బ్లాక్‌లో ఆయన సునిశితత్వాన్ని గౌరవించిన అధికారులు, ఆయన కోరింది వెంటనే సమకూర్చే వారు. ఇరాన్ ప్రభుత్వం అంతర్జాతీయ అణుశక్తి సంస్థకు ఇచ్చిన పత్రం గురించి ఒక వార్తను ప్రస్తావించినప్పుడు, ఆయన ఆ నిర్దిష్ట పత్రం మాత్రమే కాక దాని పూర్తి సమాచార సంబంధిత వివరాల కోసం ఢిల్లీలోని తన స్నేహితుడిని పీడించేవాడు. ఆగ్రాలో జరిగిన భారత్-పాకిస్థాన్ శిఖరాగ్ర సమావేశం విఫలం చెందిన తర్వాత అటల్ బిహారీ వాజపేయి, పర్వేజ్ ముషారఫ్‌ల మధ్య జరిగిన చర్చలకు సంబంధించిన పూర్తి రికార్డును, రద్దు చేయబడిన ముసాయిదా డిక్లరేషన్‌ను సంపాదిం చడానికి ఆయన ఇస్లా మాబాద్ పర్యటించాడు. ఆయన చేసిన ప్రయ త్నాల వల్ల సాధించిన ఫలితాలు 2005 'ఫ్రంట్ లైన్' పత్రికలో ప్రచురితమయ్యాయి. రచయితగా ఆయన చాలా సూటిగా, నైపుణ్యంగా ఉండేవాడు. ప్రాథమిక పత్రాలు, సాంప్రదాయ అధ్యయన పద్ధతులే కాకుండా ఆయన వ్యక్తిగత పరస్పర సంభాషణలను పరిశోధనా సాధనంగా ఉపయోగించాడు. ఆయన ఢిల్లీ పర్యటనలెప్పుడూ అధికారులు, దౌత్యవేత్తలు, జర్నలిస్టులు, స్కాలర్లతో ఒంటరి సమావేశాల్లో నిమగ్నమయ్యే విధంగా ఉండేది షెడ్యూల్. ఆయన జమ్ముకాశ్మీర్‌కు తరచుగా పర్యటించేవాడు. ఆయనకు అక్కడ విస్తృతమైన పరిచయాలున్నాయి. పూర్వ రాష్ట్ర ప్రజల హక్కులను రక్షించేందుకు ఆయన ప్రదర్శించిన స్థిరత్వం వల్ల ఆయనను ఆ రాష్ట్ర ప్రజలు గౌరవించారు.



నూరానీ న్యాయవాదిగా శిక్షణ పొందిన తరువాత బొంబాయి హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో పనిచేశాడు. అయితే వాస్తవం చెప్పాలంటే, ఆయన క్రియాశీలకంగా ఉన్న రోజుల్లో కూడా ఎక్కువ కేసుల్ని చేపట్టలేదు. కాలమిస్ట్‌గా, స్కాలర్‌గానే ఎక్కువగా పని చేశాడు. ఆయన న్యాయవాద వృత్తిని నిర్వహించే క్రమంలో, 1960లో షేక్ అబ్దుల్లాను నిర్బంధంలో ఉంచినపుడు ఆయనకు న్యాయ వాదిగా పనిచేశాడు. నూరానీ కూడా కొంత కాలం జైలు జీవితం గడిపాడు. ఆయన రాజ్యాంగ విరుద్ధత గురించి రాసినందుకు నిర్బంధ నిరోధక నిబంధనల ప్రకారం జైల్లో పెట్టారు. నాలుగు దశాబ్దాలకు పైగా నూరానీ పాత్రికేయ ప్రపంచానికి చాలా దగ్గరయ్యాడు. ఆయన ఫ్రాంక్ మోరేస్ నిర్వహణలోని 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కోసం క్రమం తప్పకుండా రాశాడు. 1990ల చివరి వరకు సీ.ఆర్.ఇరానీ 'ద స్టేట్స్‌మ్యాన్'లో నూరానీ వ్యాసాల్ని ప్రచురించాడు. గఫూర్ 1960ల నుండి బొంబాయి, ఢిల్లీ, చెన్నై, కలకత్తాలోని అగ్రశ్రేణి సంపాదకు లందరితోనూ కలిసిపోయాడు, చాలామందితో విభేదించాడు కూడా. మోరేస్, శ్యామ్‌లాల్, లిండ్సే ఎమర్సన్, గిరిలాల్ జైన్, ఎస్.ముల్గావ్కర్, కుల్దీప్ నయ్యర్, ఇందర్ మల్హోత్రా, హిరణ్మయ్ కర్లేకర్, సయీద్ నక్వీ, ప్రేమ్ శంకర్ ఝా, ఎస్.నిహాల్ సింగ్, దినా వకీల్, ఎన్.రామ్, కుష్వంత్ సింగ్, దిలీప్ పడ్గాంకర్ లాంటి వారిలో చాలామందితో ప్రేమ పూర్వక, లేక ద్వేషపూరిత సంబంధాల్ని కొనసాగించాడు. కొన్నింటిలో ఆయన మారుపేర్లు కలిగి ఉన్నాడు. చాలా దశాబ్దాల అనంతరం వాటి గురించి మాట్లాడినప్పుడు వాటిని ఉపయోగిం చడంలో ఆయన చాలా ఆనందంగా ఉండేవాడు.

బహుశా 1997 ఆ ప్రాంతంలో యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఎగైన్స్ట్ టార్చర్‌పై ప్రెస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఒక వర్క్ షాప్‌లో నేను మొదటిసారిగా నూరానీని కలిశాను. 1993లో అప్పుడు ఆక్స్ ఫర్డ్‌లో లా లెక్చరర్‌గా పనిచేస్తున్న నా సోదరుడు ఒక ఫ్రెంచ్ ఎన్జీవో, ఎఫ్ఐడీహెచ్ కోసం తయారు చేసిన కాశ్మీర్‌లో మానవ హక్కు ల ఉల్లంఘన నివే దికను నూరానీ ప్రశంసించాడు, అందుకే ఆయన నాతో చాలా స్నేహపూర్వకంగా ఉన్నాడు. ఆ తరువాత కాలంలో ఆయన తరచుగా ఢిల్లీ సందర్శించిన సందర్భాల్లో మా స్నేహం మరింతగా పెరిగింది. నేను ఆయనలో చూసిన మరోకోణం, ఆయనకు ఆహారం పట్ల మక్కువ ఎక్కువ.

పాత ఢిల్లీలో కబాబ్‌ లేక కొర్మా కోసం ఆయనతో ఎక్కువసార్లు వెళికే అదృష్టం నాకు దక్కింది. ఆయన ఢిల్లీ సందర్శనకు ముందు ఎక్కడో సందుగొందుల్లో మేము కనుగొనాల్సిన రెస్టారెంట్ పేరుతో ఒక చిన్న చీటిని అందించేవాడు. అప్పుడు మేము జమా మసీదు, లేక నిజాముద్దీన్ వైపు నా అంబాసిడర్ కారులో బయల్దేరే వాళ్లం. గఫూర్ ఎప్పుడూ నిష్కళంకమైన దుస్తులు ధరించేవాడు. ఒకసారి ఆయన ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లోని తన గదినుండి దిగి, వాతావరణం చాలా చల్లగా ఉందని గ్రహించి, మళ్లీ తన గదిలోకి వెళ్లి, కోటు, టై ధరించి తిరిగి వచ్చాడు. టై ఎందుకని నేనడిగితే మొరటోడు మాత్రమే టై లేకుండా కోటు ధరిస్తాడని సమాధానం ఇచ్చాడు. మేము ఉర్దూ బజార్ దగ్గర దిగి, ఎవరో ఒక వ్యక్తి గఫూర్‌కు చెప్పిన గోలా కబాబ్‌లను వెతకడం మొదలుపెట్టిన తర్వాత ఆయన టై అందరి దృష్టిని ఆకర్షించడంతో అందరూ మా వైపు చూశారు. ఆయన చిన్నచిన్న దాబాల వద్ద ఆగి, వారు వండిన మాంసాహారం నాణ్యతను నిర్ధారించేందుకు కుండలను చూడాలని పట్టుపట్టేవాడు. వయసు మీద పడిన తరువాత, ఆయన రావడం తగ్గింది, ఇలాంటి సాహసకార్యాలకు పూనుకోవడం కూడా కష్టంగా మారింది.

> మరే ఇతర దేశంలోనైనా నూరానీ లాంటి ప్రజామేధావి ఒక గౌరవనీయమైన జాతీయ సంపదగా పరిగణించేవి. కానీ భారతదేశంలో ఆయన నిష్కళంక పదునైన మాటలు, ఆయన పదునైన కలం ఆయనకు అన్నివైపుల నుండి చాలామంది శత్రువులను తయారు చేశాయి. చివరికి గత రెండు సంవత్సరాల వరకు, అంటే ఆయన అనారోగ్యం పాలయ్యేవరకు ఆయన భారతదేశంలో 'ఫ్రంట్ లైన్' కు, పాకిస్థాన్‌లో 'డాన్' కు పరిమితమయ్యాడు. ఆ తరువాత ఆయన రాయాలనుకున్న పుస్తకాల రచనకు తన శక్తిసామర్థ్యాలను ఉపయోగించాల్సి వచ్చింది. ఆయనతో జరిగిన కొన్ని సంభాషణల్లో, ఆయన పత్రాలకు, పుస్తకాలకు, ఢిల్లీలోని ఒక మంచి పరిశోధనా గ్రంథాలయంలో చోటు లభించాలనే ఆశాభావాన్ని వ్యక్తం చేశాడు.

నూరానీకి దృఢమైన ఇష్టాలు, అయిష్టాలున్నాయి. ఇండియన్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో 38వ నంబర్ గదిలో మాత్రమే ఉండేవాడు. ఆయన భోజనం కోసం మిమ్మల్ని కలుస్తుంటే, ఏ ఒక్కరినీ కనీసం పరిచయస్తుల్ని కూడా కూర్చున్న టేబుల్ వద్దకు ఒక్క క్షణం కూడా తిరగడానికి అనుమతించేవాడు కాదు. ఆయన ఎలాంటి చెడు ప్రవర్తన, అసంబద్ధతల పట్ల తక్కువ సహనం కలిగి ఉండేవాడు. హద్దులు దాటిన వారెవరైనా, వారిని తన జీవితం నుండి శాశ్వతంగా దూరం చేసేవాడు. వారిలో కొంతమంది జర్నలిస్టులు, స్కాలర్లు నాకు తెలుసు. ఒకరి తరపున నేను మధ్య వర్తిత్వం వహించి, ఫలానా వ్యక్తి నిన్ను కించపరచడానికి ఏమి చేశాడని ఆయనను నిలదీశాను. వాస్తవమే, చెప్పిన విషయం దశాబ్దం క్రితం జరిగిందనే విషయం ఆయనకు తెలుసు, కానీ వివరాలేమీ గుర్తులేవు.

మరే ఇతర దేశంలోనైనా నూరానీ లాంటి ప్రజామేధావి ఒక గౌరవనీయమైన జాతీయ సంపదగా పరిగణించేవి. కానీ భారతదేశంలో ఆయన నిష్కళంక పదునైన మాటలు, ఆయన పదునైన కలం ఆయనకు అన్నివైపుల నుండి చాలామంది శత్రువులను తయారు చేశాయి. చివరికి గత రెండు సంవత్సరాల వరకు, అంటే ఆయన అనారోగ్యం పాలయ్యేవరకు ఆయన భారతదేశంలో 'ఫ్రంట్ లైన్' కు, పాకిస్థాన్‌లో 'డాన్' కు పరిమితమయ్యాడు.


ఆ తరువాత ఆయన రాయాలనుకున్న పుస్తకాల రచనకు తన శక్తిసామర్థ్యాలను ఉపయోగించాల్సి వచ్చింది. ఆయనతో జరిగిన కొన్ని సంభాషణల్లో, ఆయన పత్రాలకు, పుస్తకాలకు, ఢిల్లీలోని ఒక మంచి పరిశోధనా గ్రంథాలయంలో చోటు లభించాలనే ఆశాభావాన్ని వ్యక్తం చేశాడు. ఆయన నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీ (ఎన్ఎమ్ఎమ్ఎల్)ని సాధ్యపడే గమ్యంగా పేర్కొన్నాడు. కానీ అది ఎన్ఎమ్ఎమ్ఎల్, పీఎంఎంఎల్‌గా మారడానికి ముందు. అది అనేక సందేహాస్పద సంఘాలు, ఆచరణలను సాధించింది.

("ద వైర్" సౌజన్యంతో)

అనువాదం: బోడపట్ల రవీందర్, 9848412451

యుద్ధ భయం

నీ సింహాసన రక్షణ కోసం
నీ కీర్తి దాహం కోసం
నీ సామ్రాజ్యవాద
దురహంకారం కోసం
మదమెక్కిన నీ
జాత్యాహంకారం కోసం
అవతలవారినీ ప్రేరేపించే
నీ యుద్ధ కాంక్ష కోసం
రక్షణకంటూ ఒకరు
ప్రతీకారం కోసమని ఒకరు
యుద్ధ కర్మాగారాల్లో
నిరంతర ఉత్పత్తికోసం ఒకరు
ఎప్పటికప్పుడు ప్రపంచానికి
తమ శక్తి తెలియాలని ఒకరు
మనిషి రక్తాన్ని ఎప్పుడూ
రుచి చూడాలని ఒకరు
ఏమైతేనేం ఎలాగైతేనేం



నీ యుద్ధ ప్రణయం
సామాన్య జనానికి
ఎప్పుడూ ప్రళయమే
భూగోళం చల్లగా ఉంటే
నీ ఉదరంలో హృదయంలో
నిరంతరం మండుతున్న
సంగ్రామ క్షుద్బాధ
ఏనాటికీ చల్లారదు
పౌరుల మరణాలతో
నీ మెడలో కపాలాల
పూలహారం సువాసనలు
విరబూస్తూ ఉండాలి మరి
ఆ నిర్జీవ దేహాలే
నీవు జీవించడానికి సోపానాలు
అందుకే యుద్ధ భయం
ప్రపంచంలో ఉండాలెప్పుడూ నీకూ..!

- జంధ్యాల రఘుబాబు
9849753298

పెన్షన్ చెల్లింపులో కేంద్రం దొంగాట!


వి.ఎస్. రావు
9490098890

పి.ఎఫ్., గ్రాట్యుటీల లాగా పెన్షన్ మూడవ బెనిఫిట్‌గా ఇవ్వాలని దేశ కార్మికవర్గం దశాబ్దాలుగా పోరాడుతున్నది. పాలక పార్టీలు ఆ కోర్కెను అంగీకరించకుండా, 1971లో ఫ్యామిలీ పెన్షన్ స్కీంను, దాని స్థానంలో 1995లో ఎంప్లా యీస్ పెన్షన్ స్కీంను ముందుకు తెచ్చాయి. ఈ.పి.ఎస్‌వల్ల కార్మిక వర్గానికి జరిగే నష్టాన్ని వివరించి, 1996 ఫిబ్రవరి 23న సమ్మెకు సీఐటీయూ ఇచ్చిన పిలుపుపై కార్మికవర్గం విశేషంగా పాల్గొని తమ అభ్యంతరాన్ని వ్యక్తం చేశాయి. ఈ.పి.ఎస్ స్కీంను ప్రతి మూడేండ్లకు సమీక్ష చేసి కార్మికులకు మెరుగైన ప్రయోజనాలు కల్పిస్తామన్న ఆనాటి పాలకుల మాటలను మిగతా సంఘాలు నమ్మాయి. 1995 నుండి 2024 ఈ మధ్య కాలంలో కేవలం రెండుసార్లు (2008 మరియు 2014) మాత్రమే సమీక్ష చేశాయి. ఆ రెండుసార్లు కూడా అప్పటికే అరకొరగా వున్న ప్రయోజనాలను మరింత కుదించి వేశాయి. మరోవైపున జీపీఎఫ్ స్థానంలో ఎన్.పి.ఎస్‌ను ముందుకు తెచ్చి 2004 నుండి అమలు చేస్తున్నాయి. ఎన్‌పిఎస్‌ను రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ స్కీంను పునరుద్ధరించాలని దేశవ్యాప్తంగా ఉద్యోగులు/ కార్మికులు, సంఘాలతో కలిసి ఆందోళనలు చేశాయి, చేస్తూనేవున్నాయి. చివరకు అనేక రాష్ట్రాలలో అది ఒక రాజకీయ డిమాండుగా ముందుకు రావడంతో ఉద్యోగు లకు పాలక పార్టీలు హామీ ఇవ్వాల్సి వచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఓ.పి.ఎస్‌ను అమలు చేయడానికి వెనకడుగు వేస్తు న్నాయి. ఎందుకంటే పాలక పార్టీల పేర్లు ఏమైనా (లెఫ్ట్ మినహా) పెన్షన్‌ను భారంగాను, ఈ భారం రాబోయే కాలంలో మరింత పెరుగు తుందని, దానిని ఎలా తగ్గించుకోవాలనే దానిపైనే దృష్టి పెడుతున్నాయి. అందులో భాగంగానే యూనిఫైడ్ పెన్షన్ స్కీంను ముందుకు తెచ్చాయి. ప్రపంచ అనుభవం చూసినా పాలకులు పెన్షన్ సంస్కరణలు ముందుకు తెస్తుంటే, వాటిని ప్రతిఘటిస్తూ కార్మిక వర్గం సమ్మెలతో సహా అనేక రూపాలలో ఆందోళనలు చేస్తున్నాయి.

హయ్యర్ పెన్షన్‌పై

ఇక, హయ్యర్ పెన్షన్ విషయానికి పరిశీలిస్తే, 2014 కేంద్ర ప్రభుత్వం పెన్షన్ స్కీం- 1995కి 2014లో చేసిన సవరణలను వ్యతి రేకిస్తూ రాష్ట్రాలలో అనేక ఆందోళనలు నిర్వహించడంతో పాటు, రాష్ట్ర హైకోర్టులలో కేసులు వేశారు. 2014 సవరణలను కొట్టివేస్తూ కేరళ రాష్ట్ర హైకోర్టు తీర్పునిచ్చింది. అదే తరహా లో అనేక హైకోర్టులు తీర్పులి చ్చాయి. ఈ తీర్పు లనన్నింటిని సవాల్ చేస్తూ, సుప్రీంకోర్టులో కేసు వేసిన నేపథ్యంలో ఆ కేసులనన్నింటినీ కలిపి విచారించిన అపెక్స్‌కోర్టు నవంబర్ 4, 2022న తుది తీర్పును వెల్లడించింది. 2014లో ఈ.పి.ఎస్ పథకానికి చేసిన సవరణలు 'చట్టబద్ధమైనవి మరియు చెల్లుబాటు అయ్యేవి' అని ఆ తీర్పులో చెబుతూనే, చట్టంలో హయ్యర్ పెన్షన్‌కు సంబంధించిన పేరా 11(3)ని రద్దు చేసిన సమయంలో, హయ్యర్ పెన్షన్ కోసం జాయింటు డిక్లరేషన్ (పేరా 26.6 ప్రకారం) సమర్పించడానికి ఇచ్చిన ఆరునెలల సమయంపై కార్మికులకు సరైన సమాచారం ఇవ్వలేదని పేర్కొంది. గనుక హయ్యర్ పెన్షన్ కోసం ఆప్షన్ ఇవ్వడం కోసం మరో నాలుగు నెలల గడువు ఇస్తున్నామని,హయ్యర్ పెన్షన్ స్కీం నిర్వహణ కోసం కార్మికుల నుండి 1.16శాతం డబ్బులు వసూలు చేయడం సరైంది కాదని చెప్పింది. దీనికి ప్రత్యామ్నాయం చూడా లని, ఆరు నెలల గడువులోపు ప్రభుత్వం ఆపని చేయకపోతే కార్మికుల నుండి ఎట్టి పరిస్థితులలో వసూలు చేయవద్దని తీర్పునిస్తామని కోర్టు తన తీర్పులో తెలిపింది. 1.16శాతం నిర్వహణ ఖర్చును యజమాని వాటా నుండి రికవరీ చేస్తూ కార్మికులను మోసం చేసింది.



కార్మికులకు పరిమితమైన ప్రయోజనాలు కల్పించేదే అయినా, ఈ తీర్పును అమలు చేయడం కూడా కేంద్రానికి ఇష్టం లేదు. కోర్టు ఇచ్చిన నాలుగు నెలల గడువు మరో తొమ్మిది రోజులలో ముగుస్తుందనగా, తీర్పు అమలుకు మొదట సర్క్యులర్‌ను ఇచ్చి తన వైఖరి ఏమిటో చెప్పకనే చెప్పింది. ఆ సర్క్యులర్ అస్పష్టంగా వుందని, జాయింటు డిక్లరేషన్స్ ఇవ్వడంలో వున్న ఆటంకాలు తొలగించాలని, ఆప్షన్స్ ఇచ్చు కోవడానికి సరైన సమయం ఇవ్వాలని, తదితర అనేక అంశాలపై స్పష్టత ఇవ్వాలని సీఐటీయూ అఖిల భారత కేంద్రం సిపిఎఫ్‌సికి విజ్ఞప్తి చేసింది. ఆ కృషి ఫలితంగానే అనేక ఆటంకాలను అధిగమించి, ఈ రోజు పద్దెనిమిది లక్షల మంది హయ్యర్ పెన్షన్‌కు ఆప్షన్ ఇచ్చుకోగలిగారనేది అక్షర సత్యం.

పెన్షన్ లెక్కింపులో కోత

ఇక్కడ నుండి బీజేపీ ప్రభుత్వ కుట్ర మొదలైంది. కోర్టు తీర్పును అమలు చేస్తున్నట్లే వుండాలి, దానితో పాటు తమ ప్రభుత్వంపై భారం తగ్గించుకోవడమే కాక, ప్రభుత్వానికి అదనపు నిధులు పోగేసుకోవడానికి మార్గాలను అన్వేషించింది. అందులో నుండి ముందుకు తెచ్చింది 'దామాషా పద్ధతి'. సాధారణ పెన్షన్‌ల చెల్లింపులో దామాషా పద్ధతిన లెక్కించడం సరైనదే. కానీ ఎప్పుడయితే కార్మికుడు హయ్యర్ పెన్షన్‌కు ఆప్షన్ ఇస్తాడో, 1995 స్కీం ప్రారంభమైన నాటి నుండి నేటివరకు సీలింగ్‌పైన కాకుండా పూర్తి జీతంపైన 8.33 శాతం నిధులను పెన్షన్ ఫండ్‌కు జమచేయడంతో పాటు 1.16శాతం నిధులు స్కీం నిర్వహణ ఖర్చులు కూడా చెల్లిస్తారు. అంటే యజ మాని చెల్లించే 12శాతం నిధులలో 9.49శాతం పెన్షన్ ఫండ్‌కు బదిలీ అవుతాయి.

ఈ.పీ.ఎస్ సభ్యుడు అయిన రోజు నుండి పూర్తి జీతంపైన పెన్షన్ ఫండ్‌కు నిధులు చెల్లించిన తర్వాత దామాషా పద్ధతి వర్తిం చదు. కేవలం 1971-95 మధ్య ఈ.పి.ఎస్ స్కీం లాభం, 1995 నుండి తాను స్కీం నుండి ఎగ్జిట్ అయ్యే వరకు వున్న కాలానికి చట్ట ప్రకారం చివరి అరవై నెలల జీతం సగటును తీసుకుని పెన్షన్ లెక్కించాలి. కానీ చట్టాన్ని లెక్క చేయకుండా తాను విడుదల చేసిన సర్క్యులర్స్‌ను కూడా కాదని హయ్యర్ పెన్షన్ ఆప్షన్ ఇచ్చిన వారికి దామాషా పద్ధతిని (A+B+C) అమలు చేస్తూ, చట్ట ప్రకారం తనకు ఇవ్వాల్సిన పెన్షన్‌ను దాదాపు 40శాతం కోతపెడుతున్నది. ఈ దుర్మార్గమైన దామాషా పద్ధతిని తిప్పికొట్టి చట్టపరంగా మనకు రావలసిన పెన్షన్ కోసం పోరాడటం తక్షణ కర్తవ్యం.

అలాగే పెన్షనబుల్ సర్వీసు కాలాన్ని లెక్కించే దానిలో కూడా మోసం చేస్తున్నారు. చట్టంలోని పేరు 10(2)కు 2009లో సవరణ చేస్తూ జి.ఎస్.ఆర్ నెం. 546(ఇ)ని విడుదల చేస్తూ (24 జులై.2009 నుండి అమలు), సభ్యుడు 58 సం॥ల సర్వీసు పూర్తి చేసుకొని స్కీం నుండి వైదొలిగేటప్పుడు, 20 సం॥ పెన్షనబుల్ సర్వీసు పూర్తి చేసుకొన్నట్లయితే అతనికి రెండేండ్ల సర్వీసును వెయిటేజ్ కింద కలిపి పెన్షనబుల్ సర్వీసును నిర్ధారిస్తారు. స్కీం ప్రారంభించిన 1995 సభ్యుడు అయిన కార్మికుడు, 2015 నవంబర్ తర్వాత ఇరవైయేండ్ల వెయిటేజ్ వస్తుంది. కానీ పెన్షన్‌ను కుదించడానికి రెండేండ్ల వెయిటేజ్‌ని 2014కంటే ముందే కలిపి పెన్షనబుల్ సర్వీస్‌ను లెక్కించి మోసం చేస్తున్నారు.

పెన్షనబుల్ జీతం విషయంలో కూడా ఇటువంటి మోసమే జరుగుతున్నది. జీతం అంటే బేసిక్ పే+ కరువు భత్యం+ డి.ఎ. అరియర్స్/ ఫుడ్ కూపన్‌లతో పాటు రిటైనింగ్ అలవెన్స్ కూడా అని ఈ.పి.ఎఫ్ అండ్ ఈ.పి.ఎస్ చట్టం చెబుతున్నది. కోర్టు తీర్పును అనుసరించి, సభ్యుడు కట్టాల్సిన బకాయిలను 1995 నుండి ఇప్పటివరకు అదే లెక్కన లెక్కించి, డిమాండ్ నోటీసులు జారీ చేసి కార్మి కుల వద్ద నుండి జమ చేయించింది. కానీ చివరగా అతని పెన్షనబుల్ జీతంను లెక్కించేటప్పుడు అతని డి.ఎ అరియర్స్‌ను పరిగణనలోకి తీసుకోకుండా వున్నందున వారికి రావలసిన హయ్యర్ పెన్షన్ కుదించబడుతున్నది.

> కార్మికులకు పరిమితమైన ప్రయోజనాలు కల్పించేదే అయినా, ఈ తీర్పును అమలు చేయడం కూడా కేంద్రానికి ఇష్టం లేదు. కోర్టు ఇచ్చిన నాలుగు నెలల గడువు మరో తొమ్మిది రోజులలో ముగుస్తుందనగా, తీర్పు అమలుకు మొదట సర్క్యులర్‌ను ఇచ్చి తన వైఖరి ఏమిటో చెప్పకనే చెప్పింది. ఆ సర్క్యులర్ అస్పష్టంగా వుందని, జాయింటు డిక్లరేషన్స్ ఇవ్వడంలో వున్న ఆటంకాలు తొలగించాలని, ఆప్షన్స్ ఇచ్చుకోవడానికి సరైన సమయం ఇవ్వాలని, తదితర అనేక అంశాలపై స్పష్టత ఇవ్వాలని సీఐటీయూ అఖిల భారత కేంద్రం సిపిఎఫ్‌సికి విజ్ఞప్తి చేసింది. ఆ కృషి ఫలితంగానే అనేక ఆటంకాలను అధిగమించి, ఈ రోజు పద్దెనిమిది లక్షల మంది హయ్యర్ పెన్షన్‌కు ఆప్షన్ ఇచ్చుకోగలిగారనేది అక్షర సత్యం.

ఆర్టీసీలో సమస్య-సీఐటీయూ కృషి

ఏపీ, టీజీ ఆర్టీసీలలోని కార్మికులకు వస్తున్న సమస్యలను ఆర్టీసీ యాజమాన్యాల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సీఐటీయూ అఖిల భారత కేంద్రం లోతుగా పరిశీలించిన మీదట 2024 ఆగస్టు 5న ఒక వినతిపత్రం, ఆగస్టు పద్నాలుగున మరో వినతిపత్రం సిపిఎఫ్‌సికి ఇచ్చి, ఒత్తిడి తీసుకొచ్చింది. కెవైసి సమస్యల పరిష్కారానికి ఒక ఎస్‌ఓపి (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్), పెన్షన్ నిధులు జమ కాకుండా బ్యాన్ చేసిన అకౌంట్లను (టీజీఆర్టీసీలో 1400) రీఓపెన్ చేయడానికి ఒక ఎస్‌ఓపిని కేంద్ర ఈపీఎఫ్‌ఓ విడుదల చేసింది. గుర్తించిన పదకొండు సమస్యలను కేంద్ర ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్‌కు పంపడంతో పాటు, తెలంగాణ బోర్డు మీటింగ్‌లో ఎజెండాగా పెట్టి చర్చించాలని కోరుతూ ఆర్‌పిఎఫ్‌సి-బర్కత్‌పుర వారికి వినతిపత్రం ఇవ్వడమేకాక, కమిటీ సభ్యులుగా వున్న కార్మిక సంఘాల ప్రతినిధులకు పంపింది. సిఐటియు నాయకత్వం లేఖ రాసింది. మిగతా సంఘాలు కూడా రాసి ఒత్తిడి తెస్తే సమస్య పరిష్కారానికి అవకాశముంటుంది.

కోటా నిబంధనలకు నో

- ఆరు యంగ్ ప్రొఫెషనల్స్ పోస్టుల ఫలితాలు విడుదల
- కేంద్రం తీరుపై సామాజికవేత్తల ఆగ్రహం

న్యూఢిల్లీ : కాంట్రాక్టు విధానంలో అభ్యర్థులను నియమించే పథకమైన యంగ్ ప్రొఫెషనల్ (వైపీ)కి చెందిన ఆరు పోస్టులలో ఎలాంటి రిజర్వేషన్ నిబంధనలనూ పాటించలేదు. వీటి ఇంటర్వ్యూలను ఈ ఏడాది ఆగస్టులో నిర్వహించగా కేంద్ర ప్రభుత్వంలోని ఒక విభాగం ఇటీవల ఫలితాలను విడుదల చేసింది. నలుగురు అభ్యర్థులు వైపీలుగా నియామకానికి తగినవారిగా గుర్తించినట్టు డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్‌టీ) ఒక నోటీసులో పేర్కొన్నది. కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలు అభ్యర్థులను వైపీలుగా నియమించటాన్ని కొనసాగిస్తున్నాయి. ప్రభుత్వం లాటరల్ ఎంట్రీ కింద ఇలాంటి నియామకాలను నిలిపివేసిన ఒక నెల తర్వాత.. కోటా విధానాన్ని పాటించకుండా నియామకాలు జరిగిన మరో పథకం ఇదే కావటం గమనార్హం. ఈ మంత్రిత్వ శాఖలు, విభాగాలు ఐదేండ్ల క్రితం నిటి ఆయోగ్ రూపొందిం చిన వైపీ పథకాన్ని అనుసరిస్తున్నాయి. కాగా, కాంట్రాక్టు నియామకాలకు రిజర్వేషన్ కల్పించాలన్న నిబంధనలు లేవని శాస్త్ర సాంకేతిక శాఖ అధికారి ఒకరు తెలిపారు. రెగ్యులర్, తాత్కాలిక ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీలు 15 శాతం, ఎస్టీలు 7.5 శాతం, ఓబీసీలు 27 శాతం, ఆర్థికంగా బలహీన వర్గాల(ఈడీబ్ల్యూఎస్)కు 10 శాతం రిజర్వేషన్ ఉండాలి. కానీ, ఈ పథకం పైన పేర్కొన్న విధంగా రిజర్వేషన్‌ను అందించదు. "మేము నిటి ఆయోగ్ విధానాన్ని అనుసరిస్తున్నాం. కాంట్రాక్టు ఉద్యోగాల్లో రిజర్వేషన్ నిబంధన లేదు. ఇవి తాత్కాలిక పోస్టులకు భిన్నంగా ఉంటాయి" అని ఒక అధికారి తెలిపారు.

వివేక్ జైలుకెళ్లడం ఖాయం:మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

చెన్నూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ జైలుకెళ్లడం ఖాయమని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో తన విశాఖ కంపెనీ నుంచి విజిలెన్సు సెక్యూరిటీ అనే సూట్‌కేస్ కంపెనీకి రూ.8 కోట్లు అక్రమంగా బదిలీ చేశారని తాను ఈడీకి ఫిర్యాదు చేసిన విషయాన్ని గుర్తుచేశారు.

మూసీ ప్రక్షాళనపై చర్చిద్దాం...సహకరిద్దాం

- ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొడదాం
- రైతులను కాపాడుకుందాం
- నేడు నాగోల్‌లో సమావేశం : భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మూసీ ప్రక్షాళనపై చర్చించడం, ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టడం, తద్వారా రైతులను రక్షించుకునేందుకు సమాలోచనలు చేయనున్నట్టు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం హైదరాబాద్, నాగోల్‌లోని శుభం గార్డెన్స్ నిర్వహించే సమావేశానికిఖ మూసీ పరివాహక రైతులు, ప్రజలు తరలిరావాలని ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతులకు, ముఖ్యంగా మూసీ పరివాహక ప్రాంత రైతుల బాధలేంటో ప్రపంచానికి తెలియజేసే లక్ష్యంతో సభను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం,సీఎం రేవంత్ రెడ్డి మూసీ ప్రక్షాళన అనే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలంటే రైతుల సహకారం అవసరమనీ, అందరూ నడుంబిగించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మూసీ జీవనది కింద తరతరాలుగా వ్యవసాయంతోపాటు సాగు, తాగు, పాడి, మత్స్య అవసరాలకు ఉపయోగపడేదని గుర్తు చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాలతోసహా ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలకు ప్రయోజనం జరిగిందని తెలిపారు.నేడు మానవ తప్పిదాల వల్ల మూసీ కాలుష్యమయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కలుషితమై పంటలు సరిగా పడటం లేదని తెలిపారు. ఆ పంటను కొనే పరిస్థితి లేదనీ, పండిన పంటలను తినే పరిస్థితి లేదని పేర్కొన్నారు.

15 రోజుల్లో ఆ మూడు వర్సిటీల సెర్చ్ కమిటీల భేటీ?

- కేయూ, జేఎన్ఏఎఫ్ఏయూ, బీఆర్ఏఓయూలవి వాయిదా
- ముగిసిన ఏడు వర్సిటీల సమావేశాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పది విశ్వవిద్యాలయల ఉపకులపతుల (వీసీ) నియామకం ప్రక్రియకు సంబంధించి ఏడు వర్సిటీల సెర్చ్ కమిటీల సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. గురువారం ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ), పాలమూరు విశ్వవిద్యాలయం (పీయూ), పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సెర్చ్ కమిటీల సమావేశాలు జరిగాయి. శుక్రవారం జేఎన్టీయూ హైదరాబాద్, తెలంగాణ విశ్వవిద్యాలయం (టీయూ), శాతవాహన విశ్వవిద్యాలయం (టీయూ) సెర్చ్ కమిటీల సమావేశాలను నిర్వహించారు. దీంతో ఏడు విశ్వవిద్యాలయాలకు సంబంధించి వీసీలపై కసరత్తు పూర్తయ్యింది. కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ), జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం (జేఎన్ఏఎఫ్ఏయూ), డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (బీఆర్ఏఓయూ) సెర్చ్ కమిటీ సమావేశాలు వాయిదా పడ్డాయి. దీంతో ఆ మూడు విశ్వవిద్యాలయాల సెర్చ్ కమిటీల సమావేశాలు ఎప్పుడు జరుగుతాయోనన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. విశ్వసనీయ సమాచారం ప్రకారం 15 రోజుల్లో ఆ సెర్చ్ కమిటీల సమావేశాలను నిర్వహించే అవకాశమున్నట్టు తెలిసింది. అన్ని పూర్తయ్యాక పది విశ్వవిద్యాలయాలకు సంబంధించిన సెర్చ్ కమిటీ ప్రతిపాదనలను కూడిన ముగ్గురు వీసీల పేర్లను గవర్నర్ ఆమోదానికి రాష్ట్ర ప్రభుత్వం పంపించనుంది. గవర్నర్ ఆమోదించిన తర్వాత ప్రభుత్వం అధికారికంగా ప్రకటిస్తుంది.

వైద్యమండలి పనితీరు భేష్

- డాక్టర్ క్రిస్టీనా జెడ్ చొంగ్తూ
- నూతన భవనం ప్రారంభం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ వైద్యమండలి పనితీరు దేశంలోనే బాగుందని వైద్యారోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టీనా జెడ్ చొంగ్తూ అభినందించారు. శుక్రవారం హైదరాబాద్ కోఠిలోని వైద్యమండలి నూతన భవనాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండలి చైర్మెన్ డాక్టర్ మహేష్ కుమార్, వైస్ చైర్మెన్ డాక్టర్ శ్రీనివాస్ తదితరులు ప్రభుత్వం అందించిన సహకారానికి ధన్యవాదాలు తెలిపారు. ఎథిక్స్ కమిటీ చైర్మెన్ డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ 300 మంది నకిలీ వైద్యులపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ బోధనా వైద్యుల సంఘం ప్రతినిధి డాక్టర్ కిరణ్ మాదాల, నిలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి ముగ్గురు చిన్నారులు మృతి

నవతెలంగాణ-శామీర్‌పేట

ప్రమాదవశాత్తు ముగ్గురు బాలురు చెరువులో పడి ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జీనోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొల్తూరు గ్రామంలో శుక్రవారం జరిగింది. ఇందుకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మూడుచింతలపల్లి మండలం కొల్తూరు గ్రామానికి చెందిన కటిక మణికంఠ(14), సలేంద్రి హర్ష(10), మనోజ్(8) శుక్రవారం గ్రామంలోని చెరువు వద్దకు వెళ్లారు. ప్రమాదవశాత్తు జారిపడి నీటిలో మునిగిపోవడంతో ముగ్గురూ మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను వెలికి తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ముగ్గురు బాలురు మృతితో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

ఎల్ఆర్ఎస్ మరింత ఆలస్యం..?

- చెరువుల బఫర్ జోన్లు కలిశాయన్న అనుమానాలు
- దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్న అధికారులు
- 10-15శాతం ఎఫ్‌టీఎల్, బఫర్‌లో ఉన్నట్టు గుర్తింపు
- మేడ్చల్ జిల్లాలో 40వేలకు పైగా దరఖాస్తుల పరిశీలన
- మిగతా చోట్ల అదే పనిలో ప్రభుత్వ సిబ్బంది



నవతెలంగాణ-సిటీబ్యూరో

లేఅవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) ప్రక్రియ మరింత ఆలస్యం కానున్నట్టు తెలుస్తోంది. ఎల్ఆర్ఎస్ కింద వచ్చిన దరఖాస్తుల్లో కొన్ని ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్నట్టు అనుమానాలు రావడంతో అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. మూడు దశల్లో పరిశీలించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ కావడంతో అధికారులు ఆ పనిలో ఉన్నారు. క్రమబద్ధీకరణ దరఖాస్తుల పరిష్కార బాధ్యతలను ప్రభుత్వం స్థానిక సంస్థలను పర్యవేక్షించే అదనపు కలెక్టర్లకు అప్పగించింది. ఈ క్రమంలో ఆ పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు.

రాష్ట్ర వ్యాప్తంగా భూముల క్రమబద్ధీకరణపై ప్రభుత్వానికి 25.67 లక్షల దరఖాస్తులు అందాయి. అందులో పురపాలక సంఘాల పరిధిలో 10.54 లక్షలు, గ్రామ పంచాయతీల పరిధిలో 10.76లక్షలు, మిగిలినవి కార్పొరేషన్ల పరిధిలో వచ్చాయి. ప్లాట్లకు సంబంధించినవి 25.53లక్షలు కాగా, లేఅవుట్ల దరఖాస్తులు 0.13లక్షలు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు పరిశీలించినవి 4.50లక్షలు మాత్రమే. ఆమోదం పొందినవి 70వేల లోపే.. ఈ దరఖాస్తులపై ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రెవెన్యూ, మున్సిపాల్టీల అధికారులు కొత్త నిర్ణయం తీసుకున్నారు. దరఖాస్తుల్లో కొన్ని బఫర్ జోన్లలో ఉన్నట్టు అనుమానాలు రావడంతో రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు క్షేత్ర స్థాయిలో భూములను పరిశీలిస్తున్నారు. జియో మ్యాపింగ్ సరిహద్దులు, హెచ్ఎండీఏ వెబ్‌సైట్‌లోని చెరువుల ప్రాథమిక నోటిఫికేషన్, తుది నోటిఫికేషన్లను పరిగణలోకి తీసుకుంటున్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల్లో ఉంటే వాటిని తిరస్కరించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. తూంకుంట, మేడ్చల్, గుండ్ల పోచంపల్లి, పోచారం, ఘట్‌కేసర్ మున్సిపాల్టీలు, పీర్జాదిగూడ, బోడుప్పల్ కార్పొరేషన్ల పరిధిలోని దరఖాస్తుల్లో 10 నుంచి 15శాతం ఇలాంటివే ఉన్నట్టు అధికారులు తెలిపారు.

హైడ్రా ప్రభావం

క్రమబద్ధీకరణ దరఖాస్తుల పరిష్కార బాధ్యతలను ప్రభుత్వం స్థానిక సంస్థలను పర్యవేక్షించే అదనపు కలెక్టర్లకు అప్పగించిన విషయం తెలిసిందే. వీటిని మూడంచెల్లో (ఎల్-1, ఎల్-2, ఎల్-3) పరిష్కరించాలంటూ ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. దరఖాస్తులను పరిశీలించాక, అధికారులు ఆమోదించేలా ఒక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. గతంలో దరఖాస్తులను ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల సూచనల ఆధారంగా మున్సిపల్ అధికారులు పరిష్కరించారు. హైడ్రా ఏర్పాటుతో క్షేత్ర స్థాయిలో పరిశీలించి చెరువుల సరిహద్దులు, బఫర్ జోన్లను నిర్ధారించి దరఖాస్తుదారు పేర్కొన్న సర్వే నెంబర్ విస్తీర్ణం బఫర్ జోన్‌లోకి వస్తుందా..? అన్న అంశాలను తేల్చనున్నారు. గ్రామ పరిధిలోని నక్ష, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన జీడీపీఎస్‌లతో సర్వే నిర్వహించనున్నారు. ఇలాంటివి జిల్లాలోని మున్సిపాల్టీలు, గ్రామాల్లో కలిపి దాదాపు 40వేలకు పైగా క్రమబద్ధీరణ దరఖాస్తులను పరిశీలిస్తున్నట్టు సమాచారం. జిల్లా వ్యాప్తంగా మొత్తం లక్షా 70వేల వరకు ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తులు రాగా.. ఇప్పటి వరకు దాదాపు 3వేలకు పై చిలుకు మాత్రమే పరిష్కరించినట్టు ఓ అధికారి తెలిపారు.

కొత్త దరఖాస్తు చేసుకుంటేనే ఆమోదం

1.ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిల్లో క్రమబద్ధీకరణ దరఖాస్తులుంటే ప్రాథమిక దశ (ఎల్-1)లోనే అధికారులు తిరస్కరిస్తారు. దరఖాస్తుదారులకు మెస్సేజ్‌లు, ఫోన్లు, ఈ మెయిల్స్ ద్వారా తెలుపనున్నారు.

2.బఫర్ జోన్‌లో ఉంటే.. ఆ పరిధిని తొలిగించి సర్వే చేయించుకుని కొత్త దరఖాస్తు చేసుకున్నాకే క్షేత్రస్థాయిలో రెండోసారి పరిశీలించి ఆమోద్ర ముద్ర వేయనున్నారు.

3.ఎల్-2 దశలో మున్సిపల్, రెవెన్యూ అధికారులు అభ్యంతరం చేసినా తిరస్కరిస్తారు.

4.మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మున్సిపాల్టీలు, గ్రామాల్లో దాదాపు 40వేలకు పైగా క్రమబద్ధీరణ దరఖాస్తులను పరిశీలిస్తున్నారు.

పైసా వసూల్..

హైదరాబాద్ చుట్టూ ఉన్న చెరువుల హద్దుల్లో బఫర్ జోన్లను కొందరు నీటిపారుదల శాఖ అధికారులు మార్చారని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధికారులు అంటున్నారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో జలవనరులు.. చెరువుల బఫర్ జోన్లలో ఈ మార్పులు చేర్పులు చేశారని, జిల్లా నీటిపారుదల శాఖ అధికారుల్లో కొందరు సహకారం అందించినట్టుగా గుర్తించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ హద్దులను గుర్తించే క్రమంలో ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి.

10 శాతం ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోకి..

రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 1820 చెరువులుండగా, 10 శాతం చెరువులు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లుగా మారిపోయాయంటూ స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. సహజ సిద్ధమైన నీటివనరులు, చెరువులు అధికంగా ఉన్న కూకట్‌పల్లి, మేడ్చల్, ఉప్పల్, ఘట్‌కేసర్ మండలాల్లో నీటిపారుదల శాఖ అధికారులు చెరువుల బఫర్ జోన్లు, ఎఫ్‌టీఎల్‌గా మార్చేశారు. మేడ్చల్ మండలం తూంకుంట మున్సిపాలిటీ పరిధిలో రెండు చెరువుల్లో కొన్నేండ్ల నుంచి ప్రవాహం ఆగిపోవడంతో బఫర్ జోన్‌ను 20 మీటర్లు వెనక్కి జరిపారు. ఇరిగేషన్ శాఖ ఇండ్లకు నిరభ్యంతర పత్రాలను ఇచ్చింది.

ఏజెన్సీ హక్కులను కాలరాయొద్దు

- ఖాళీ పోస్టులను స్థానిక గిరిజనులకే ఇవ్వాలి : తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మూడ్ ధర్మానాయక్

నవతెలంగాణ-కందనూలు



ఏజెన్సీలో గిరిజనుల హక్కులను కాలరాయొద్దని, ఇక్కడ ఖాళీ పోస్టులను స్థానిక గిరిజనులకే ఇవ్వాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మూడ్ ధర్మానాయక్ అన్నారు. గిరిజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని డీటీడీఓ అధికారి ఫిరంగిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలో 5వ షెడ్యూల్ ఉన్నదన్నారు. 275(1) ప్రకారం ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న అన్ని రకాల ఉద్యోగాలను స్థానిక గిరిజనులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కానీ ఆ చట్టాన్ని కొంతమంది అధికారులు అమలు చేయకుండా గిరిజనులకు మోసం చేయచూస్తున్నారని ఆరోపించారు. అర్హులైన గిరిజన నిరుద్యోగ అభ్యర్థులు వందల సంఖ్యలో ఉన్నారని, జిల్లాలో 58 (సీఆర్‌టీపీ) పోస్టులు ఉన్నట్టు చెప్పి.. ఇప్పుడు 41 పోస్టులకే నోటిఫికేషన్ ఇచ్చారని అన్నారు. రోస్టర్ విధానం లేదని, వికలాంగులకు అర్హత లేదని, ఇది కూడా గిరిజనులకు ఇవ్వకుండా జనరల్ స్థానికులకే ఇవ్వాలని సర్క్యులర్ వచ్చిందని చెప్పారు. ఇది పూర్తిగా ఏజెన్సీ చట్టాలకు విరుద్ధమని, తక్షణమే 11 ఆశ్రమ పాఠశాలల్లో సీఆర్‌టీ పోస్టులను స్థానిక గిరిజనులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ హక్కులు అమలు చేయకపోతే హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు దేశ్య నాయక్, జిల్లా అధ్యక్షులు అశోక్ నాయక్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో కన్సల్టెన్సీల ప్రభావం పెరుగుతోంది

- గీతం చర్చాగోష్టిలో వక్తల అభిప్రాయం

నవ తెలంగాణ-పటాన్‌చెరు



భారతదేశ ఎన్నికల ప్రచారంలో రాజకీయ కన్సల్టెన్సీల ప్రభావం క్రమంగా పెరుగుతూనే ఉందని ప్రముఖ విద్యావేత్తలు, పరిశోధకులు అభిప్రాయపడ్డారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారం పరిధిలో ఉన్న గీతం యూనివర్శిటీలోని "స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్" ఆధ్వర్యంలో 'భారతదేశంలో ఎన్నికల ప్రచారాలు - పెరుగుతున్న రాజకీయ సలహాదారుల పాత్ర' అనే అంశంపై శుక్రవారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా "భారతదేశ ఎన్నికల దృశ్యంలో రాజకీయ కన్సల్టెన్సీల పాత్ర పెరగడం"పై లైడెన్‌లోని రాయల్ నెదర్లాండ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సౌత్ ఈస్ట్ ఏషియన్ అండ్ కరీబియన్ స్టడీస్‌లో రీసెర్చ్ ఫెలో డాక్టర్ విఘ్నేష్ కార్తీక్ మాట్లాడారు. ఎన్నికల కన్సల్టెన్సీలు వ్యూహాత్మక వనరుల కేటాయింపు, ఉపన్యాస మెళకువలు, సిబ్బంది నిర్వహణ ద్వారా పార్టీలకు అధికారం ఇస్తాయని, పొలిటికల్ ఎడ్జ్ (2014) వంటి మార్గదర్శకుల నుంచి నేషన్ విత్ నమో (2023-24) వంటి సైద్ధాంతిక కన్సల్టెన్సీలుగా మారడాన్ని ఉటంకించారు. ఈ మార్పునకు దారితీసిన ముఖ్య కారకాలు.. దేశంలోని అధిక జనాభా, లోతైన ప్రజాస్వామ్యీకరణ, పెరిగిన సాంకేతిక వినియోగం, సగం మంది మాత్రమే తిరిగి ఎన్నికవడమని తెలిపారు. భారతదేశ ఎన్నికల ఖర్చులు ఇప్పుడు అమెరికాకు పోటీగా ఉన్నాయని, స్థిరమైన అభివృద్ధి కార్యక్రమాలు పార్టీలకు ప్రధాన ఆందోళనగా ఉద్భవించాయని చెప్పారు. భారత రాజకీయ పార్టీలను కేంద్రీకృత ఎన్నికల యంత్రాలుగా మార్చడం గురించి హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్ర విభాగం అధిపతి ప్రొఫెసర్ కైలాష్ కున్ని క్రిష్ణన్ మాట్లాడారు. 1989 నుంచి రెండు పార్టీల పోటీ నుంచి మూడవ పార్టీ వ్యవస్థ ఆవిర్భావాలను ప్రస్తావించారు. అనేక రాజకీయ పార్టీలు ఇప్పుడు వారి సంస్థాగత నిర్మాణాలు, సిద్ధాంతాల్లో చాలా సారూప్యతను కలిగి ఉన్నాయన్నారు. బయటి నిధుల వనరులపై ఎక్కువగా ఆధారపడే రాజకీయ నాయకుల జవాబుదారీతనం గురించి ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్య ప్రక్రియలు, పార్టీ సభ్యులు పాల్గొనే విధానాలు ప్రభావితం చేస్తున్నాయని తెలిపారు. అభ్యర్థుల ఎంపిక విషయంలో పార్టీ నాయకత్వం తరచుగా స్వయంగా ఎన్నికల ఖర్చును భరించగల అభ్యర్థులకు ప్రాధాన్యమిస్తోందన్నారు. రాజకీయ పార్టీల్లో ప్రజాస్వామ్యం, జవాబుదారీతనంపై ఈ మార్పుల ప్రభావం గురించి ఆలోచించాల్సిన అవశ్యకత ఏర్పడిందన్నారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రొఫెసర్లు డాక్టర్ మయాంక్ మిశ్రా, డాక్టర్ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడే నిందితుడు

- ప్రేమను అంగీకరించలేదని సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని హత్య
- వివాహిత హత్య కేసును ఛేదించిన మియాపూర్ పోలీసులు

నవతెలంగాణ-మియాపూర్



వివాహిత అయిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని హత్య కేసును మియాపూర్ పోలీసులు ఛేదించారు. తన ప్రేమను అంగీకరించకపోవడంతో స్నేహితుడే హత్య చేసినట్టు గుర్తించారు. హైదరాబాద్ మియాపూర్‌లోని దీప్తిశ్రీనగర్‌లోని సీబీఆర్ ఎస్టేట్ అపార్ట్‌మెంట్‌లోని ఓ ఫ్లాట్‌లో నాలుగు రోజుల కిందట వివాహిత పట్టపగలు దారుణంగా హత్యకు గురైన ఘటన స్థానికంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఫోన్ కాల్స్, సీసీ పుటేజీ ఆధారంగా శుక్రవారం నిందితుడిని అరెస్ట్ చేసిన మియాపూర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కేసుకు సంబంధించిన వివరాలను మియాపూర్ సీఐ దుర్గారామలింగ ప్రసాద్ మీడియాకు వెల్లడించారు. మియాపూర్‌లోని దీప్తిశ్రీనగర్‌కు చెందిన స్పందన (29) 2017లో ఇంటర్ చదువుతున్న సమయంలో గచ్చిబౌలి సుదర్శన్‌నగర్ సమీపంలోని ఆర్ఎంఓయూ కాలనీలోని గ్రీన్ అవెన్యూ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే ఎం. మనోజ్‌కుమార్ ఫ్రెండ్ అయ్యాడు. దీప్తి శ్రీనగనగర్‌కు చెందిన వినయ్‌కుమార్ కూడా ఇంటర్ చదివే సమయంలో స్పందనకు స్నేహితుడు. కాగా, స్పందన, వినయకుమార్ ప్రేమించుకొని పెద్దలను ఒప్పించి 2022లో పెండ్లి చేసుకున్నారు. ఆ తర్వాత కొద్ది రోజులకే భార్యభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో వేరువేరుగా ఉంటున్నారు. స్పందన.. తన తల్లి, సోదరుడితో కలిసి దీప్తిశ్రీనగర్ సీబీఆర్ ఎస్టేట్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటుండగా, వినయ్‌కుమార్ ఇదే కాలనీలో మరో చోట ఉంటున్నాడు. ఇద్దరి మధ్య విడాకుల కేసు కోర్టులో నడుస్తున్నది. ఇదిలా ఉండగా.. భర్తతో విభేదాల కారణంగా ఒంటరిగా ఉంటున్న స్పందనకు తన క్లాస్‌మెట్ మనోజ్‌కుమార్ దగ్గరయ్యాడు. స్పందనకు మనోజ్‌కుమార్ ప్రపోజ్ చేయగా, తిరస్కరించింది. అయితే స్పందన తన ప్రేమను తిరస్కరించడం, ఇతర ఫ్రెండ్స్, కొలీగ్స్‌తో సన్నిహితంగా ఉంటుండటంతో మనోజ్ జీర్ణించుకోలేకపోయాడు. దీనిపై ఆమెను హెచ్చరించాడు. అయినా పట్టించుకోవడంతో ఆమెపై పగపెంచుకున్నాడు. సెప్టెంబర్ 30న ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో గ్రానేట్ రాయి, స్క్రూ డ్రైవర్ వెంటపెట్టుకొని స్పందన ఫ్లాట్‌లోకి వెళ్లాడు. నిద్రలో ఉన్న స్పందనపై మొదట గ్రానేట్ రాయితో తలపై బాది, ఆ తర్వాత స్క్రూ డ్రైవర్‌తో మొఖంపై పొడిచి దారుణంగా హత్య చేశాడు. అనంతరం ఫ్లాట్ బయటి నుంచి లాక్‌వేసి వెళ్లిపోయాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన మృతురాలి తల్లి నమ్రత డోర్ లాక్ చేసి ఉండటంతో స్పందనకు కాల్ చేసింది. ఫోన్ తీయకపోవడంతో స్థానికులతో కలిసి డోర్‌ను బ్రేక్ చేసి ఇంట్లోకి వెళ్లి చూసే సరికి రక్తపుమడుగులో కుమార్తె చనిపోయి కనిపించింది. వెంటనే మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించారు. దర్యాప్తులో భాగంగా మృతురాలి ఫోన్ సీడీఆర్ డేటా, స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలో లభించిన పుటేజీని సేకరించారు. స్పందనను హత్య చేసింది తన ఫ్రెండ్ మనోజ్ కుమార్‌గా గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించాడు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 20 మంది ఎయిడెడ్ అధ్యాపకులు

- పది రోజుల్లో చేరాలని ఇంటర్ విద్యాశాఖ ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎయిడెడ్ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న 20 మంది అధ్యాపకులను అవసరమున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీలు (జీజేసీ)ల్లో సర్దుబాటు చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఇంటర్ విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎయిడెడ్ జూనియర్ కాలేజీల్లో 20 మంది అధ్యాపకులు అవసరానికి మించి ఉన్నట్టు గుర్తించామని తెలిపారు. వారిని అవసరం ఉన్న జీజేసీల్లో సర్దుబాటు చేశామని పేర్కొన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న కాలేజీల్లో వెంటనే విధుల నుంచి వైదొలగాలని కోరారు. కొత్తగా కేటాయించిన కాలేజీల్లో పది రోజుల్లో ఆ అధ్యాపకులు చేరాలని ఆదేశించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్లు ఆ అధ్యాపకులను చేర్చుకోవాలనీ, వారికి సంబంధించిన అక్టోబర్ నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు జీతాలకు సంబంధించిన వివరాలను డీఐఈవోలకు పంపించాలని కోరారు.

దొడ్డు వడ్లకూ రూ.500 బోనస్ చెల్లించాలి

- సన్న వడ్లకే బోనస్ అన్న ప్రభుత్వ ప్రకటనపై ఆగ్రహం
- ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్
- సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలో రైతులు పండించిన దొడ్డు వడ్లకూ రూ.500 బోనస్ చెల్లించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. సన్నవడ్లకే బోనస్ ఇస్తామన్న ప్రభుత్వ ప్రకటనపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దొడ్డు వడ్లకూ బోనస్ ఇచ్చి ప్రభుత్వ హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ముడుపుల కోసం, మూసీ కోసం రూ. లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధపడ్డ ముఖ్యమంత్రికి రైతుభరోసా, దొడ్డు వడ్లకు బోనస్ ఇచ్చేందుకు డబ్బులు లేవా అని విమర్శించారు. రైతులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అవినీతి ఆలోచనలు మానుకుని రైతులకు ఇచ్చిన హామీలపై దృష్టి సారించాలని సూచించారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో చాలా స్పష్టంగా రైతులు పండించే ప్రతి క్వింటా ధాన్యానికి రూ. 500 బోనస్ చెల్లిస్తామని హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తు చేశారు. గురువారం జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలోనూ దొడ్డు వడ్లకు రూ.500 బోనస్, ఈ వర్షాకాలానికి సంబంధించి రైతు భరోసా సాయంపై తేల్చకుండా సీఎం, రాష్ట్ర ప్రభుత్వం కప్పదాటు వైఖరితో వ్యవహరించాయని విమర్శించారు. గత సీజన్‌లో బోనస్ చెల్లించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని దుయ్యబట్టారు. ఈ సీజన్‌లో కూడా ఇప్పటి వరకు దొడ్డువడ్లకు బోనస్ సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన లేకపోవటంతో రైతులు అయోమయంలో ఉన్నారని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్ హామీకి అనుగుణంగా ఈ సీజన్ రైతులు పండించిన ధాన్యం మొత్తానికి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ చెల్లించాల్సిందేనని కేటీఆర్ డిమాండ్ చేశారు.

గత సీజన్ బకాయిలను కూడా ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కోరారు. కేవలం సన్నవడ్లకు మాత్రమే బోనస్ ప్రకటిస్తామంటే అది మొత్తం రాష్ట్ర రైతాంగాన్ని మోసం చేయటమేనని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 80 శాతానికిపైగా రైతులు దొడ్డువడ్లు పండిస్తారనీ, ఈ విషయం కాంగ్రెస్‌కు కూడా తెలుసన్నారు. సన్నాలు, దొడ్డు వడ్లకు రెండింటికీ బోనస్ ఇస్తామంటేనే రైతులు కాంగ్రెస్‌ను గెలిపించారని తెలిపారు. అధికారంలోకి వచ్చాక రైతులను మోసం చేస్తారా? అని ప్రశ్నించారు. బోనస్ ఇవ్వకుంటే రైతుల తరఫున బీఆర్ఎస్ పోరాడుతుందని హెచ్చరించారు.

రైతు భరోసా ఊసేదీ?

వానాకాలం సీజన్ పూర్తయినప్పటికీ ఇప్పటి వరకు రైతు భరోసా సంగతి తేల్చటం లేదు. ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు భరోసా పేరిట ఎకరాకు రూ. 7,500 ఇస్తామంటూ స్వయంగా పీసీసీ అధ్యక్షుడి హెూదాలో రేవంత్ రెడ్డి మాట్లాడారని కేటీఆర్ గుర్తు చేశారు. కానీ గత సీజన్‌లో రైతులకు రైతుబంధు పైసలు మాత్రమే వేశారు. ఈ సీజన్‌కు సంబంధించి ఇప్పటి వరకు అసలు రైతు భరోసా సంగతే తేల్చటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు నాట్లు వేసే నాడు వేయాల్సిన పెట్టుబడి సాయాన్ని పంట చేతికొచ్చే వరకు కూడా ఇవ్వకపోవటమంటే రైతుల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏంటో అర్థమవుతోందని విమర్శించారు. రైతును రాజు చేసేందుకు కేసీఆర్ ప్రతి ఏడాది రూ.10 వేలు ఇస్తుంటే, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.15 వేలు ఇస్తామని నమ్మించి అధికారంలోకి వచ్చాక రూ.10 వేలు కూడా దక్కకుండా రైతులను వేధిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు భరోసా ఇస్తారో లేదా ప్రభుత్వం స్పష్టం చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గత సీజన్‌లో బాకీ ఉన్న డబ్బులను కలుపుకొని వెంటనే రైతుల ఖాతాల్లో ఎకరాకు రూ.10 వేల చొప్పున జమ చేయాలని డిమాండ్ చేశారు.

20 లక్షల మంది రైతులకు నయా పైసా రాలే

వందశాతం రుణమాఫీ అయ్యిందంటూ విర్రవీగిన ముఖ్యమంత్రి బండారం వ్యవసాయ శాఖ మంత్రి ప్రకటనతో బట్టబయలైందని కేటీఆర్ తెలిపారు. 20 లక్షల మంది రైతులకు ఇంకా రుణమాఫీ జరగలేదని స్వయంగా వ్యవసాయ మంత్రే ప్రకటన చేశారంటే ముఖ్యమంత్రివన్నీ డొల్లమాటలేనని తేలిపోయిందని ఎద్దేవా చేశారు.

డిసెంబర్ 9వ రోజే ఏకకాలంలో రూ. 2లక్షలు రుణమాఫీ చేస్తామని చెప్పి 10 నెలలైనా 20 లక్షల మంది రైతులకు నయా పైసా రాలేదంటే రైతులను నయవంచన చేయడమేనని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి చేతకానితనం.. అన్నదాతలకు కోలుకోలేని శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రైతులందరికీ రుణమాఫీ చేయకపోతే ఊరుకునేది లేదని కేటీఆర్ హెచ్చరించారు.

27న మర్రి శ్రేయారెడ్డి, ఆదిత్యరెడ్డిల వివాహం

- మాజీ సీఎం కేసీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందించిన ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఈ నెల 27న తన ఏకైక కుమార్తె మర్రి శ్రేయా రెడ్డి , ఆదిత్య రెడ్డిల వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాజీ సీఎం కేసీఆర్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయనను కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మల్లారెడ్డి కూడా ఉన్నారు.

వేర్వేరు రోజుల్లో 9,10 తరగతుల సైన్స్ పరీక్షలు

- ఉత్తర్వులు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో తొమ్మిది, పదో తరగతి చదువుతున్న విద్యార్థుల పరీక్షల విధానంలో ప్రభుత్వం సంస్కరణలు తెచ్చింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం శుక్రవారం ఉత్తర్వులు (జీవోనెంబర్ 23) విడుదల చేశారు. తొమ్మిది, పది తరగతుల పరీక్షల నిర్వహణకు సంబంధించి 2022, డిసెంబర్ 28న విడుదల చేసిన జీవో నెంబర్ 33కు సవరణ చేస్తున్నామని తెలిపారు. 33 జీవో ప్రకారం పారా నెంబర్ 3లో తొమ్మిది, పదో తరగతి విద్యార్థుల పరీక్షల సమయం అన్ని సబ్జెక్టులకూ మూడు గంటలు ఉంటుందని పేర్కొన్నారు. కానీ సైన్స్ సబ్జెక్టు సమయం మాత్రం మూడు గంటలా 20 నిమిషాలుంటుందని వివరించారు. ఒకే రోజు గంటన్నర ఫిజికల్ సైన్స్, గంటన్నర బయలాజికల్ సైన్స్ సబ్జెక్టులకు పరీక్ష నిర్వహించాలని తెలిపారు. ఫిజికల్ సైన్స్ పరీక్ష ముగిసిన తర్వాత జవాబు పత్రాలను తీసుకుని బయలాజికల్ సైన్స్ ప్రశ్నాపత్రాలను ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇందు కోసం అదనపు సమయం అవసరమవుతుందని వివరించారు. అందుకే సైన్స్ సబ్జెక్టు పరీక్ష నిర్వహణకు 20 నిమిషాలు అదనంగా కేటాయించామని పేర్కొన్నారు. దీన్ని మార్పు చేశామని తెలిపారు. 23 జీవో పారా నెంబర్ 3 ప్రకారం తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు అన్ని సబ్జెక్టుల రాతపరీక్షలకూ మూడు గంటల సమయం కేటాయించామని వివరించారు. సైన్స్ సబ్జెక్టును రెండు భాగాలుగా విడదీసి పరీక్షలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ సబ్జెక్టుల పరీక్షలను ఒకే రోజు కాకుండా వేర్వేరు రోజుల్లో గంటన్నర సమయం చొప్పున నిర్వహిస్తామని వివరించారు.

ప్రజావాణికి 338 దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 338 దరఖాస్తులు అందాయి. గృహనిర్మాణ శాఖకు సంబంధించి 79, రెవెన్యూ పరమైన సమస్యలు 52, పంచాయతి రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 35, విద్యుత్ శాఖకు సంబంధించి 35, ఎస్సీ సంక్షేమ శాఖకు సంబంధించి 29, ప్రవాసీ ప్రజావాణి ద్వారా 4, ఇతర శాఖలకు సంబంధించి 104 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ డాక్టర్ చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చినవారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

మంత్రాల నెపంతో మహిళ సజీవ దహనం

- మెదక్ జిల్లాలో ఘటన
- పర్యటించిన ఎస్పీ



నవతెలంగాణ-రామాయంపేట

మంత్రాలు చేస్తుందన్న నెపంతో ఓ మహిళపై పెట్రోల్ పోసి సజీవ దహనం చేసిన ఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండల పరిధిలోని కాట్రియాలలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాట్రియాల గ్రామానికి చెందిన ధ్యాగల ముత్తవ్వ (50) అమావాస్య రోజు మంత్రాలు చేయడం వల్ల, తమ కుటుంబం అనారోగ్యం పాలైందని గ్రామానికి చెందిన ఓ కుటుంబ సభ్యులు ముత్తవ్వను విపరీతంగా కొట్టారు. అనంతరం ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించడంతో తీవ్రంగా గాయపడింది. దాంతో అక్కడే ఉన్న గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. ముత్తవ్వను వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కాగా, మంత్రాల నెపంతో ముత్తవ్వను తీవ్రంగా కొడుతున్న సందర్భంలో, చుట్టుపక్కల ఉన్న గ్రామస్తులు చోద్యం చూస్తూ నిలబడ్డారని తెలుస్తోంది. ముత్తవ్వపై తీవ్రంగా దాడి చేసి, పెట్రోలు పోసి నిప్పంటించినా ఆపడానికి ఎవరూ ప్రయత్నించకపోవడం విచారకరం. వరుసగా రెండ్రోజులు రామాయంపేట మండలంలో మంత్రాల నెపంతో దాడులు జరగడం పట్ల ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కాట్రియాలలో ఎస్పీ పర్యటన

కాట్రియాలలో మంత్రాల నెపంతో మహిళ సజీవ దహనం నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి గ్రామంలో పర్యటించారు. ముత్తవ్వను కొట్టి చంపిన కేసుపై విచారణ చేపట్టారు. ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చుట్టుపక్కల గ్రామస్తులను వివరాలడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు డీఎస్పీ వెంకటరెడ్డి, సీఐ వెంకట రాజా గౌడ్ తదితరులున్నారు.

ముగిసిన డిప్యూటీ సీఎం విదేశీ పర్యటన

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బృందం విదేశీ పర్యటన ముగిసింది. గతనెల 24వ తేదీ సింగరేణి సీఎమ్‌డీ ఎన్ బలరాం, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, విద్యుత్‌శాఖ కార్యదర్శి రొనాల్డ్ రోస్ తదితరులతో కలిసి అమెరికా, జపాన్ దేశాల్లో అధికారికంగా పర్యటించారు. ఆయా దేశాల్లోని పలు ప్రముఖ కంపెనీలను క్షేత్రస్థాయిలో సందర్శించి, సాంకేతికాంశాలను పరిశీలించారు. శుక్రవారం రాత్రి 9.30 గంటలకు ఈ బృందం శంషాబాద్ విమానాశ్రయానికి తిరిగి చేరుకుంది. వారికి పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు స్వాగతం పలికారు. 13 రోజుల విదేశీ పర్యటనలో అంతర్జాతీయ మైనింగ్ ఎగ్జిబిషన్ మైనెక్స్-2024లో కూడా పాల్గొన్నారు. గ్రీన్ ఎనర్జీతో పాటు పలు అంశాలను వారు అధ్యయనం చేశారు.

హైకోర్టు ప్రాంగణంలో మల్టీ స్పెషాలిటీ ఆరోగ్యశిబిరం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉస్మానియా జనరల్ ఆస్పత్రి, స్వచ్ఛంద సేవా సంస్థ నిర్మాణ్ ఆర్గనైజేషన్ సహకారంతో తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ వైద్యసేవలను కొనసాగిస్తున్నది. ఈ నేపథ్యంలో శుక్రవారం హైకోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మల్టీ స్పెషాలిటీ ఆరోగ్య శిబిరం, రక్తదాన శిబిరాన్ని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాథే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి సుజయ్ పాల్, అభినంద్ కుమార్ శావిలి తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ చైర్మెన్ ఎ.నర్సింహారెడ్డి, తెలంగాణ హైకోర్ట్ అడ్వొకేట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ.రవీందర్ రెడ్డి, ఉస్మానియా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ కుమార్ సహాయ్, నిర్మాణ్ వ్యవస్థాపక సీఈవో మయూర్ పట్నాల హాజరయ్యారు. హైకోర్టు న్యాయవాదులు, సిబ్బందికి వైద్యసేవలు, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు అందించేందుకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రక్తదాన శిబిరం ద్వారా ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి వచ్చే రోగులకు అవసరమైన రక్తాన్ని అందజేయనున్నారు.

మంకీపాక్స్ నిర్ధారణ పరీక్షకు డబ్ల్యూహెచ్‌ఓ ఆమోదముద్ర

జెనీవా : అత్యవసర సమయాల్లో ఉపయోగించేందుకై మంకీపాక్స్ నిర్ధారణ పరీక్షకు డబ్ల్యుహెచ్‌ఒ ఆమోద ముద్ర వేసింది. అంతర్జాతీయంగా తొలి మంకీపాక్స్ నిర్ధారణ పరీక్షను అందుబాటులోకి తీసుకురావడాన్ని కీలకమైన మైలురాయిగా చెప్పుకోవచ్చు. పరిమితమైన పరీక్షా సామర్థ్యాలు వుండడంతో ఈ వైరస్ ఎక్కువగా వున్న ఆఫ్రికా ప్రాంతం తీవ్రంగా ఇబ్బందులు పడుతోంది. అటువంటి సమయంలో ఈ పరీక్ష అందుబాటులోకి రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఏడాదిలో ఆఫ్రికా ఖండంలో 30వేలకు పైగా ఎంపాక్స్ అనుమానిత కేసులు నమోదయ్యాయి. కాంగో, బురుండి, నైజీరియా దేశాలు బాగా ప్రభావితమయ్యాయి. కానీ కాంగోలో కేవలం 37శాతం కేసుల్లో మాత్రమే ఈ ఏడాది నిర్ధారణ పరీక్షలు చేశారు. తాజా చర్యతో మంకీపాక్స్ వైరస్ ఉధృతంగా వున్న దేశాల్లో నిర్ధారణ పరీక్షల సామర్థ్యం పెరగనుంది.

అనేక కష్టనష్టాలు చూశా

పీసీసీ పదవితో వడ్డీతో సహా దక్కింది

- కష్టపడిన వారందరికీ పదవులు
- సీఎం రేవంత్ టీమ్‌లో మంచి మంత్రులున్నారు
- మోడీ దేవుళ్ళ పేరుతో రాజకీయం, ఓట్ల బిక్షాటన చేస్తున్నారు
- అప్పులు చేసి కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు పరిమితమయ్యారు : స్వాగత సభలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్



నవతెలంగాణ-కంఠేశ్వర్

'ఆనాడు మావోయిస్టుల ప్రభావంతో సొంత ఊరు వదిలి నిజామాబాద్‌కు వచ్చాం. ఒక సాధారణ వ్యక్తి పార్టీ అధ్యక్షునిగా ఎదగటం కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అవుతుంది. 27 ఏండ్లకే డిచ్‌పల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశా. రాజకీయాల్లో పని చేసుకుంటూపోతే పదవులు వాటంతట అవే వస్తాయి. నా రాజకీయ జీవితంలో 38 ఏండ్లలో అనేక కష్టనష్టాలు చూశా. కానీ వడ్డీతో సహా నాకు పీసీసీ పదవి దక్కింది. అందుకు నా తల్లిదండ్రుల ఆశీర్వాదం కూడా తోడైంది. పీసీసీ అధ్యక్షుడిని అవుతానని కలలో కూడా ఊహించలేదు. ఎంత సంతోషంగా ఉందో చెప్పలేను' అని టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. టీపీసీసీ అధ్యక్షులైన తర్వాత తన సొంత జిల్లా నిజామాబాద్‌కు శుక్రవారం తొలిసారి రావడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు మహేశ్‌కుమార్‌కు ఘన స్వాగతం పలికారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సన్మాన సభ నిర్వహించారు. ముందుగా మాదవ్‌నగర్‌కు చేరుకొని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి ప్రారంభించిన ర్యాలీ.. పాత కలెక్టరేట్ వరకు కొనసాగింది. దారి పొడవునా.. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాత కలెక్టరేట్ మైదానంలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతం, కులం, శ్రీరాముడు, హనుమంతుడు పేరుతో రాజకీయం చేస్తూ ఓట్లు అడుక్కుంటుందని అన్నారు. అందుకే అభివృద్ధే ధ్యేయంగా ప్రజల కోసం పనిచేస్తున్న లౌకికపార్టీ కాంగ్రెస్‌కు ప్రజలు అండగా నిలవాలని కోరారు. ప్రభుత్వ రంగంలోని పెద్ద పెద్ద కంపెనీలను అదాని, అంబానీకి కట్టబెడుతుందని ఆరోపించారు. రాష్ట్రాన్ని పదేండ్లు పాలించిన కేసీఆర్.. లక్షల కోట్ల అప్పులు చేసి ఇప్పుడు ఫామ్‌హౌస్‌కే పరిమితం అయ్యారని విమర్శించారు. కేటీఆర్, హరీశ్‌రావు అబద్ధపు మాటలు చెబుతూ ప్రజలను మభ్యపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా అవసరం లేదన్నారు.సీఎం రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షునిగా, తాను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడు తమ మధ్య కెమిస్ట్రీ కలిసిందని, సీఎం టీమ్‌లో మంచి మంత్రులు ఉన్నారని మహేశ్‌గౌడ్ అన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం పెద్దఎత్తున చేపడుతోందని తెలిపారు. కార్యకర్తలు అధైర్యపడొద్దని, అందరికీ పదవులు వస్తాయని, కష్టపడ్డ కార్యకర్తలకు తప్పకుండా న్యాయం జరుగుతుందని అన్నారు. దళితుల పట్ల కాంగ్రెస్ పార్టీకి ఎంతో ప్రేమ ఉందని, అందుకే మల్లికార్జున ఖర్గేకు ఏఐసీసీ అధ్యక్ష పదవి దక్కిందని, వెనకబడ్డ బీసీ బిడ్డ అయిన తనకు పీసీసీ పదవి వచ్చిందని తెలిపారు. అజారుద్దీన్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, షబ్బీర్ అలీకి ప్రభుత్వ సలహాదారు పదవులను ఇచ్చి ముస్లింలనూ గౌరవించిం దని తెలిపారు. పీసీసీ అధ్యక్షునిగా తాను జిల్లాకు చెందిన వ్యక్తిని కాబట్టి ప్రజలకు తనపై ఆశలు ఎక్కువగా ఉంటాయని అన్నారు. అందుకే జిల్లాలో మరో మెడికల్, ఇంజినీరింగ్ కాలేజీలు ఏర్పాటు చేయాలని మంత్రులను కోరారు. రాజకీయాల్లో హెల్తీ కాంపిటేషన్ ఉండాలని, పీసీసీ అధ్యక్ష రేసులో మధుయాష్కి, లక్ష్మణ్ కుమార్ కూడా పోటీ పడ్డారని, ఎవరికీ వచ్చినా హైకమాండ్ మాట జవదాట కూడదని అనుకున్నామన్నారు. గాంధీ కుటుంబం త్యాగాల కుటుంబమని, దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిందని గుర్తు చేశారు. పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసుకుందామన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితం అయ్యారని అన్నారు. పదేండ్లలో కాంగ్రెస్ అధికారంలో లేకున్నా ప్రతిపక్ష హోదాలో భట్టి విక్రమార్క పోరాడారని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావు, నాయకులు వి. హనుమంతరావు, జీవన్ రెడ్డి, ఆయా శాఖల చైర్మెన్లు, నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మెన్ తాహేర్ బిన్ హందాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కేశ వేణు, పీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూసీ పునర్నిర్మాణానికి మద్దతు తెలపాలి

- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మూసీతో లక్ష ఎకరాలకు సాగునీరు
- వేలాది మందికి తాగునీరు
- మల్లన్నసాగర్ నుంచి 2 టీఎంసీల నీరు తీసుకొస్తాం : భారీ నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



నవతెలంగాణ-మఠంపల్లి

నిజాం కాలంలో నిర్మించిన మూసీ పునర్నిర్మాణానికి అన్ని వర్గాల వారు మద్దతు తెలపాలని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి నలగొండ జిల్లాలో లక్ష ఎకరాలకు సాగునీరు, వేలాది మందికి తాగునీరు అందిస్తున్న మూసీ.. వ్యర్థాలతో నిండుకొని కలుషితమైందని చెప్పారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా మట్టపల్లి వద్ద విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. హైదరాబాద్, రంగారెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లాలకు జీవనాధారంగా ఉన్న మూసీ నదికి పునరుజ్జీవం తీసుకొచ్చేందుకు తమ ప్రభుత్వం చేస్తున్న మంచి పనికి హర్షించాలన్నారు. ప్రక్షాళన తరువాత మలన్నసాగర్ నుంచి 2 టీఎంసీల నీటిని గండిపేటకు.. అక్కడి నుంచి మూసీ నదిలోకి తీసుకొస్తామని చెప్పారు. గత ప్రభుత్వంలో మూసీ డెవలప్‌మెంట్ బోర్డ్ ఏర్పాటు చేసి ఎటువంటి చర్యలూ తీసుకోలేదన్నారు. మూసీ నీటిని శుభ్రపరిచి రైతులకు వ్యవసాయానికి, ప్రజలకు తాగునీరు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ నది భువనగిరి, ఆలేరు, నకిరేకల్, తుంగతుర్తి, మునుగోడు, నల్లగొండ సూర్యాపేట, హుజూర్‌నగర్ నియోజకవర్గాల గుండా శూన్యంపాడు వద్ద కృష్ణా నదిలో కలుస్తుందన్నారు. తమ ప్రభుత్వం మూసీ నదిని పూర్తిస్థాయిలో శుభ్రపరిచేందుకు కట్టుబడి ఉందని, పూర్తిగా మానవతా దృక్పథంతో ముందుకు సాగుతామని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు భూక్యా మంజీనాయక్, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్, ట్రాన్సుకో డీఈ వెంకటకృష్ణ, ఏడీ సక్రు నాయక్, తహసీల్దార్ మంగారాతోడ్, సీఐ చరమందరాజు, రామిశెట్టి అప్పారావు, వంటిపులి శ్రీనివాస్, ఈడుపుగంటి సుబ్బారావు, అరుణ్ కుమార్ దేశముఖ్, న్యాయవాదులు సాముల రామిరెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, నారపరాజు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆశావర్కర్లకు రూ.18 వేల వేతనం ఇవ్వాలి

సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్

- డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద ఆశా వర్కర్ల ధర్నా



నవతెలంగాణ-బేగంపేట

ఆశా వర్కర్లకు గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు, కాంగ్రెస్ ప్రభుత్వం తన మ్యానిఫెస్టోలో పొందుపర్చినవి.. ఆరోగ్య శాఖ కమిషనర్ ఇచ్చిన హామీలనే వెంటనే అమలు చేయాలని సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్ అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని డీఎంహెచ్‌ఓ కార్యాలయం ముందు తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023లో రాష్ట్రవ్యాప్తంగా 16 రోజులు ఆశా వర్కర్లు నిరవధిక సమ్మె చేశారని గుర్తు చేశారు. సమ్మె సందర్భంగా అప్పటి హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు కొన్ని నిర్దిష్టమైన హామీలు ఇచ్చారని తెలిపారు. అయితే, అందులో సమ్మె కాలం వేతనాలు మాత్రమే ప్రభుత్వం చెల్లించిందని.. ఇతర సమస్యలు నేటికీ పరిష్కారం కాలేదని అన్నారు. సమస్యలు పరిష్కరించాలని ఆరోగ్య శాఖ మంత్రి, ఆరోగ్య శాఖ రాష్ట్ర అధికారులను కలిసి అనేక విజ్ఞప్తులు చేశామని, ఆందోళనలు చేశామని తెలిపారు. అయినా ఇప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశా వర్కర్లకు గాంధీ ఆస్పత్రి, ఉస్మానియా ఆస్పత్రిలో పని భారం తగ్గించాలని, పెరుగుతున్న ధరలకనుగుణంగా రూ.18,000/- వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే, ఆశాలకు ప్రతి సంవత్సరం 20 రోజుల వేతనంతో కూడిన క్యాజువల్ సెలవులు, 6 నెలల వేతనంతో కూడిన మెడికల్ సెలవులు ఇవ్వాలన్నారు. టెన్త్, ఇంటర్, ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్, డిగ్రీ, టెట్, గ్రూప్ 1, 2 తదితర ఎగ్జామ్స్ సందర్భంగా ఆశాలకు వేస్తున్న డ్యూటీలకు డబ్బులు చెల్లించాలని కోరారు. యూనిఫామ్ వెంటనే ఇవ్వాలని, ఆశాలకు పని భారం తగ్గించాలని, జాబ్ చార్ట్ ఇవ్వాలని, బిఎల్ఓ డ్యూటీలు వేయడాన్ని రద్దు చేయాలని, ఆశాలతో ఆన్‌లైన్ ఎంట్రీలను చేయించడాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశాల యూనియన్ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ అధ్యక్షులు టి.యాదమ్మ ప్రధాన కార్యదర్శి అనిత, ఆశ వర్కర్లు ధర్నాలో పాల్గొన్నారు.

ఎస్ఐ కొట్టాడని..

- మనస్తాపంతో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం
- పరిస్థితి విషమం.. హైదరాబాద్‌కు తరలింపు
- డీజిల్ దొంగతనం చేశాడని స్టేషన్‌కు పిలిపించి తీవ్రంగా కొట్టిన సెల్ఫీ వీడియో బట్టబయలు



నవతెలంగాణ- ప్రాంతీయ ప్రతినిధి నల్లగొండ /తిరుమలగిరి/శాలిగౌరారం

డీజిల్ దొంగతనం నెపం మోపి పోలీసుస్టేషన్‌కు పిలిపించి ఎస్ఐ విచక్షణారహితంగా కొట్టాడని మనస్తాపానికి గురైన ఓ లారీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం చేశాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. అంతకు ముందు బాధితుడు తీసుకున్న సెల్ఫీ వీడియో బయటపడింది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలోని శాలిగౌరారం మండలం ఆకారం గ్రామంలో శుక్రవారం జరిగింది. కుటుంబ సభ్యులు, బాధితుని భార్య సరిత తెలిపిన వివరాల ప్రకారం ... గ్రామానికి చెందిన శనిగ నాగరాజు తిరుమలగిరి మండలం తొండ గ్రామంలోని బాలాజీ క్రషర్ మిల్లులో కొంత కాలం టిప్పర్ డ్రైవర్‌గా పని చేశాడు. ఆ తర్వాత పని మానేశాడు. రెండు నెలల జీతం కూడా రావాల్సి ఉంది. ఈ క్రమంలో నాగరాజు డీజిల్ దొంగతనం చేసినట్టు క్రషర్ యజమాని గొలుసుల వెంకన్న తిరుమలగిరి పోలీసు స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశాడు. దాంతో నాగరాజును పోలీసులు స్టేషన్‌కు పిలిపించారు. తర్వాత విడుదల చేశారు. అయితే, "దొంగతనం నెపంతో నాగరాజును పిలిపించి స్థానిక ఎమ్మెల్యే సామేల్ ఆదేశాలతో ఎస్ఐ సురేష్ తీవ్రంగా కొట్టాడు. ఈ అవమానం తట్టుకోలేక ఉరేసుకుంటున్నానని" నాగరాజు సెల్ఫీ వీడియో తీసుకుని బావి దగ్గర చెట్టుకు ఉరేసుకున్నాడు. గమనించిన స్థానికులు కిందకు దించి నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నల్లగొండకు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. నల్లగొండలోని ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడా కాదడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. కాగా, నాగరాజు విషయంలో తనకెలాంటి సంబంధం లేదని, ఎస్ఐ సురేష్‌కు తాను ఎలాంటి ఆదేశాలూ ఇవ్వలేదని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు.

పోలీసుల దెబ్బల వల్లే :శనిగ సరిత (నాగరాజు భార్య)

మాకు ఇంట్లో ఎలాంటి గొడవలూ లేవు. ఐదు నెలల నుంచి ఆయన క్రషర్‌లో పని చేయడం లేదు. దేని గురించో పోలీస్ స్టేషన్‌కి పిలిపించి తీవ్రంగా కొట్టారు. తట్టుకోలేక ఉరేసుకున్నాడు. నా భర్త పరిస్థితి సీరియస్‌గా ఉంది. ఆయన్ని రక్షించాలి. మాకు న్యాయం కావాలి.

కావాలనే ఇదంతా చేశారు :బుద్ధ గణేష్ (నాగరాజు బావమర్ది)

లేనిపోని నింద మోపారు. డీజిల్ తీశారనే నెపంతో మా బావ నాగరాజును తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి ఎస్ఐ కొట్టారు. కనీసం మాట్లాడుకోవడానికి సమయం ఇవ్వలేదు. అవమా నంగా భావించి మా బావ శుక్రవారం ఉదయం బావి దగ్గర ఉరేసుకున్నాడు. డాక్టర్లు సీరియస్‌గా ఉందంటున్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకొచ్చాం. ఇక్కడ కూడా కాదనడంతో హైదరాబాద్‌కు తీసుకుపోయాం.

విచారణలో దొంగతనాన్ని ఒప్పుకున్నాడు :తిరుమలగిరి ఎస్ఐ

బాలాజీ క్రషర్ యజమాని గొలుసుల వెంకన్న ఫిర్యాదు మేరకు నాగరాజును స్టేషన్‌కు పిలిపించాం. డీజిల్ దొంగతనం చేసినట్టు విచారణలో అతను ఒప్పుకున్నాడు. దాంతో యజమాని అంగీకారంతో నాగరాజును విడుదల చేశాం.

6న సికింద్రాబాద్-వాస్కోడాగామా ఎక్స్‌ప్రెస్ ప్రారంభం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సికింద్రాబాద్ నుంచి వాస్కోడాగామాకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలును ఆదివారం కేంద్రమంత్రి జీ కిషన్‌రెడ్డి జెండావూపి ప్రారంభించనున్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో జరిగే ఈ కార్యక్రమంలో రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొంటారని దక్షిణ మధ్య రైల్వే శుక్రవారంనాడొక పత్రికా ప్రకటనలో తెలిపింది. సికింద్రాబాద్ నుంచి కర్నాటక, గోవా వైపు ప్రయాణించేవారికి ఈ రైలు సౌకర్యవంతంగా ఉంటుందని పేర్కొన్నారు. వారానికి రెండ్రోజులు నడిచే ఈ రైలు 854 కిలోమీటర్ల దూరాన్ని 20 గంటల్లో చేరుకుంటుంది. సికింద్రాబాద్, మహబూబ్‌నగర్, గద్వాల్, కర్నూల్ సిటీల మీదుగా వాస్కోడాగామాకు వెళ్తుంది.

తిరుపతి లడ్డూ వివాదంపై స్వతంత్ర సిట్

(మొదటిపేజీ తరువాయి)

సీబీఐ నుంచి ఇద్దరు, ఏపీ ప్రభుత్వం తరపున ఇద్దరు పోలీసు అధికారులు, ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఎఐ) నుంచి ఒకరు ఉండాలని సూచించింది. సీబీఐ డైరెక్టర్‌కు పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ రద్దు కానుంది. తిరుపతి లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి వినియోగించారన్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోపణలతో దాఖలైన పిటిషన్లను శుక్రవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కెవి విశ్వనాథన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. ఈ అంశం రాజకీయ డ్రామాగా మారకూడదని, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది ప్రజల మనోభావాలకు సంబంధించినదని ధర్మాసనం పేర్కొంది. తొలుత కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ "తిరుపతి లడ్డూ వ్యవహారం మొత్తాన్ని పరిశీలించాం. ఆరోపణలలో ఏదైనా నిజం ఉంటే అది ఆమోదయోగ్యం కాదు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సిట్ సభ్యులపై ఎలాంటి సందేహాలు లేవు. అవసరమైతే కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి ఒకరిని సిట్‌లో చేర్చవచ్చు. తిరుమల శ్రీవారికి దేశవ్యాప్తంగా భక్తులున్నారు. సీనియర్ కేంద్ర అధికారి పర్యవేక్షణ ఉంటే మరింత విశ్వాసం పెరుగుతుంది. స్వతంత్ర దర్యాప్తు ఉంటే.. రాజకీయ జోక్యం ఉండదు" అని వివరించారు. జస్టిస్ గవాయి జోక్యం చేసుకుని "ఎలాంటి సందేహం లేని దర్యాప్తుపై ఎలాంటి విచారణ లేదని సీఎం ప్రకటన చేశారని వార్తాపత్రికల్లో చదివాను" అని అన్నారు. దీనికి ఏపీ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ జోక్యం చేసుకుని "తాము సిట్‌తో విచారణ చేయించాలనుకుంటున్నాం. అందులో మీకు నచ్చిన అధికారిని చేర్చవచ్చు. ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది" అని వాదించారు. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ స్వతంత్ర దర్యాప్తు చేయాల్సిందేనని అన్నారు. "ముఖ్యమంత్రి బహిరంగ వ్యాఖ్యలు చేసిన తరువాత సిట్ వేశారు. దాని ప్రభావం సిట్‌పై ఉంటుంది. ఆయన వ్యాఖ్యలు చేయకుండా సిట్ వేస్తే, అది వేరే విషయం" అని అన్నారు.

ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ సెప్టెంబరులో ఏపీ ప్రభుత్వం 100 రోజులు పూర్తి చేసుకున్న నేపథ్యంలో సీఎం మాట్లాడారని, ఈ కేసుకు సంబంధించిన నివేదిక జులైలో వచ్చిందని, రెండింటికీ సంబంధం లేదని అన్నారు. మీడియా ఆయనను ఉటంకిస్తూ కేవలం నాలుగు లైన్లు రాసిందని అన్నారు. తమ వైపు ఎటువంటి సమస్యైనా ఉంటే చెప్పండి. తాము అఫిడవిట్ దాఖలు చేస్తామని పేర్కొన్నారు.టీటీడీ తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా వాదనలు వినిపిస్తూ నెయ్యి సరఫరా చేసే ట్యాంకర్లు అసలు సరఫరాదారు నుంచి కూడా సరఫరా చేయబడలేదని, తాము ఇప్పుడు సేవా పన్ను శాఖ నుంచి సమాచారం పొందామని అన్నారు. టీటీడీ రిట్ పిటిషన్ దాఖలు చేసిందని అన్నారు. జస్టిస్ విశ్వనాథన్ జోక్యం చేసుకుని ఐదు పిటిషన్లు ఉన్నాయని, న్యాయస్థానం ఎప్పుడైనా అమికస్‌ను నియమించవచ్చని అన్నారు. ఆరోపణలు చాలా తీవ్రమైనవని జస్టిస్ గవాయి తెలిపారు. న్యాయవాది రోహత్గీ జోక్యం చేసుకుని పందికొవ్వు ఉపయోగించినట్టు కచ్చితమైన ఆధారం ఉందని అన్నారు. వెంటనే కపిల్ సిబల్ జోక్యం చేసుకుని ఏ నివేదిక స్పష్టం చేస్తుందని ప్రశ్నించారు. అందుకు రోహత్గీ నివేదిక చూపించారు. దానికి కపిల్ సిబల్ జోక్యం చేసుకుని "ఇది కూరగాయల కొవ్వు. జంతువుల కొవ్వు కాదు. అందుకే స్వతంత్ర విచారణకు ఆదేశించాలి" అని డిమాండ్ చేశారు. దీంతో ధర్మాసనం జోక్యం చేసుకుని "ఐదుగురు సభ్యులతో సిట్ ఏర్పాటుకు ఆదేశిస్తున్నాం. కోర్టును రాజకీయ యుద్ధ భూమిగా ఉపయోగించుకోవడానికి అనుమతిం చం. కోట్లాది మంది ప్రజల మనోభావాలను నివృత్తి చేయడానికే ఈ దర్యాప్తు జరుగుతుందని స్పష్టం చేస్తున్నాం" అని పేర్కొంది.

జేఎల్ తుది ఫలితాలు త్వరగా విడుదల చేయండి

- ప్రజాభవన్ వద్ద జేఎల్ అభ్యర్థుల శాంతియుత నిరసన
- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డికి వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో జూనియర్ లెక్చరర్ (జేఎల్) పోస్టులకు తుది ఫలితాలు త్వరగా విడుదల చేయాలని పలువురు అభ్యర్థులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మహాత్మా జోతిబాపూలే ప్రజాభవన్ వద్ద వందలాది మంది అభ్యర్థులు శాంతియుతంగా నిరసన చేపట్టారు. ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జి చిన్నారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. 56 రోజుల్లో డీఎస్సీ ఫలితాలను ప్రకటించి 65 రోజుల్లోనే నియామకపత్రాలను ఉపాధ్యాయ అభ్యర్థులకు ఇవ్వడం సంతోషకరమని పలువురు అభ్యర్థులు అన్నారు. అయితే 2022లో టీజీపీఎస్సీ 1,392 జేఎల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిందనీ, అప్పటి నుంచి నియామక పత్రాల కోసం ఎదురుచూస్తున్నామని చెప్పారు. డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులకు ఇస్తున్నట్టుగానే జేఎల్ అభ్యర్థులకు కూడా 1:1 నిష్పత్తిలో ఎంపిక చేసి నియామకపత్రాలను అందించాలని కోరారు. ప్రభుత్వ విద్యారంగాన్ని ముఖ్యంగా ఇంటర్ విద్యను బలోపేతం చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని వివరించారు. చిన్నారెడ్డి సానుకూలంగా స్పందించారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సంప్రదిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. అనంతరం ఎమ్మెల్సీ కోదండరామ్‌ను అభ్యర్థులు కలిశారు. టీజీపీఎస్సీ కార్యదర్శితో మాట్లాడి ఫలితాలు త్వరగా వచ్చేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారని వివరించారు. ఈ కార్యక్రమంలో జేఎల్ అభ్యర్థులు లింగనాయక్, వేణురావు, సతీష్, పాషా, నాగరాజు, అశ్విన్, ప్రవళిక, లావణ్య, చిత్రిక, శ్రీలక్ష్మి, హరిత తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ -మహేశ్వరం
శనివారం | అక్టోబర్ 05, 2024 | www.navatelangana.com

వెడ్డింగ్ సారీ సెంటర్‌ను ప్రారంభించిన కార్పొరేటర్

నవతెలంగాణ-నాగోల్



మీ వ్యాపార సంస్థకు వచ్చే వినియోగదారులకు నాణ్యతమైన వస్త్రాలను సరసమైన ధరలకు అందించి.. వినియోగదారుల్లో మంచి గుర్తింపును తెచ్చుకొని వ్యాపారభివృద్ధిలో ముందుకు సాగాలని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ యాదవ్ అన్నారు. శుక్రవారం నాగోల్ డివిజన్ పరిధిలోని మమత నగర్ రోడ్ నెంబర్ -3 లో నూతన ఈషా వెడ్డింగ్ శారీస్ సెంటర్‌ను నిర్వాహకులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సిద్దలా ఐలయ్య, రావుల శ్రీనివాస్, నరేందర్ రెడ్డి, రాధిక, రాము గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'వావ్ కలర్స్' షోరూం ప్రారంభోత్సవంలో ఈటల

నవతెలంగాణ - వనస్థలిపురం



బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎన్జీవోస్ కాలనీ రెడ్ వాటర్ ట్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన నూతన వావ్ కలర్స్ షోరూంను మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి, స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, పార్టీ నాయకులు రాజిరెడ్డి, శంకరయ్య గౌడ్, రఘు రామ్ నేత, శరత్ కుమార్, పవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) బలోపేతమే లక్ష్యం

- సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు, తుర్కయంజాల్ మున్సిపల్ కన్వీనర్ డి.కిషన్
- సీపీఐ(ఎం) రాజీవ్ గృహకల్ప శాఖ మహాసభ
- నూతన కార్యదర్శిగా పల్లె కృష్ణ ఎన్నిక

నవతెలంగాణ-తుర్కయంజాల్

సీపీఐ(ఎం) పార్టీ భలోపేతమే లక్ష్యమని పార్టీ రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు, తుర్కయంజాల్ మున్సిపల్ కన్వీనర్ డి.కిషన్ అన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ రాగన్నగూడ పరిధిలోని రాజీవ్ గృహకల్ప సీపీఐ(ఎం) శాఖ మహాసభ శుక్రవారం ఆనంధోత్సహాల మధ్య కొనసాగింది. తర్వాత పార్టీ జెండాను ఆవిష్కరించి.. అమరవీరులకు, ఇటీవల అనారోగ్యానికి గురై మరణించిన సీపీఐ(ఎం) అఖిల భారత ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ సీపీఐ(ఎం) మహాసభలు ప్రతి మూడేళ్లకోసారి నిర్వహిస్తామన్నారు. మూడేళ్ల కాలంలో పార్టీ నిర్వహించిన ప్రజా ఉద్యమాలు, ఇతర కార్యక్రమాలను సమీక్షించుకొని, భవిష్యత్తు కర్తవ్యాలను నిర్దేశిస్తామన్నారు. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. రాజీవ్ గృహకల్ప పరిధిలో ఇళ్లు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పింఛన్ల సమస్యల పరిష్కారానికి పోరా డాలన్నారు. గృహ కల్పలో పేద పిల్లలున్న నేపథ్యంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, బస్సు సౌకర్యం, అంగన్‌వాడీ కేంద్రం, బస్తీ దావఖాన వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు ఎం.సత్యనారాయణ, ఎం.జె. ప్రకాష్ కరత్, కుంచం వెంకటకృష్ణ, ఎ.మాధవరెడ్డి, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.



రాజీవ్ గృహకల్ప సీపీఐ(ఎం)పార్టీ నూతన శాఖ ఎన్నిక

సీపీఐ(ఎం) నూతన కార్యదర్శిగా పల్లె కృష్ణ, కమిటీ సభ్యులుగా నాగయ్య, పిల్లి వెంకటేష్, శ్రీను నాయక్, శివప్రసాద్, భాస్కర్, లక్ పతి, సుధాకర్, నరహరి, సైదులు, నరసింహ, కాశీం, నవీన్ తదితరులు ఎన్నికయ్యారు.

బీజేపీవి ప్రజా వ్యతిరేక విధానాలు

- సీపీఐ(ఎం) హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి ఎం.డి అబ్బాస్

నవతెలంగాణ-చంపాపేట్



కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రజలకు అనేక ఇబ్బందులకు గురిచేస్తుందని సీపీఐ(ఎం) హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి ఎం.డి అబ్బాస్ అన్నారు. సీపీఐ(ఎం) చాంద్రాయణగుట్ట శాఖ 3వ మహా సభను జంగంమేట్ సీపీఐ(ఎం) ఆఫీస్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలను మతం మత్తులో పెట్టి, ప్రజా సమస్యల గాలికి వదిలేసి ప్రభుత్వం బీజేపీ అని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రయివేట్ పరం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకి కల్పించాల్సిన కనీస సౌకర్యాలు కూడా అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక ధరలు, ప్రయివేటీకరణ, మతోన్మాదానికి వ్యతిరేకంగా అక్టోబర్14 నుండి 20వరకు బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ క్యాంపెనింగ్ చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న పార్టీ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం చాంద్రాయణగుట్ట శాఖ కార్యదర్శిగా కామ్రేడ్ రమేష్‌ను శాఖ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎల్ కోటయ్య, జిల్లా నాయకులు ఎస్.కిషన్, గౌస్, బషీర్, సుధాకర్, లక్ష్మీ అరుణ, దీపికా, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

రాను నాయక్ విగ్రహ ప్రతిష్టాపనకు శంకుస్థాపన



నవతెలంగాణ-చంపాపేట్

రంగారెడ్డి జిల్లా చంపాపేట్ డివిజన్ మీర్‌పేట్ చందన చెరువుపై రాను నాయక్ విగ్రహ ప్రతిష్టాపనకు శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దుర్గాదీప్లాల్ చౌహన్ మాట్లాడారు. బంజారా జాతి చరిత్ర వారసత్వాన్ని కాపాడే బాధ్యత బంజారులపై ఉందన్నారు. డాక్టర్ శంకర్ నాయక్ బంజారా జాతి ఐక్యత కోసం ఇలాంటి విగ్రహాలను ప్రతిష్టించడం ద్వారా ఏకమయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అనిల్ యాదవ్, రవి నాయక్,నీలా రవి నాయక్, బిఆర్ఎస్ దశయనాయక్, డాక్టర్ మధుగా గోర్సిక్ వాడి, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధర్మానాయక్, మీర్‌పేట్ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రామ్‌లాల్ నాయక్, మాజీ జడ్పీటీసీ కిషన్ నాయక్, ఎస్టీ కార్పొరేషన్ మీర్ పేట్ అధ్యక్షులు హము నాయక్, గిరి, కర్మన్ ఘాట్ ఆంజనేయస్వామి టెంపుల్ డైరెక్టర్, మీర్ పేట్ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ శంకర్ నాయక్, బంజారా సేవ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టాయిలెట్స్ లేక అవస్థలు

- అవస్థలు పడుతున్న మహిళా సిబ్బంది

నవతెలంగాణ - ఎల్బీనగర్



హయత్‌నగర్, ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయంలో కంపు కొడుతున్న పాత టాయిలెట్లను తొలగించారు. కొత్త టాయిలెట్స్ నిర్మాణం బాధ్యతను కాంట్రాక్టర్‌కు అప్పగించారు. పాత టాయిలెట్స్ కుండీలు, టైల్సు తొలగించారు. తిరిగి రేనివేషన్స్ పనులు ప్రారంభించకపోవడంతో హయత్ నగర్, ఎల్బీ నగర్ సర్కిల్ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది టాయిలెట్ సౌకర్యం లేక నానా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా మహిళా సిబ్బంది బాధలు వర్ణాతీతం. నెలరోజుల క్రితం టాయిలెట్స్, టైల్స్‌ను తొలగించారు. కొత్త టైల్స్ ఏర్పాటు చేయలేదు. దీపం చుట్టూ వెలుతురు ఇచ్చినట్టు తన కింద చీకటిని మిగిల్చినట్టు హయత్ నగర్, ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయం పరిస్థితి అధ్వానంగా ఉన్నది. ఇంజనీరింగ్ అధికారులు తమ కార్యాలయాలను రెనివేషన్ చేసుకొని తమ ఛాంబర్స్‌ను పరిశుభ్రంగా ఉంచుకుంటున్నారు. టౌన్ ప్లానింగ్ సెక్షన్, బర్త్ అండ్ డెత్ సెక్షన్, శానిటేషన్ విభాగల కార్యాలయం పరిస్థితి అధ్వానంగా ఉంది.

గత కొంతకాలంగా ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయంలో టాయిలెట్స్ కంపు కొడుతూ దుర్వాసన వెదజల్లుతుంటే పట్టించుకునే పరిస్థితి లేదు. మూడు సర్కిల్ కార్యాలయాలు ఒకే చోట ఉండడంతో నిర్వహణ బాధ్యత తమది కాదంటే తమది కాదని అధికారులు తప్పించుకుంటున్నారు. హయత్‌నగర్, ఎల్బీనగర్ సరూర్ నగర్ సర్కిల్ కార్యాలయాలు ఒకే చోట ఉన్నాయి. 20 ఏండ్ల కిందట నిర్మించిన టాయిలెట్స్‌ని ఇంతకాలం వాడారు. పగిలిపోయిన పైప్ లైన్ వ్యవస్థ, పనిచేయని నల్లాలు, వాటర్ లేక నానా ఇబ్బందులు పడ్డారు. ఇంచార్జి జోనల్ కమిషనర్‌గా పనిచేసిన ముకుంద రెడ్డి వెంటనే మోడ్రన్ టాయిలెట్స్ నిర్మించాలని అధికారులను ఆదేశించారు. పనులను ప్రారంభించిన ఇంజనీరింగ్ అధికారులు టాయిలెట్స్ నిర్మాణం పనులు చేయకుండా పట్టించుకోకపోవడంతో ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్ని చందంగా మారిపోయింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకొని టాయిలెట్స్ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.





కళాకారులను ఆదుకుంటున్న కాంగ్రెస్

టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్త

నవతెలంగాణ- సిటీ బ్యూరో

రాష్ట్రంలోని కళాకారులను కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్త అన్నారు. హిమాయత్ నగర్‌లోని అల్లైడ్ ఆర్టిస్ట్ ఆడిటోరియంలోని ఏడు కొండలు ఆధ్వర్యంలో జరిగిన సేవెన్ హిల్స్ దసరా పురస్కార్ సినీ గీతాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ సంస్కృతిని, కళలను గొప్పగా ఆదరిస్తూ.. ప్రోత్సహిస్తూ ఎంతో మంది నూతన కళాకారులను వెన్నుతట్టి ముందుకు నడిపించాలని అన్నారు. కళాకారులు తమ తమ రంగాల్లో రాణించాలని రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కళాకారులను ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నారు. కళాకారులకు తెలంగాణ పుట్టినిల్లు అని, అనేక మంది కళాకారులను తయారు చేసిన ఘనత మన రాష్ట్రానికే దక్కుతుందన్నారు. అనంతరం వివిధ రంగాల్లో రాణించిన వారికి దసరా అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ దర్శకుడు రేలంటి నర్సింహారావు, తెలంగాణ రాష్ట్ర శెట్టి బలిజ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస రావు, కల బ్రమ్మ శిరోమణి వంశీ రామ రాజు, అవార్డ్ గ్రహీతలు మహేశ్వరం నరహాఖి, రామకృష్ణ రావు, వెంకటేష్, విజయ్ కుమార్, వంశీ, శోభారాణి, కృష్ణ యాదవ్, డాని , సత్యనారాయణ, ప్రసాద్ రావు, గాయనీలు అరుణ, శాలిని, ఆనంద లక్ష్మి, హరి చందన, దేవేందర్ గౌడ్, ఐవీఎఫ్ నాయకులు నరేష్ గుప్త, శ్రీధర్ గుప్త పాల్గొన్నారు.

దసరాకు ఊరు వెళ్తున్నారా జాగ్రత్త..

నాగోల్ సీఐ సుధీర్ కృష్ణ



నవతెలంగాణ -నాగోల్

దసరా పండుగకు ఊరు వెళ్తున్నారా.. అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్త పడాలని నాగోలు పోలీస్ స్టేషన్ సీఐ సుధీర్ కృష్ణ నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలను విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ దసరాకు సొంత గ్రామాలకు, బంధువులు, స్నేహితుల ఇండ్లకు వెళ్లేవారు కొంత అప్రమత్తంగా మేలుగుతూ జాగ్రత్తలు తీసుకొని నష్టపోకుండా ఉండాలని ప్రజలను కోరారు. దసరా పండుగను అదునుగా భావించి దొంగలు కూడా రెచ్చిపోయి తాళం వేసిన ఇండ్లనే లక్ష్యంగా పెట్టుకొని చోరీలకు పాల్పడే అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. ఈ క్రమంలో ఊర్లకు వెళ్లే సమయంలో ఇంటికి సరైన తాళం వేసి స్థానిక పోలీసులకు గానీ పరిసర ప్రాంతాల్లో నమ్మకమైన వారికి గానీ సమాచారాన్ని ఇవ్వాలని అన్నారు. ఇంటికి మధ్యలో ఉన్న తాళం వేసి బయటి గొళ్ళెం పెట్టకుండా వదిలి పెట్టాలని అదేవిధంగా గేట్లకు కూడా తాళం వేయకుండా ఉంచి ఇంట్లో ఎక్కడ కూడా చెత్త గాని, రోజువారి పాల ప్యాకెట్లు గానీ, న్యూస్ పేపర్ గాని పేరుకుపోకుండా చూసుకోవాలని అలా ఉంటే ఇంట్లో ఎవరూ లేరని దొంగలు గమనించి చోరీలకు పాల్పడే ప్రమాదం ఉందన్నారు. ఊరు వెళ్ళే సమయంలో విలువైన వస్తువులు బంగారు నగలు, నగదును వీలైనంత మేరకు ఇంట్లో పెట్టకుండా బ్యాంకులోని లాకర్లో గాని భద్రత ఉన్న చోట గాని దాచుకోవాలని సూచించారు. బీరువా తాళాలను కూడా ఇంట్లో, బట్టలలో గాని పెట్టకుండా మీ వెంటే తీసుకువెళ్తే ఉత్తమమని అన్నారు. బయటకు వెళ్లేటప్పుడు ఇంటి లోపల బయట కొన్ని లైట్లు వేసి ఉంటే అలా చేస్తే ఇంట్లో మనుషులు ఉన్నారని దొంగలు రాకుండా ఉంటారని చెప్పారు.

కాలనీలో అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా తిరిగితే వెంటనే 100 నెంబర్‌కు గానీ స్థానిక పోలీస్‌లకు గానీ సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కాలనీలో కూడా దొంగతనాలను నివారించేందుకు స్వచ్ఛందంగా కమిటీలను వేసుకోవాలని, ఆర్థిక పరిస్థితులు మెరుగుగా ఉన్నవారు సీసీ కెమెరాలను అమర్చుకోవాలని, ఆ స్థోమత లేని వారు కాలనీ కమిటీల ద్వారా కాలనీలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే.. ఎక్కడికి వెళ్లినా సెల్ ఫోన్ల ద్వారా ఎప్పటికప్పుడు గమనించుకోవచ్చని దొంగలు కూడా చోరీలకు పాల్పడడానికి సాహసించరని దీంతో దొంగతనాలను అరికట్టడానికి వీలుంటుందని అన్నారు. తమ తమ సొంత ఊర్లకు వెళ్లే సందర్భాలలో రైళ్లు, ఆర్టీసీ బస్సులలో అపరిచిత వ్యక్తులు ఇచ్చిన తినుబండరాలను తీసుకోకూడదని, మీ వెంటే విలువైన వస్తువులను తీసుకువెళ్తే వాటిని ఎక్కడపడితే అక్కడ పెట్టుకోకుండా మీ దగ్గరే జాగ్రత్తగా అంటిపెట్టుకొని ఉంచుకోవాలని సూచించారు. నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలంతా తాము అందించినటువంటి సలహాలు, సూచనలను పాటించి ఏమాత్రం నష్టపోకుండా దసరా పర్వదినాన్ని ఉత్సాహంగా, సంతోషంగా, ఘనంగా జరుపుకోవాలని కోరారు.

లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు

నవతెలంగాణ-హయత్‌నగర్

ప్రేమ పేరుతో పెళ్లి చేసుకుంటానని చెప్పి.. లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగోల్‌లోని ఓ హోటల్ లో సీనియర్ కెప్టెన్‌గా పనిచేసే యువతిని అదే హోటల్ లో బౌన్సర్‌గా పనిచేసిన మేడ్చల్ జిల్లా అల్వాల్‌కు చెందిన సాయి కుమార్... ప్రేమిస్తున్నానని చెప్పి ప్రేమ పేరుతో లైంగిక దాడికి పాల్పడి ఈ ఏడాది ఏప్రిల్‌లో నిశ్చితార్థం చేసుకున్నాడు. ఇక అప్పటి నుంచి కనిపించకుండా తిరుగుతున్నాడు అని బాధితురాలు ఈ నెల 3న ఎల్బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

'నేడు ఏఎంసీ పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సం'

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్



గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం నేడు బాటసింగారంలోని మార్కెట్ ఆవరణలో జరగనుంది. మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా చిలక మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మెన్‌గా సిహెచ్ భాస్కరాచారితో పాటు పాలకవర్గం కమిటీ డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, పురపాలక శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ అలియాస్ సీతక్క, భువనగిరి ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డిలు హాజరు కానున్నారు. ఈ క్రమమంలో మార్కెట్ ఉన్నతశ్రేణి అధికారి శ్రీనివాస్, తమ సిబ్బందితో కలిసి ప్రమాణ స్వీకారోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. శాంతి భద్రతల దృష్ట్యా పోలీసులు కూడా భద్రతను ఏర్పాటు చేశారు. పలువురు ప్రముఖులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరు కానున్నారు.



మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్ పరిధిలోని పలు దేవాలయాలు, పార్కులలో పనిచేసే సిబ్బందికి, పారిశుద్ధ్య కార్మికులకు దసరా పండుగను పురస్కరించుకొని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి మహిళలకు ఉచితంగా చీరలను పంపిణీ చేశారు. నవతెలంగాణ - ఎల్బీనగర్

గార్బేజ్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు
ప్రణాళికలు తయారు చేయాలి

కమిషనర్ ఆమ్రపాలి కాట

నవతెలంగాణ-సిటీబ్యూరో

గార్బేజ్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికలు తయారు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం అడిషనల్, జోనల్ కమిషనర్లతో ఆమె టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో శానిటేషన్ ప్రక్రియను మెరుగుపరచి గార్బేజ్ ఫ్రీ సిటీగా చేయుటకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని శానిటేషన్ అడిషనల్‌ను ఆదేశించారు. అవసరమైతే జోనల్ కమిషనర్లు, ఎస్.ఎస్.డబ్ల్యూ ఇంజనీర్లతో చర్చించి తుది నివేదికను రెండు రోజుల్లో అందజేయాలని శానిటేషన్ ఏసిని ఆదేశించారు. మార్కెట్‌ల వద్ద వ్యర్థాలను ఒకే చోట వేసే విధంగా డస్ట్ బిన్‌లను ఏర్పాటు చేయాలని, కమర్షియల్ స్ట్రేచేస్ వద్ద లిట్టర్ బిల్‌లను ఏర్పాటు చేయాలని, ఈ విషయంలో జోనల్ లెవెల్‌లో పూర్తిస్థాయిలో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. వాటర్ వర్క్స్, ఇంజనీరింగ్ శాఖ ద్వారా చేపట్టి పూర్తయిన నేపథ్యంలో కాంట్రాక్టర్ వ్యర్థాలను పూర్తి స్థాయిలో తొలగించే విధంగా ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు. గార్బేజ్ ఫ్రీ సిటీలో ఇతర శాఖల సమన్వయంతో కలిసి పనిచేయాలన్నారు. జోనల్ స్థాయిలో కాంట్రాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేసి పనులు పూర్తి చేసే విధంగా కృషి చేయాలని జోనల్ కమిషనర్‌లకు కమిషనర్ ఆదేశించారు. పనులు పూర్తి కాకపోవడానికి గల కారణాలు వివరాలు తెలుసుకొని వాటి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. కమర్షియల్ కాంప్లెక్స్‌లకు సంబంధించి ఆస్తి పన్ను చెల్లింపులు డిప్యూటీ కమిషనర్లు వెళ్లినప్పుడు అక్కడ శానిటేషన్ పరిస్థితి పరిశీలించి లిట్టర్ బిన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్వచ్ఛ ఆటో వాహనాలు జీపీఎస్ లింక్ ఇచ్చినందున రూట్ మ్యాప్ తయారు చేసి స్వచ్ఛ ఆటో రూట్ మ్యాప్ ప్రకారంగా ఇంటింటికి చెత్త సేకరణ పూర్తి స్థాయిలో చేసే విధంగా చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్లు ఆదేశించారు. నీటి వనరుల వద్ద, నాలాల వద్ద కూడా ఫ్లోటింగ్ మెటీరియల్ తొలగింపుకు చర్యలు తీసుకోవాలని గార్బేజ్ ఫ్రీ సిటీగా ఉండటానికి ప్రతి అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కమిషనర్ అధికారులను కోరారు.

ప్రపంచంతో పోటీపడేలా రాష్ట్ర పర్యాటకం అభివృద్ధి



- రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రపంచ స్థాయిలో పోటీపడేలా రాష్ట్ర పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. అనేక అత్యంత ఆకర్షణీయమైన విజిటింగ్ ప్లేస్‌లను రాష్ట్ర పర్యాటక రంగం దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైందని ఆయన స్పష్టం చేశారు. వసతులు కల్పించి, మార్కెటింగ్ చేసి పర్యాటకులను ఆకర్షించడమే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని తెలిపారు. మాదాపూర్ హెచ్ఐసీసీలో నాగాలాండ్ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న హార్న్ బిల్ మ్యూజిక్ ఫెస్టివల్ ప్రమోషనల్ ఈవెంట్‌కి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నాగాలాండ్ టూరిజాన్ని ప్రమోట్ చేసేందుకు ఆ రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి టెన్ జెన్ ఇమ్నా అలాంగ్, బృందం ఇక్కడికి చేరుకున్నారు. తెలంగాణ పర్యటక ప్రదేశాన్ని, ఔనత్యానత్వాన్ని ప్రపంచానికి తెలిపేందుకు దుబాయ్, అమెరికాలో అంతర్జాతీయ టూరిజం సదస్సుకు వెళ్తున్నామనీ, వందల కోట్ల విలువైన పర్యాటక ఆస్తులకు తగిన విధంగా ఉపయోగించేందుకు వృద్ధిలోకి తీసుకొస్తామని మంత్రి పేర్కొన్నారు. ఈ వేడుక నిర్వహణకు తెలుగు రాష్ట్రాల నుంచి సుచరిండియా గ్రూప్, శ్రేయాస్ ఈ వెంట్స్ గ్రూప్ సంస్థలతో నాగాలాండ్ శాఖ అవగాహనా బృందం అగ్రిమెంట్ చేసుకుంది. సుచరిండియా గ్రూప్ ఎండీ కిరణ్, శ్రేయాస్ గ్రూప్ ఎండీ డైరెక్టర్ శ్రీనివాస్, ఆర్టిస్ట్ కనెక్ట్ సంస్థ సీఈవో ఉజ్వల్ ముఖియా, నాగాలాండ్ సీఎం సలహాదారుడు అబూ మెహతా, టీఏఎఫ్ఎంఏ సంస్థ చైర్మెన్ తేజ మీరు, నాగాలాండ్ టూరిజం డిపార్ట్మెంట్ అధికారులు, ప్రముఖ తెలుగు సంగీత దర్శకులు రమణ గోగుల పాల్గొన్నారు.

ఘనంగా పట్టోళ్ళ ఇంద్రారెడ్డి జయంతి వేడుకలు



నవతెలంగాణ-బడంగ్‌పేట్

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ హెూం మంత్రి స్వర్గీయ పట్టోళ్ళ ఇంద్రారెడ్డి చేసిన కృషి మరువలేనిదని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి అన్నారు. శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి ఆధ్వర్యంలో బడంగ్‌పేట్ సర్కిల్ వద్ద మాజీ హెూం మంత్రి స్వర్గీయ ఇంద్రారెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పండ్లు, స్వీట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనే ఊపిరిగా బతికిన గొప్ప నాయకుడు ఇంద్రారెడ్డి అని కొనియాడారు. ఇంద్రన్న ఆశయాలను కొనసాగిస్తున్న మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి బాటలో తామందరం ముందుకు సాగుతున్నట్లు తెలిపా3రు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ సూర్యగంటి అర్జున్, కార్పొరేటర్లు పెద్దబావి శ్రీనివాస్ రెడ్డి ఏనుగు రాంరెడ్డి, యాతం పవన్ కుమార్ యాదవ్, చుక్క శివ కుమార్, సీనియర్ నాయకులు ఆనంద్ రెడ్డి, బీమిడి జంగారెడ్డి, బోయపల్లి శేఖర్ రెడ్డి, గుర్రం వెంకట్ రెడ్డి, జెనిగ శ్రీనివాస్ యాదవ్, గట్టు మహిపాల్, బొట్టు వెంకటేష్, కో ఆప్షన్ సభ్యులు, సోషల్ మీడియా అధ్యక్షులు, వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ప్రశాంతత, మనోధైర్యం

- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి





నవతెలంగాణ-బడంగ్‌పేట్

నేటి సమాజంలో విద్యార్థులకు క్రీడలతోనే మానసిక ప్రశాంతతతో పాటు మనోధైర్యం కలుగుతుందని మేయర్ పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ గ్రామంలో ఉన్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 38వ సబ్ జూనియర్ బాయ్స్ నేషనల్ హ్యాండ్ బాల్ ఛాంపియన్షిప్ 2024 కార్యక్రమాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని అన్నారు. క్రీడల్లో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ పద్మ జ్యోతి, కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్ రెడ్డి, గూడెపు ఇంద్రసేన, పెద్దబావి సుదర్శన్ రెడ్డి, నాయకులు రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, సుభాన్ యాదవ్, బంగారి అశోక్, యాతం కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
శనివారం | అక్టోబర్ 05, 2024 | www.navatelangana.com



నవతెలంగాణ-ఘట్కేసర్ రూరల్
దేవి శరన్నవరాత్రి ఉత్స వాలలో భాగంగా రెండో రోజు అమ్మవారి గాయత్రి దేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఔషపూర్‌లోని దుర్గామాత కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారిని గాయత్రి దేవిగా అలంకరించారు. ఈ కార్యక్రమం లో ఎంసి మాజీ డైరెక్టర్ పనాల కొండ రెడ్డి నాయకులు జగదీష్ భక్తులు అమ్మవారు మూలధరులు తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న నక్క ప్రభాకర్ గౌడ్



నవతెలంగాణ-శామీర్ పేట
దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ మండలంలోని బొమ్మరాసిపేటలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్ ఆయన వ్యవసాయ క్షేత్రం వెళ్లే దారిలో దుర్గామాత ఆలయంలో నవరాత్రుల ఉత్సవాల్లో నక్క ప్రభాకర్‌గౌడ్ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నక్క ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజులపాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

పట్నం మహేందర్‌రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ





నవతెలంగాణ-ఉప్పల్
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్‌గా నియమితులైన పట్నం మహేందర్ రెడ్డినీ ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి, గడ్డం రవి, తవిడబోయిన గిరిబాబు ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సన్మానించారు.

నవతెలంగాణ-కాప్రా
శాసనమండలి ప్రభుత్వ విప్‌గా ఎమ్మెల్సీ డా. పట్నం మహేందర్‌రెడ్డి నియమితులైన సందర్భంగా డా. ఏ.ఎస్ రావు నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి శుక్రవారం జూబ్లీహిల్స్ లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావుని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బోజ్జ రాఘవరెడ్డి, జనంపల్లి వెంకటేశ్వర రెడ్డి, గడ్డం రవి, రాజేందర్‌రెడ్డి, అప్పమ్మగారి రాంరెడ్డి,పైళ్ళ హరినాథ్‌రెడ్డి కుందనపల్లి నరసింహ,కోటేశ్వర్ తదితరులున్నారు.

ఫ్యామిలీ డిజిటల్ హెల్త్ కార్డుల్లో పూర్తి సమాచారం పొందుపర్చాలి

- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్
- ఫ్యామిలీ డిజిటల్ హెల్త్ కార్డు పైలెట్ ప్రాజెక్టు కింద పోతారం, తుంకుంట 4వ వార్డు ఎంపిక
- సర్వే నిర్వహించిన అధికారులు
- పోతారంలో సర్వేను పరిశీలించిన కలెక్టర్





నవ తెలంగాణ-శామీర్ పేట
ఫ్యామిలీ డిజిటల్ కార్డులో ఎలాంటి తప్పులు లేకుండా పక్కా సమాచారం ఉండాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సర్వే టీములకు ఆదేశించారు. ఫ్యామిలీ డిజిటల్ హెల్త్ కార్డుల సర్వేను మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ హెల్త్ కార్డుల సర్వే లో భాగంగా పైలెట్టు ప్రాజెక్టు కింద తుంకుంట మున్సిపాలిటీలోని 4వ వార్డును, మూడు చింతలపల్లి మండలంలోని పోతారం గ్రామాన్ని ఎంపిక చేశారు. శుక్రవారం తుంకుంట మున్సిపల్ పరిధిలోని4వ వార్డులో మూడు చింతలపల్లి మండలంలోని పోతారంలో అధికారులు సర్వే నిర్వ హించారు. పోతారంలో మూడు టీం లు సర్వే నిర్వహిస్తుండగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అదనపు కలెక్టర్ రాధికా గుప్తా, డీపీఓ వెంకయ్యతో కలిసి సర్వేను పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన సర్వే టీములకు దరఖాస్తు ఫారంలో ఎలాంటి తప్పులు లేకుండా చూసుకోవాలని సూచిం చారు. అదేవిధంగా ఫ్యామిలీ డిజిటల్ హెల్త్ కార్డులో పొందు పరిచే వివరాలలో యాజమానికి మిగతా సభ్యుల వివరాలతో పాటు న్యూ ఎన్ రోల్ మెంట్ కూడా చేయాలని సర్వే టీములకు ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, నిర్మాణంలో ఉన్న తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఆకస్మిక తనిఖీలు చేసి రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వంలో కల్పించిన మౌలిక వసతులను పూర్తిస్థాయిలో వినియోగిస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించాలని జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్‌ను కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఎంఅండ్ హెచ్ఓ రఘునాథస్వామి, ఆర్ డి ఓ ఉపేందర్ రెడ్డి, డిఎల్ పిఓ సాంబిరెడ్డి, మూడుచింతలపల్లి తహశీల్దార్ వెంకట నర్సింహ రెడ్డి, ఎంపీడీఓలు గ్యామ, వసంత లక్ష్మి, ఎంపీఓ మంగ తాయారు, రవి, నంద కిషోర్ , మెడికల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శిలు తదితరులు పాల్గొన్నారు.

స్వయం శక్తితో వ్యాపార రంగంలో రాణించాలి

మాజీ మేయర్ మేకల కావ్య



నవతెలంగాణ-జవహర్ నగర్
యువత స్వయం శక్తితో వ్యాపార రంగంలో రాణించాలని జవహర్ నగర్ మాజీ మేయర్ మేకల కావ్య అన్నారు. శుక్రవారం జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలోని 15వ డివిజన్ బృందావన్ కాలనీ లో సతీష్ రెడికి చెందిన 7 స్టార్ ఫ్రెష్ చికెన్ షాప్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇతరుల మీద ఆధారపడకుండా స్వయం శక్తితో పైకి రావాలని, వ్యాపార రంగంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, కస్టమర్లతో మంచి సత్సంబంధాలు కొనసాగించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నాగభూషణం, డివిజన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


విద్యతో సమాజ మార్పు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.రఘునాథస్వామి



నవతెలంగాణ-సిటీబ్యూరో
విద్య అనేది సమాజాన్ని మారుస్తుంద మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.రఘునాథస్వామి అన్నారు. ఘట్‌కేసర్‌లోని శ్రీనిధి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విద్యార్థులు నిర్వహిస్తున్న 'సేవా సంస్థ బచ్పన్ ప్రయాస్' కార్యక్రమానికి డీఎంఅండ్‌హెచ్ఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యను అందించడం ద్వారా ఎంతో మంది పిల్లలు ఉత్తమ జీవితాన్ని గడపడానికి మార్గం సుగమ మవుతుందన్నారు. విద్యార్థులు నిర్వహించే ఈ సేవా కార్యక్రమాలు సమాజంపై మంచి ప్రభావాన్ని చూపడం వల్ల, విద్యార్థులు తమ సామాజిక బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తున్నారని ప్రశంసించారు. ఈ 'శ్రీనిధి' విద్యార్థులు సేవా కార్యక్రమాలు, ముఖ్యంగా వాక్ ఫర్ ఏ కాజ్, సపోర్టింగ్ హ్యాండ్స్ వంటి కార్యక్రమాలు విస్తృత ప్రజాదరణ పొందుతున్నాయనీ, విద్యార్థుల కృషి మరింత పురోగమించాలని ఆకాంక్షించారు. 'బచ్పన్ ప్రయాస్' అనే విద్యార్థులే నడిపించే ఈ ఎన్జీవో, అనాథాశ్రమాలు, ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాలు, తాగునీటి శుద్ధి పరికరాలు ఏర్పాటు చేయడంతో పాటు, అవసరమైన వస్తువులను అందించడం ద్వారా సమాజానికి విశేష సేవలందిస్తున్నది.

వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ-నేరేడ్ మెట్
నేరేడ్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాకతీయ నగర్‌లో నివాసం ఉండే 40 ఏండ్ల చంద్రులు రాజేష్ వృత్తి ప్రయివేటు ఉద్యోగం. గురువారం సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో సికింద్రాబాద్‌లో సర్వీసింగ్‌కి ఇచ్చిన తన యాక్టీవా బండి ని తెచ్చుకోవడానికి తన ఇంటి నుండి బయలు దేరి ఇప్పటి వరకు ఇంటికి తిరిగి రాలేదు. శుక్రవారం నేరేడ్ మెట్ పోలీస్ స్టేషన్ లో తన భార్య స్వప్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

517

డాక్టర్ ఏఎస్‌రావుకు ఘన నివాళులు



నవతెలంగాణ-కాప్రా
తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్, డాక్టర్ ఏ ఎస్ రావు విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో డాక్టర్ ఏ ఎస్ రావు విజ్ఞానోత్సవాలు డాక్టర్ ఏఎస్ రావు నగర్ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆవరణలో డాక్టర్ ఏ ఎస్ రావు డాక్యుమెంటరీ ఫిలిం ప్రదర్శించబడింది. ముఖ్యఅతిథిగా విజ్ఞాన దర్శిని వ్యవస్థాపకులు టి.రమేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమా నికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్ష వహించారు. టి.రమేష్ మాట్లాడుతూ డాక్టర్ ఏఎస్ రావు విద్య అభ్యసించడం కోసం ఎనలేని కృషి చేశారని చెప్పారు. అమెరికాలో చదువుకున్నప్పటికీ అక్కడ ఉద్యోగ అవకాశాలు ఉన్నా దేశభక్తియుతంగా భారతదేశానికి వచ్చి దేశ స్వావలంబన కొరకు మన కాళ్ళ మీద మనం నిలబడి ఉత్పత్తులు చేసే అందుకోసం అవిరళ కృషి చేశారని చెప్పారు. ఆయన స్వయంగా సైంటిస్ట్ గా ఉండి ఈసీఐఎల్ నిర్మాణం పరిపాలన అభివృద్ధిని చేసి వేలాది మందికి ఉద్యోగాలు లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కోట్లాది మందికి స్ఫూర్తివంతంగా నిలిచారని చెప్పారు. అనంతరం డాక్టర్ ఏఎస్ రావు జీవిత విశేషాలు తో కూడిన డాక్యుమెంటరీ ఫిల్ము ప్రదర్శించడం జరిగింది. ఏఎస్ రావు నగర్ కాలనీవాసులు సీనియర్ సిటిజన్స్ అత్యధికలు పాల్గొని డాక్టర్ ఏఎస్ రావుకి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ఏఎస్ రావు విజ్ఞాన వేదిక ఉపాధ్యక్షులు జి శివరామకృష్ణ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ పాషా, రుక్కయ్య, బాలు, రామ్మూర్తి, పి బి చారి, ఏ ఎస్ రావు నగర్ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కృష్ణమూర్తి, రామ్మోహన్రావు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా
ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మల్లాపూర్ డివిజన్ పరిధిలోని బాబా నగర్‌లో రూ.17 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రయినేజీకి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, వాటర్ వర్క్ ఏఈ వేణు గోపాల్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు దయాకర్ రెడ్డి, ప్రవీణ్, వాసు, మూర్తి, గౌసు తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నాణ్యత పనుల పరిశీలన

నవతెలంగాణ-కాప్రా
మల్లాపూర్ డివిజన్ పరిధిలోని దుర్గానగర్ కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు పనుల నాణ్యత ప్రమాణాలను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి.ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ శ్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, స్థానిక కాలనీ వాసులు, నాయకులు పైళ్ల ప్రవీణ్, దయాకర్ రెడ్డి, పొన్నాల మహేందర్, పొన్నాల రాజు, మూర్తి, ఉస్మాన్, శ్రీశైలం, రాజేష్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాతకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజాలు



నవతెలంగాణ-కాప్రా
మీర్పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్ వెంకటేశ్వర నగర్ షిరిడి సాయిబాబా ఆలయ సముదాయంలో ఉన్న కనకదుర్గమాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, ఫేస్-1 గ్రౌండ్ లో కమ్యూనిటీ హాల్ కోసం నూతనంగా నిర్మించిన వాచ్ మెన్ రూమ్‌ని ప్రారంభోత్సవం చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ డివిజన్ పరిధిలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసుకున్నామని మన కళ్ళ ముందే కనపడుతున్నాయని ఇక ముందు కూడా అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తూ ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటానని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ని, కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి శాలువాతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు బేటి పాండు ప్రతాపరెడ్డి ప్రసాద్, సికిందర్ రెడ్డి దేవేందర్ షిరిడి సాయిబాబా సంస్థాన్ ట్రస్టు కార్యవర్గం, సంక్షేమ సంఘం కార్యవర్గం, బీఆర్ఎస్ నాయకులు జంపాల్ రెడ్డి, నవీన్ గౌడ్, చారి, బాలయ్య గౌడ్, పూస రమేష్, నిసార్ అహ్మద్ గోరి, దండెం నరేందర్ పాల్గొన్నారు.

మహేశ్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు ఘన స్వాగతం..



నవతెలంగాణ-శామీర్ పేట
టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. శుక్రవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ లు నిజామాబాద్ వెళుతుండగా మార్గమధ్యంలో మేడ్చల్ రింగ్ రోడ్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు వారికి పుష్ప గుచ్ఛాలు అందజేసి శాలువాతో సత్కరించారు. టీపీసీసీ అధ్యక్షుడు గా ఎన్నికైన మహేష్ కుమార్ గౌడ్ కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, శామీర్ పేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ గౌడ్, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని సమస్యలను పరిష్కరిస్తా



నవతెలంగాణ-నేరేడ్ మెట్
మల్కాజిగిరి సర్కిల్ సఫిల్ గూడా మినీ ట్యాంక్ బండ్ పై శుక్రవారం మినీ ట్యాంక్ బండ్ పై టైల్స్ రిపేర్, యావరేజ్ డైవర్షన్ పనులను, సుందరికరణ పనులు, పలు సమస్యలపై హెచ్ఎండిఏ అధికారులు, జిహెచ్ఎంసి అధికారులతో కలిసి పరిశీలించి, పరిష్కరించగా, మిగిలిన సమస్యలను త్వరలో పరిష్కరించే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండిఏ డిఈ రామారావు, మహేష్, నవీన్, మధు, తపన్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ బాల త్రిపురసుందరి అవతారంలో దుర్గామాత



నవతెలంగాణ-నేరేడ్ మెట్
దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నేరేడ్ మెట్ డివిజన్ సప్తగిరి కాలనీలోని శ్రీ పోచమ్మ మహంకాళి అమ్మ ముత్యాలమ్మ దేవాలయం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ దేవాలయంలో శ్రీ దేవి నవరాత్రి ఉత్సవం సందర్భంగా మొదటి రోజు నుండి 13వ తేది వరకు కుంకుమార్చన అనంతరం ఆ అమ్మవారి ఆశీస్సులతో అన్నదాన కార్యక్రమంను నిర్వహించడం జరుగుతుందని, అమ్మవారి తీర్థ ప్రసాదములను స్వీకరించవలసిందిగా కోరుతున్నామన్నారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ నాయకులు కె.చెన్నారెడ్డి, యాది, ఎన్ కృష్ణ, కోటేశ్వరి, దుర్గ, కమిటీ సభ్యులు కె శ్రీధర్, కెనర్సింగ్, జి రామకృష్ణ, శ్రీనివాస్,పి వీరేష్, భక్తులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-కీసర
నాగారం మున్సిపాలిటీ 9వ వార్డు ఎస్వి నగర్ కాలనీ రోడ్డు నెంబర్-3లో గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజూ శ్రీ బాల త్రిపురసుందరి అవతారంలో అమ్మవారు దర్శనం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ కోమీరెల్లి అనిత, సుధాకర్ రెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో కొత్త గోపాల్ రెడ్డి, కొక్కొండ ఆగి రెడ్డి,కరుణాకర్ రెడ్డి,ప్రవీణ్ నాయక్, సమీర్, నీకేష్ రెడ్డి,సుజాత, నవ్య,సరళ, మౌనిక, కావ్య, మంజునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైకు లారీ ఢీ.. యువకుడికి తీవ్ర గాయాలు



నవతెలంగాణ-ఘట్కేసర్
బైక్‌ను లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన ఘట్కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి-భువనగిరి జిల్లా, బీబీనగర్ మండలం, కొండమడుగుకు చెందిన ఆకాష్(19) చర్లపల్లిలోని ఓ పరిశ్రమలో కూలి గా పనిచేస్తుంటాడు. రోజు మాదిరిగానే పనికోసం బైక్‌పై వెళుతున్న ఆకాష్ అవుషాపూర్ సర్వీసు రోడ్డులో వెళ్లతుండగా లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఘట్కేసర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. యువకుడి పరిస్థితి విషమంగా ఉందని ఉందని వైద్యులు తెలిపారు. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పూజారి వివాదాస్పద వాఖ్యాలు

- భక్తుల ఆందోళన

నవతెలంగాణ-బోడుప్పల్
బోడుప్పల్ మాత నిమిషాంబికా దేవి ఆలయ పూజారి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలతో భక్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటన శుక్రవారం నాడు చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే నవరాత్రుల సందర్భంగా రెండవ రోజైన శుక్రవారం బాలాత్రిపురసుందరి అవతారంలో ఉండాల్సిన" అమ్మవారికి ఫ్రాక్ వేశారు " ఇది సరైందేన అంటూ ప్రశ్నించిన భక్తులపై ఆగ్రహం వ్యక్తం చేసిన పూజారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. దాంతో జరిగిన ఘటనపై భక్తులు మేడిపల్లి పీఎస్ లో ఫిర్యాదు చేస్తామన్నారు.

వైద్య విద్యార్థికి ఎమ్మెల్యే సాయం



నవతెలంగాణ-కాప్రా
నాచారం రాఘవేంద్ర నగర్‌కు చెందిన మహమ్మద్ ఖాజా నిరుపేద కుటుంబానికి చెందినవాడు. కనీసం సొంత ఇల్లు కూడా లేని నిరుపేద. ఆయన కొడుకు మహమ్మద్ ఓమర్ ఫరూక్‌ను ప్రయివేట్ స్కూల్లో చదివించే ఆర్థిక స్తోమత లేక ఏడవ తరగతి నుండి 12వ తరగతి వరకు గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్ ఏర్పాటు చేసిన తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషనల్ సొసైటీ లో చదివించాడు ఇంటర్‌లో 956 మార్కులు సాధించి గోల్డ్ మెడల్ అందుకున్నారు.. అనంతరం టీఎంఆర్ఎస్‌సీ బార్యాస్ లో నీట్ కోచింగ్ తీసుకొని ప్రతిష్టాత్మకమైన నీట్ ఎంట్రన్స్‌లో స్టేట్ ర్యాంక్ 1583 సాధించాడు. ఆర్థిక పరిస్థితులు డాక్టర్ అయ్యేందుకు మళ్ళీ అడ్డు పడ్డాయి అలాంటి సమయంలో ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి నియోజకవర్గంలోని నిరుపేద వైద్య విద్యార్థులకు అండగా ఉంటూ వారికి ఐదు సంవత్సరాల కాలేజీ ఫీజులు కడుతున్న విషయం తెలిసి గ్రేటర్ బీఆర్ఎస్ నాయకులు సాయి జన్ శేకర్ ని కలిసి ఎమ్మెల్యేను కలిశారు. విద్యార్థితో మాట్లాడిన ఎమ్మెల్యే ఐదు సంవత్సరాల కాలేజీ ఫీజులు కడతానని హామీ ఇవ్వడం జరిగింది. ఎంబీబీఎస్ అయ్యాక కూడా సహకరిస్తానని భరోసా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రేటర్ బీఆర్ఎస్ నాయకులు సాయి జన్ శేకర్ బీఆర్ఎస్ మహిళ నాయకురాలు అజ్మీర తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్‌ను పరామర్శించిన ఎమెల్సీ



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ 27 వ వార్డు కౌన్సిలర్ శంకర్ నాయక్ తల్లి కొర్ర లక్ష్మీ భాయి ఇటీవల మరణించగా.. శుక్రవారం వారి నివాసానికి వెళ్ళి లక్ష్మి బాయి చిత్ర పటానికి మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమెల్సీ శంభీపూర్ రాజుపూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేటర్లు ఆగం రాజు, బాలాజీ నాయక్, 125 డివిజన్ ప్రెసిడెంట్ విజయ్ రామ్ రెడ్డి, పాక్స్ డైరెక్టర్ మోహన్ నాయక్, వార్డు ప్రెసిడెంట్ అమర్ సింగ్, సీనియర్ నాయకులు రవీందర్ నాయక్, సంజీవ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-దుండిగల్

బౌరంపేట్ కేబుల్ ఫీడర్ లో కొత్త సర్వీస్ కనెక్షన్లు మెయింటెనెన్స్ పనుల కారణంగా ఉదయం 11.30 గం॥ నుంచి మధ్యాహ్నం 1.00 గం॥ వరకు బౌరంపేట్ విలేజ్, ఆర్ కే టౌన్ షిప్, షికర స్కూల్ రోడ్ లలో.అలాగే ఉదయం 10.30 గం॥ నుంచి మధ్యాహ్నం 2.30 గం॥ వరకు డిఆర్ కే ఇంజినీరిగ్ కళాశాల, కే ఏల్ విశ్వవిద్యాలయం, డాలర్ డ్రీమ్స్, సింహపురి కాలనీ, గోకుల్ భృదావనం, నెస్ట్ విల్లాస్, ఎస్‌బిఐ కాలనీలలో బొల్లారం సబ్‌స్టేషన్ నుంచి మధ్యాహ్నం 1.30 గం॥ నుంచి మధ్యాహ్నం 2.00 గం॥ వరకు బాలాజీ వెంచర్, ఖాజీపల్లి రోడ్,ప్రణీత్ జెమ్స్‌లలో, బహదూర్‌పల్లి ఫీడర్‌లో మధ్యాహ్నం 12.00 గం॥ నుంచి 12.30 ॥ని వరకు లక్ష్మీనగర్, సూరారం గ్రామం, విశ్వకర్మ కాలనీ, అయ్యప్ప కాలనీలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని, ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని బౌరంపేట్ విద్యుత్ శాఖ ఏఈ బి. సాయి కిరణ్ తెలిపారు.

పేదలకు వరం సీఎం సహాయ నిధి







- ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

పేదలకు వరం సీఎం సహాయ నిధి అని కుత్బుల్లా పూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకనంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద దుండిగల్ మున్సిపాలిటీ పరిధి మల్లంపేట్‌కు చెందిన టి. వెంకటేశ్వర్లు, కొంపల్లి మున్సిపాలిటీ పరిధి దూలపల్లికి చెందిన ఎస్.లక్ష్మీనారాయణలకు ఆరోగ్య పరిస్థితి బాగాలేదని స్థానిక నాయకుల ద్వారా సమాచారం అందుకున్న ఎమ్మె ల్యే.. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి టి.వెంకటేశ్వర్లు తండ్రి టి.బాలేశ్వరయ్య రూ.1,10,000, ఎస్.లక్ష్మీనారా యణ తండ్రి ఎస్.వీర రాజు రూ.2,75,000 లకు ఎల్‌ఓసీ మంజూరు చేయించి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలో ఉండి ఆర్థిక సహాయం కోసం ఎదురుచూసే వారికి సీఎం సహాయనిధి ఎంతో భరోసానిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ మున్సిపాలిటీ మహిళా అధ్యక్షు రాలు పడాల మనోజ, సీనియర్ నాయకులు శ్రీనివాస్, స్థానిక నాయ కులు తదితరులు పాల్గొన్నారు.

"ఆగ్రా మిఠాయి వాలా" స్వీట్ హౌస్ ప్రారంభించిన ఎమ్మెల్యే...

132 - జీడిమెట్ల డివిజన్ భాగ్యలక్ష్మి కాలనీలో రామ్ విలాస్, రాహుల్, రవి ఆధ్వ ర్యంలో.. శుక్రవారం నూతనం గా ఏర్పాటు చేసిన "ఆగ్రా మిఠాయి వాలా" స్వీట్ హౌస్‌ను ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, కార్పొరేటర్ రావుల శేషగిరిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 'అంగూరి పేట' వంటి మిఠాయి రుచులను కుత్బుల్లాపూర్ ప్రజలకు అందించేందుకు ఏర్పాటు చేసిన "ఆగ్రా మిఠాయి వాలా" వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కిషన్ రావ్, సుధాకర్ గౌడ్, ఆటో బలరాం, యేసు, నదీం రాయ్, సమ్మయ్య నేత, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిరూపం బతుకమ్మ: ఎమ్మెల్యే..

జగద్గిరిగుట్ట: మన తెలుగు మహిళల సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిరూపంగా బతుకమ్మ ఉత్సవాలు నిలుస్తాయని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. బతుకమ్మ పండగ పురస్కరించుకొని గురువారం రాత్రి జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి కూన మహాలక్ష్మినగర్ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన బతు కమ్మ కుంటను స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం అటుకుల బతుకమ్మ సంద ర్భంగా మహిళలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి లో మమేకమవుతూ ప్రకృతిని ఆరాధిస్తూ తెలంగాణ ప్రజ లు అత్యంత వైభవంగా తొమ్మిది రోజుల పాటు జరుపుకునే వేడుక బతుకమ్మ పండుగ మన రాష్ట్ర ఆత్మగౌరవం అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళలకు ప్రాధాన్యత నిస్తూ బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను పథకాలతో మోసం చేస్తూ పబ్బం గడుపుకుం టున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, నాయకులు వేణుయాదవ్, ఎత్తరి మారయ్య, అజమ్, మల్లేష్ గౌడ్, శశిధర్, పాపులు గౌడ్, విఠల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంక్షేమానికి కృషి : ఎమ్మెల్యే

జగద్గిరిగుట్ట: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ గౌడ సంక్షేమానికి కృషి చేస్తానని, తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని స్థానిక ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కుత్బుల్లాపూర్ గౌడ సంఘం అధ్యక్షులు కూన రాజ్ కుమార్ గౌడ్ అధ్వర్యంలో.. నిర్వహించిన సమావేశానికి ఆయనతో పాటు రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ విజయ శేఖర్ గౌడ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్‌లో గౌడ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణంతోపాటు,సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఏర్పాటుకు సహాయ సహకారాలు అందించాలని గౌడ సంఘం సభ్యులు ఎమ్మెల్యేను కోరారు. అనంతరం అయన మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ గౌడ సంక్షేమ సంఘానికి నా మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. తన ఎమ్మెల్యే గెలుపునకు సహకరించిన చేసిన గౌడ సంఘ పెద్దలకు,కులస్తులకు పేరుపేరునా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘ నాయకులు కూన శ్రీరాములు గౌడ్, మద్దెల జైరాజ్ గౌడ్, కూన సుధాకర్ గౌడ్, కూన శ్రవణ్ గౌడ్, నల్ల ప్రసాద్ గౌడ్, మద్దెల మధు గౌడ్, సంక్షేమ సంఘం సభ్యులు, కుల బంధువులు తదితరులు పాల్గొన్నారు.



శేరిలింగంపల్లిని అభివృద్ధి చేస్తా



- పీఏసీ చైర్మెన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

శేరిలింగంపల్లి నియోజక వర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన అగ్రగామిగా తీర్చిదితాన ని పీఏసీ చైర్మెన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని హెచ్ఎంటీ హిల్స్, రాంనరేశ్ నగర్ కాలనీలలో రూ. 75.50 లక్షల అంచనా వ్యయంతో చెపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆయనతో పాటు స్థానిక కార్పొ రేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హైదర్ నగర్ డివిజన్ అభివృద్ధికి బాటలు వేస్తూ శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమన్నారు. మౌళిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తానన్నారు. సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శ కంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానన్నారు. డివిజన్ అభివృద్ధికి బాటలు వేస్తూ సీసీ రోడ్ల నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసు కోవడం చాల సంతోషకరమన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, సీసీ రోడ్లు వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలన్నారు. నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదన్నారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలిపిస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తాన న్నారు. హెచ్ఎంటీ హిల్స్‌లో రూ.25.30 లక్షల అంచ నా వ్యయంతో చేపట్టబోయే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, రాం నరేష్ నగర్ రోడ్డు నంబర్ 2లో రూ. 24.70 లక్షలతో అంచనా వ్యయంతో చేపట్టబోయే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, రాం నరేష్ నగర్ రోడ్డు నంబర్ 13లో రూ.25.50 లక్షల అంచనా వ్యయంతో చేపట్ట బోయే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. నాయ కులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, కాలనీల అసోసియే షన్ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

జీడిమెట్ల పోలీసులకు అభినందనలు

- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో తప్పుడు డాక్యూమెంట్లు సృష్టించి, వాళ్ళ భూములను లాక్కునే వాళ్ళను గుర్తించి వారిని అరెస్టు చెయ్యడం అభినందనీయమని వారు పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో కబ్జా రాయులు అనేక ప్రభుత్వ భూములను కబ్జాచేసి ప్రజలకు తప్పుడు పత్రాలను చూపి లక్షలకు అమ్మి మోసం చేసారన్నారు. నేడు ఆ ప్రాంతాలో నివసిస్తున్న ప్రజలు ఎప్పుడు హైడ్రా వచ్చి కూలుస్తోందోనని భయంతో బతుకుతున్నారని అన్నారు. ఆ సృష్టించిన పత్రాలు భూములు అమ్ముకోవడానికే కాకుండా ఆ పేపర్లతో ఎలక్ట్రిక్ మీటర్లు, టాక్స్‌లు, మంచి నీటి కనెక్షన్, డోర్ నంబర్‌లు ఇలాగ అన్నింటికి ఉపయోగించారని, కావున ఆ కబ్జాదారులను అరెస్టు చెయ్యడమే కాకుండా వాళ్ళ వల్ల మోసపోయిన వారిని గుర్తించి, కబ్జాదారులు మోసంతో పెంచుకున్న ఆస్తులను జప్తు చేసి ప్రజలకు న్యాయం చెయ్యాలని విజ్ఞప్తి చేసారు. వాటి వెను కాల ఉన్న అధికారులను అరెస్టు చెయ్యాలన్నారు. నేటికీ భూకబ్జాదారులు వాళ్లు కబ్జా చేసి కాలనీలుగా ఏర్పరిచి అందులో మధ్యలో ఖాళీగా ఉన్న స్థలాలలో గదులను నిర్మిస్తు న్నారని, గతంలో సీపీఐగా పోరాటం చేసి, విజ్ఞప్తులపై ఇంకా రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పందించట్లేదని, ఉద్య మాన్ని మరొక సారి నిర్మిస్తామని అన్నారు. అనేక ప్రాంతాలో నిర్మించిన బస్తీలో ఇలాగే అక్రమ పత్రాలను సృష్టించి ఉండవచ్చని కావున వాటి పై కూడా సమగ్ర దర్యాప్తు చెయ్యాలని పత్రిక ప్రకటన ద్వారా పోలీస్ అధికారులను కోరారు. గతంలో చింతల్ చెరువులో హైడ్రా అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తే మళ్ళీ అక్కడ నిర్మాణాలు మొదలు పెట్టారని సమాచారం ఉందని, వాటిపైన కూడా చర్యలు తీసుకోవాలన్నారు.

సౌత్ జోన్ కబడ్డీ పురుషుల జట్టు ఎంపిక



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీలో కబడ్డీ సెలక్షన్ ట్రయల్స్ శుక్రవారం నిర్వహించారు. జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ ప్రొఫెసర్ ఎస్ఎస్ దిలీప్, ఫిజికల్ డైరెక్టర్ డా. నల్లగొండ అశోక్‌ల ఆధ్వర్యంలో.. నిర్వహించిన ఈ ట్రయల్స్‌లో వివిధ కళాశాలల నుంచి దాదాపు 300 మంది పాల్గొన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఇండోర్ కబడ్డీ మ్యాట్‌పై ఈ సెలక్షన్లు జరిగాయి. ఎంపికైన క్రీడాకారులు చెన్నైలో జరిగే సౌత్ జోన్ కబడ్డీ ఛాంపియన్షిప్‌లో పాల్గొంటారని, అక్టోబర్ 30 నుంచి నవంబర్ 3 వరకు జరిగే టోర్నమెంట్‌లో జేఎన్‌టీయూ జట్టు పాల్గొంటుందని కెమిస్ట్రీ ప్రొఫెసర్ సత్యనారాయణ తెలిపారు. అనంతరం క్రీడాకారులను అభినందించారు. నూతనంగా ఏర్పాటుచేసిన కబడ్డీ మ్యాట్‌పై ఆడటం తమకు ఎంతో సంతోషకరంగా ఉందని క్రీడాకారులు తెలిపారు.

జీడిమెట్లలో నకిలీ డాక్యుమెంట్ల ముఠా గుట్టు రట్టు

- తీగ లాగితే డొంక కదిలిన వైనం

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ డాక్యుమెంట్ల తయారీ ముఠా గుట్టురట్టు అయ్యింది. ఓ కేసులో భాగంగా విచారణ చేపట్టిన జీడిమెట్ల పోలీసులు నకిలీ డాక్యుమెంట్లు తయారు చేసి భూములు కబ్జాలు చేస్తున్న ముఠా సభ్యులను అరెస్టు చేశారు. ఏకంగా బతికున్న వారినే చనిపోయినట్టు మరీ పత్రాలు సృష్టించి అడ్డంగా భూములు కొల్లగొడుతున్న వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. డబ్బు ఆశ చూపి వ్యవస్థలను మేనేజ్ చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్న ముఠా సభ్యులను పోలీసులు కటకటాల వెనక్కి పంపించారు.

నగరవ్యాప్తంగా ఖాళీ స్థలం కనిపిస్తే చాలు అక్రమార్కులు వాటిని కబ్జా చేసేందుకు గద్దల్లా వాలిపోతున్నారు. తాజాగా అలాంటి ఘటన ఒకటి జీడిమెట్లలో వెలుగులోకి వచ్చింది. జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ డాక్యుమెంట్ల దందా వ్యవహారాన్ని పోలీసులు ఛేదించారు. జీడిమెట్ల సుభాష్ నగర్‌లో తమ 200 గజాల స్థలం కబ్జాకు గురైందంటూ సురేశ్ అనే బాధితుడు ఇటీవల జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. కేసు దర్యాప్తులో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. పద్మాజారెడ్డి అనే మహిళ నకిలీ పత్రాలతో స్థలాన్ని కొట్టేసేందుకు పక్కా పథకం వేసినట్లు పోలీసులు తెలిపారు. ఇందులో భాగంగా కరుణాకర్ అనే వ్యక్తి ద్వారా నకిలీ పత్రాలు సృష్టించిందని తెలిపారు. నకిలీ పత్రాల తయారు చేసేందుకు రూ.3.5 లక్షలకు కరుణాకర్ అనే వ్యక్తి పద్మాజారెడ్డితో ఒప్పందం కుదుర్చుకున్నట్లు పోలీసులు తెలిపారు. పథకం ప్రకారం తన ముఠాతో కలిసి కరుణాకర్ డాక్యుమెంట్లు తయారీ చేపట్టినట్లు వెల్లడించారు. భూ యజమాని సురేశ్ 1992లోనే చనిపోయినట్లు ఫేక్ డెత్ సర్టిఫికెట్, లీగల్ హెయిడ్ సర్టిఫికెట్ సృష్టించారని పేర్కొన్నారు. ఆధార్ సెంటర్‌లో పని చేసే హరీశ్ అనే వ్యక్తి సహాయంతో ల్యాండ్ ఓనర్ పేరుతో నకిలీ ఆధార్ తయారు చేయించినట్లు పోలీసులు వెల్లడించారు. అనంతరం వాటి సహాయంతో కుత్బుల్లాపూర్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పద్మాజారెడ్డి తన చెల్లి పేరుతో 200గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించినట్లు తెలిపారు. విచారణలో భాగంగా పూర్తి ఆధారాలతో ముఠా మ్నెత్తాన్ని పట్టుకున్నట్లు వెల్లడించారు. నగరంలో ఎవరైనా భూ కబ్జాలకు పాల్ప డితే కఠిన చర్యలు ఉంటాయని పోలీసులు హెచ్చరించారు.

టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో బతుకమ్మ వేడుకలు..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. టీవీఆర్ మోడల్ హై స్కూల్ అపురూప కాలనీ, సత్యవాణి విద్యానికేతన్ ఎస్ఆర్ నాయక్ నగర్‌లలో టీవీఆర్ గ్రూప్ ఆఫ్ ఏ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టి వంశీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో "ఎంగిలిపూల బతుకమ్మ" పండగ శోభాయ మయంగా నిర్వహించారు. ప్రకృతి ప్రసాదించిన రంగు రంగుల పూలతో అలంకరించి అడవిలో నుంచి ఇంటిలో గౌరమ్మగా పసుపు కుంకుమలతో అలంకరించి సౌభాగ్యాన్ని కుటుంబ సౌఖ్యాన్ని క్షేమంగా చూడాలని అమ్మవారిని కొలిచి పండగ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులు విద్యార్థినిలు వారి మాతృ మూర్తులు (తల్లులు) పాల్గొన్నారు. చిన్నారులు రంగురంగుల పట్టు వస్త్రాలు ధరించి బతకమ్మ పండుగకి శోభను చేకూర్చారు. కోలాటం వంటి ఆటపాటలతో పాఠశాలలు పండుగ వాతావరణం నెలకొంది. టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మెన్ టి.కోటి రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ డా.సురా రవిచంద్ర రెడ్డి, ఉపాధ్యాయి లకు తల్లిదండ్రులకు విద్యార్థిని విద్యార్థుల కు "బతుకమ్మ' దసర "పండగ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఓ జర్నలిస్ట్ యూనియన్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు..



- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇప్పిస్తామంటూ రాష్ట్రవ్యాప్తంగా ఒక జర్నలిస్టు యూనియన్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) తీవ్రంగా ఖండించింది. జర్నలిస్టులను మభ్యపెట్టి పక్కదారి పట్టించేందుకు ఆ యూనియన్ చేస్తున్న చర్యలను ఫెడరేషన్ నాయకులు వ్యతిరేకించారు. యూనియన్ చేస్తున్న అనధికారిక కార్యకలాపాలకు మీడియా అకాడమి చైర్మెన్ మద్దతు ఇవ్వడాన్ని వారు తప్పు పట్టారు. శుక్రవారం సూరారంలోని అంబేద్కర్ భవన్‌లో జరిగిన టీడబ్ల్యూజేఎఫ్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం విస్తృతస్థాయి సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడ సోమయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, కార్యదర్శులు ఎస్.కె. సలీమా, తన్నీరు శ్రీనివాస్ తదితరులు ప్రసంగించారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ.. గత కొద్ది రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఇండ్ల స్థలాల దరఖాస్తుల పేరుతో జర్నలిస్టులను అయోమానికి గురి చేస్తున్నారని, యూనియన్ పేరుతో దరఖాస్తులు తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలన్న ఆలోచన, చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉంటే సమాచార శాఖ ద్వార ప్రక్రియ చేపట్టాలని, లేదంటే అధికారులు, జర్నలిస్టు యూనియన్‌ల ప్రతినిధులు, సీనియర్ పాత్రికేయులతో కమిటీ వేయాలని ఆయన డిమాండ్ చేశారు. మీడియా అకాడమి చేయాల్సిన బాధ్యతలను పక్కన పెట్టి అన్ని పనులు తానే చేస్తామనడం, అందుకు ముఖ్యమంత్రి, మంత్రులు జర్నలిస్టులకు సంబంధించిన అన్ని విషయాలు చైర్మెన్‌కు అప్పగించడం సరైంది కాదని అన్నారు. జర్నలిస్టుల సమస్యల విషయంలో గానీ, మీడియా అకాడమీ నిర్వహణలో గానీ గత ప్రభుత్వంలో జరిగిన తప్పులే ఈ ప్రభుత్వంలో జరగకూడదని, అలా జరిగితే జర్నలిస్టుల ఆగ్రహాన్ని చవి చూడాల్సి వస్తుందని మామిడి సోమయ్య హెచ్చరించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, హైదరాబాద్‌లో ఇప్పటికే ఉన్న జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీలను పరిగణలోకి తీసుకోవాలని, సొసైటీలలో లేని అర్హులైన జర్నలిస్టుల జాబితాను ప్రభుత్వం రూపొందించాలని డిమాండ్ చేశారు. ఇండ్ల స్థలాల విషయంలో ఒక యూనియన్ చేస్తున్న హడావిడి, తప్పుడు ప్రచారాలతో జర్నలిస్టులు ఆందోళ చెందవద్దని ఆయన కోరారు. గత తొమ్మిదిన్నరేండ్లు బీఆర్ఎస్ చేసిన మోసాన్ని చవి చూసిన జర్నలిస్టులు ఇక ఎవరు మోసం చేసినా భరించే పరిస్థితిలో లేరని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనె జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని మామిడి సోమయ్య విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్.కె సలీమా మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యలపై పోరాటం చేసేది టీడబ్ల్యూజేఎఫ్ ఒక సంఘమేనన్నారు. ఎటువంటి ఆటుపోట్లు వచ్చిన నిలబడి తట్టుకునే బలమైన సంఘం మనదేనని తెలిపారు. మీడియా రంగంలో పనిచేస్తున్న ప్రతి జర్నలిస్టుకి అక్రిడేషన్లతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరిని గుర్తించాలని ఆమె డిమాండ్ చేశారు. ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని ఆమె కోరారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో సంఘాన్ని అగ్ర భాగాన నిలపాలని కోరారు. జిల్లాలో ఉన్నటువంటి ఐదు నియోజకవర్గాలలోను నియోజకవర్గ కమిటీలు వేసి నిర్మాణాత్మకంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ మాట్లాడుతూ... వ్యక్తుల కన్నా సంఘం ఎంతో ప్రాధాన్యత కలిగిందని.. ఎప్పటికైనా సంఘం కార్యక్రమాలతో ముందుకు సాగాలని అన్నారు. ప్రతి నియోజకవర్గంలో సంఘాన్ని బోలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో ఫెడరేషన్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అధ్యక్షుడు గడ్డమీది అశోక్, కార్యదర్శి పి.శంకర్, సీనియర్ జర్నలిస్టులు జగదీశ్వర్, కోశాధికారి గోవిందరావు, సంయుక్త కార్యదర్శి శివకుమార్, డప్పు రామస్వామి, సంజీవ్ కుమార్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అందరూ సంతోషంగా ఉండాలి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

శ్రీ దుర్గా మాత ఆశీస్సులతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజులరామారం డివిజన్ ప్రజలందరూ సంతోషంగా ఉండాలని గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు, స్థానిక కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు పురస్కరిం చుకుని గాజులరామారం డివిజన్ పరిధి రావి నారాయణరెడ్డి నగర్ ఈస్ట్, దేవేందర్ నగర్, నరసింహ బస్తీ చివర వీధిలో ఆయా ప్రాంతాల నిర్వాహకులు ఏర్పాటుచేసిన మంటపాల వద్ద శుక్రవారం శ్రీ గాయత్రి దేవి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మికతతోనే ప్రతి మనిషి మానసిక ప్రశాంతత పొందుతారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు శ్రావణ్, సంతోష్, వేణు, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్

నవతెలంగాణ-బాలానగర్

ఒడిషా నుంచి గంజాయిని తెచ్చి నగరంలో విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను బాలానగర్ ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 4.90 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ వేణు కుమార్ తెలిపిన వివరాల ప్రకారం బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు వ్యక్తులు గంజాయి విక్రయాలు చేస్తున్నా రన్న సమాచారం పోలీసులు దృష్టికి వచ్చింది. దాంతో ఎక్సైజ్ పోలీసులు నిఘా పెట్టారు. జగిత్యాల జిల్లాకు చెందిన పడిగల వెంకటేష్, బెడపట్ల తరుణ్‌లు ఒడిషా నుంచి గంజాయి కొని చిన్న, చిన్న చిన్న ప్యాకెట్లలోకి మార్చి విక్రయిస్తున్నారు. ఈ మేరకు పక్కా సమాచారం అందు కున్న ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ వేణు కుమార్ తన సిబ్బందితో కలిసి శుక్రవారం బాలానగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ లోని నిందితుల ఇంటిపై దాడి చేశారు. ఈ మేరకు వారి వద్ద ఉన్న గంజాయిని, రెండు సెల్‌ఫోన్లు, బైకును స్వాధీనం చేసుకుని వారిని అరెస్ట్ చేశారు. నిందితులను పోలీసులు రిమాండుకు తరలించారు.

యూసుఫ్ గూడలో డిజిటల్ సర్వే



నవతెలంగాణ- జూబ్లీహిల్స్.
యూసుఫ్ గూడా డివిజన్ లక్ష్మీనరసింహ నగర్ బస్తీలో డిజిటల్ సర్వేను యూసుఫ్ గూడా సర్కిల్ 19 అధికారులు ఇంటింటికి తిరిగి సేకరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ బాలరాజు, టాక్స్ డిపార్ట్మెంట్ సిబ్బంది పాల్గొన్నారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా సర్వేను సేకరించామని ఏఎంసీ బాలరాజు తెలిపారు.

'సమస్యలను త్వరగా పరిష్కరించాలి'



నవతెలంగాణ-కంటోన్మెంట్
కంటోన్మెంట్ రెండో వార్డు పరిధిలోని సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ బోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మెన్ టీఎన్ శ్రీనివాస్ శుక్రవారం బోర్డ్ సీఈఓ మధుకర్ నాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. పలు రోడ్లు బాగు చేయాలని, మురికి కాలువలను మెరుగుపరచాలని కోరారు. సమస్యలకు సంబంధించిన పలు ఫోటోలను కూడా సీఈవోకు ఆయన చూపించారు సీఈఓ వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

డిప్యూటీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లతో మంత్రి
సమావేశానికి ఏర్పాట్లు చేయండి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో
డిప్యూటీ కలెక్టర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లతో రెవెన్యూ మంత్రి సమావేశానికి అవసరమైన ఏర్పాట్లను త్వరతగతిన ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. ఈ నెల 6న రెవెన్యూ సంబంధిత అంశాలపై చర్చించేందుకు డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి ఇనిస్టిట్యూట్ హైదరాబాద్‌లో రాష్ట్రంలోని డిప్యూటీ కలెక్టర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లతో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సమావేశం కానున్నారు. ఈ క్రమంలో శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి ఇనిస్ట్యూటన్ కలెక్టర్ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఇనిస ్టిట్యూట్‌లోని దాశరథి సమావేశ మీటింగ్ హాల్ సిటింగ్ కెపాసిటీ, లైటింగ్, సౌండ్ సిస్టమ్‌తో పాటు స్టేజ్ బ్యానర్ తదితర ఏర్పాట్లను నిర్దేశించిన సమయానికి పూర్తి చేసి అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. సమావేశం నిర్వహణ రోజున ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనాలు ఏర్పాటు చేసే హాల్స్‌లో ఎక్కడ ఇబ్బందులు కలగకుండా అన్ని చోట్ల గైడ్‌తో పాటు రెవెన్యూ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. అల్పాహారం, భోజనాలు నాణ్యతంగా ఉండాలనీ, సమయానికి అందించాలన్నారు. అన్ని చోట్ల టోకెన్ సిస్టమ్ ఉంచాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటాచారి, ఆర్డీవో దశరథ్ సింగ్, హెచ్ఆర్డీ ఏవో నిర్మల, కలెక్టరేట్ ఏవో సదానందం, తహసీల్దార్లు నయీమొద్దీన్ , అనిత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వచేసిన టపాసుల స్వాధీనం

- రూ.15 లక్షల విలువగల టపాసుల స్వాధీనం
- వ్యాపారీ అరెస్ట్



నవతెలంగాణ-సిటీబ్యూరో
నగరంలో అక్రమంగా నిల్వచేసిన టపాసులను టాస్క్‌ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకుని, వ్యాపారిని అరెస్టు చేశారు. సెంట్రల్‌జోన్ టాస్క్‌ఫోర్సు ఇన్‌స్పెక్టర్ ఎస్.రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు బేగంబజార్‌కు చెందిన శ్యామ్ యాదవ్ ఖేరియావాలే అనే వ్యాపారీ సులువుగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో టపాసులకు డిమాండ్ ఉండడంతో పెద్దఎత్తున వివిధ టపాసులను కొనుగోలు చేశాడు. బేగంబజార్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో రెండు గోదాంలల్లో వాటిని నిల్వచేశాడు. రెసిడెన్షియల్ ఏరియాలో పేలుడు పదార్థాలు ఉంచినట్టు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. విచారణలో ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండానే టపాసులు నిల్వ ఉంచినట్టు తేలిందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

విజయ డైరీ పాల సరఫరాలో జాప్యం..

రోడెక్కిన వ్యాన్స్ డ్రైవర్లు, జిమ్మేదారులు

- 4 రోజులుగా ఇదే తంతు..
- పాల బూత్ ఏజెంట్స్‌తో తిట్లు, నిద్రలేక ప్రమాదాలు : వ్యాన్ డ్రైవర్ల ఆవేదన
- మేఘ డెయిరీ ట్రైల్స్ భాగంగానా..? లేక అధికారుల మధ్య సమన్వయ లోపామా.. ?
- వినియోగదారులు, వెండర్స్ సహకరించాలి : విజయ డెయిరీ చైర్మెన్ గుత్తా అమిత్ రెడ్డి



నవతెలంగాణ-ఓయూ
లాలాపేట్‌లోని విజయ డైరీ ప్రధాన కార్యాలయం నుంచి తమ వ్యాన్‌లలో పాల సరఫరా చేయడం ఆలస్యం అవుతోందని వ్యాన్ డ్రైవర్స్ ఆరోపిస్తున్నారు. దాంతో ఏజెంట్స్‌తో తాము తిట్లు తినాల్సి వస్తున్నదని, అలాగే నిద్రలేక ప్రమాదాలకు గురవుతున్నట్టు వారు ఆవేదన వ్యక్తం చేశారు. లాలాపేట్‌లోని విజయ డైరీ ప్రధాన కార్యాలయం వద్ద గురువారం రాత్రి 2 గంటల నుంచి తెల్లవారు జామున వరకు వ్యాన్ డ్రైవర్లు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయ డైరీ ప్రధాన కార్యాలయం నుంచి నిత్యం గతంలో రాత్రి 10 నుంచి 1 గంటల సమయం వరకు అధికారులు తమ వ్యాన్‌లలో పాల సరఫరా చేసేందుకు లోడ్ చేసే వారని, దాంతో పాలను తాము సకాలంలో సంబంధిత ఏజెంట్స్, పాయింట్స్ వద్దకు చేరుకునే వాళ్ళమని తెలిపారు. కానీ అర్థాంతరంగా గత కొన్ని రోజుల నుంచి తెల్లవారుజామున 3 గంటలు 4 గంటల వరకు వ్యాన్‌లలో లోడ్‌కు సమయం పడుతున్నదని చెప్పారు. దీనిపై అధికారులు దృష్టికి తీసుకు వెళ్లినా ఫలితం లేక పోవడంతో పాలు సరఫరా చేసే చోట్ల బూత్ ఏజెంట్స్‌తో తాము తిట్లు తినాల్సి వస్తున్నదని తెలిపారు. అలాగే పాల లోడ్ కోసం వేచి చూసి వేచి చూసి జాప్యంతో నిద్రలేక ప్రమాదాలకు గురవుతున్నట్టు తెలిపారు. కొందరు పాల బూత్ ఏజెంట్స్ వ్యాన్స్ తాళాలు లాక్కొని, ఇలాగే వస్తే వాహనాలు దగ్ధం చేస్తాం అంటూ హెచ్చరిస్తున్నట్టు డ్రైవర్స్ ,జిమ్మేదారులు, క్లీనర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత ఆలస్యంగా వస్తే కస్టమర్లకు ఏం సమాధానం చెప్పాలని కొందరు బూత్ వారు ప్రశ్నిస్తున్నారన్నారు.

ఆలస్యంగా పాలు వ్యాన్‌లలో లోడు చేయడంతో డ్రైవర్లు శుక్రవారం ఉదయం వాటిని రవాణా చేసేందుకు నిరాకరించారు. దాంతో హైదరాబాద్ నగరంతో పాటుగా భువనగిరి, జహీరాబాద్, రంగారెడ్డి, సిద్దిపేట లాంటి ప్రాంతలకు వెళ్లాల్సిన వ్యాన్‌లు నిలిచిపోయాయి. విషయం తెలుసుకుని సుమారు తెల్లవారు జామున 5 గంటలకు కొందరు డైరీ అధికారులు వచ్చి డ్రైవర్లను బుజ్జగించే ప్రయత్నాలు చేసినా వారు ససేమిరా అన్నారు.

ఇవే కారణాలా ? సమన్వయం ఎక్కడ ?

పూర్తిస్థాయిలో విషయం అరా తీయగా గత 5 రోజుల నుంచి రావీర్యాల లో ఉన్న విజయ మేఘ డైరీ నుంచి కంటెనర్స్ ద్వారా లాలాపేట్‌లోని విజయ డైరీ కి తీసుకురావడంలో తీవ్రమైన జాప్యం జరుగుతోందని డ్రైవర్స్ ఆరోపిస్తున్నారు. కొన్ని రోజులుగా విజయ డైరీ లో "ఫ్రీ ప్యాక్ ప్యాకింగ్" చేయడం లేదని, మిషన్స్ రన్ చేయకుండా మెఘా డైరీ నుండి ట్రైల్స్‌లో భాగంగానే అధికారుల మధ్య సమన్వయం లేక ఇలా జరుగుతుందని తెలిసింది. ఈ విషయంలో డైరీ అధికారుల వివరణ కోరగా వారు స్పందించలేదు.

డెయిరీలో రోజంతా హడావుడి

ఈ ఘటన తో డెయిరీలో శుక్రవారం రోజంతా హడావిడి జరిగింది. 70 వేల లిటర్స్ పాలు నగరంలో విక్రయాలు చేయాల్సిన ఉన్నా ఈ ఘటనతో ఒక్క లీటర్ పాలు కూడా బయటకు పోలేదు. ఇక చైర్మెన్ అమిత్ రెడ్డితో డ్రైవర్స్ మధ్యాహ్నం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఇంటిలిజెన్స్ ,ఎస్బి అధికారులు పూర్తిస్థాయిలో డెయిరీ లో పర్యవేక్షించి పూర్తి స్థాయిలో వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీనికి ప్రధాన కారణం ఇద్దరు జనరల్ మేనేజర్స్ అని డెయిరీలో అధికారులు, ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

వినియోగదారులు, వెండర్స్ సహకరించాలి



రావిర్యాలలో నిర్మాణం చేసిన మేఘ డైరీ ట్రయల్ రన్ చేస్తున్నాము. దానిలో భాగమే గత 2 ,3 రోజులు కాస్త జాప్యం జరుగుతోంది. ఇది తాత్కాలికం మాత్రమే. ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్స్, వెండర్స్, వినియోగదారులు సహకరించలి

– విజయ డెయిరీ చైర్మెన్ అమిత్ రెడ్డి

అభివృద్ధి పనుల్లో ప్రభుత్వం అలసత్వం

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్
- కేఎల్ఎన్ పార్కులో అధికారులతో కలిసి పర్యటించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-బేగంపేట్/జూబ్లీహిల్స్
అభివృద్ధి పనులను చేపట్టడంలో ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నదని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. శుక్రవారం సనత్ నగర్ లోని కేఎల్ఎన్‌వై పార్క్‌లో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ముందుగా వృద్ధాలను తరలించే వాహనా లను జెండా ఊపి ప్రారంభించారు. అదేవిధంగా పార్క్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన డ్రింకింగ్ వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు. పార్క్‌లోని ఓపెన్ జిమ్ పరికరాలు, చిల్డ్రన్స్ పార్క్ లో పరికరాల మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే కోరారు. అదే విధంగా పార్క్ లో కొన్ని లైట్ లు వెలగడం లేదని తెలిపారు. జిమ్ పరికరాల మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. అవసరమైన చోట్ల లైట్ లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా మొరం మట్టితో పాత్ వే ను అభివృద్ధి చేయాలని పలువురు వాకర్స్ చేసిన విజ్ఞప్తి మేరకు అధికారులను అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశిం చారు. పార్క్ లోని టాయిలెట్స్ నిర్వహణ సక్రమంగా ఉండటంలేదని, సులబ్ కాంప్లెక్స్‌ల తరహా లో ప్రయివేటు వ్యక్తులకు నిర్వహణ అప్పగించాలనే ప్రతిపాదనను పలువురు వాకర్స్ ఎమ్మెల్యే దష్టికి తీసుకురాగా, పరిశీలించా లన్నారు. కేఎల్ఎన్ పార్క్ ను తాము ఎంతో అభివద్ధి చేశామని చెప్పారు. నగరంలో ఎక్కడా లేని విధంగా యోగా చేసుకొనే వారికి ఎంతో సౌకర్యవంతంగా ఉండేలా షెడ్డు ను కూడా నిర్మించినట్టు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వివిధ అభివద్ధి పనుల కోసం కోట్లాది రూపాయలను మంజూరు చేసినప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం వాటిని చేపట్టకుండా అలసత్వం ప్రదర్శిస్తుందని విమర్శించారు. ఈఎస్ఐ గ్రేవ్ యార్డ్, కైలాష్ నగర్ లో మల్టి పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి, ఫతే నగర్ ఫ్లై ఓవర్ విస్తరణ, సనత్ నగర్ లోని ఇండస్ట్రియల్ ప్రాంతంలో అండర్ పాస్ నిర్మాణానికి కోట్లాది రూపాయ లను గత ప్రభుత్వం మంజూరు చేసిందని వివరించారు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు దాటినా నేటి వరకు ఆ పనులను చేపట్టకుండా నిర్లక్ష్యం చేస్తుందని పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను పట్టించుకోవడం లేదని, దీపావళి తర్వాత ప్రజాక్షేత్రంలో కి వెళ్ళి అభివద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలన్ లక్ష్మి బాల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ రజనీకాంత్, ఈఈ వెంకటనారాయణ, వాటర్ వర్క్స్ జీఎం హరిశంకర్, హార్టికల్చర్ డీడీ చంద్రశేఖర్, ఏఎంఓహెచ్ చంద్రశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి, పార్క్ అభివద్ధి కమిటీ సభ్యులు శ్రీనివాస్, గోపి, శ్రీనివాస్ గౌడ్, సురేష్ గౌడ్, రాజేష్, ప్రభాకర్ రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్‌ను అభినందించిన ఎమ్మెల్యే

జూబ్లీహిల్స్ సేవా కార్యక్రమాలకు ఎస్ నగర్ సీనియర్ సిటిజన్స్ ఆదర్శంగా నిలుస్తారని, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అభినందించారు. శుక్రవారం సనత్ నగర్ లోని బీకే గూడ ప్రాంతంలో గల సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐరన్ స్టెప్స్‌ను ఆయన ప్రారంభిం చారు. ముందుగా కార్యాలయంలో నిర్వహించిన సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ వయసును సైతం లెక్కపెట్టకుండా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిం చడం అభినందనీయం అన్నారు. సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలకు తన సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. తమకు అన్ని విధాలుగా అండగా ఉంటూ తమను ఎంతగానో ప్రోత్సహిస్తున్న ఎమ్మెల్యేకు కౌన్సిల్ ప్రతినిధులు కతజ్ఞతలు తెలుపుతూ శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ కొలన్ లక్ష్మి బాల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, కౌన్సిల్ అధ్యక్షుడు మాణిక్ రావ్ పాటిల్, ప్రధానకార్యదర్శి యాదగిరి, పార్థసారధి, మాణిక్ రావ్, ఆర్సీ కుమార్, దూబే, సహదేవ్ గౌడ్, మాధవరావు తదితరులు ఉన్నారు.



అధికారులతో డిప్యూటీ మేయర్ సమావేశం



నవతెలంగాణ-ఓయూ
బతుకమ్మ, దసరా నవరాత్రుల సందర్భంగా డివిజన్ లో ఏర్పాట్లపై డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి , ఐఎన్టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్ రెడ్డిలు తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో వివిధ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పండుగల సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ట్రాఫిక్ నిర్వహణ, పారిశుధ్యం, పందిరులు, నీటి సౌకర్యాలు, భద్రత చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు, అవసరమైన చోట్ల పోలీస్ సిబ్బంది, వలంటీర్లను మోహరించనున్నట్లు తెలిపారు. బతుకమ్మ వేడుకలు జరిగే ప్రదేశాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, అన్ని ప్రాంతాల్లో పండుగ ఉత్సాహంగా జరగడా నికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచిం చారు. పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా ఏర్పాటు చేయా లని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులకు స్పందించేం దుకు హెల్ప్‌లైన్ నంబర్లను అందుబాటులో ఉంచాలని, ఎలాంటి అపాయాలు సంభవించకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సుభాష్, శానిటేషన్ డీ ఈ వెంకటేష్, ఇంజిరింగ్ డిప్యూటీ ఇంజనీర్ సువర్ణ, ఏ ఈ వేణు, ఎంటమాలజీ ఏ ఈ రాజశేఖర్, ఎలక్ట్రికల్ ఏ ఈ శ్రీకాంత్, హెచ్ఎండబ్ల్యూఎస్-ఎస్ఆర్బీ ఏఈ నికిత, టీఎస్ఎస్‌పీడీసీఎల్ మధుసూదన్, ఎస్ఎఫ్ఏ లు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగించుకోవాలి : జక్కుల మహేశ్వర్ రెడ్డి



నవతెలంగాణ-కంటోన్మెంట్
పొదుపు సంఘాలు పొందిన రుణాలను సద్వినియోగించుకోవాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం బోయిన్‌పల్లి బాపూజీ నగర్‌లో భవాని పొదుపు సంఘానికి కెనరా బ్యాంక్ ద్వారా మంజూరైన రూ. పది లక్షల నగదును ఆయన అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొదుపు సంఘాల ద్వారా రుణం పొందిన మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచిం చారు. గతంలో ఎన్నో మహిళా పొదుపు సంఘాలు సద్వినియోగం చేసుకున్నారని, వారిలో ప్రస్తుతం ఆర్థికంగా స్థిరపడిన వారు కూడా ఉన్నారని వివరించారు పట్టుదల తో పని చేసుకుంటే ఆర్థికంగా ఎదగవచ్చు అన్నారు. ఈ సందర్భంగా పొదుపు సంఘం వారు మహేశ్వర్ రెడ్డికి కతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో పద్మ, సౌజన్య, సావిత్రి తో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు

ఓయూలో ఎన్ఎస్ఎస్ ప్రీ ఆర్డీ ఎంపిక



నవతెలంగాణ-ఓయూ
వెస్ట్ జోన్ ఎన్ఎస్ఎస్ ప్రీ ఆర్డీ ఎంపికలు శుక్రవారం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రారంభమయ్యాయి. ఓయూ నుంచి 50 మంది వాలంటీర్లు, ప్రొఫెసర్ జైశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ నుంచి 9 మంది ఈ కార్యక్ర మానికి హాజరయ్యారు. రిజిస్ట్రేషన్ల అనంతరం ఓయూ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ప్రో.సవిన్ సౌదా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను ఉద్దేశించి మాట్లాడారు. హైదరాబాద్‌లోని ప్రాంతీయ డైరెక్టరేట్‌లోని యువజన అధికారి సైదా నాయక్ ఎంపిక మార్గదర్శకాల గురించి వాలంటీర్లకు దిశానిర్దేశం చేశారు. మొదటి రౌండ్‌లో ఎత్తును తనిఖీ చేశారు. రన్నింగ్, పరేడ్ ప్రాక్టీస్ చేశారు. చివరి రౌండ్ సాంస్కృతిక, ఇంటర్వ్యూ తెలంగాణ ప్రభుత్వ సచివాలయం రాష్ట్ర ఎన్ఎస్ఎస్ సెల్ నుండి నరసింహులు గౌడ్ హాజరయ్యారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు పాల్గొన్నారు. కళాశాలలు అపర్ణా రాజాన్స్, సెయింట్ జోసెఫ్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల, డాక్టర్ శోభా రాణి, ప్రగతి మహావిద్యా లయం, డాక్టర్ రాధా రాణి, ఎంజేపీటీబీసీడబ్ల్యూ ఆర వార్గల్, డాక్టర్ జగన్, మల్కాజిగిరి, డాక్టర్ జజ్జీశ్వర, తారా ప్రభుత్వ కళాశాల, డాక్టర్ భాస్కర్ రెడ్డి, గజ్వేల్, డాక్టర్ వెంకటేశ్వరులు, నిజాం కళాశాల, బి. శ్రీధర్, అంబేద్కర్ కళాశాల డాక్టర్ ఎ. మీనా, పీ. జేటీఏయూ ఎంపిక ప్రక్రియలో పాల్గొన్నారు. చివరగా ఓయూ నుంచి మొత్తం ఆరుగురు వాలంటీర్లు, ప్రొఫెసర్ జైశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ నుచంచి ఇద్దరు, ఒక యువతి పాల్గొన్నారు.

బోరబండలో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



నవతెలంగాణ- జూబ్లీహిల్స్
బోరబండ బస్ స్టాప్ నుంచి పిల్లి దర్గా వరకు ప్రధాన రోడ్డుకు ఇరువైపులా రోడ్డు స్థలాన్ని, ఫుట్‌పాత్‌లను ఆక్రమిం చి రేకుల షెడ్లు, డబ్బాలు, టీ దుకాణాలు నిర్వహిస్తున్న ఆక్రమ ణలను శుక్రవారం తొలగిం చారు. జీహెచ్ఎంసీ సర్కిల్ 19 టౌన్ ప్లానింగ్ అధికారులు జేసీబీ యంత్రంతో సిబ్బందితో వెళ్లి బోరబండ పోలీసులతో కలిసి ఉదయం నుంచి సాయంత్రం వరకు పూర్తిగా ఆక్రమణలను తొలగించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ కష్ణవేణి ,సెక్షన్ ఆఫీసర్ నరేష్ , ఎస్ఏసీ ఇంజినీర్ అభినవ్, సిబ్బంది పాల్గొన్నారు. బోరబండ ఇన్‌స్పెక్టర్ రవిశేఖర్ ,సబ్ ఇన్‌స్పెక్టర్లు సిబ్బంది పాల్గొని ఎలాంటి గొడవలు జరగకుండా, ఆక్రమణదారులు అధికారులకు అడ్డు రాకుండా భద్రత ఏర్పాట్లు చేశారు.

సంస్కృత అకాడమీ నూతన సంచాలకులుగా పెన్నా మధుసూదన్



నవతెలంగాణ-ఓయూ
నల్గొండ జిల్లా నార్కట్ పల్లికి చెందిన ప్రొఫెసర్ పెన్నా మధుసూదన్ సంస్కృత అకాడమీ నూతన సంచాలకులుగా శుక్రవారం బాధ్యత స్వీకరించారు. ఈ సందర్భం గా ఇప్పటివరకు డైరెక్టర్‌గా ఉన్న ఆచార్య నీలకంఠం మాట్లాడుతూ నాగపూర్ లోని కాళిదాస సంస్కృత విశ్వవిద్యాలయంలో పలు ఉన్నతపదవులు నిర్వహించిన పెన్నా మధుసూదన్ అనేక కావ్యాలు రచించారని తెలిపారు. వాచస్పతి, శాస్త్రరత్నాకర ఇత్యాది వివిధ పురస్కారాలతో పాటు కేంద్రీయసాహిత్య అకాడమీ అవార్డును కూడా పొందిన గొప్ప విద్వాంసుడని, ఆయన అకాడమీ డైరెక్టర్ గా రావడం చాలా ఆనందదాయకం అని అన్నారు. ఆచార్య పెన్నా మధుసూదన్ సారథ్యంలో అకాడమీ ఇంకా ఉన్నతమైన స్థానం పొందుతుందని, ఒక ప్రఖ్యాత విద్వాంసుడిని అకాడమీ డైరెక్టర్ స్థానంలో నియమించినందుకు కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య శ్రీనివాస వర్ఖేడికి కృతజ్ఞతలు తెలిపారు. గొప్ప గొప్ప విద్వాంసులు సంచాలకులుగా పని చేసిన ఈ స్థానం లో తాను నియమితులవ్వడం అదృష్టంగా భావిస్తున్నానని ప్రొఫెసర్ మధుసూదన్ అన్నారు.

ఓయూలో బతుకమ్మ సంబరాలు..





నవతెలంగాణ-ఓయూ
ఓయూ ఇంజినీరింగ్ కళాశాల టీచింగ్ నాన్ టీచింగ్, విద్యార్థుల ఆధ్వర్యంలో శుక్రవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ ప్రో.పైడిమర్రి. చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర సంస్కృతి ,సంప్రదాయలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇంజినీరింగ్ కళాశాలలో విద్యా ,సంస్కృతి క్రీడలకు, పరిశోధనకు పెద్దపీటం వేస్తామని చెప్పారు. పలువురు విద్యార్థులు, ప్రొఫెసర్స్ , ఉద్యోగులు వారి వారి కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ సంబరాల్లో చురుగ్గా పాల్గొన్నారు. అనంతరం భక్తి శ్రద్ధలతో బతుకమ్మను నిమజ్జనం చేశారు.

ఓయూ ఈఈఈ విభాగంలో బతుకమ్మ సంబరాలు.

ఓయూ ఇంజినీరింగ్ కళాశాలలోని ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ 75 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా తెలంగాణ ప్రజల ఆత్మగౌరవంగా జరుపుకునే బతుకమ్మ పండుగను డిపార్ట్మెంట్ హెడ్ ప్రొఫెసర్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో విభాగం ఎదుట ఘనంగా నిర్వహించారు ఈ పండుగలో ప్రొఫెసర్లు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రొఫెసర్లు యూజీసీ డీన్ ప్రో.జి.మల్లేశం, ప్రో. మంగు, డాక్టర్ శిరీష, డాక్టర్ శుశీల,ప్రో. ఏసు రత్నం , డాక్టర్ విజేందర్ రెడ్డి, డాక్టర్ శ్రీలత, డాక్టర్ రామారావు, విద్యార్థులు, ఉద్యోగులు విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజ్ వాది పార్టీ 32వ ఆవిర్భావ వేడుకలు

- 300 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ



నవతెలంగాణ - బంజారాహిల్స్
సమాజ్‌వాది పార్టీ 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం జూబ్లీహిల్స్‌లో ఘనంగా నిర్వహించారు. పార్టీ గ్రేటర్ హైదరాబాద్ నేత దండు బోయిన నిత్య కళ్యాణ్ యాదవ్ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని దుర్గా భవాని నగర్ బస్తీలో 300 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావ దినోత్సవంతో పాటు దసరా పండుగ నేపథ్యంలో పేదల మధ్య వేడుకలు జరుపుకోవాలని ఉద్దేశంతో పేద మహిళలకు చీరలు పంపిణీ చేపట్టినట్టు తెలిపారు. జీహెచ్ఎంసీ ఎన్నికల నాటికి పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. తెలంగాణలో రాజ్యాధికారం లక్ష్యంగా పనిచేస్తామన్నారు. త్వరలోనే నగరా వ్యాప్తంగా మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఇటీవలే జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో సమాజ్ వాదీ పార్టీ జాతీయ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ ఏ విధంగా అయితే విజయదుందిభి మోగించారో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కూడా అదే తరహాలో విజయాన్ని నమోదు చేసి సీఎంగా అఖిలేష్ యాదవ్ ప్రమాణస్వీకారం చేస్తారని ఆకాంక్షించారు. తెలంగాణ మాదిగ దండోరా ఫౌండర్ ప్రెసిడెంట్ నర్సింగ్ రావు,బస్తీ నేత శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వివాహానికి హాజరు కావాలని కేసీఆర్‌కు ఆహ్వానం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఈ నెల 27వ తేదీన తన కుమార్తె మర్రి శ్రేయారెడ్డి, ఆదిత్యారెడ్డిల వివాహానికి హాజరై నూతన వధూవరు లను ఆశీర్వదించాలని మాజీ సీఎం కేసీఆర్‌కు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, మర్రి మమతారెడ్డి దంపతులు వివాహ ఆహ్వాన పత్రికను మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డితో కలిసి అందజేశారు.



తెలంగాణ సాహితి డీవైఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 2 రోజుల పాటు నిర్వహిస్తున్న ఫెస్ట్‌లో డ్యాన్సులతో అలరించిన చిన్నారులు.

'రవాణా' అర్ధ వార్షికాదాయం రూ. 3,195కోట్లు

- దానిలో 45 శాతం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచే..
- రూ.1,436 కోట్లు సాధించాం : ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉప రవాణా కమిషనర్ మామిండ్ల చంద్ర శేఖర్ గౌడ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

రవాణాశాఖ రాష్ట్రవ్యాప్తంగా రవాణాశాఖ అర్ధ వార్షిక ఆదాయం రూ.3195కోట్లు సాధించగా.. అందులో 45శాతం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచే వసూలైంది. ఉమ్మడి రంగారెడ్డిలోని రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్ జిల్లాలు సంయుక్తంగా రూ.1,436 కోట్లు ఆదాయాన్ని సాధించాయని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉపరవాణా కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం మూడు జిల్లాల రవాణా అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ గౌడ్ మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా రూ.802 కోట్లు, మేడ్చల్-మల్కాజిగిరి రూ.595 కోట్లు, వికారాబాద్ రూ.39 కోట్లు కలిపి మొత్తం రూ.1,436 కోట్ల ఆదాయం సాధించామన్నారు. రాష్ట్ర ఆదాయం రూ.3,195 కోట్లలో.. 45 శాతం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాదేనని ఆయన తెలిపారు. కాగా మొత్తం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అర్ధ వార్షిక ఆదాయ లక్ష్యం రూ. 1,792 కోట్లకు 1,436 కోట్లతో 80శాతం ఆదాయ లక్ష్యాన్ని సాధించినట్టు చంద్రశేఖర్ గౌడ్ వివరించారు.

వివిధ పన్నుల రూపంలో ఇలా..

ఇదిలావుంటే త్రైమాసిక పన్నుల ద్వారా రూ. 161 కోట్లు, జీవిత కాలపు పన్నుల ద్వారా రూ.1,120 కోట్లు, ఫీజుల ద్వారా రూ.92 కోట్లు సర్వీస్ చార్జీల ద్వారా రూ.21 కోట్లు, గ్రీన్ టాక్స్‌ల ద్వారా రూ.10 కోట్లు, తనిఖీల ద్వారా రూ.32 కోట్లతో మొత్తం ఇలా.. 1,436 కోట్ల ఆదాయాన్ని సాధించినట్టు డీటీసీ చంద్ర శేఖర్ గౌడ్ తెలిపారు.

ఓవర్ లోడ్ వాహనాలపై ప్రత్యేక డ్రైవ్

త్రైమాసిక పన్నులు చెల్లించని వాహనదారులు వెంటనే పన్నులు చెల్లించాలని, లేనిపక్షంలో అధికారుల తనిఖీల్లో పట్టుబడితే వాహనాలను సీజ్ చేయడంతో పాటు భారీ జరిమానా విధిస్తామని చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. ఓవర్ లోడ్‌తో తిరిగే వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం నిర్దేశించిన ఆదాయ లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు. ఈ సమీక్షా సమావేశంలో వివిధ జిల్లాల రవాణా శాఖ అధికారులు సుభాష్ చందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కిరణ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, సుశీల్ రెడ్డి, నవీన్, వాసు, కృష్ణవేణి, మున్ని, అనూష, ఉపాసిని తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం.. ఉపాధ్యాయుల సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీ చేసిన హైదరాబాద్ జిల్లా కలెక్టర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన బండ్లగూడ -2 మండలం చంద్రికపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎస్జీటీ ఉపాధ్యాయులు వి. పీక్ లాల్, పి. వెంకట్ రెడ్డిలపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఉత్తర్వులు జారీచేశారు. చంద్రికాపూర్ పాఠశాల నిర్వహణ, ఉపాధ్యాయులపై పలు ఫిర్యాదుల నేపథ్యంలో గత నెల 29న డీఈవో రోహిణీ సదరు పాఠశాలను తనిఖీ చేశారు. ఆ తనిఖీ సమయంలో పాఠశా లలోని ఇద్దరు ఉపాధ్యాయులు కె. వెంకట్ రెడ్డి, పి.పిక్ లాల్‌లలో ఒక్కరే పాఠశాలలో ఉండటాన్ని, మరో ఉపాధ్యాయుడు వెంకట్ రెడ్డి గైర్హాజరులో ఉన్నట్టు గుర్తించారు. దాంతో పాటు మండల డిప్యూటీ ఐవోఎస్ తనిఖీ టైంలో ప్రతిసారి ఈ ఇద్దరిలో ఒక్కరే పాఠశాలకు హాజరవుతున్నట్టు గమనించారు. లక్షల్లో జీతాలు తీసుకుంటూ.. బడికి డుమ్మకొట్టడమే కాకుండా ఎఫ్ఆర్ఎస్‌లో హాజరు అస్తవస్త్యంగా ఉండడంతో పాటు అన్ని రిజిస్టర్ రికార్డులు నిర్లక్ష్యంగా నిర్వహిస్తున్నందుకు డీఈవో ఆగ్రహం వ్యక్తం చేసి.. క్రమశిక్షణరాహిత్యం కింద ఆ ఇద్దరికి షోకాజు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. అనంతరం సదరు రికార్డులన్నీ సీజ్ చేసి తదుపరి క్రమశిక్షణ చర్యలకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి నోటీస్‌లోకి తీసుకెళ్లారు. డీఈవో నివేదిక, రికార్డుల పరిశీలన ఆధారంగా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన సదరు ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ.. శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.



మహంకాళి ఆలయంలో కోట నీలిమ పూజలు

నవతెలంగాణ-బేగంపేట

సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గజలక్ష్మి దేవి అవతారంలో అమ్మవారిని కాంగ్రెస్ సనత్ నగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి కోట నీలిమ శుక్రవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, వారికి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని అమ్మవారిని వేడుకున్నట్టు తెలిపారు. ఏ బ్లాక్ అధ్యక్షుడు త్రికాల మనోజ్ కుమార్, బద్రి యాదవ్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు

బతుకమ్మ ఉత్సవాలలో కవయిత్రులు సమ్మేళనం







నవతెలంగాణ-కల్చరల్

భాషా సాంస్కృతిక శాఖ సంగీత నాటక అకాడమీ నిర్వహణలో భాగంగా శుక్రవారం రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై సాహిత్య అకాడెమీ అధ్యర్యం కవయిత్రులు సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సంగీత నాటక అకాడమీ ఛైర్మన్ డాక్టర్ అలేఖ్య పాల్గొని మాట్లాడుతూ బతుకమ్మ పండుగ మహిళలకు ప్రత్యేక వేడుక అన్నారు. జాన పద పాటలు నృత్యాలతో గ్రామీణ ప్రాంతాలలో స్త్రీలు జరుపుకుంటారని వీరికి సంగీతం నృత్యంలో ప్రత్యేక శిక్షణ అవసరం లేదని సహజమైన ప్రతిభ వారిదన్నారు కార్యక్రమాన్ని రూపొందించిన సాహిత్య అకాడెమీ కార్యదర్శి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ రాష్ట్ర సాధనలో క్రియాశీలక పాత్ర నిర్వహించింది అన్నారు తెలంగాణ ప్రాంత సంస్కృతికి ప్రతిబింబంగా బతుకమ్మ పండుగ అని చెప్పారు భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ కవయిత్రులుకు తమ అభినందన తెలిపారు. అనంతరం 50 మంది కవయిత్రులు తమ స్వీయ కవితలు చదివారు వీరిలో డాక్టర్ తిరునగరి దేవకీ దేవి, సంధ్యా విష్ణువ్, బండారు విజయ, నెల్లుట్ల రామా దేవి రావూరి వనజ, ఝాన్సీ ముదుంబై తదితరులు వున్నారు

టీజీఎస్ ఆర్టీసీ సికింద్రాబాద్ రీజియన్‌లో 85 కారుణ్య నియామకాలు

- నియామక పత్రాలను అందజేసిన ఆర్ఎం ఖుష్రోషా ఖాన్



నవతెలంగాణ-సిటీబ్యూరో

టీజీఎస్ ఆర్టీసీలో పని చేస్తూ.. విధి నిర్వహణలో మరణించిన సిబ్బంది వారసులకు కారుణ్య నియామకాల కింద కండక్టర్ పోస్టులను భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ప్రభుత్వ ఆదేశాల మేరకు టీజీఎస్ ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు. బ్రెడ్ విన్నర్ (కారుణ్య నియామకాలు), మెడికల్ ఇన్‌వాలిడేషన్ స్కీమ్ కింద ఉద్యోగుల జీవిత భాగస్వామి, పిల్లలకు ప్రత్యామ్నాయ ఉపాధిని అందించడానికి వారి విద్యార్హత ప్రకారం ఉద్యోగాలు కల్పిస్తుంది. ఈ మేరకు శుక్రవారం జేబీఎస్‌లోని ఆర్ఎం కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో టీజీఎస్ఆర్టీసీ సికింద్రాబాద్ రీజియన్ పరిధిలో 69 మంది కండక్టర్లకు, మెడికల్ ఇన్‌వాలిడేషన్ స్కీం కింద 16 మందికి కలిపి మొత్తం 85 మంది కండక్టర్ల నియామకాలు పత్రాలను అందజేయడంతో పాటు రీజియన్ పరిధిలోని వివిధ డిపోలకు వారిని కేటాయించినట్టు సికింద్రాబాద్ రీజనల్ మేనేజర్(ఆర్ఎం) ఖుష్రోషా ఖాన్ తెలిపారు.



తెలంగాణ సాహితి డీవైఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 2 రోజుల పాటు నిర్వహిస్తున్న ఫెస్ట్‌లో నాట్యం చేస్తున్న చిన్నారి.
నవతెలంగాణ-సిటీబ్యూరో

IN THE COURT OF THE HON'BLE I ADDITIONAL DISTRICT JUDGE MEDCHAL-MALKAJGIRI, AT: KUSHAIGUDA
M.V.O.P NO.16 OF 2023

Between:
A.Sunil Kumar .... Petitioner
AND
Mohammad Nasser & another ...Respondents

NOTICE

Mohammad Naseer, S/o MD Nijamuddin Gimiwala, Residing at: H.No.7-1-48/A, Matha Aravind Colony, Chengicherla, Medchal-Malkajgiri Dist, Telangana-500092. Ph.No: 8341156355.

Please take notice that the Petitioner filed above M.V.O.P No. 16 of 2023 for compensation. The above matter is posted on 18/10/2024 for your appearance. Therefore, you are hereby requested to appear before the Hon'ble I Additional District Judge, Medchal-Malkajgiri District at Kushaiguda **on 18/10/2024 at 10.30 a.m.**, in Person or by an Advocate duly instructed failing which the matter will be heard and determined in accordance with law.

//By order of the court//
M/s RADHICAL GLOBAL ATTORNEYS
P. RADHIKA SHARMA
ADVOCATES & ASSOCIATES
HIGH COURT OF TELANGANA
#7, 2-2-16, Near Uppal Metro Station, Uppal, Medchal-Malkajgiri District TS - 500 039
Cell: 8019600006 & 8247499300

IN THE COURT OF HON'BLE I ADDL JUNIOR CIVIL JUDGE-CUM- VII ADDL. JUDICIAL MAGISTRATE OF FIRST CLASS: RANGA REDDY DISTRICT AT: HAYATHNAGAR.
I.A.NO.722 OF 2021 IN O.S.NO.350 OF 2021

Between:
Alimineti Janga Reddy ...Petitioner/Plaintiff
A N D
Alimineti Laxmamma & others ...Respondents/Defendants

To,
1)Alimineti Laxmamma W/o.late Narsimha Reddy, Aged 70 yrs,
2)Alimineti Niranjan Reddy @ Bal Reddy S/o late Narsimha Reddy, Aged 53 yrs
3)Alimineti Ashok Reddy S/o.late Narsimha Reddy, Aged 51 yrs,
4)Alimineti Panduranga Reddy S/o.late Narsimha Reddy, Aged 49 years,
5)Alimineti Kavitha D/o.late Narsimha Reddy, Aged 45 years,
All are Occ. Business R/o. H.no. 17-2-678, Madannapet, Saidabad, Hyderabad ...Respondents/ Defendants no.1 to 5

Whereas the above named Petitioner/Plaintiff has instituted the above petition U/o 39 R.1 & 2 against you. You are hereby summoned to appear in person or through an Advocate duly instructed and able to answer all material questions relating to the suit **on the 21-10-2024, at 10-30 A.M.** Take notice in default of your appearance and to file written statement and counter the suit & I.A will be heard and determined in your absence.

(BY ORDER OF THE COURT)
V. Dharma Raju
Advocate
Plot no.61, Road no.4
Sri Srinivasapuram Colony
Vanastalipuram Hyderabad
Mobile: 9553999909

IN THE COURT OF HON'BLE I ADDL JUNIOR CIVIL JUDGE-CUM- VII ADDL. JUDICIAL MAGISTRATE OF FIRST CLASS: RANGA REDDY DISTRICT AT: HAYATHNAGAR.
O.S.No.350 OF 2021

Between:
Alimineti Janga Reddy ... Plaintiff
A N D
Alimineti Laxmamma & others ...Defendants

TO,
1)Alimineti Laxmamma W/o.late Narsimha Reddy, Aged 70 yrs,
2)Alimineti Niranjan Reddy @ Bal Reddy S/o late Narsimha Reddy, Aged 53 yrs
3)Alimineti Ashok Reddy S/o.late Narsimha Reddy, Aged 51 yrs,
4)Alimineti Panduranga Reddy S/o.late Narsimha Reddy, Aged 49yrs,
5)Alimineti Kavitha D/o.late Narsimha Reddy, Aged 45 yrs,
All are Occ. Business R/o. H.no. 17-2-678, Madannapet, Saidabad, Hyderabad ...Defendants no. 1 to 5

Whereas the above named Plaintiff has instituted the above suit for the cancellation of Regd.gift settlement deed no.14432/2004 dt.31-12-2004 against you. You are hereby summoned to appear in person or through an Advocate duly instructed and able to answer all material questions relating to the suit **on the 21-10-2024, at 10-30 A.M.** Take notice in default of your appearance and to file written statement the suit will be heard and determined in your absence.

(BY ORDER OF THE COURT)
V.Dharma Raju
Advocate
Plot no.61, Road no.4
Sri Srinivasapuram Colony
Vanastalipuram Hyderabad
Mobile: 9553999909

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE AT: JAYASHANKAR BHUPALPALLY
HMOP 49 of 2023

Between:
Markandi @Gangineni Ramadevi, ...Plaintiffs/Petitioner
AND
Markandi Narsing Rao ...Respondents/ Defendant

NOTICE

where as the above named plaintiff have filed a Hmop for divorce. the case is posted **on 09-10-2024** for your appearance **at 10.30.A.M** before the Said court. therefore you are the hear by directed to appear before the said court if any otherwise the matter will be decide acording with law

//By Order of the court//
SD/-
CHEERLA ASHOK REDDY
ADVOCATE
Cell: 9849109050

In the court of the Hon'ble mact cum XII Addl.Chief Judge.City civil Court, At: Secunderabad.
MV OP.NO. 95 of 2023

Between:
Musukula Kirankumar S/o. M.Raghavareddy 35yrs, Pvt. employee, F.No.101, Plot No.86/C Eshwaripuri colony, sainikpuri, sec'bad-094 ...Petitioner.
And
V.Krishna Chava and others ...Respondents

To:
Mohan Boini s/o B.Narsimha, aged 38 yrs, occ: Driver r/o 29-913, Vinayaknagar, Old Safilguda, Mechal Malkajgiri Dist.at Malkajgiri ...Respondent No.2.

Please take notice that the above-named Petitioner filed the above MVOP for claiming compensation of Rs.1,50,000/- together with interestand costs, due to damage of his four wheeler Car bearing No. TS09 EU 3989 in the accident occured on 06.10.2022 nnear Swamy Vivekananda Matam, Eswaripuri colony, Sainikpuri-94 , due to rash and negligent driving of you. The said OP stands posted **to 23.10.2024** for your appearence **at 10.30 a.m.** before the said court either in person or through your Advocate,. If you fail to appear before the said court on the date and time mentioned above, the matter will be heard and decided exparte)

(By order of the court).
N.Venkata Reddy
S.David Raju
Advocates,
H.No.12-5-49/2, F.No.118, Padmadham Apts, Vijayapuri colony Tarnaka, Secunderabad-500017 TS Sec'bad,
Cell No. 94404 11313

IN THE COURTOF JUNIOR CIVIL JUDGE CUM ADDITIONAL MAGISTRATE OF FIRST CLASS, RANGA REDDY DIST, AT AMANGAL
O.S. NO. 1097 OF 2022

Between:
Shabana Begum W/o Mr.Mujeeb Khan, Aged years, Occ: Housewife, R/o HNo. 23-6-324, Moghalpura, Sultan Shahi, Hyderabad ...Plaintiff
And
1.. Farooq Ashraf S/o not known to plaintiff, C/o M/s Maleka Furnitures, Age: Major H.No. 23-2-214/2, Near Volta Hotel, Moghalpura, Hyderabad 2. Maleka Colony Phase-6 represented by its Proprietor Farooq Ashraf, R/o M/s Maleka Furnitures, Age: Major H.No. 23-2-214/2, Near Volta Hotel, Moghalpura, Hyderabad ....Defendants

Please take notice that the above suit is filed against you for specific performance and for other reliefs, against you, In respect of suit schedule property. All that Plot No. 49 admeasuring 200 sq yards in Sy No. 226, 107, 108, 109, Maleka Colony PHASE-6 situated at Mudwin Sevara, Yekkuva Pally (V), Karkarl Pahad, Amangal (M), MBNR Dist and bounded by: NORTH: 20 ft wide Road, SOUTH: Plot No. 4, EAST Plot No.48 WEST: Plot No. 50 and same is posted to 15-=10-2024 for your appearance. If you fail to appear either in person or through your counsel, the matter will be decided in your absence on merit.

// BY ORDER OF THE COURT/
A.UDAY BHASKAR GOPALRAO
PATIL SUNIL KULKARNI
Advocates
(M) 9347000298 Flat No202, Swagrugha, Sri Laxmi, Apts,2-2-1105/4/2, Tilak Nagar, Hyderabad.

IN THE HON'BLE COURT OF THE VI ADDITIONAL JUDGE: MEDCHAL-MALKAJGIRI DISTRICT: AT KUKATPALLY
O.S.No.1172 OF 2015

Between:-
1.Sheikh Jeelani Basha
S/o. S.G.Dasthagiri, A/o.45 Years
2. Zainabee, W/o. Abdul Saleem,
A/o.61 years, Both are R/o.Flat No.G1, Rishi Residency, Plot Nos.290 & 291, Tejasvinagar Colony, Attapur, Hyderabad-48 **.... Plaintiffs**
And
1.Lt.Col.Nandika Suhasini Reddy, W/o.J.K.dhya, A/o. 48 Years Occ: Classified Aviation Specialist, 23(1) R & O Flt, C/o.55 APO, Pin-925423.
2. M/s.Mark Constructions
Rep.by its Managing Director-K.J.Rajesh, S/o.Prabhudas, A/o.49 Years, Having its Office at-Plot No.24, Flat No.G-1,Happy Homes Appartments,Masjidbanda, Kondapur, Hyderabad. **...Defendants**

The above named Plaintiffs have filed the above Original Suit bearing O.S.No. 1172 OF 2015 on the file of the HON'BLE COURT OF THE VI ADDITIONAL JUDGE: MEDCHAL-MALKAJGIRI DISTRICT: AT KUKATPALLY, for Specific Performance of the Agreement . Please take notice that the above O.S. is stands posted to 22-10-2024 for the appearance of Defendant No1 and in case of default to appear in person or through Counsel, the above suit will be heard and determined accordingly.

(BY ORDER OF THE HON'BLE COURT)
Sd/- ADAPA LAKSHMI KANTAM
M.A., M.L., P.G.D.H.R, ADVOCATE
Head Office: House No. 1-2-213/1, MCH Ward Office Lane, Domalguda, Hyderabad- 500029.
Branch Office: MIG- 641, Dwarakamayee, K.P.H.B. Colony, Kukatpally, Hyderabad-500072.
Phone : + 91-9701000555, + 91-9848822636,
Mail : lakshmikantamlawfirms@gmail.com

IN THE COURT OF THE HONBLE XXI JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURTS AT: HYDERABAD
O.S.NO: 4670 OF 2024

Between:
1.Mr.Andola Srinivas, S/o Andola Satyanarayana, Age 54 yrs Occ Pvt Empl,
2.Mr.Andola Sai Shiv Raj, S/o Andola Srinivas, Age 29 yrs Occ: Pvt Empl,
3.Mr.Andola Sai Shubam, S/o Andola Srinivas, Age 27 yrs Occ: Student,
4.Mr.Andola Sirish, S/o Andola Srinivas, Age 24 yrs Occ Student,
All are R/o 8-2-674/1/1/A, Road No-13A, Banjara Hills,Khairatabad, Hyderabad. ...Plaintiff
AND
1.The Tahsildhar [M.R.O] Khairtabad Mandal, Hyderabad.
2.All others Concerned ...Defendants

To:- All others Concerned

This is to bring to your notice that the above-named Plaintiffs has filed Suit for Declaration to Declare him as the legal Heirs of the deceased Late Smt.Andola Vara Laksmi, who died on 15-06-2023, vide O.S.No.4670 of 2024, on the file of The XXI Junior Civil Judge, City Civil Courts At: Hyderabad, and the matter is posted **on 04-11-2024.** It is hereby informed those having any claims/ objection, may bring them before the court on above mentioned date failing which the matter will be heard exparte.

Sd/-
THOMAS LLOYD
GAURAV KWATRA
SHAIK ATHAR PARVEZ
MOHD IRFAN
5-9-314/1, First Floor, St.Joseph Cathedral, Gunfoundry, Hyderabad-1, ©9849179263

IN THE COURT OF THE HON'BLE MACT CUM XXIV ADDL. CHIEF JUDGE, CITY CIVIL COURT: AT HYDERABAD.
O.P.NO. 920 OF 2022

BETWEEN:-
P. Navaneetha @ P. avaneetham ...Petitioner
AND
Bharadwaj P.V.L. &another ... Respondents

To,
R1. Bharadwaj P.V.L. S/o P.V.S.R.A. Swamy, aged about 41 years, Occ:Driver cum Owner of Mahindra Y Jailo bearing No.AP-10BF-6859, R/o Flat No.G6, Evenue Apartments, Road No.14, Banjara Hills, Hyd - 500094.

That the above named petitioner filed the above OP for claiming compensation against you for the injuries sustained by the petitioner in a Motor Accident, occurred on **04-12-2015,** under the jurisdiction of P.S. Kothakota, Mahabubnagar District (now Wanaparthy District) and the said OP is now posted to **10-10-2024** for your appearance. Therefore you may appear before the Hon'ble Court on the date mentioned above at 10-30 AM either in person or through an advocate, failing which, the matter will be decided in your absence as per law.

"BY THE ORDER OF THE COURT"
P. GIRIVARDHAN REDDY,
Advocate,
H.No. 4-31, Flat No.201, Hanuman Swathi Plaza, Vikasnagar, Dilsukhnagar, Hyderabad – 500060.

IN THE COURT OF THE HON'BLE III ADDITIONAL CHIEF JUDGE : CITY CIVIL COURT: AT: HYDERABAD.
O.S No. 430 OF 2024

Between
Smt. K. Sudha Rani and others ...Plaintiffs
And
The Tahsildar and another ...Defendants

To,
All Concern ..Defendant No. 2

Whereas, the above named Plaintiffs have filed the above suit for seeking permission of the Hon'ble Court to declare that the Plaintiffs are the legal heirs and successors of Sri. Kajjam Rama Murthy @ K. Ramamurthy S/o. Late Sri. K. Anantha Swamy who died on 17-09-2021 inrespect of Schedule of Property i.e., all that property bearing Municipal No. 1-3- 183/40/41, Plot No. 41, consist of Ground and First Floor admeasuring 291.2 Square Yards situated at Tallabasthi, SBI Colony, New Bakaram, Gandhi Nagar, Hyderabad, Telangana State 500080 and present bounded by: North: H. No. 1-3-183/40/32 (Plot No.32); South: Road; East : H. No. 1-3-183/40/40 (Plot No. 40); West: H. No. 1-3-183/40/42 (Plot No. 42). The above said case is posted on 30-10-2024 for the objections and claims of all concern to appear before the above said Court on **30-10- 2024** at 10.30 A. M and to submit objections/claims along with producing all documents if any to before above Hon'ble Court. If no objection received, the Hon'ble Court will be heard and determined in absence all concern and pass the order/s as per Law.

// BY THE ORDER OF THE COURT//
M/s. SURENDER KUMAR AGARWAL
Advocate
#4-4-101/1, 1ST Floor, Kokkonda Complex, Sultan Bazar, Hyderabad-500 001 Telangana.
Cell: 09391107084

మహారాజశ్రీ గౌరవనీయులైన సూర్యాపేట సీనియర్ సివిల్ జడ్జి గారి దివ్యసముఖమునకు
I.A.NO. 216 OF 2022
IN
O.S.NO. 17 OF 2018

మధ్యన : శ్రీమతి సంకేపల్లి మణెమ్మ @ గుడిమాలతి తండ్రి లింగారెడ్డి వయస్సు: 50 సం. వృత్తి : గృహిణి, తిర్మలగిరి మండలం, మరియు గ్రామం.
.....దరఖాస్తుదారుడు/వాది
మరియు
R-13 ముద్దసాని అంకిత, తండ్రి ముద్దసాని సంతోష్‌రెడ్డి భర్తపే సందీప్‌రెడ్డి, వయస్సు : 30సం. వృత్తి : గృహిణి. H.NO. 1-7 D/14 & 15 కౌసల్య టవర్స్, Flat NO. 503, కమలానగర్, హైదరాబాద్.
....Proposed Respondent No. 13

పై వాది పై కోర్టులో మీపై దావా వేసియున్నారు. జడ్జి దావాలో మీకు పలుమార్లు నోటీసులు పంపినను అందక తిరిగి వచ్చుచున్నవి. పై దావా మీ యొక్క హాజరు కొరకు తేది : 30-10-2024 నాటికి వాయిదా వేసి యున్నారు. కావునా మీరు ఆ రోజు ఉదయం 10.30 నిమిషములకు కోర్టు వారి ఎదుట మీరు గాని లేదా మీ తరపున వకీలు ద్వారా గానీ హాజరై మీ యొక్క అభ్యంతరములు తెలియజేసుకొనగలరు. లేనిచో పై దావా మీకు వ్యతిరేకముగా తీర్పు చేయబడును.

(కోర్టు వారి అనుమతితో)
ఎం. ఈశ్వర్‌కుమార్,
న్యాయవాది,
సూర్యాపేట.
9848198660.

IN THE DEBTS RECOVERY TRIBUNAL- II, TRIVENI COMPLEX (PALACE HEIGHTS) ABIDS, HYDERABAD - 500001
O.A. No. 330 OF 2024

Between;
UNION BANK OF INDIA
Begumpet Br. ...APPLICANT
AND
Ms.Yaram Anusha and another ...DEFENDANTS

To,
1. Ms.Yaram Anusha, W/o. Sri. Edara Pranay,
2. Edara Pranay, S/o. Sri. Inna Reddy,
Both R/o. 4-3-27, Plot No.27, Balaji Kirana Stores, Mallikarjuna Nagar, Bandlaguda Jagir, K.V. Ranga Reddy Dist. Telangana-500086.
Also at S.S. Apearl, Plot No. 127, 1st Floor, Prashanthnagar Colony, Bandlaguda Jagir-500086.

SUMMONS /SUBSTITUTED SERVICE BY WAY OF PAPER PUBLICATION
SUMMONS

WHEREAS OA 330/2024 was listed before Hon'ble Presiding officer/Registrar on 24-09-2024

Whereas, this Hon'ble Tribunal is pleased to issue Summons / Notice on the said Application under Section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of **Rs. 36,87,644.91/-** (Rupees Thirty Six Lakhs Eighty Seven Thousand Six Hundred Forty Four and Paise Ninty One Only).

In accordance with sub-section (4) of Section 19 of the Act, you the defendants are directed as under: -
(i) to show cause within 30 days of the service of summons as to why relief prayed for should not be granted; **(ii)** to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application; **(iii)** you are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties; **(iv)** you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of your business any of the assets over which security interest is created and / or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal; **(v)** you shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the Bank or financial institutions holding security interest over such assets. You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before the Registrar, on **04-11-2024** at 10:30 A.M. failing which the application shall be heard and decided in your absence.

GIVEN UNDER MY HAND AND SEAL OF THIS TRIBUNAL ON THIS THE 25th DAY OF SEPTEMBER 2024

Signature of the authorized officer to issue summons

M/s. SANGEETA JAISWAL, Advocate,
12-8-170, Mettuguda, Secunderabad.

IN THE COURT OF II ADDITIONAL DISTRICT JUDGEAT SANGA REDDY
I.A No. 43of 2022
IN
O.S No. 44 of 2022

BETWEEN:
Munnuri Yadaiah. ....Petitioner/Plaintiff
AND
Yelamala Ramulu& Others. ...Respondents/Defendants

To,
R5. S.Srinija, D/o. S. Raghunath, Aged 31 years, Occ: H/h, R/o. H.No. 382/2/RT, Sanjeevareddy Nagar, Hyderabad.
R6. S.Srividya,D/o. S. Raghunath, Aged 28 years, Occ: H/h,R/o. H.No. 382/2/RT, Sanjeevareddy Nagar, Hyderabad.
R7. Smt. K. Laxmi Rekah, W/o. Srinivasa Chary,Aged 42 years, Occ: H/w, R/o. H.No. 6-7/1, Bhavani Nagar, Dilsukhnagar, Hyderabad.
R10. K. Malesham, S/o. Narsi Reddy, Aged 49 years, Occ: Business, R/o. H.No. 8-3-224\8\2\D, E-31, Madshuranagar, Hyderabad.
R12.Sri. M. Rajesh Kumar, S/o. M. Ramulu, Aged 47 years, Occ: Emp., R/o. H.No. 7-1-617/A/3, Ameerpet, Hyderabad.
R13.Smt. M. Padma, W/o. Rajesh Kumar,Aged 40 years, Occ: Emp., R/o. 7-1-617/A/3, Ameerpet, Hyd
R18. Meerza Mohammad Anwar Baig, S/o. SattarBaig,Aged 50 years, Occ: Employee,R/o. H.No. C-46, RBI Quarters, Begumpet, Hyderabad.
R19. Sri. M.V. Srinivas Reddy, S/o. late Narayana Reddy, Aged 55 years, Occ: Pvt. Emp., R/o. H.No. 6-3-814/13, Ameerpet, Hyderabad - 16.
R20. Smt. M. Sunitha, W/o. M. Venu Kumar, Aged 47 years, Occ: H/w, R/o. H.No. 7-1-617/A/3, Ameerpet, Hyderabad.

Where as Petitioners filed Application against all of you Respondents No. 5 to 7, 10, 12, 13, & 18 to 20 along with other Respondents seeking Interim Injunction Order. You are directed to appear before this court in person or by pleaderon 25th day of October, 2024 at 10.30 AM, failing which case will be decidedEx-parte.

// BY ORDER OF COURT//
P. SAMARA SIMHA REDDY
Advocate,
Sanga Reddy.
Cell: 9912382345

నవతెలంగాణ
హైదరాబాద్
శనివారం | అక్టోబర్ 05, 2024 | www.navatelangana.com

7న 'పాఖాల అలయ్..బలయ్'

- తెలంగాణ క్రిస్టియన్ జేపీసీ చైర్మెన్ జిలుకర రవికుమార్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

జనగామ జిల్లా, కొడకండ్ల మండలం, పాఖాల గ్రామం వారు నిర్వహించే "పాఖాల అలయ్..బలయ్" కార్యక్రమాన్ని ఈ నెల 7వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్ లోని బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో నిర్వహిస్తున్నట్టు తెలంగాణ క్రిస్టియన్ జేపీసీ చైర్మెన్ జిలుకర రవికుమార్, డాక్టర్ బి.విద్యాకుమార్, వి.సోమయ్య, బొట్టుమంచి సుధాకర్, గోలి ప్రకాష్, బుర్కా చంద్రమౌళి తెలిపారు.ఈ మేరకు శుక్రవారం 'అలయ్..బలయ్' కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఖాల గ్రామస్తులు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విద్య, ఉద్యోగం, వ్యాపారం చేస్తున్న పాఖాల గ్రామస్తులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని, జయప్రదం చేయాలని వారు కోరారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

కోఠి ప్రభుత్వ ఈఎన్‌టీ (చెవి, ముక్కు ,గొంతు) ఆస్పత్రి ఆవరణలోని శ్రీ తాటి మైసమ్మ ఆలయంలో దేవి నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకొని అమ్మవారికి ఆస్పత్రి సూపరింటెండెంట్ సునీల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ లు అశ్విన్ , సంతోష్ , యూనిట్ అధ్యక్షుడు టి. రాజు, జూనియర్ అసిస్టెంట్ ఎస్. రవి, డి ఈ ఓ రజనీ, హెల్త్ ఇన్ స్పెక్టర్ సురేందర్ రెడ్డి, సూపర్వైజర్ శ్రీనివాస్, డీఈఓ సంగీత, ఎల్‌టీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ అభిమానులకు అసౌకర్యం కలగొద్దు

- 12న ఉప్పల్ రాజీవ్ గాంధీ స్టేడియంలో భారత్ బంగ్లాదేశ్ జట్ల మధ్య టీ20 మ్యాచ్
- టీ-20 మ్యాచ్ నిర్వహణకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు
- రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో త్వరలో జరగనున్న టీ- 20 క్రికెట్ మ్యాచ్ నేపథ్యంలో రాచకొండ పోలీస్ అధికారులు అప్రమత్తమయ్యారు. శుక్రవారం రాచకొండ సీపీ సుధీర్‌బాబు భద్రతా ఏర్పాట్లపై ఆరా తీశారు. ఉప్పల్ స్టేడియంలో డీసీపీలు, ఏసీపీలు, జీహెచ్‌ఎంసీ, అగ్నిమాపక, విద్యుత్ శాఖతోపాటు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, రాచకొండ కమిషనరేట్ పరిధిలో జరగనున్న మ్యాచ్ నిర్వహణకు అవసరమైన అన్ని రకాల సెక్యూరిటీ పరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు తెలిపారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో క్రికెట్ పోటీలు నిర్వహించడం గొప్ప అవకాశమని, ఎన్ని సవాళ్ళు ఎదురైనా తగిన విధంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, ప్రేక్షకులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్టు వివరించారు. టికెట్ల పంపిణీలో ఎటువంటి గందరగోళం లేకుండా చూడాలని నిర్వహణ బృందానికి సూచించారు. ప్రేక్షకులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు అవసరమైన పార్కింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. స్టేడియం పరిసరాల్లో సీసీటీవీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరి కదలికలూ సీసీటీవీ కెమెరాల్లో నిక్షిప్తం అవుతాయని పేర్కొన్నారు. నకిలీ టికెట్లు అమ్మేవారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని, టికెట్ల పంపిణీ పూర్తి పారదర్శకంగా జరుగుతుందని, ఎటువంటి పుకార్లనూ నమ్మవద్దని తెలిపారు. ఈ సమావేశంలో డీసీపీలు పద్మజ, రమణారెడ్డి, ఉషా విశ్వనాథ్, కరుణాకర్, అరవింద్ బాబు, అడిషనల్ డీసీపీ శ్యామ్, హెచ్‌సీఏ అధ్యక్షులు జగన్మోహన్‌రావుతోపాటు తదితరులు పాల్గొన్నారు.

తొలగనున్న ట్రాఫిక్ కష్టాలు..!

- లెమన్ ట్రీ హెటల్ నుంచి మాదాపూర్ యశోదా ఆస్పత్రి వరకు పనుల పరిశీలన
- పర్వత నగర్ మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం
- సున్నం చెరువులో మురుగు ప్రవాహానికి అడ్డుకట్ట
- రెండో రోజు పలు ప్రాంతాలల్లో పర్యటించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి
- జీహెచ్‌ఎంసీ, పోలీస్, జలమండలి సంయుక్త కార్యచరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌లో ట్రాఫిక్ కష్టాలు చెప్పనక్కర్లేదు. నిమిషాల వ్యవధిలో వెళ్లాల్సి గమ్యస్థానానికి సైతం గంటల తరబడి ప్రయాణించాల్సిన పరిస్థితి. పద్మవ్యూహం లాంటి ట్రాఫిక్ సమస్యల నుంచి నగరవాసులకు ఉపసమనం కల్పించేదుకు వాటర్ బోర్డు, జీహెచ్‌ఎంసీ, పోలీస్ మూడుశాఖల ఆధ్వర్యంలో సంయుక్త కార్యాచరణను రూపొందించారు. నగరంతోపాటు మాదాపూర్, హైటెక్ సిటీ ప్రాంతాల్లో వాహనదారులు, స్థానికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ జామ్ సమస్యను పరిష్కరించేందుకు కసరత్తు మొదలు పెట్టారు. ఈ మేరకు ట్రిడెంట్ హెటల్ నుంచి యశోదా ఆసుపత్రి వరకు ఉన్న 5 కిలోమీటర్ల వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలన

శుక్రవారం జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, సైబరాబాద్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి కలిసి ఆయాప్రాంతాల్లో పర్యటించారు. లెమన్ ట్రీ హెటల్ నుంచి ట్రిడెంట్ హెటల్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో అక్కడున్న ఎయిర్ వాల్వ్‌లను సమీపానికి తరలించడానికి జాయింట్ సీపీతో చర్చించారు. ఆ తర్వాత మాదాపూర్ యశోదా ఆస్పత్రి వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో ధ్వంసమైన సీవరేజ్ పైపులైన్లు పరిశీలించారు. వాటిని సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించాలని అధికారులకు జలమండలి ఎండీ ఆదేశించారు. అనుకున్న ప్రకారం పనులు పూర్తయితే మాదాపూర్, మైండ్ స్పేస్, హైటెక్ సిటీ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇక్కట్లు కొంత వరకు తొలిగిపోనున్నాయి.

మ్యాన్‌హెళ్ల నుంచి మురుగు పొర్లడం నిత్యకృత్యం

పర్వత నగర్ చౌరస్తా దగ్గర రోడ్డుకు ఇరువైపులా ఉన్న రెండు మ్యాన్ హెళ్ల నుంచి మురుగు పొంగిపోర్లుతోంది. ప్రతిరోజూ ఒక ఎయిర్ టెక్ మిషన్ ఆ సమస్యను పరిష్కరించడానికి పనిచేయడం, ట్రాఫిక్ మళ్లింపు కోసం ఓ కానిస్టేబుల్ విధులు నిర్వర్తించడం ఇక్కడ నిత్యకృత్యం. ఈ నేపథ్యంలో పర్వత నగర్ చౌరస్తా నుంచి సున్నం చెరువు వరకు అధికారులు పర్యటించారు. పరిస్థితిపై ఆరా తీశారు. అయితే స్థానికంగా ఏర్పాటు చేసిన ఔట్ లెట్‌ను ప్రయివేటు వ్యక్తులు ధ్వంసం చేసినట్టు గుర్తించారు. దీనివల్లే ప్రతి రోజూ ఈ రహదారిపై మురుగు పొంగి సీవరేజ్ ఫిర్యాదులు వస్తున్నాయని ఎండీ గుర్తించారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు పర్వత నగర్ సిగ్నల్ నుంచి రోడ్ నంబర్.45 వరకు కొత్త సీవరేజ్ పైపు లైన్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు సంబంధిత ప్రతిపాదనల్ని సిద్ధం చేయాలని జలమండలి అధికారులను ఆదేశించారు. ఇక్కడ ఉత్పన్నమయ్యే మురుగు నీటిని సున్నం చెరువులోకి చేరకుండా మళ్లించి దుర్గం చెరువు ఎస్టీపీ ద్వారా శుద్ధి చేయాలని నిర్ణయించారు.

సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తాం: ఎండీ

90 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా రెండో రోజు క్షేత్రస్థాయిలో పర్యటించి స్థానికుల నుంచి స్వయంగా సమస్యలను అడిగి తెలుసుకున్నట్లు ఎండీ అశోక్‌రెడ్డి తెలిపారు. వివిధ ప్రాంతాలను పరిశీలించామని తెలిపారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్స్-2 స్వామి, జీఎం, మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

'బడ్జెట్ పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలి'



- ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎన్.రెడ్డి
- రాష్ట్ర ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ జి.రమేష్‌కు వినతి

నవతెలంగాణ-హిమాయత్ నగర్

రాష్ట్రంలోని 33 జిల్లాల్లో గల బడ్జెట్ పాఠశాలల ఉపాధ్యాయులు, యాజమాన్యాలకు ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించాలని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్మెంట్స్ అసోసియేషన్ (ట్రస్మా) రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎన్.రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.అనిల్ కుమార్, కోశాధికారి కె.శ్రీకాంత్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ట్రస్మా రాష్ట్ర నూతన కార్యవర్గం ఏర్పాటైన సందర్భంగా శుక్రవారం రాష్ట్ర ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ జి.రమేష్ ను వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో గల బడ్జెట్ పాఠశాలల సమస్యలను వివరించినట్లు వారు ఒక ప్రకటనలో తెలిపారు.ప్రయివేటు పాఠశాలల సమస్యలను పరిష్కరించి కార్పొరేట్ పాఠశాలలను నియంత్రించాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బడ్జెట్ పాఠశాలల స్కూళ్ల యాజమాన్యాలకు, ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని, అదే విధంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు (డీసీఈబీ) ప్రకారం ఆరో తరగతి నుంచి 10వ తరగతి వరకు ఒకే కామన్ ఫీజు విధానం ఉండాలని, ప్రభుత్వం ముద్రించిన ప్రశ్నా పత్రాలను పాఠశాలల్లో వాడడం లేదని, వాటిని వాడేట్లు అధికారులు, డీఈవోలు చర్యలు తీసుకోవాలని, బడ్జెట్ పాఠశాలల సమస్యలను పరిష్కరించి కార్పొరేట్ స్కూళ్లను నియంత్రించాలని కోరినట్టు తెలిపారు.ఇందుకు డైరెక్టర్ రమేష్ సానుకూలంగా స్పందిస్తూ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని, ముఖ్యంగా సాంకేతిక రంగాన్ని వినియోగించుకుని మంచి ఫలితాలను తీసుకురావాలని కోరారు.దేశంలోనే మన రాష్ట్రం విద్యా రంగంలో మంచి అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నట్లు వారు తెలిపారు. ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలు తమకు రెండు కండ్ల లాంటివని, వాటిని సమాన దృష్టితో చూస్తున్నామని చెప్పినట్లు వారు వెల్లడించారు.దాదాపు 11 వేల పాఠశాలల్లో 34 వేల మంది ప్రయివేటు పాఠశాలల్లో చదువుతున్నారని చెప్పారు.ఈ సందర్భంగా ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రమేష్ ను శాలువాతో ఘనంగా సత్కరించినట్లు వారు తెలిపారు. ట్రస్మా గౌరవాధ్యక్షులు కందాల పాపిరెడ్డి, అధికార ప్రతినిధి చింతల రామచందర్, ముఖ్య సలహాదారులు అనంతరెడ్డి, ఉపాధ్యక్షులు పి.వి.రామనర్సయ్య, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు బానాల రాఘవ, జయరాం ప్రసాద్, పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి



- ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నవతెలంగాణ-అంబర్‌పేట

డ్రయినేజీ సమస్యల శాశ్వాత పరిష్కారం కోసం నిరంతర కృషి చేస్తున్నానని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శుక్రవారం గోల్నాక డివిజన్ పరిధిలోని తిరుమల నగర్, ఏకే ప్లాజా ఏడు లక్షల వీధులతో నూతన డ్రయినేజీ పనులకు కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారి ఏఈ రోహిత్ స్థానిక నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

అంబర్‌పేట మహంకాళి అమ్మవారి ఆలయంలో దేవీ నవరాత్రులను పురస్కరించుకుని వాకర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు, అలాగే భక్తులు అమ్మవారికి లక్ష కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకుల కమిటీ సభ్యులు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



సినీ ఇండస్ట్రీలో అన్యాయాలపై పెద్దలు ఎందుకు మాట్లాడరు

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తేజ గౌడ్



నవతెలంగాణ - ముషీరాబాద్

సినీ ఇండస్ట్రీలో తరతరాలుగా ఎంతో మందికి అన్యాయాలు జరుగుతున్నా యని వాటిపై సినీ పెద్దలు ఎందుకు పెదవి విప్పరని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తేజ గౌడ్ ప్రశ్నించారు. ముషీరాబాద్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యల పై సినీ ఇండస్ట్రీ పెద్దలు మూకుమ్మడిగా స్పందిస్తున్నారని.. అదే సినీ ఇండస్ట్రీలో తరతరాలుగా ఎన్నో అన్యాయాలు జరుగుతున్నా సినిమా పెద్దలని చెప్పుకునే వారు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రంగుల లోకంలో తమ నైపుణ్యాన్ని చూపించడానికి ఎంతోమంది కళాకారులు ఈ రంగంలోకి వస్తుంటే బ్యాక్ గ్రౌండ్ ఉన్న కొంతమంది మాత్రమే నిలదొక్కుకుంటున్నారని మిగిలిన వారికి అన్యాయం జరుగుతోందన్నారు. ఈ సమస్యపై ఏ హీరో స్పందించడం లేదన్నారు. మంత్రి కొండా సురేఖ ఒక బీసీ మహిళగా అవమానాన్ని తట్టుకోలేక చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకున్నా దానిపై ముక్కుమ్మడిగా సోషల్ మీడియాలో చెలరేగడం ఇక మానుకోవాలన్నారు. ఈ సమస్యను ఇక్కడికి స్వస్తి పలకాలని కోరారు. మాజీ మంత్రి కేటీఆర్ చేసిన ప్రచారానికి గాను వెంటనే క్షమాపణ చెప్పాలని, సినీ ఇండస్ట్రీలో జరుగుతున్న డ్రగ్స్ మోసాలు అన్యాయాలపై ఇండస్ట్రీ పెద్దలు వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.



'వనపర్తి ఎక్సైజ్ సూపరిండెంట్‌ను వెంటనే సర్వీస్ నుంచి తొలగించాలి'

- బీసీ పొలిటీకల్ జేపీసీ చైర్మెన్ రాచాల యుగంధర్ గౌడ్

నవతెలంగాణ-హిమాయత్ నగర్

ప్రభుత్వాన్నే మోసగించిన వనపర్తి ఎక్సైజ్ సూపరిండెంట్ ప్రభు వినయ్ కుమార్ ను వెంటనే సర్వీస్ నుంచి తొలగించి క్రిమినల్ కేసు నమోదు చేయాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మెన్ రాచాల యుగంధర్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తెలంగాణ సచివాలయంలో ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఏఎం.రిజ్విని ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా రాచాల యుగంధర్ మాట్లాడుతూ ప్రభు వినయ్ కుమార్ గత 3 నెలల నుంచి విధులకు హాజరు కాకుండా, హాజరు రిజిస్టర్ ఫైళ్లను ఇంటి వద్దకే తెప్పించుకుని సంతకాలు చేస్తూ వేతనం తీసుకుంటున్నాడని వనపర్తి జిల్లా కలెక్టర్‌కు ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా వారం రోజులైనా ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ప్రభు వినయ్ సీనియారిటీ జాబితాలో అక్రమాలకు పాల్పడటమే కాకుండా చట్ట విరుద్ధంగా సర్వీస్ పొడిగించుకున్నాడని, సర్వీస్ రిజిస్టర్ లో పుట్టిన తేదీని 06.06.1964 నుండి 06.06.1969కు మార్చుకున్నాడని ఆరోపించారు.2014లో విడుదల చేసిన సీనియారిటీ లిస్టులో సీరియల్ నెంబర్ 73 కాగా, 2024లో విడుదల చేసిన సీనియారిటీ లిస్టులో 32గా ఉందని, దీంతో నిజాయితీ గల అధికారులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభు వినయ్ పదవ తరగతి సర్టిఫికెట్లను, బోనఫైడ్ తదితర విద్యార్హత సర్టిఫికెట్లతో పాటు ఐఎఫ్ఎంఐఎస్, ఇన్సూరెన్స్ బాండ్లను పరిశీలించాలని, భవిష్యత్తులో ఏ ఉద్యోగి ఇలాంటి టాంపరింగ్ లకు పాల్పడకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఆయన యూనిఫాం సర్వీసుకు అన్ ఫిట్ అని, ఆయనకు ఫిజికల్ పరీక్షలు నిర్వహించి ఫిట్ గా ఉన్నాడా లేదా అని తేల్చాలన్నారు. అన్ని ఆధారాలతో ప్రిన్సిపాల్ సెక్రెటరీ రిజ్వీతో పాటు సీఎస్ శాంతి కుమారి, ఎక్సైజ్ కమిషనర్ కు ఫిర్యాదు చేశామని, అతని అక్రమాలపై వెంటనే విచారణ జరిపించి ప్రభుత్వాన్ని మోసం చేసిన ఆయనపై, అతనికి సహకరిస్తున్న సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు బడేసాబ్, రాఘవేందర్ గౌడ్, మ్యాదరి రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రిప్టో కరెన్సీ కేసులో అరెస్టయిన ఉద్యోగులకు బెయిల్



- 30 శాతం ట్యాక్స్ చెల్లించినప్పుడు క్రిప్టో అక్రమం ఎలా అవుతుంది
- హైకోర్టు న్యాయవాది హబీబ్ సుల్తాన్ అలీ

నవతెలంగాణ-హిమాయత్ నగర్

క్రిప్టో కరెన్సీ పేరుతో నిర్మల్ పోలీసులు అరెస్టు చేసిన ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసిందని హైకోర్టు న్యాయవాది హబీబ్ సుల్తాన్ అలీ తెలిపారు.శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హబీబ్ సుల్తాన్ అలీ మాట్లాడుతూ క్రిప్టో కరెన్సీ దందా అక్రమమంటూ నిర్మల్ పోలీసులు గత ఆగస్టు మాసంలో ముగ్గురు ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఇద్దరు కానిస్టేబుళ్లను అరెస్టు చేసి జైలుకు పంపారని చెప్పారు. క్రిప్టో కరెన్సీని కొనుగోలు చేసి లావాదేవీలు నిర్వహించి, లాభాలు వచ్చిన తరువాత 30 శాతం ట్యాక్స్ చెల్లించాలని కేంద్ర ప్రభుత్వం పేర్కొందని చెప్పారు. అలాంటప్పుడు క్రిప్టో అక్రమం ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు.ప్రభుత్వ ఉద్యోగులు అని చూడాకుండా పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి నెల రోజుల పాటు జైల్లో పెట్టడంతో వారు ఉద్యోగాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్టయినా ఉద్యోగులు నెల రోజులు జైల్లో ఉన్న వారిపై ప్రజల నుండి పోలీసులకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదన్న విషయాన్ని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రశ్నించి, ఉద్యోగులకు బెయిల్ మంజూరు చేసిందని గుర్తు చేశారు.నిర్మల్ పోలీసులు సుమోటగా కేసు నమోదు చేసి అత్యుత్సహం ప్రదర్శించి ఐదుగురు ఉద్యోగులను అరెస్టు చేశారని, దీంతో వారు సమాజంలో తలెత్తుకు తిరిగే పరిస్థితి లేదన్నారు. వారికి హైకోర్టు బెయిల్ మంజూరు చేసి ఊరట కల్పించిందని ఆయన తెలిపారు.ఈ సమావేశంలో న్యాయవాదులు ఎం.హేమలత, బి.రాజేశ్వరి, డి.విజయదుర్గ, డి.సుమిత, సి.హెచ్.సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా శ్రీనివాసులు..



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా కే శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం కోఠి లో ఎన్నికల ప్రధాన ఎన్నికల అధికారి శ్రీ శ్యామ్ , ఉప ఎన్నికల అధికారి డాక్టర్ రామారావు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ సభ్యుల ఎన్నికలు నిర్వహించారు.

అధ్యక్షులుగా కె. శ్రీనివాసులు.అసోసియేట్ అధ్యక్షులు ఎస్ రామాంజనేయులు.జనరల్ సెక్రెటరీ సునీల్ రాజ్. కోశాధికారి నామాల శ్రీనివాస్,కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఇట్టి కార్యవర్గ సభ్యులకు రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు చేతుల మీదుగా ఎన్నికైన సభ్యులకు ధ్రువపత్రాలను అందజేశారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు కే శ్రీనివాసులు మాట్లాడుతూ.. సంఘంలోని ప్రతి సభ్యుడు వారి వారి సమస్యలను నేరుగా తమ దృష్టికి తీసుకువచ్చినట్టయితే సమస్యలను సంబంధితపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు.తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు సభ్యులకు, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర సంఘం ఆదేశాల మేరకు సమస్యలపై పోరాడడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు.ఉద్యోగుల న్యాయమైన హక్కుల గురించి పోరాడేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని, ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ ఉద్యోగస్తుల న్యాయమైన కోరికలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. జిల్లాల వారీగా సంఘాలను బలోపేతం చేసి ఉద్యోగుల హక్కుల కోసం పోరాడుదాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు కలిముద్దీన్ హైమద్ , రంగారెడ్డి జిల్లా టిజిఓ అధ్యక్షులు శ్రీ రామారావు , సిద్దిపేట జిల్లా టిజిఓ అధ్యక్షులు శ్రీరామ్ రెడ్డి , రాష్ట్రంలో వివిధ జిల్లాలలో పనిచేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ గజిటెడ్ అధికారులు పాల్గొన్నారు.

తెలుగుకు పూర్వవైభవం రావాలి : తనికెళ్ల భరణి



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

గొప్పనైన తెలుగు భాషకు స్వరాష్ట్రాల్లో జరుగుతున్న నిరాదరణ వాంఛనీయం కాదని ప్రముఖ కవి,సినీ నటులు తనికెళ్ల భరణి అన్నారు. పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, కేరళ, తమిళనాడుల్లో ఉన్న పాటి భాషాభిమానం కూడా మనకు లేదని, విదేశాల్లో 10వ తరగతి ఇంటర్మీడియట్ స్థాయిలో చదువుతున్న పిల్లలు సొంతగా పద్యాలు రాసి అవధానాలు చేసే విధంగా భాషాభిమానం పరిఢవిల్లుతోందని అన్నారు. పిల్లలకు తెలుగు భాష ఒంటపట్టించే విషయంలో తల్లిదండ్రులే బాధ్యత తీసుకోవాలని, భాషకు పూర్వ వైభవం తీసుకురావా లని భరణి సూచించారు. పరి షత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ సారస్వత పరిషత్తు తెలుగు భాషా సంస్కృతుల వికాసానికి అవిరళంగా,అవి ఛిన్నంగా కృషి సాగిస్తున్నదని అన్నారు.పరిషత్ లోని డాక్టర్ దేవులపల్లి రామానుజ రావు కళామందిరంలో శుక్రవారం సాయంత్రం జరిగిన సభలో 2024 సంవత్సరానికి 8 మంది సాహితీవేత్తలకు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి తనికెళ్ల భరణితో కలిసి పురస్కారాలు ప్రదానం చేశారు. ఎర్రం రెడ్డి రంగనాయకమ్మ పురస్కారాన్ని ఆచార్య కాత్యాయని విద్మహేకు, ఆచార్య యశోదా రెడ్డి పురస్కారాన్ని డాక్టర్ పి. భాస్కరయోగికి, డాక్టర్ బెజవాడ గోపాల్ రెడ్డి పురస్కారాన్ని మోతుకూరి నరహరి కి, డాక్టర్ చింతపల్లి వసుంధర రెడ్డి జానపద సాహిత్య పురస్కారాన్ని ఆచార్య ఎస్.భక్తవత్సల రెడ్డికి, ఆలూరి బైరాగి పురస్కారాన్ని నాగవరం బాలరాం కు, డాక్టర్ వానమామలై వరదాచార్య పురస్కారాన్ని డాక్టర్ వెలుదండ సత్యనారాయణకు, ఆచార్య రావికంటి వసునందన్ పురస్కారాన్ని రేడియం కు, డాక్టర్ దివాకర్ల వెంకటా వధాని పురస్కారాన్ని డాక్టర్ తిరుమల శ్రీనివాస చార్యకు ప్రదానం చేశారు. పురస్కారం కింద ఒక్కొక్కరికి రూ. 5000 నగదు, పురస్కార పత్రం, జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె చెన్నయ్య స్వాగతం ఉపన్యాసం చేశారు. పురస్కార గ్రహీతలను పరిచయం చేశారు.డాక్టర్ వసుంధరా రెడ్డి, ఆచార్య సుమతీ నరేంద్ర, డాక్టర్ పి. లక్ష్మీరెడ్డి అతిథులుగా పాల్గొని ప్రసంగించారు.

6న ఆప్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు

నవతెలంగాణ-హిమాయత్ నగర్

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల మేలు కలయికైనా బతుకమ్మ పండుగ వేడుకలను పెద్ద ఎత్తున ఆప్ మహిళా విభాగం నిర్వహిస్తుందని ఆప్ తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు హేమ జిల్లోజు, ప్రధాన కార్యదర్శి నర్సింగ్ యమునలు వెల్లడించారు.శుక్రవారం హిమాయత్ నగర్, లిబర్టీలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హేమ జిల్లోజు, నర్సింగ్ యమున మాట్లాడుతూ 5వ రోజు అట్ల బతుకమ్మ సందర్భంగా ఈ నెల 6న సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్ నెక్లెస్ రోడ్, పీపుల్ ప్లాజాలో ఆమ్ ఆద్మీ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగ వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

కులమతాలకతీతంగా సకల జనులు, సబ్బండ వర్ణాలు కలిసి సాంస్కృతిక సమభావన, సామరస్యం చాటుకుంటూ తెలంగాణ ప్రజలు జరుపుకునే బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అన్నారు.హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మహిళలందరూ కలిసి ఆప్ మహిళా విభాగం నిర్వహించే ఈ బతుకమ్మ వేడుకలలో పాల్గొని, పాటలు పాడి, ఆడి ఏకత్వ స్ఫూర్తిని చాటుతారన్నారు. గొప్ప స్వాభిమానంతో జరిగే ఈ బతుకమ్మ వేడుకలలో అన్ని వర్గాల వారు పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.ఈ సమావేశంలో ఆప్ డాక్టర్స్ వింగ్ అధ్యక్షురాలు డాక్టర్ లాక్ష్య, జిల్లా నాయకులు షర్ హాత్ ఉన్నిసా, మౌనికా తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-అంబర్‌పేట

సినిమా పరిశ్రమకు చెందిన నటులపై నీచంగా మాట్లాడిన తెలంగాణ మంత్రి కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారంగోల్నాక డివిజన్ పరిధిలో ఆయన మాట్లాడుతూ మహిళా మంత్రి అయ్యుండి ఒక మహిళపై అలా మాట్లాడడం తప్పు అన్నారు. వెంటనే స్వచ్ఛందంగా ఆమె తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని సూచించారు.

ఆకాకర కాయతో...



ఆకాకర కాయ, బోడ కాకరకాయ, ఆగాకర కాయ అని పిలిచుకునే ఈ కాయగూర వర్షాకాలంలో లభిస్తుంది. ఆకాకర కాయలో విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా లభిస్తాయి. ఈ కూరగాయలో అనేక ఆరోగ్య ప్రయోజనాలను దాగున్నాయి.

కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది

బోడ కాకర కాయలో విటమిన్ ఎ పుష్కలంగా లభిస్తుంది. ఇది కంటి ఆరోగ్యానికి అవసరమైన విటమిన్. విటమిన్ ఎ కళ్ళు దెబ్బతినకుండా కాపాడుతుంది. రేచీకటిని నివారించడంలో సహాయపడుతుంది.

రోగనిరోధక శక్తిని పెంచుతుంది

ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుండి శరీరాన్ని రక్షించడంలో ఇవి సహాయపడతాయి. ఫ్రీ రాడికల్స్ అస్థిర అణువులు. ఇవి కణాలను దెబ్బతీస్తాయి. వ్యాధులను కలుగజేస్తాయి. యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్‌ను తటస్తం చేయడానికి సహాయపడతాయి. అంటే రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. ఆకాకర కాయలో ఉండే యాంటీఆక్సిడెంట్లు కాలేయం దెబ్బతినకుండా కాపాడతాయి.

రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది

ఆగాకర కాయలో హైపోగ్లైసీమిక్ లక్షణాలు ఉన్నాయి, అంటే ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. మధుమేహం లేదా ప్రీడయాబెటిస్ ఉన్న వారికి ఇది మంచి ఎంపిక.

జీర్ణక్రియకు తోడ్పడుతుంది

బోడ కాకర కాయలో ఫైబర్ బాగుంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఫైబర్ జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది మలబద్ధకాన్ని నివారించడంలో సహాయపడుతుంది.

చర్మ ఆరోగ్యానికి మంచిది

ఆకాకరలో ఉండే బీటా కెరోటిన్ శరీరంలో విటమిన్ ఎగా మారుతుంది. విటమిన్ ఎ చర్మ ఆరోగ్యానికి అవసరం. సూర్యరశ్మి వల్ల కలిగే నష్టం నుండి చర్మాన్ని రక్షించడంలో సహాయపడుతుంది.

క్యాన్సర్ నిరోధకంగా

బోడకాకరలో ఉండే యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుండి శరీరాన్ని రక్షించ డంలో సహాయపడతాయి. ఒకరకంగా క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయ పడతాయి. ■

మద్యానికి బానిసైతే..?

వ్యసనం ఏదైనా సరే అది మనిషి జీవితంపై ప్రభావం చూపకుండా ఉండలేదు. రకరకాల వ్యసనాల్లో మద్యపానం వల్ల కలిగే నష్టాల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. మద్యానికి అలవాటు పడి కుటుంబాన్ని, జీవితాన్ని సర్వనాశనం చేసుకున్న వారిని మనం ఎంతో మందిని చూస్తూనే ఉన్నాం. ఎంత చెప్పినా వారిలో మార్పు రాదు. మళ్లీ మళ్లీ అదే తప్పు చేస్తూనే ఉంటారు. మద్యం మత్తులో మనుషులు అంతగా మునిగిపోతున్నారు. అలా మద్యానికి బానిసై కుటుంబాన్ని ఇబ్బంది పాలు చేస్తున్న ఓ కొడుకు జీవితాన్ని బాగు చేసుకునేందుకు తల్లి పడుతున్న వేధనే ఈ వారం ఐద్వా అదాలత్‌లో...



ఐద్వా అదాలత్
సెల్: 9490098024

రాజేశ్వరమ్మకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. భర్త లేడు. అతను కూడా మద్యానికి బానిసై రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. ఒంటరిగానే పిల్లలను పోషించింది. కూతురు పెండ్లయి అత్తారింటికి వెళ్లిపోయింది. ఇక ఇద్దరు కొడుకుల్లో పెద్ద కొడుకు సునీల్. బాధ్యత లేకుండా తిరుగుతుంటాడు. రాజేశ్వరమ్మ ఓ ప్రైవేట్ సంస్థలో పని చేస్తుంది. ఆ వచ్చిన డబ్బుతోనే ఇల్లు గడుపుతుంది. కూతురు తనకు తోచిన సహాయం చేస్తుంది. సునీల్ మాత్రం తల్లికి సాయం చేయకపోగా దొరికిన చోటల్లా అప్పులు చేస్తుంటాడు. ఆ అప్పులన్నీ రాజేశ్వరమ్మనే తీర్చాలి. రెండో కొడుకు రాజేష్‌కు ప్రస్తుతం 20 ఏండ్లు. అతనైనా మంచిగా ఉంటాడనుకుంటే పెద్ద కొడుక్కంటే దారుణంగా తయారయ్యాడు. 15 ఏండ్లకే తాగడం మొదలుపెట్టాడు. గుట్కాలు కూడా తింటాడు. తల్లి మాటంటే ఎవ్వరికీ లెక్కలేదు. రాజేష్ తల్లి నిద్రపోయిన తర్వాత మెల్లగా ఇంటికి వస్తాడు. కాలేజీకి వెళ్లమని చెప్పినా వెళ్లడు. చుట్టుపక్కల వారి సలహాతో తను ఉద్యోగం చేసే కంపెనీలోనే రాజేష్‌ను కూడా పనిలో పెట్టింది. కానీ కొన్ని రోజులు చేసి మానేశాడు. వేరే చోట ఉద్యోగం చూసుకున్నాడు. తాగడం కూడా ఎక్కువయింది. తల్లి అడిగితే 'నేను చేసే పని అలాంటిది, తాగితే తప్ప కుదరదు' అంటుంటాడు. దాంతో రాజేశ్వరమ్మ ఆ ఉద్యోగం మాన్పించి ఇంకో ఉద్యోగం చూసుకోమంది. ఎన్ని ఉద్యోగాలు మారినా రాజేష్ తాగుడు మాత్రం మానడం లేదు. పైగా 18 ఏండ్లు నిండినప్పటి నుండి 'ఉద్యోగం చేస్తున్నాను కదా! నాకూ పెండ్లి చేయండి, అక్క పెండ్లి కూడా అయిపోయింది కదా!' అనడం మొదలుపెట్టాడు.

'ఉండటానికి సరిగా ఇల్లు లేదు, వయసేమో చిన్నది. ఇప్పుడే పెండ్లేంటి. నీకంటే పెద్దోడు సునీల్ ఉన్నాడు. వాడికి చేయకుండా నీకెలా చేయాలి' అంటూ ఎలాగో పెండ్లిని వాయిదా వేస్తూ వస్తుంది. కానీ అతని తాగుడు మాత్రం మాన్పించలేకపోతుంది. ప్రస్తుతం ఎవరి మాటా వినే స్థితిలో లేడు. తాగకుండా అస్సలు ఉండలేకపోతున్నాడు. తాగకపోతే చనిపోతాడేమో అన్నట్టు ప్రవర్తిస్తున్నాడు. దాంతో చివరకు తల్లే అతనికి మద్యం ఇచ్చే పరిస్థితి వచ్చింది. ఇలాగే ఉంటే పెద్దోడిలా చిన్నోడి జీవితం కూడా నాశనం అయిపోతుందని రాజేశ్వరమ్మకు భయం పట్టుకుంది. ఆ భయంతోనే ఐద్వా లీగల్‌సెల్‌కు వచ్చింది.

మేము రాజేష్‌ను పిలిపించి 'ఎందుకింతలా తాగుతున్నావు. నీ వల్ల మీ అమ్మ చాలా బాధపడుతుంది. నీ ఆరోగ్యం కూడా పాడైపోతుంది. ఇలా తాగుతుంటే నీకు పిల్లని ఎవరిస్తారు. అసలు నీకేమైనా సమస్య ఉంటే మాతో చెప్పు. పరిష్కరించేందుకు ప్రయత్నిస్తాము. అంతే కానీ నువ్వు ఇలా తాగుతూ ఉంటే నీకు జీవితమే ఉండదు. మీ నాన్న కూడా ఇలాగే తాగితాగి చనిపోయాడు. తర్వాత నీ పరిస్థితి కూడా అంతే అవుతుంది. తాగకపోతే నువ్వు మీ అమ్మను చాలా బాగా చూసుకుంటావని చెప్పింది. మీ అన్నయ్య కూడా మందుకు బానిసై అప్పులు చేసి మీ అమ్మను బాధపెడుతున్నాడు. కనీసం నువ్వైనా ఆమె కష్టాన్ని అర్థం చేసుకోవాలి కదా? మీ కోసం ఒంటరిగా ఎంతో కష్టపడుతుంది. మీ నాన్న లేకపోయినా మీకు ఏ లోటూ లేకుండా చూడాలని తపిస్తుంది. మీరు సంతోషంగా ఉంటే చూడాలని కోరుకుంటుంది. తన సుఖాలన్నీ వదులుకొని మీ కోసం కష్టపడుతుంది. అలాంటి తల్లిని మీరు బాధపెడుతున్నారు. మీ అమ్మ గురించి ఒక్కసారి ఆలోచించు. కచ్చితంగా మందు మానేస్తావు' అని చెప్పి మళ్లీ 15 రోజుల తర్వాత రమ్మనమని చెప్పాము.

రెండు వారాల తర్వాత వచ్చిన రాజేష్ 'తాగకుండా రెండు రోజులు కూడా ఉండలేకపోతున్నాను మేడమ్. మీరు చెప్పింది విన్న తర్వాత మానేయడానికి చాలా ప్రయత్నించాను. కానీ నా వల్ల కావడం లేదు' అని చెప్పాడు. దాంతో మేము అతన్ని డాక్టర్ దగ్గరకు వెళ్లమని చెప్పాము. అక్కడకు వెళితే పదిహేను రోజులు మందులు వాడమన్నారు. అవి వాడి మళ్లీ వస్తానని చెప్పాడు. మళ్లీ నెల రోజుల తర్వాత ఐద్వా ఆఫీస్‌కు వచ్చి 'దీని వల్ల కూడా ఫలితం లేదు మేడం, మరో మార్గమేదైనా ఉంటే చెప్పండి. నేను చచ్చిపోతానేమో అని భయంగా వుంది' అంటూ ఏడ్చాడు. అప్పుడు మేము అతన్ని రీహాబిటేషన్ సెంటర్‌కు పంపించాము.

ఆ సెంటర్లో రాజేష్‌కు అన్ని రకాల పరీక్షలు చేసి ఆరు నెలలు ట్రీట్‌మెంట్ ఇచ్చారు. ప్రస్తుతం అతనిలో చాలా మార్పు వచ్చింది. ఇంకా మూడు నెలలు అక్కడే ఉంటే మంచిదని సెంటర్ వాళ్లు చెప్పారు. 'మరో మూడు నెలల్లో పూర్తిగా మద్యం మానేసి మా అమ్మా అన్నయ్యతో హాయిగా ఉంటాను. నన్ను ఇక్కడికి పంపించి చాలా మంచి పని చేశారు. నా జీవితాన్ని నిలబెట్టారు. నన్ను మళ్లీ మనిషిని చేశారు. మళ్లీ ఉద్యోగం చూసుకున్న తర్వాత మీ దగ్గరకు అప్పుడప్పుడు వస్తుంటాను' అన్నాడు. దానికి మేము కచ్చితంగా రావొచ్చు అని అతనికి ధైర్యం చెప్పాము.

> రాజేశ్వరమ్మ ఓ ప్రైవేట్ సంస్థలో పని చేస్తుంది. ఆ వచ్చిన డబ్బుతోనే ఇల్లు గడుపుతుంది. కూతురు తనకు తోచిన సహాయం చేస్తుంది. సునీల్ మాత్రం తల్లికి సాయం చేయకపోగా దొరికిన చోటల్లా అప్పులు చేస్తుంటాడు. ఆ అప్పులన్నీ రాజేశ్వరమ్మనే తీర్చాలి.

> నీ ఆరోగ్యం కూడా పాడైపోతుంది. ఇలా తాగుతుంటే నీకు పిల్లని ఎవరిస్తారు. అసలు నీకేమైనా సమస్య ఉంటే మాతో చెప్పు. పరిష్కరించేందుకు ప్రయత్నిస్తాము. అంతే కానీ నువ్వు ఇలా తాగుతూ ఉంటే నీకు జీవితమే ఉండదు. మీ నాన్న కూడా ఇలాగే తాగితాగి చనిపోయాడు. తర్వాత నీ పరిస్థితి కూడా అంతే అవుతుంది.

- వై వరలక్ష్మి
9948794051

ఎలాంటి మినహాయింపులొద్దు

(మొదటిపేజీ తరువాయి)

హైడ్రాకు మద్దతు ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. అజీజ్‌నగర్‌లో ఉన్న తన కుటుంబ సభ్యుల ఫామ్‌హౌస్‌పై వస్తున్న ఆరోపణలపై ఆయన స్పందిం చారు. ఫామ్‌హౌస్‌లోకి హైడ్రా అధికారులను పంపించాలనీ, ఎఫ్‌టీఎల్, బఫర్‌లో ఉంటే మార్క్ చేయాలని కోరారు. తన సొంత ఖర్చులతో కూల్చివేస్తా నని హామీ ఇచ్చారు. కూల్చివేతల విషయంలో కాంగ్రెస్ పార్టీ నేతగా తనకు ఎలాంటి మినహాయింపులు వద్దని తన లేఖలో పేర్కొన్నారు. సాధారణ పౌరుడి విషయంలో చట్టం ఏం చేస్తుందో అలాగే వ్యవహరించాలని కోరారు. 'మీరు, నేను కలుగజేసు కోకుండా చట్టాన్ని తన పని తాను చేసుకుపోనిద్దాం. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మూసీ ప్రక్షాళన, సుందరీకరణను స్వాగతిస్తున్నా. పార్టీ శ్రేయోభిలాషులు కొందరు మొదటి దశలో మూసీ ప్రక్షాళన చేయాలన్నారు. రెండో దశలో సుందరీకరణ చేపడితే బాగుంటుందని మీకు సూచించాలని కోరారు. మూసీ సుందరీకరణపై మీ ఆసక్తి, సమర్థతను గమనించే.. ఇవి మీ దృష్టికి తీసుకురాలేదు. పేదలకు నష్టం లేకుండా మన ప్రభుత్వం చేపట్టే అన్ని పనులనూ స్వాగతిస్తున్నా. కొంత మంది నేతలు వారి స్వప్రయోజనాల కోసమే విమర్శలు చేస్తున్నారు. మూసీ విషయంలో ప్రతిపక్షాలది మొసలి కన్నీరేనని ప్రజలందరికీ తెలుసు. మీ ఆశయాలను దెబ్బతీసే కొంతమంది ప్రయత్నాలను నేను ఖండిస్తున్నా' అని పేర్కొన్నారు.

సీఎం భుజంపై తుపాకీ పెట్టి నన్ను కాల్చాలని చూస్తున్నారు

సీఎం భుజంపై తుపాకీ పెట్టి నన్ను కాల్చాలనీ, తద్వారా సీఎం రేవంత్‌రెడ్డిని ఇరుకున పెట్టాలని ప్రయత్నిస్తున్నారని కేవీపీ లేఖలో పేర్కొన్నారు. వాస్తవానికి పార్టీ శ్రేయోభిలాషులు కొందరు మొదటి దశలో మూసీ ప్రక్షాళన, రెండో దశలో సుందరీకరణ చేపడితే బాగుంటుందని సీఎంకు సూచించాలంటూ తనను కోరినా మూసీ సుందరీకరణపై సీఎం ఆసక్తిని గమనించి, ఆయన ఆలోచన, విజన్, సమర్థతపై నమ్మకంతో పార్టీ నాయకులు చెప్పిన విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లలేదని వెల్లడించారు. పేదలకు నష్టం కలుగకుండా ప్రభుత్వం చేపట్టే అన్ని పనులనూ ఒక క్రమశిక్షణ కలిగిన కాంగ్రెస్ కార్యకర్తగా స్వాగతిస్తున్నట్టు తెలిపారు. అయితే ఈ ప్రాజెక్టు విషయంలో అటు బీఆర్ఎస్, ఇటు బీజేపీ నాయకులు వారి పెంపుడు మీడియాతో తప్పుడు వార్తలు చెప్పిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు అన్యాయం పేరుతో వారు మాట్లాడేది వారి స్వప్రయోజనాల కోసమేనని ఆరోపించారు.

సీఎం ఆశయాన్ని దెబ్బతీసే ప్రయత్నం

దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలు, మైనార్టీలు, పేదల అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ పార్టీ మౌలిక సిద్ధాంతమని ఆయన తెలిపారు. హైడ్రా విషయంలో వీలు చూసుకుని సంబంధిత అధికారులను తన ఫామ్‌హౌస్‌కు పంపించాలనీ, చట్ట ప్రకారం అక్కడ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిని మార్క్ చేస్తే, ఏదైనా కట్టడం మార్క్ పరిధిలో ఉంటే 48 గంటల్లో సొంత ఖర్చులతో తమ కుటుంబ సభ్యులు కూలుస్తారని హామీ ఇస్తున్నట్టు తెలిపారు. అయితే మార్కింగ్ ప్రక్రియ పారదర్శకంగా జరగాలని తాను ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆ మార్కింగ్ చేసే సమయం, తేదీ ముందే ప్రకటిస్తే తనపై పదే పదే ఆరోపణలు చేస్తున్న ప్రతిపక్ష నాయకులు, వారి అనుకూల మీడియా కూడా వచ్చి ఈ ప్రక్రియను వీక్షించే అవకాశం ఉంటుందని వివరించారు. 1980 నుంచి హైదరాబాద్‌లో స్థిర నివాసం ఏర్పర్చుకుని అప్పటి నుంచి ప్రతి ఎన్నికలో ఓటరుగా పాల్గొంటున్నాననీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు, తన మిత్రులు, శ్రేయోభిలాషుల సహకారంతో వనరులు సమకూర్చుతూ వారి గెలుపునకు కృషి చేస్తున్నట్టు తెలిపారు.

పార్టీకి నష్టం కలిగించే పని చేయను

క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన కాంగ్రెస్ కార్యకర్తగా ప్రాంతాలకు అతీతంగా జాతీయ పార్టీ కాంగ్రెస్ బలోపేతానికి తన శాయశక్తులా ప్రయత్నిస్తున్నానని పేర్కొన్నారు. తన వల్ల పార్టీకి నష్టం కలిగించే ఏ పని తాను చేయననీ, చేయలేనని స్పష్టం చేశారు. తాను, డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి దాదాపు మూడు దశాబ్దాల కిందట 1996లోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. తన తుది ఊపిరి ఉన్నంత వరకు ఈ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. 1984 నుంచి ఇప్పటి వరకు ఏఐసీసీ సభ్యుడిగా ఉంటూ దాదాపు ఐదు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో నిబద్ధత కార్యకర్తగా తాను కొనసాగుతున్నానని, తాను పార్టీలో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తనని వివరించారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి కార్యక్రమాన్ని, పథకాన్ని త్రికరణ శుద్ధిగా సమర్థిస్తానని వివరించారు. తాను ప్రభుత్వ నిర్ణయాలను చిత్తశుద్ధితో అమలు చేయడానికి శాయశక్తులా కృషి చేస్తానని ఇవాళ ఓ కాంగ్రెస్ సీఎంకు చెప్పాల్సి రావడం బాధాకరమే అయినా తప్పులేదని ఆయన పేర్కొన్నారు.

వాతావరణ మార్పులతో అన్నదాత బెంబేలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ కార్యక్రమాలు, కొన్ని ప్రైవేటు నిధులతో నడుస్తున్న ప్రాజెక్టులు ఆఫ్రికా, మధ్య అమెరికా, ఇతర ఆసియా దేశాలలో వాతావరణ మార్పులను తట్టుకొనే పంటలను అభివృద్ధి చేస్తున్నాయి.

కష్టాల కడలిని ఈదుతున్న రైతులు

మన దేశంతో పాటు అనేక ప్రపంచ దేశాలు వాతావరణ మార్పులను తట్టుకోలేకపోతున్నాయి. ఆయా దేశాలపై అధిక వర్షాలు, కరువు కాటకాల ప్రభావం ఎక్కువగా పడుతోంది. ఈ నేపథ్యంలో దేశ ప్రజలకు అవసరమైన ఆహారాన్ని అందించడంతో పాటు ఎగుమతి చేసే స్థాయికి కూడా చేరుకోవాలంటే నూతన వంగడాలను వినియోగించక తప్పదు. దేశంలో వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల కారణంగా అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దేశంలో సుమారు 12 కోట్ల మంది రైతులు ఉన్నారు. వీరిలో ఎక్కువ మందికి ఐదు లేదా అంతకంటే తక్కువ ఎకరాల భూ కమతాలు మాత్రమే ఉన్నాయి. అనూహ్యంగా దంచికొడుతున్న వానలు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, మరోవైపు చీడపీడల దాడి...ఇవన్నీ రైతన్నను కష్టాల కడలిలో ముంచేస్తున్నాయి.

సమస్యల నుండి బయటపడాలంటే...

ఇటీవలి కాలంలో ప్రకృతి వ్యవసాయం అనే పదం ఎక్కువగా వినిపిస్తోంది. ఇందులో సహజ ఎరువుల వినియోగం ఓ భాగం. అంతర పంటలకు కూడా ప్రాధాన్యత ఉంది. పొలం గట్లపై పెద్ద పెద్ద చెట్లు పెంచుతారు. గాలులు, కోతల నుండి ఇవి పంటను రక్షిస్తాయి. పంటలపై దాడి చేసే పురుగులను ఆకర్షించేందుకు పంట మధ్యలో, గట్ల పైన పూల మొక్కలు నాటతారు. అయితే ప్రకృతి వ్యవసాయం కారణంగా దిగుబడులు తగ్గే అవకాశం ఉన్నందున ఉత్పత్తిపై ప్రభావం చూపని, వాతావరణ మార్పులను తట్టుకునే రకాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. భూగర్భ జలాలలో లవణాలు పెరగడం, తక్కువ సమయంలోనే అత్యధిక వర్షపాతం నమోదు కావడం, దీర్ఘకాల కరువు కాటకాలు, రాత్రి సమయాలలో సైతం ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడం వంటివి వరి విత్తనాలపై ప్రభావం చూపుతాయని నిపుణులు తెలిపారు. వాతావరణం వేడెక్కడం వల్ల ఎదురవుతున్న సమస్యల నుండి బయటపడాలంటే నూతన వంగడాలను ఉత్పత్తి చేయాల్సిందేనని న్యూఢిల్లీలోని భారతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ మాజీ డైరెక్టర్ అశోక్ కుమార్ సింగ్ చెప్పారు. ఈ సంస్థ గత దశాబ్ద కాలంలో రెండు వేల వరి వంగడాలను విడుదల చేసింది. వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యం ఈ వంగడాలకు ఉంది.

ఇక్రిశాట్ కూడా...

ఈ సంవత్సరం ప్రారంభంలో వివిధ పంటలకు చెందిన 109 కొత్త రకాలను ప్రధాని నరేంద్ర మోడీ విడుదల చేశారు. వీటిలో ఆహారధాన్యాలు, పప్పులు, చముర గింజలు ఉన్నాయి. దేశంలో వరి పండించే భూమిలో నాలుగో వంతును వాతావరణ మార్పులను తట్టుకునే వంగడాల ఉత్పత్తి కోసం వినియోగించేలా చూసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలను ప్రకటించింది. వేడి, చీడపీడల దాడి వంటి వివిధ రకాల ఒత్తిడులను తట్టుకునే పంట రకాలను ఉత్పత్తి చేస్తున్నామని హైదరాబాదులోని ఇక్రిశాట్‌కు చెందిన జనీలా పసుపులేటి తెలిపారు. ఈ వంగడాలు దిగుబడులను స్థిరంగా ఉంచడమే కాకుండా పంటలలో పౌష్టికాహార నాణ్యతను పెంచుతాయని, ఇవి రైతులు, వినియోగదారులు...వీరిద్దరికీ ప్రయోజనకరంగా ఉంటాయని ఆయన చెప్పారు.

ఏం చేయాలంటే...

వాతావరణ మార్పుల ప్రభావాన్ని తట్టుకునే రకాలను ఉత్పత్తి చేయడానికి శాస్త్రవేత్తలు విశేష కృషి చేస్తున్నప్పటికీ అవి రైతులకు గరిష్ట స్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాల్సిన అవసరం ఉంది. ' నూతన వంగడాలపై రైతులకు అవగాహన కల్పించాలి. వాటిని సరసమైన ధరలను అందుబాటులో ఉంచాలి. వాటిని ఎలా వినియోగించాలో అన్నదాతలకు శిక్షణ ఇవ్వాలి' అని ఐరాస వాతావరణ నివేదికల రూపకర్త అదితి ముఖర్జీ అభిప్రాయపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా కృషి చేయడం వల్లనే 1960వ దశకంలో వచ్చిన హరిత విప్లవం విజయం సాధించిందని గుర్తు చేశారు. వ్యవసాయ పరిశోధన, అభివృద్ధి కోసం మరిన్ని నిధులు కేటాయించాలని పలువురు శాస్త్రవేత్తలు సూచించారు. వ్యవసాయ స్థూల దేశీయోత్పత్తిలో కనీసం ఒక శాతంతో సమానమైన నిధులనైనా కేటాయించాలని వ్యవసాయ శాస్త్రవేత్త సింగ్ కోరారు.

పేదల ఇండ్లు కూల్చితే ఊరుకోం

(మొదటిపేజీ తరువాయి)

బాధితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. మూసీని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడం కోసం పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలు నాశనం చేయడం తగదన్నారు. లక్షల విలువ చేసే ఇండ్లను కూల్చి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తామంటే సహేతుకమేనా అని ప్రశ్నించారు. ఇక్కడ ఉపాధి అవకాశాలు వదిలి ఎక్కడికో తరలిస్తామంటే ఎలా బతకాలని అన్నారు. పేదలకు అండగా తాము నిలబడతామని, వారి ఇండ్లు కూలుస్తామంటే ఊరుకునేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎన్నికలు వచ్చినప్పుడే.. రాజకీయ స్వలాభం కోసమే కొన్ని పార్టీలు వస్తాయని, తమ పార్టీ ఎక్కడ పేదలు కష్టాల్లో, సమస్యల్లో ఉంటే అక్కడికి వెళ్లి వారికి అండగా ఉంటుందని తెలిపారు.

ఎస్.వీరయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మూసీ సుందరీకరణ పేరుతో రూ. లక్షన్నర కోట్లతో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ప్రజలపై యుద్ధం ప్రకటించటం సరికాదన్నారు. సంపన్నుల వ్యాపారాల కోసం, కమీషన్ల కోసం, కాంట్రాక్టర్లు, తమ నాయకులు లబ్ధి పొందడానికి ప్రజల ఇండ్లను కూల్చడమేంటని ప్రశ్నించారు. పేదల జీవనోపాధి దెబ్బతింటుందన్నారు. పేదల విషయంలో ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే తాము ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్యాచరణలో ముందుగా కాలుష్యంపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశ్రామిక వ్యర్థాలు, హైదరాబాద్ మురుగు కలిసి మూసీ కాలుష్య కాసారంగా మారిందని, ముందుగా దాన్ని ప్రక్షాళన చేయాలని అన్నారు. మూసీ కాలుష్యపు నీటితో పండించిన పంటలను హైదరాబాద్ ప్రజలు తిని అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. ఇదే నీటితో పెరిగిన గడ్డి తిని గేదెల పాలు కూడా విషతుల్యంగా మారుతున్నాయన్నారు. వాటితో ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని, ప్రభుత్వానికి అది పట్టదా ?అని ప్రశ్నించారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి పి.సత్యం మాట్లాడుతూ.. ప్రజలు తమ ఇండ్లను, జీవనోపాధిని కాపాడుకోవడానికి ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

"మా ఇల్లు మాకే కావాలి"

మూసీ నిర్వాసిత ప్రాంతాల్లో పర్యటించిన సీపీఐ(ఎం) బృందానికి పలువురు స్థానికులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఎప్పుడొచ్చి కూలుస్తారో అని నిత్యం భయంతో బతుకుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా, ఇండ్లను ఖాళీ చేయబోమని, ఇక్కడ ఉపాధి వదిలి ఎక్కడికీ వెళ్లలేమని.. చావైనా బతుకైనా ఇక్కడే అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.వినోద, జె.చంద్రశేఖర్, ఎ.అశోక్, డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, సీపీఐ(ఎం) నాయకులు శ్రీనివాసులు, సబిత, సృజన, ఉప్పల్ కార్యదర్శి జె.వెంకన్న, వై.వెంకటేశ్వర్లు, భీష్మాచారి, శేషు, పద్మ, లలిత, నాగరాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా కూల్చివేతలపై స్టేకి నిరాకరణ : హైకోర్టు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైడ్రా కూల్చివేత చర్యలు వివక్షతో ఉన్నాయంటూ కే.ఏ.పాల్ వ్యక్తిగత హోదాలో వేసిన పిల్‌ను శుక్రవారం హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాథే బెంచ్ విచారించింది. పేదల ఇండ్లను కూల్చేస్తున్న ప్రభుత్వం సీఎం సోదరుడి ఇంటికి నోటీసు ఇచ్చి నెల రోజులైనప్పటికీ కూల్చివేయలేదంటూ పాల్ పిల్ వేశారు. ప్రభుత్వ స్థలాలు, చెరువుల బఫర్ జోన్స్, ఎఫ్‌టీఎల్ ప్రాంతాల్లో ఆక్రమణలు, అక్రమ నిర్మాణాల కూల్చివేత చర్యలను నిలిపివేయాలని పాల్ వాదించారు. చెరువుల రక్షణ చర్యలు సముచితమే అయినప్పటికీ కూల్చివేత చర్యలు చట్ట ప్రకారం లేనందున స్టే ఇవ్వాలని కోరారు. సర్వే చేశాక చర్యలు తీసుకోవాలనీ, కూల్చివేసే ముందు 30 రోజుల గడువు ఇవ్వాలనీ, పేదలకు పరిహారంతోపాటు పునరావాసం కల్పించేలా ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. హైడ్రా కూల్చివేత చర్యలపై స్టే ఇవ్వాలని కోరారు. వాదనల తర్వాత ధర్మాసనం, కూల్చివేతల్లో వివక్షత గురించి వివరాలు ఇవ్వకుండా ఏ సమాచారం లేకుండా స్టే ఇవ్వలేమని చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వ వాదనల తర్వాత మధ్యంతర ఉత్తర్వుల అంశాన్ని పరిశీలన చేస్తామంది. రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులిచ్చింది.

రూ.2 లక్షల రుణమాఫీ ఏమాయే?

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా డోర్నకల్ మండలం దరావత్ తండాలో ఒక రైతు, దుబ్బాక మండలం చిట్టాపూర్ గ్రామంలో సురేందర్ రెడ్డి అనే రైతు రుణమాఫీ కాక చనిపోయినట్టు చెప్పారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలు అమలు చేయాలని కోరుతూ ఢిల్లీకి వెళ్లి రాహుల్‌గాంధీ ఇంటి ముందు ధర్నా చేస్తామని తెలిపారు. వడ్ల కొనుగోలు కేంద్రాల వద్దకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వస్తే రైతులు, ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. బతుకమ్మ పండుగకు చీరల పంపిణీ, కేసీఆర్ కిట్లు బంద్ అయ్యాయని గుర్తు చేశారు. పాలకుర్తిలో దయాకర్‌రెడ్డి ఓడిపోయినా సరే మీతోనే ఉంటున్నాడని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో తనపై 300 కేసులు పెట్టారని, తనపై ఎన్ని కేసులు పెట్టినా రేవంత్‌రెడ్డిని వదిలే ప్రసక్తే లేదని తెలిపారు. రేవంత్ రెడ్డి రైతులకు బాగా మంచి చేశాడని కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీలో చేరారని, స్టేషన్ ఘన్‌పూర్‌లో బై ఎలక్షన్స్ వస్తాయని, తాటికొండ రాజయ్యను గెలిపించుకుందామని అన్నారు ఈ కార్యక్రమంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ కవిత, మాజీ స్పీకర్ మధుసుదనా చారి, మాజీ ఎమ్మెల్యే తాడికొండ రాజయ్య, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల్లో సీఎం ఫెయిల్

మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో శాంతిభద్రతల నియంత్రణలో ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ఘోరంగా విఫలమయ్యారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాజీ మంత్రి టీ హరీశ్‌రావు విమర్శించారు. హోంశాఖను కూడా ముఖ్యమంత్రే నిర్వహిస్తున్నారనీ, ఆయన హయాంలో 9 నెలల్లో మహిళలపై రెండువేల అత్యాచారాలు జరిగాయని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యం అని గొప్పలు చెప్పుకోవడమే తప్ప, మహిళలకు ఒనగూరిన ప్రయోజనం ఏమీ లేదన్నారు. తాజాగా ఇద్దరు మైనర్ బాలికలపై జరిగిన అత్యాచార ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా భద్రతపై సాక్షాత్తు అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని హెచ్చరించినా, నిర్లక్ష్యం వీడలేదన్నారు. గత ప్రభుత్వం మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందనీ, షీ టీమ్స్, సఖి భరోసా కేంద్రాలు ఏర్పాటుచేశామని తెలిపారు. మైనర్ బాలికలపై అత్యాచారానికి పాల్పడిన దుర్మార్గులకు కఠిన శిక్షలు పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

టీజీపీఎస్సీ వద్ద గ్రూప్-1 పోస్టర్ల కలకలం

(మొదటిపేజీ తరువాయి)

అకాడమి పుస్తకాలు పోటీ పరీక్షలకు ప్రామాణికం కాదు'అని హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన నేపథ్యంలో ఈ పోస్టర్లను అంటించడం గమనార్హం. అకాడమి పుస్తకాలను ఎవరూ కొనొద్దని విజ్ఞప్తి చేశారు. 'టీజీపీఎస్సీ ముందు నేను ఒక నియంతను. తప్పు జరిగితే ఒప్పుకోను'అని పోస్టర్లు వెలిశాయి. గ్రూప్-1 రాతపరీక్షల్లో 150 ప్రశ్నలను తయారు చేయలేని టీజీపీఎస్సీ ఎందుకు, సిగ్గు సిగ్గు అంటూ పోస్టర్లపై రాశారు. టీజీపీఎస్సీ వల్ల నిరుద్యోగ అభ్యర్థులకు ఎన్ని తిప్పలో అన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఈ ఏడాది ఫిబ్రవరి 19న గ్రూప్-1 నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే. గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్షను జూన్ తొమ్మిదిన నిర్వహించింది. ఈ పరీక్షకు 4.03 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 3.02 లక్షల మంది హాజరయ్యారు. వారిలో 31,382 మంది అభ్యర్థులు గ్రూప్-1 మెయిన్స్‌కు ఎంపికయ్యారు. గ్రూప్-1 మెయిన్స్ రాతపరీక్షలు ఈనెల 21 నుంచి 27వ తేదీ వరకు హెచ్ఎండీఏ పరిధిలో జరుగుతాయి. గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్షల కీపై అభ్యంతరాలు ఉండడంతో కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఇరువైపులా వాదనలు విన్న కోర్టు తీర్పును రిజర్వు చేసినట్టు తెలిసింది.

నవచిత్రం

విజయ్ ఆఖరి చిత్రం దళపతి 69


పూజా హెగ్డే, విజయ్


విజయ్ సినిమా కెరీర్‌లో ఆఖరి చిత్రం 'దళపతి 69'ని అత్యంత వైభవంగా ప్రారంభించింది కేవీయన్ ప్రొడక్షన్స్.
సినిమాలో నటించే నటీనటులు, పని చేసే సాంకేతిక నిపుణుల సమక్షంలో ఆత్మీయంగా ఈ చిత్ర పూజా కార్యక్రమాలు జరగటం విశేషం. శనివారం నుంచి సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుంది. విజయ్ కెరీర్‌లో ఇదొక హిస్టారిక్ ప్రాజెక్ట్. సిల్వర్‌స్క్రీన్ మీద ఆయన చివరిసారిగా కనిపించనున్న చిత్రం ఇదే. అలాగే విజయ్ ఫ్యాన్స్‌కి ఇదొక ఎమోషనల్ ప్రాజెక్ట్. విజయ్ సరసన ఈ చిత్రంలో పూజా హెగ్డే నాయికగా నటిస్తున్నారు. బాబీ డియోల్ కీలక పాత్రలో కనిపిస్తారు. గౌతమ్ వాసుదేవ మీనన్, ప్రియమణి, ప్రకాష్ రాజ్, మమిత బైజు ప్రధాన పాత్రల్లో మెప్పించడానికి సిద్ధమవుతున్నారు.
హెచ్.వినోద్ దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. కేవీయన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె నారాయణ నిర్మిస్తున్నారు. అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. సత్యన్ సూర్యన్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తారు. ప్రదీప్ ఇ రాఘవ్ ఈ సినిమాకు ఎడిటింగ్ విభాగాన్ని హ్యాండిల్ చేస్తున్నారు. అనల్ అరసు యాక్షన్ కొరియోగ్రఫీని అందిస్తున్నారు. సెల్వ కుమార్ ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. తమిళం, తెలుగు, హిందీలో వచ్చే ఏడాది అక్టోబర్‌లో ఈ సినిమా విడుదల కానుంది.

శ్వాగ్‌కి అద్భుతమైన రెస్పాన్స్


శ్రీ విష్ణు

శ్రీవిష్ణు, డైరెక్టర్ హసిత్ గోలి కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'శ్వాగ్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై నిర్మాత టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. శుక్రవారం విడుదలైన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించి, విమర్శకులు ప్రశంసలు అందుకుంది.
ఈ నేపథ్యంలో హీరో శ్రీవిష్ణు మాట్లాడుతూ, 'ప్రేక్షకుల నుంచి చాలా మంచి స్పందన వస్తోంది. ముఖ్యంగా లేడీస్, ఫ్యామిలీ ప్రేక్షకుల నుంచి విపరీతమైన అప్రిషియేషన్ వస్తోంది. కథ, పెర్ఫార్మెన్స్, కొత్త కంటెంట్‌ను ప్రేక్షకులు చాలా అద్భుతంగా రిసీవ్ చేసుకుంటున్నారు' అని అన్నారు.
'సినిమాలో కొత్త విషయాలని హత్తుకునేలా చెప్పాం. ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని డైరెక్టర్ హసిత్ గోలి చెప్పారు.
నిర్మాత టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ, 'శ్వాగ్ కమర్షియల్ ఫిల్మ్. కంటెంట్ పరంగా లాంగ్ పీరియడ్ గుర్తుండిపోయే సినిమా అని నమ్మే తీశాం. మేము అనుకున్నట్లు సినిమా వచ్చింది. అన్ని చోట్ల నుంచి చాలా మంచి రెస్పాన్స్ వస్తోంది. సినిమా ఎక్స్‌ట్రార్డినరీగా ఆడుతోంది' అని తెలిపారు.

మాస్ జాతర సందడి షురూ..


కిరణ్ అబ్బవరం

హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న భారీ పీరియాడిక్ థ్రిల్లర్ 'క'. నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ పై చింతా గోపాలకృష్ణ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శక ద్వయం సుజీత్, సందీప్ విలేజ్ బ్యాక్ డ్రాప్ యాక్షన్ థ్రిల్లర్ కథతో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. త్వరలో తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు ఈ సినిమాని తీసుకురాబోతున్నారు.
ఈ సినిమా నుంచి 'మాస్ జాతర ' సాంగ్‌ను ఈ నెల 7వ తేదీన విడుదల చేయబోతున్నారు. నేటి (శనివారం) ఉదయం 10.05 ఈ సాంగ్ ప్రోమో రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. సామ్ సీఎస్ మ్యూజిక్ అందించిన ఈ సినిమా నుంచి 'వరల్డ్ ఆఫ్ వాసుదేవ్..' సాంగ్ ఇప్పటికే రిలీజై హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకుంది. 'మాస్ జాతర' సాంగ్ మీద కూడా మ్యూజిక్ లవర్స్‌లో మంచి ఎక్స్‌పెక్టేషన్స్ ఉన్నాయి. ఈ సినిమాను తెలుగులో ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి, మలయాళంలో హీరో దుల్కర్ సల్మాన్ తన వేఫరర్ ఫిలింస్ పై రిలీజ్ చేయబోతున్నారు.

దసరా బరిలో విశ్వం


గోపీచంద్, కావ్యా థాపర్

గోపీచంద్, దర్శకుడు శ్రీను వైట్ల ఫస్ట్ కలయికలో వస్తున్న చిత్రం 'విశ్వం'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, వేణు దోనేపూడి చిత్రాలయం స్టూడియోస్‌పై టిజి విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. దోనేపూడి చక్రపాణి సమర్పిస్తున్నారు.
ఫస్ట్ సింగిల్ 'మొరాకో మగువా', సెకెండ్ సింగిల్ 'మొండి తల్లి పిల్ల నువ్వు' సాంగ్స్ చార్ట్‌బస్టర్ హిట్ అయ్యాయి. మేకర్స్ శుక్రవారం థర్డ్ సింగిల్ 'వస్తాను వస్తానులే..'ని రిలీజ్ చేశారు. చేతన్ భరద్వాజ్ లవ్లీ రొమాంటిక్ నెంబర్‌గా ఈ సాంగ్‌ని బ్యూటీఫుల్‌గా కంపోజ్ చేశారు. వెంగి రాసిన లిరిక్స్ లీడ్ పెయిర్ కెమిస్ట్రీని అద్భుతంగా ప్రజెంట్ చేశాయి. కపిల్ కపిలన్ తన గ్రేస్‌ఫుల్ వోకల్స్‌తో కట్టిపడేశారు.
ఈ సాంగ్‌లో గోపీచంద్, కావ్యా థాపర్ కెమిస్ట్రీ మెస్మరైజింగ్‌గా ఉంది. ఫారిన్, బీచ్ ల్యాండ్ స్కేప్‌లో షూట్ చేసిన ఈ సాంగ్‌లో విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. థియేటర్స్‌లో ఈ సాంగ్ ఐఫీస్ట్‌లా ఉండబోతోంది.
దసరా కానుకగా ఈనెల 11న ఈ సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది అని చిత్ర యూనిట్ తెలిపింది. గోపీచంద్, కావ్య థాపర్, వెన్నెల కిషోర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి దర్శకత్వం: శ్రీను వైట, క్రియేటివ్ ప్రొడ్యూసర్: కృతి ప్రసాద్, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, డీఓపీ: కె.వి.గుహన్, సంగీతం: చైతన్ భరద్వాజ్, రైటర్స్: గోపీ మోహన్, భాను-నందు, ప్రవీణ్ వర్మ, ఎడిటర్: అమర్ రెడ్డి కుడుముల, ఆర్ట్ డైరెక్టర్: కిరణ్ కుమార్ మన్నె, ఫైట్ మాస్టర్: రవి వర్మ, దినేష్ సుబ్బరాయన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కొల్లి సుజిత్ కుమార్, ఆదిత్య చెంబోలు.

మీ ఊహకి మించి..


ధృవ సర్జా, వైభవి శాండిల్య

ధృవ సర్జా టైటిల్ పాత్రలో నటించిన పాన్ ఇండియా చిత్రం 'మార్టిన్'. ఎ.పి.అర్జున్ దర్శకత్వంలో వాసవీ ఎంటర్‌ప్రైజెస్, ఉదయ్ కె.మెహతా ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై ఉదయ్ కె.మెహతా, సూరజ్ ఉదయ్ మెహతా ఈ యాక్షన్ థ్రిల్లర్‌ను నిర్మించారు. ఈ చిత్రం దసరా కానుకగా ఈనెల 11న రిలీజ్ కాబోతోంది. ఈ క్రమంలో శుక్రవారం చిత్రయూనిట్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించింది.
అర్జున్ మాట్లాడుతూ, "మార్టిన్' గురించి చాలా ఖర్చు పెట్టామని చెప్పాల్సిన పని లేదు. టీజర్, ట్రైలర్, పాటలు చూస్తే అందరికీ తెలుస్తుంది. మా చిత్రం ఈనెల 11న రాబోతోంది. దసరాకి చాలా సినిమాలు వస్తున్నాయి. అన్ని చిత్రాలు చూడండి. మా మూవీని కూడా చూడండి. ధృవ సర్జా ఈ చిత్రానికి చాలా కష్టపడ్డాడు. ప్రేక్షకుడు ఎంత ఊహించుకుని వచ్చినా.. అంతకుమించి ఈ సినిమా ఉంటుంది. చాలా గ్యాప్ తరువాత ఇలాంటి కమర్షియల్ చిత్రం రాబోతోందని చెప్పగలను. వైభవి అద్భుతంగా నటించారు. ప్రేక్షకులు కూడా ఈ మధ్య కాలంలో ఇలాంటి సినిమా రాలేదని కచ్చితంగా చెబుతారని ఆశిస్తున్నాను' అని తెలిపారు. నిర్మాత ఉదయ్ కే మెహతా మాట్లాడుతూ, 'ఈ సినిమాను తెలుగులో చౌదరి డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారు. ఆయనకు సినిమా పట్ల ఎంతో ప్యాషన్ ఉంది. అందుకే ఆయన్ని నమ్మి ఈ చిత్రాన్ని ఆయనకు ఇచ్చాను. అర్జున్, ధృవ్ సర్జా నాకు ఎంతో సపోర్టివ్‌గా ఉన్నారు. వాళ్ళు లేకపోతే ఈ చిత్రం ఇంత బాగా వచ్చేది కాదు.' అని అన్నారు.
'ఈ సినిమా నాకు ఎంతో ప్రత్యేకం. నేను పోషించిన ప్రీతి పాత్ర అందర్నీ మెప్పిస్తుంది' అని నాయిక వైభవి శాండిల్య చెప్పారు.

> మా మావయ్య అర్జున్ లేకపోతే నేను ఈ స్థాయిలో ఉండేవాడ్ని కాదు. ఈ మూవీని చూడండి.. నాకు టాలెంట్ ఉందని అనుకుంటే ఆ తరువాత నా సినిమాలను ఎంకరేజ్ చేయండి. లేదంటే వదిలేయండి. కానీ మీకు సినిమా నచ్చితే అందరికీ చెప్పండి.
> - హీరో ధృవ సర్జా

కాంతార కాంతార..


సిమ్రాన్ శర్మ, మాధవ్

రవితేజ తమ్ముడు రఘు కొడుకు మాధవ్ హీరోగా నటిస్తున్న సినిమా 'మిస్టర్ ఇడియట్'. సిమ్రాన్ శర్మ హీరోయిన్. జేజేఆర్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎల్ఎల్‌పీ పతాకంపై యలమంచి రాణి సమర్పణలో నిర్మాత జేజేఆర్ రవిచంద్ నిర్మిస్తున్నారు. గౌరీ రోణంకి డైరెక్ట్ చేస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. రీసెంట్‌గా రిలీజ్ చేసిన ట్రైలర్ డిజిటల్ వ్యూస్‌లో హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకుంది. తాజాగా శుక్రవారం ఈ సినిమా నుంచి 'కాంతార కాంతార..' లిరికల్ సాంగ్‌ను హీరో నిఖిల్ సోషల్ మీడియా ద్వారా రిలీజ్ చేశారు.
పాట చాలా ఎనర్జిటిక్‌గా ఉందన్న ఆయన మూవీ టీమ్‌కు బెస్ట్ విషెస్ తెలియజేశారు.
అనూప్ రూబెన్స్ మంచి బీట్‌తో కంపోజ్ చేసిన ఈ పాటకు కాసర్ల శ్యామ్ లిరిక్స్ అందించారు. పాటలోని ఎనర్జీని రెట్టింపు చేసేలా రాహుల్ సిప్లిగంజ్ పాడారు.
'ఎందుకె చిట్టి నువ్వు ఇట్లా పుట్టినావు మందిని సంపుతావు ఏందే, మా లెక్కనే నీకు రెండు కాళ్లు చేతులు ముక్కు మూతి ఉన్నయి గాదె, బలుపు నీకు ట్విన్ బ్రదరా, ఈగో నెత్తి మీద ఫెదరా, మనషులంటే నీకు పడరా, నువ్వేమన్న అవతారా, ఎమి చూసుకుని నీకు ఇంత టెక్కూ, దిష్టి బొమ్మకైన పనికి రాదు నీ పిక్కూ ..కాంతార కాంతార కాంతారా...' అంటూ సాగుతుందీ పాట. కాలేజ్‌లో హీరోయిన్‌ను హీరో టీజింగ్ చేసే సందర్భంలో ఈ పాటను తెరకెక్కించారు.
ఈ చిత్రానికి డైలాగ్స్ - శ్యామ్, వంశీ, సంగీతం అనూప్ రూబెన్స్, లిరిక్స్ - శివశక్తి దత్తా, భాస్కరభట్ల, కాసర్ల శ్యామ్, కొరియోగ్రఫీ - భాను, జిత్తు, వెంకట్, పృథ్వీ, స్టంట్స్ - రాజేశ్ లంక, సినిమాటోగ్రఫీ - రామ్ రెడ్డి, ఆర్ట్ - కిరణ్ కుమార్ మన్నె, ఎడిటింగ్ - విప్లవ్ నైషధం, రచన, దర్శకత్వం - గౌరి రోణంకి.

నలుగురు మేయర్లుగా జీహెచ్ఎంసీ

ఎన్నికల పరిశీలనలో అంశం

- హైదరాబాద్ దశ, దిశా మారుస్తాం
- మూసీ ప్రక్షాళనకు అంతా సహకరించాలి : అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమ్మిట్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రేటర్ హైదరాబాద్‌ను నాలుగు కార్పొరేషన్ మేయర్లుగా విభజించే ఆలోచనలో ప్రభుత్వం ఉందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం మహానగర జనాభా కోటిన్నర దాటిన నేపథ్యంలో విభజన ప్రక్రియ చేపట్టిన తర్వాతే ఎన్నికలకు వెళ్లే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. శుక్రవారం అసోచాం ఆధ్వర్యంలో నగరంలోని హెచ్ఐసీసీ నోవాటెల్‌లో జరిగిన "అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమ్మిట్ 2024"కు హాజరైన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రతిపక్ష పార్టీల ద్వంద్వ విధానాలపై మండిపడ్డారు. రీజినల్ రింగ్ రోడ్డుతో హైదరాబాద్ మహానగర రూపు రేఖలు మారిపోతాయన్న మంత్రి రూ.30 వేల కోట్లతో చేపట్టే ఈ ప్రాజెక్టుకు కేంద్రం సాయం అందిస్తోందని తెలిపారు. మరో రెండు నెలల్లో రీజినల్ రింగు రోడ్డుకు టెండర్లు పిలువనున్నట్టు చెప్పారు. మూసీ సుందరీకరణకు ప్రభుత్వం ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేసిందనీ దాంతో రంగారెడ్డి, హైదరాబాద్, నల్లగొండ జిల్లా వాసులకు ప్రయోజనం చేకూరుతుందని మంత్రి తెలిపారు. మూసీ కంటే విషపూరితమైన సబర్మతిని ప్రక్షాళన చేసి మంచినీరు ప్రవహించేలా మార్చారని గుర్తు చేశారు. మూసీని ప్రక్షాళన చేస్తామని జైకా నుంచి రూ.వెయ్యి కోట్లు రుణం తీసుకున్న బీఆర్ఎస్ నాయకులు అధికారం



పోగానే మూసీ ప్రక్షాళన వద్దని గగ్గోలు పెడుతున్నారని మంత్రి విమర్శించారు. ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతుంటే.. రాజకీయాలు తగదని ఆయన ప్రతిపక్షాలకు సూచించారు.

ప్రపంచ వ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న అర్బన్ కల్చర్‌కు అనుగుణంగా తెలంగాణలో కూడా పట్టణీకరణ జరగవలసిన ఆవశ్యకత ఉందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. అందుకోసం కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం భవిష్యత్తు సవాళ్ళను ఎదుర్కొనేందుకు, అభివృద్ధికి బలమైన పునాదులు వేయడంతో పాటు రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చేసేందుకు అనేక మౌలిక సదుపాయాలను నిర్మిస్తున్నదని కోమటిరెడ్డి వివరించారు. ఇందులో భాగంగా హైదరాబాద్ దశ-దిశను మార్చేందుకు తమ ప్రభుత్వం కంకణం కట్టుకుందన్న మంత్రి అందులో భాగంగానే రోడ్లు, ఆర్ఓబీలు, ఆర్‌యూబీలు, కొత్త లింక్ రోడ్లు నిర్మించడం వంటి కీలక మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నదని చెప్పారు. అంతేకాకుండా అర్బన్ ఏరియాల్లో ఘన వ్యర్థాల నిర్వహణ సవాల్‌తో కూడుకున్నదని చెప్పిన మంత్రి.. అందుకోసం ఎస్టీపీఎస్ నిర్మించి మెరుగైన మురుగునీటి వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ఓఆర్ఆర్ పరిధిలో దాదాపు 40 శాతం జనాభా నివసిస్తుందనీ 2028 నాటికి ఇది 50 శాతం దాటే అవకాశం ఉందన్నారు. అందుకనుగుణంగా హైదరాబాద్‌లో పట్టణ విస్తరణ, మౌలిక వసతులను కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు.

దేశంలో పరిమితమైన ప్రాంతంలో అపరిమితమైన ఫ్లోర్ స్పెస్ అందించే ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనన్న మంత్రి అందుకనుగుణంగా అగ్నిమాపక వ్యవస్థ, ట్రాఫిక్ నియంత్రణ, మౌలిక వసతులు, సౌకర్యాల కల్పనవంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్టు తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనను వేగవంతం చేసేందుకు స్పీడ్ (స్మార్ట్, ప్రొయాక్టివ్, ఎఫీషియంట్, ఎఫెక్టివ్ డెలివరీ) వంటి ప్రణాళికలతో 19 ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేసేందుకు ముందుకు సాగుతున్నట్టు తెలిపారు. అందులో భాగంగానే, మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి, కొత్త విమానాశ్రయాల నిర్మాణం, శాటిలైట్ టౌన్స్ ఏర్పాటు, మెట్రో విస్తరణ, జీహెచ్ఎంసీ పునర్వ్యవస్థీకరణ, సికింద్రాబాద్, ఇతర నగరాల్లో ఎలివేటెడ్ కారిడార్లు, రీజినల్ రింగ్ రోడ్, హైకోర్ట్ భవన నిర్మాణం, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్, ఉస్మానియా నూతన భవన నిర్మాణం వంటి ప్రాజెక్టులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. హైకోర్టు భవనంలో పీపీపీ మోడల్‌లో పార్కింగ్ నిర్మించే అంశంపై ఆలోచిస్తున్నట్టు ఆయన చెప్పారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం ఇప్పటికే బడ్జెట్‌లో రూ.10వేల కోట్లు కేటాయించినట్టు ఆయన గుర్తుచేశారు.

ఈ కార్యక్రమంలో అమెరికన్ కాన్సుల్ జనరల్ (ఛీఫ్ పొలిటికల్, ఎకానమిక్ సెక్షన్), హైదరాబాద్ ఫ్రాంక్ పిటల్లూటో, ఫోనిక్స్ గ్రూప్ ఛైర్మన్ సురేష్ చుక్కపల్లి, అలార్డ్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ పూనమ్ కశ్యప్, రాంబాబు బూరుగు, అసోచాం రాష్ట్ర ప్రతినిధి దినేష్ పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి కృషి

- మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహిళా కమిషన్‌కు వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేందుకు తగిన కృషి చేస్తామని మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బుద్ధ భవన్‌లోని తెలంగాణ మహిళ కమిషన్ ప్రధాన కార్యాలయంలో సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో మహిళా కమిషన్ ఆరుగురు సభ్యులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు. ఇప్పటి వరకు వచ్చిన పిటిషన్లపై రివ్యూ చేశారు. భవిష్యత్తులో మహిళా కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాల్సిన కార్యక్రమాలు, కార్యాచరణలపై చర్చించారు. కమిషన్‌కి వచ్చే ఫిర్యాదులకు సత్వరం స్పందించడమే కాకుండా.. రెగ్యులర్ ఫాలో అప్ కూడా చేయాలని చైర్ పర్సన్ ఈ సందర్భంగా సిబ్బందికి సూచించారు.

టెన్త్, ఇంటర్ దూరవిద్య ప్రవేశాల గడువు 31 వరకు పొడిగింపు

- టాస్ డైరెక్టర్ పి.వి. శ్రీహరి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పదో తరగతి, ఇంటర్మీడియెట్ దూరవిద్య ప్రవేశాల గడువును ఈనెల 31 వరకు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) డైరెక్టర్ పివి శ్రీహరి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2024-25 విద్యాసంవత్సరంలో పదో తరగతి, ఇంటర్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ద్వారా ఈనెల 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. www.telanganaopenschools.org వెబ్‌సైట్‌ను ఆసక్తి ఉన్న విద్యార్థులు సంప్రదించాలని కోరారు. ప్రవేశాల కోసం సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించాలని తెలిపారు.

ఆటలు

ఛేదనలో చతికిల

టీమ్ ఇండియా అమ్మాయిలు తేలిపోయారు. హాట్ ఫేవరేట్‌గా బరిలోకి దిగి న్యూజిలాండ్ చేతిలో కంగుతిన్నారు. 161 పరుగుల ఛేదనలో చతికిల పడింది. ఒత్తిడిలో చిత్తయి.. ఏ దశలోనూ గెలుపు దిశగా సాగలేదు. మంధాన, షెఫాలీ, హర్మన్‌ప్రీత్ వైఫల్యంతో మిడిల్ ఆర్డర్ కుప్పకూలింది. టీ20 ప్రపంచకప్ వేటను భారత్‌ను ఓటమితో ఆరంభించింది.

- 102 పరుగులకే భారత్ ఆలౌట్
- 58 పరుగులతో కివీస్ ఘన విజయం
- ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్

దుబాయ్ (యుఏఈ) : ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ వేటను టీమ్ ఇండియా ఓటమితో ఆరంభించింది. శుక్రవారం దుబాయ్‌లో న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన.. దారుణంగా విఫలమైంది. న్యూజిలాండ్ చేతిలో 58 పరుగుల తేడాతో భారీ పరాజయం మూటగట్టుకుంది. సోఫీ డివైన్ (57 నాటౌట్, 36 బంతుల్లో 7 ఫోర్లు) అజేయ అర్థ సెంచరీతో తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 160 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్లు జార్జియా ప్లిమ్మర్ (34, 23 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), సుజీ బేట్స్ (27, 24 బంతుల్లో 2 ఫోర్లు) రాణించారు. 161 పరుగుల కఠిన ఛేదనలో టీమ్ ఇండియా చతికిల పడింది. 19 ఓవర్లలో 102 పరుగులకే కుప్పకూలింది. సమిష్టిగా చేతులెత్తేసి.. దారుణ పరాజయం చవిచూశారు. స్మృతీ మంధాన (12), షెఫాలీ వర్మ (2) సహా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (15) నిరాశపరిచారు. గ్రూప్-ఏలో తర్వాతి మ్యాచ్‌లో భారత్ ఆదివారం పాకిస్థాన్‌తో పోటీపడనుంది.

సోఫీ సూపర్ షో

మంచు ప్రభావం ఉండే దుబాయ్‌లో టాస్ నెగ్గిన న్యూజిలాండ్ మహిళలు తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నారు. ఇక్కడి పిచ్ స్లో బౌలర్లకు, స్పిన్‌కు అనుకూలం. కానీ భారత స్పిన్నర్లు ఆశించిన ప్రభావం చూపించలేదు. దీప్తి శర్మ ధారాళంగా పరుగులు సమర్పించుకుంది. కానీ పేసర్లు రాణించటంతో న్యూజిలాండ్ బ్యాటర్లకు ముకుతాడు పడింది. ఓపెనర్లు సుజీ బేట్స్ (27), జార్జియా ప్లిమ్మర్ (34) జోడీకి న్యూజిలాండ్‌కు అదిరే ఆరంభం అందించింది. 7.4 ఓవర్లలోనే 67 పరుగులు పిండుకుంది. పవర్‌ప్లేలో దంచికొట్టిన కివీస్ ఓపెనర్లు భారీ స్కోరుకు బాటలు వేశారు. కానీ రేణుక సింగ్, అరుంధతి రెడ్డి న్యూజిలాండ్ దూకుడు కట్టడి చేశారు. స్వల్ప వ్యవధిలో ఓపెనర్లు అవుటైనా.. మిడిల్‌ఆర్డర్‌లో సోఫీ డివైన్ (57 నాటౌట్) అదరగొట్టింది. భారత బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొని 33 బంతుల్లో ఏడు బౌండరీలతో అర్థ సెంచరీ బాదింది. బ్రూకీ (16), మాడీ (5 నాటౌట్) డెత్ ఓవర్లలో ధనాధన్ ఆట చూపించారు. 20 ఓవర్లలో 4 వికెట్లకు న్యూజిలాండ్ 160 పరుగులు చేసింది.


సమిష్టిగా విఫలం

భారీ ఛేదనలో టీమ్ ఇండియా అమ్మాయిలకు మంచి ఆరంభం దక్కలేదు. ఫామ్‌లో ఉన్న టాప్-3 బ్యాటర్లు డగౌట్‌కు చేరుకున్నారు. తొలి బంతి నుంచే ఎదురుదాడి వ్యూహంతో బరిలోకి దిగిన టీమ్ ఇండియాకు న్యూజిలాండ్ పంచ్ విసిరింది. స్మృతీ మంధాన (12), షెఫాలీ వర్మ (2)లు నిరాశపరిచారు. సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (15) సైతం విఫలమైంది. దీంతో 42 పరుగులకే భారత్ మూడు వికెట్లు చేజార్చుకుని ఒత్తిడిలో పడింది. ఆ తర్వాత ఏ దశలోనూ కోలుకోలేదు. జెమీమా రొడ్రిగస్ (13), రిచా ఘోష్ (12), దీప్తి శర్మ (13) మంచి ఆరంభాలను సద్వినియోగం చేసుకోలేదు. బ్యాటర్లలో ఎవరూ నిలదొక్కుకోలేదు. దీంతో పది ఓవర్లలోనే సగం వికెట్లను పడగొట్టిన న్యూజిలాండ్.. గెలుపు లాంఛనం చేసుకుంది. 19 ఓవర్లలో 102 పరుగులకు భారత్ కుప్పకూలింది. కివీస్ బౌలర్ రోస్‌మేరీ (4/19) నాలుగు వికెట్ల ప్రదర్శన చేసింది.

సంక్షిప్త స్కోర్లు

న్యూజిలాండ్ మహిళల ఇన్నింగ్స్ : 160/4 (సోఫీ డివైన్ 57, జార్జియా ప్లిమ్మర్ 34, సుజీ బేట్స్ 27, రేణుక సింగ్ 2/27)
భారత మహిళల ఇన్నింగ్స్ : 102/10 (హర్మన్‌ప్రీత్ కౌర్ 15, జెమీమా రొడ్రిగస్ 13, రోస్‌మేరీ 4/19, లీ తహుహు 3/15)

టికెట్ల విక్రయం నేటి నుంచే



- 12న భారత్, బంగ్లాదేశ్ టీ20 మ్యాచ్
- హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్ వెల్లడి

నవతెలంగాణ-హైదరాబాద్

దసరా రోజు భారత్, బంగ్లాదేశ్ మూడో టీ20 మ్యాచ్‌కు హైదరాబాద్ వేదిక కానుండగా.. తెలుగు క్రికెట్ అభిమానులు టికెట్ల కోసం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నారు. ఈ నెల 12న ఉప్పల్ స్టేడియంలో జరిగే టీమ్ ఇండియా పొట్టి పోరు మ్యాచ్ టికెట్లను నేటి నుంచి అభిమానులకు అందుబాటులో ఉంచుతున్నట్టు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు వెల్లడించారు. భారత్, బంగ్లాదేశ్ టీ20 మ్యాచ్ టికెట్ కనిష్ఠంగా రూ.750, గరిష్ఠంగా రూ.15 వేలుగా నిర్ణయించారు. గతంలో జరిగిన చేదు సంఘటనలను దృష్టిలో ఉంచుకుని ఆఫ్‌లైన్‌లో టికెట్లను విక్రయించటం లేదని, స్టేడియం పూర్తి సామర్థ్యం మేరకు అన్ని టికెట్లను ఆన్‌లైన్‌లోనే అందుబాటులో ఉంచామని జగన్‌మోహన్ రావు ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి పేటీఎం ఇన్‌సైడర్ వెబ్‌సైట్, యాప్‌లో మ్యాచ్ టికెట్లను అభిమానులు కొనుగోలు చేయవచ్చు. గతంలో మాదిరిగానే ఈ మ్యాచ్‌కు సైతం విడతల వారీగా టికెట్లను ఆన్‌లైన్‌లో ఉంచే అవకాశం ఉంది. తొలి విడతలో కనిష్ఠ ధర రూ.750 టికెట్లను అమ్మకానికి ఉంచనున్నట్టు సమాచారం. భారత్, బంగ్లాదేశ్ తొలి టీ20 ఆదివారం గ్వాలియర్‌లో జరుగనుండగా.. బుధవారం న్యూఢిల్లీ వేదికగా రెండో మ్యాచ్ షెడ్యూల్ చేశారు. సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్‌కు హైదరాబాద్ వేదికగా నిలువనుంది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

వారంలో రూ.16 లక్షల కోట్లు ఫట్

- మార్కెట్లను వెంటాడిన యుద్ధ భయాలు
- సెన్సెక్స్ 800 పాయింట్ల పతనం



ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లలో వరుసగా రెండో రోజూ యుద్ధ భయాలు కొనసాగాయి. ఇరాన్-ఇజ్రాయిల్ యుద్ధ భయాలు, చమురు ధరలు ఒక్కసారిగా పెరగడం, విదేశీ మదుపర్లు తమ ఈక్విటీలను వెనక్కి తీసుకోవడం తదితర పరిణామాలు వారాంతంలోనూ మార్కెట్లను మళ్లీ ఉక్కిరిబిక్కిరి చేశాయి. శుక్రవారం ఉదయం ఓ దశలో మార్కెట్లు పుంజుకున్నప్పటికీ.. మధ్యాహ్నం తర్వాత మళ్లీ అమ్మకాలు వెల్లువెత్తాయి. దీంతో తుదకు బీఎస్ఈ సెన్సెక్స్ 809 పాయింట్లు లేదా 0.98 శాతం పతనమై 81,688కు పడిపోయింది. అదే బాటలో ఎన్ఎస్ఈ నిఫ్టీ 200 పాయింట్లు లేదా 0.79 శాతం నష్టంతో 25,050 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ దాదాపు 800 పాయింట్ల లాభపడి 83,368 గరిష్టాన్ని తాకగా... మధ్యాహ్నం తర్వాత అమ్మకాల దెబ్బకు 81,533 కనిష్టాన్ని తాకింది. దీంతో వరుసగా ఐదో సెషన్‌లోనూ మార్కెట్లు నష్టాలు చవి చూసినట్లయ్యింది. వారాంతం సెషన్‌లో మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, ఏషియన్ పెయింట్స్, నెస్లే ఇండియా, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. ఇన్ఫోసిస్, టాటా మోటార్స్, టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్, టీసీఎస్ షేర్లు లాభపడ్డాయి. సెన్సెక్స్‌లో 2384 స్టాక్స్ క్షీణించగా.. 1564 సూచీలు లాభపడగా.. 106 షేర్లు యథాతథంగా నమోదయ్యాయి.

నిఫ్టీ 4.3 శాతం పతనం

ఈ వారంలో ఏ ఒక్క రోజూ సానుకూలత లేకపోవడంతో సెన్సెక్స్ 3,883 పాయింట్లు లేదా 4.5 శాతం క్షీణించగా.. ఎన్ఎస్ఈ 1,128 పాయింట్లు లేదా 4.3 శాతం పతనమయ్యింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ ఏకంగా 7.31 శాతం పతనమై రూ.2,771.50 వద్ద నమోదయ్యింది. ఒక్క వారంలోనే సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 4 మధ్య బీఎస్ఈ మార్కెట్ కాపిటలైజేషన్ రూ.16.67 లక్షల కోట్లు హరించుకుపోయి.. రూ.461.26 లక్షల కోట్లకు పరిమితమయ్యింది.

తరలిన రూ.30వేల కోట్ల ఎఫ్ఐఐలు

గడిచిన మూడు సెషన్లలో విదేశీ సంస్థాగత మదుపరు రూ.3.65 బిలియన్ డాలర్ల (రూ.30వేల కోట్లు పైగా) నిధులను తరలించుకుపోయారు. ఆర్థిక వృద్ధికి చైనా మరింత ఊతం ఇచ్చేలా ఇటీవల ప్రకటించిన విధానాలతో ఎఫ్ఐఐలు ఆ దేశం వైపు మొగ్గు చూపుతున్నాయి.

సంపదలో బెజోస్‌ను అధిగమించిన జూకర్‌బర్గ్

- 14వ స్థానంలో అంబానీ
- బ్లూమ్‌బర్గ్ ఇండెక్స్ వెల్లడి



న్యూయార్క్ : ప్రపంచంలో అత్యంత సంపన్నుల్లో ఇప్పటి వరకు రెండో స్థానంలో ఉన్న అమెజాన్ అధిపతి జెఫ్ బెజోస్‌ను మెటా సీఈఓ మార్క్ జూకర్‌బర్గ్ అధిగమించారు. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్ ఇండెక్స్ ప్రకారం.. రెండో అత్యంత సంపన్నుడిగా జూకర్‌బర్గ్ నిలిచారు. ఇటీవల మెటా షేర్లు అంచనాలు మించి 23 శాతం పెరగడంతో జూకర్‌బర్గ్ సంపద అమాంతం పెరిగింది. కాగా.. టెస్లా అధినేత ఎలన్‌మస్క్ 265 బిలియన్ డాలర్లతో అగ్రస్థానంలో కొనసాగారు. జూకర్‌బర్గ్ నికర సంపద 206 బిలియన్ డాలర్లకు చేరింది. 205 బిలియన్ డాలర్లతో బెజోస్ మూడో స్థానానికి తగ్గారు. భారత్‌కు చెందిన ముకేష్ అంబానీ 107 బిలియన్ డాలర్లతో 14వ స్థానంలో ఉన్నారు. గౌతమ్ అదానీ 100 బిలియన్ డాలర్లతో 17వ స్థానంలో నిలిచారు.

వచ్చే ఐదేండ్లలో తలసరి ఆదాయం రెట్టింపు

- మంత్రి సీతారామన్ అంచనా



న్యూఢిల్లీ : వచ్చే ఐదేండ్లలో ప్రజల తలసరి ఆదాయం రెట్టింపు కానుందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. శుక్రవారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన కౌటిల్య ఎకనామిక్ కాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న పలు నిర్మాణాత్మక చర్యల వల్ల ప్రజల జీవన ప్రమాణాల్లో అనూహ్య మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. దేశంలో అసమానతలు తగ్గడంతో పాటు గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. దేశంలో రూ.2,730 డాలర్ల తలసరి ఆదాయాన్ని చేరడానికి 75 ఏండ్లు పట్టిందన్నారు. మరో 2వేల డాలర్లను చేరడానికి ఐదేండ్లు మాత్రమే పడుతుందన్నారు. 2047 నాటికి స్వాతంత్ర్యం వచ్చి శతాబ్దం పూర్తికానుందని.. అప్పటి కల్లా భారత్ అభివృద్ధి చెందిన దేశాల సరసన చేరనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

హైటెక్ ఆటోమోటివ్‌లో మెర్క్యూరీకి 70 శాతం వాటా

హైదరాబాద్ : హైటెక్ ఆటోమోటివ్‌లో 70 శాతం వాటా కొనుగోలుకు తమ కంపెనీ బోర్డు ఆమోదం తెలిపిందని విద్యుత్ వాహనాల తయారీ సంస్థ మెర్క్యూరీ ఈవీ టెక్ లిమిటెడ్ వెల్లడించింది. దీంతో హైటెక్ ఆటోమోటివ్ తమ అనుబంధ సంస్థగా ఉండనుందని పేర్కొంది. ఇదే క్రమంలో మూడు చక్రాల ఈవీ మార్కెట్‌లో తమ స్థానం బలోపేతంపై దృష్టి కేంద్రీకరించినట్లయ్యిందని తెలిపింది. మెజారిటీ వాటా కొనుగోలు ద్వారా తమ ప్రస్తుత కార్యకలాపాలు, పంపిణీ నెట్‌వర్క్‌లు, కస్టమర్ బేస్ పెరగనుందని పేర్కొంది.

నల్లగండ్లలో వేడుకగా సీబీఎస్ ప్రారంభం



హైదరాబాద్ : నగరంలోని నల్లగండ్లలో సీబీయస్ (చందన బ్రదర్స్ షాపింగ్ మాల్)ను ఏర్పాటు చేశారు. శనివారం దీన్ని సినీనటి కుమారి వైష్ణవి చైతన్య లాంచనంగా ప్రారంభించారు. అందరికి అందుబాటు ధరలలో వన్ స్టాప్ మాల్ సీబీయస్ ప్రారంభమవటం ఎంతో సంతోషదాయకమని షోరూం ఎండీ జానా సురేష్ పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాలతో తమకు 40 ఏండ్ల అనుబంధం ఉందన్నారు.

నవంబర్‌లో కాస్ట్యూమ్స్ అండ్ ఫ్యాషన్ అవార్డ్స్

హైదరాబాద్ : కాస్ట్యూమ్స్ అండ్ ఫ్యాషన్ అవార్డ్స్ (సీఎఫ్ఏ) 2024ని నవంబర్ 30, డిసెంబర్ 1న నిర్వహించనున్నట్టు ఆర్‌వీ వల్లభనేని స్టూడియోస్ తెలిపింది. నగరంలోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో దీన్ని ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొంది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం నిర్వాహకులు ఆవిష్కరించారు. ఇది టాలీవుడ్ సినిమా వైభవానికి తోడ్పడుతున్న సాంకేతిక నిపుణులు, కాస్ట్యూమ్ డిజైనర్ల ప్రతిభను వెలుగులోకి తీసుకువచ్చే ప్రయత్నమని వల్లభనేని స్టూడియోస్ ప్రతినిధులు వల్లభనేని గోపీచంద్, అరుణ శ్రీ సుకల తెలిపారు. దక్షిణ భారతదేశంలో భారీ స్థాయిలో నిర్వహించబోతున్న తొలి అవార్డుల వేడుక ఇదేనని పేర్కొన్నారు.

రాష్ట్ర పోలీసులు అప్రమత్తం

- సీనియర్ అధికారులతో పరిస్థితిని సమీక్షించిన డీజీపీ

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్ర సరిహద్దుల్లోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో దట్టమైన అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో శుక్రవారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 36 మందికి పైగా మావోయిస్టులు చనిపోవటంపై రాష్ట్ర పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. అబూజ్‌మడ్‌లో సాగుతున్న ఎన్‌కౌంటర్‌పై పోలీసు ఉన్నతాధికారులతో రాష్ట్ర డీజీపీ జితేందర్ పరిస్థితిని సమీక్షించారు. మావోయిస్టులకు పెట్టని కోటగా నిలిచిన అత్యంత దుర్భేద్యమైన అబూజ్‌మడ్‌లో ఈ భారీ ఎన్‌కౌంటర్ చోటు చేసుకోవటం, దాంతో ఏదేనీ విపత్కర పరిస్థితులు రాష్ట్రంలో మావోయిస్టుల ద్వారా తలెత్తే అవకాశం ఉన్నదా అనే కోణంలో అధికారులతో డీజీపీ చర్చించినట్టు తెలిసింది. ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డి, ఎస్ఐబీ ఐజీ సుమతి, గ్రేహౌండ్స్ అదనపు డీజీ స్టీఫెన్ రవీంద్ర, రాష్ట్ర శాంతి భద్రతల విభాగం అదనపు డీజీ మహేశ్ భగవత్, మల్టీజోన్-1 ఐజీ తరుణ్ జోషి మొదలుకొని ఉత్తర తెలంగాణ జిల్లాలకు చెందిన ఎస్పీలతో మావోయిస్టుల కదలికలపై డీజీపీ చర్చించారని సమాచారం.

మావోయిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని భారీ ఎత్తున అబూజ్‌మడ్‌లో సమావేశాన్ని నిర్వహిస్తున్నారనే సమాచారంతో సీఆర్‌పీఎఫ్ కోబ్రా దళం, బీఎస్ఎఫ్‌తో పాటు ఛత్తీస్‌గఢ్ యాంటీ నక్సలైట్ విభాగం అబూజ్‌మడ్‌ను చుట్టుముట్టటంతో భారీ ఎన్‌కౌంటర్ చోటు చేసుకున్నది. ప్రాథమికంగా 36 మంది మావోయిస్టులు మరణించినట్టు పోలీసు వర్గాలు చెప్తుండగా.. ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నదని రాష్ట్ర ఇంటలిజెన్స్ విభాగం అనుమానిస్తున్నది. ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు నాయక శ్రేణిలోని వారు కొందరు మరణించే అవకాశం కూడా లేకపోలేదని అనుమానిస్తున్నారు. సరిహద్దు రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న ఈ భారీ ఎన్‌కౌంటర్ కారణంగా రాష్ట్రంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని డీజీపీ అధికారులను ఆదేశించారు.

భారత్, శ్రీలంక ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి కృషి

శ్రీలంక అధ్యక్షుడితో జై శంకర్ భేటీ



కొలంబో : విదేశాంగ మంత్రి జై శంకర్ శుక్రవారం శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకెతో సమావేశమయ్యారు. భారత్, శ్రీలంక దేశాల మధ్య ప్రస్తుతమున్న సహకారాన్ని పెంచుకుని, సంబంధాలను మరింత బలోపేతం చేసుకునేందుకు గల మార్గాలపై చర్చించారు. శ్రీలంక ఆర్థిక వ్యవస్థ పునర్నిర్మాణానికి భారత్ మద్దతు కొనసాగుతుందని హామీ ఇచ్చారు. ఒక రోజు పర్యటన నిమిత్తం జై శంకర్ శుక్రవారం ఉదయం కొలంబో చేరుకున్నారు. శ్రీలంక అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన దిసనాయకెకు అభినందనలు తెలియచేశారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఇరు దేశాల ప్రజలు, ఈ ప్రాంత ప్రయోజనాల కోసం సహకారాన్ని పెంచుకునేందుకు గల అవకాశాలపై విస్తృతంగా చర్చించామని తెలిపారు. నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పిపి) అధికారంలోకి వచ్చిన 15రోజుల్లోగా శ్రీలంకలో పర్యటించిన తొలి విదేశీ నేత జైశంకర్. తొలుత విమానాశ్రయంలో శ్రీలంక విదేశాంగ కార్యదర్శి అరుణి విజెవర్ధనె, శ్రీలంకలో భారత హై కమిషనర్ సంతోష్ ఝూలు ఆయనకు స్వాగతం పలికారు. అంతకుముందు శ్రీలంక విదేశాంగ మంత్రి విజిత హెరాత్‌తో జై శంకర్ భేటీ అయ్యారు. ఆయన విస్తృతాంశాలపై చర్చలు జరిపినట్లు తెలియచేశారు. ఇరు దేశాల భాగస్వామ్యంలోని వివిధ అంశాలను సమీక్షించామన్నారు. పొరుగువారికి ప్రాధాన్యతనివ్వాలనే తమ విధానంతో, సాగర్ దృక్పథం మార్గనిర్దేశనంతో సంబంధాలను ముందుకు తీసుకెళతామన్నారు.

జైళ్ళలో కుల వివక్షపై సుప్రీం తీర్పు హర్షణీయం

స్వాగతించిన సీపీఐ(ఎం)

న్యూఢిల్లీ : జైళ్లలో కుల వివక్షను ప్రదర్శించే పద్ధతులకు స్వస్తి పలుకుతూ చర్యలు తీసుకోవాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) స్వాగతించింది.

ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ తీర్పు ఇచ్చింది. అభ్యంతరకరమైన, అత్యంత హేయమైన కుల వ్యవస్థకు వ్యతిరేకంగా జరగాల్సిన పోరాటంలో న్యాయ వ్యవస్థ చేసుకున్న జోక్యం చాలా కీలకమైనదని పేర్కొంది.

'గౌరవంతో జీవించే హక్కును బందీలకు కూడా విస్తరించాలి' అని కోర్టు స్పష్టం చేసింది. వివిధ జైళ్ళ మాన్యువల్స్‌లో, చట్టాల్లో కుల వివక్షను, విభజనను అనుమతించే నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమని కోర్టు పేర్కొంది. కుల వివక్ష, అస్పృశ్యతా భావనల ప్రాతిపదికన ఖైదీలకు పనులు కేటాయించడం, వారిని వుంచే ప్రాంతాలను నిర్ణయించడం, ఆహార సన్నాహాలకు సంబంధించిన నిబంధనలను ఎత్తిచూపుతూ వీటన్నింటినీ వెంటనే జైళ్ళ మాన్యువల్స్ నుండి తొలగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. జైళ్ళ నుండి కుల వివక్షను పూర్తిగా నిర్మూలించేందుకు నిర్దేశించిన మూడు మాసాల్లోగా కోర్టు సూచించిన ఈ చర్యలన్నింటినీ ప్రభుత్వాలు తీసుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది.

మహారాష్ట్ర సచివాలయం మూడో అంతస్తు నుండి దూకిన డిప్యూటీ స్పీకర్ మరో ముగ్గురు సభ్యులు

ముంబయి : మహారాష్ట్ర సెక్రటేరియట్‌లో శుక్రవారం అనూహ్యమైన సన్నివేశాలు చోటు చేసుకున్నాయి. ఎస్‌టి కేటగిరీలోకి ఒక కమ్యూనిటీని చేరుస్తున్నందుకు నిరసనగా మహారాష్ట్ర డిప్యూటీ స్పీకర్ నరహరి జిర్వాల్, మరో ముగ్గురు ఎంఎల్‌ఎలు అకస్మాత్తుగా రాష్ట్ర సచివాలయం మూడో అంతస్తు నుండి కిందకు దూకారు. అయితే మొదటి అంతస్తు వద్ద వున్న సేఫ్టీ నెట్‌లో వారు పడడంతో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాదాలు నివారించేందుకు 2018లో ఈ నెట్‌ను ఏర్పాటు చేశారు. అజిత్ పవార్ వర్గమైన నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి)కి చెందిన జిర్వాల్, బిజెపి ఎంపి సహా ముగ్గురు సభ్యులు సెక్రటేరియట్ భవనం పై నుండి దూకాలని నిర్ణయించుకున్నారు. ధన్‌గడ్ కమ్యూనిటీని ఎస్‌టి కేటగిరీలో చేర్చాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. దీన్ని వారు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ పరిణామం చోటు చేసుకుంది. నెట్‌లోకి పడిన తర్వాత వారు తిరిగి వెనక్కి వెళ్ళేందుకు చేస్తున్న ప్రయత్నాలు వీడియోలో కనిపిస్తున్నాయి. అంతకుముందు కొంతమంది గిరిజన ఎంఎల్‌ఎలు సచివాలయమైన మంత్రాలయ కాంప్లెక్స్‌లో కేబినెట్ సమావేశం జరుగుతుండగా నిరసన నిర్వహించారు. రాష్ట్రంలోని ధనగడ్ కమ్యూనిటీ ప్రస్తుతం ఇతర వెనుకబడిన తరగతులు (ఒబిసి) కేటగిరీలో వుంది. తమన ఎస్‌టి కేటగిరీలో చేర్చాలని ఆ సభ్యుల్లో కొంతమంది డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేస్తున్నారు. అనేక రాష్ట్రాల్లో ధన్‌గడ్‌లు ఎస్‌టిలుగా వున్నారని, తమను కూడా అందులో చేర్చాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

క్రిమినల్ కేసుల్లో సరైన సహకారం అందడం లేదు

- వట్టి జానయ్య కేసు విచారణలో సుప్రీం వ్యాఖ్యలు
- నాలుగు వారాల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశం
- సుప్రీంకోర్టు ముందుకు హాజరైన తెలంగాణ డీజీపీ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

క్రిమినల్ కేసుల్లో తెలంగాణ నుంచి సరైన సహకారం అందడం లేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. వట్టి జానయ్య దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణలో భాగంగా ఈ మేరకు అభిప్రాయపడింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తనపై ఒకే సారి తెలంగాణ పోలీసులు పెద్ద సంఖ్యలో కేసులు నమోదు చేయడాన్ని సవాల్ చేస్తూ సూర్యాపేటకు చెందిన బీఆర్ఎస్ మాజీ నేత వట్టి జానయ్య గతేడాది సెప్టెంబర్ 20న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇందుకు సంబంధించి ఆరు స్పెషల్ లీవ్ పిటిషన్లు(ఎస్ఎల్పీ) దాఖలు చేశారు. తెలంగాణ ప్రభుత్వం (గత బీఆర్ఎస్ సర్కార్) తనపై ఒకేసారి అక్రమాస్తులు, నేరపూరిత బెదిరింపులు, దొంగతనం, దోపిడీ కేసులకు సంబంధించి పదుల సంఖ్యలో కేసులు నమోదు చేసిందని పేర్కొన్నారు. గత విచారణ సందర్భంగా ప్రాసిక్యూషన్, ప్రభుత్వ న్యాయవాది మధ్య సంబంధం లేనట్టు స్పష్టంగా కనిపిస్తుందని వ్యాఖ్యానించింది. తాము లేవనెత్తిన అంశాలకు రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది సమాధానం చెప్పలేకపోతున్నందున కోర్టు ముందు హాజరుకావాలని డీజీపీకి నోటీసులు ఇచ్చింది.

దీంతో శుక్రవారం విచారణ సందర్భంగా రాష్ట్ర డీజీపీ వర్చువల్ మోడ్‌లో కోర్టు ముందు హాజరయ్యారు. 'క్రిమినల్ కేసులో మీ రాష్ట్రం నుంచి సరైన సహాయం అందడం లేదు. ఇది ప్రతిసారి కనిపిస్తోంది. జానయ్య కేసుల్లో ప్రభుత్వ తరపు న్యాయవాది వాదనల్లో అసమానతలకు ఎవరు బాధ్యులు. తప్పు ఎవరిది? మీ దర్యాప్తు చేస్తోన్న అధికారులదా? రాష్ట్ర ప్రభుత్వానిదా? వీరిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు' అని డీజీపీని ప్రశ్నించింది. ఇందుకు డీజీపీ జితేందర్ బదులిస్తూ మరోసారి ఇలాంటి పొరపాట్లు జరగనీవబోమని కోర్టును అభ్యర్థించారు.

'ఇలాంటి వాటికి మళ్లీ అవకాశం ఇవ్వం. పొరపాట్లు జరగకుండా చూస్తాం. సంబంధిత అధికారులపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం. చర్యలను జవాబుదారీగా తీసుకుంటాం' అని తెలిపారు. ప్రస్తుత జానయ్య కేసులో తీసుకున్న చర్యలపై సరైన వివరణ లేదని కోర్టు అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఈ అసమానతలపై నాలుగు వారాల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది.

మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులో రూ. లక్ష కోట్ల కుంభకోణం

- ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల కుంభకోణం దాగి ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతలు చిరుమళ్ల రాకేష్ కుమార్ ,మన్నె గోవర్ధన్ రెడ్డి, తుంగబాలుతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ హయాంలో రూ.16 వేల కోట్లతో ప్రతిపాదించారని గుర్తుచేశారు. రూ.3,800 కోట్లతో స్పెషల్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ,అందమైన బ్రిడ్జిలు నిర్మాణం చేశారని తెలిపారు.సైకో సీఎంగా తయారైన రేవంత్ రెడ్డి శాడిస్టులాగా పేదల ఇండ్లపై పడ్డారనీ, దమ్ముంటే మూసీ దగ్గరికి రావాలని సవాల్ చేశారు. అక్కడికి వస్తే రేవంత్ రెడ్డి వీపును పుచ్చపండు చేస్తారని హెచ్చరించారు. కాళేశ్వరంతో 38 లక్షల ఎకరాలకు నీరు పారుతుందని తెలిపారు.

రష్యాతో ఎన్నడూలేనంత స్నేహ సంబంధాలు

చైనా



రష్యా, చైనాల మధ్య సంబంధాలు ఎన్నడూ లేనంత బలమైన స్థాయికి చేరుకున్నాయని బీజింగ్ విదేశాంగ మంత్రి వాంగ్ యి అన్నాడు. బుధవారంనాడు రెండు పొరుగు దేశాల మధ్య అధికారిక దౌత్య సంబంధాల 75వ వార్షికోత్సవం జరిగింది. పీపుల్స్ డైలీ వార్తాపత్రికలో వార్షికోత్సవానికి అంకితం చేసిన వాంగ్ భాగం ప్రకారం, సమగ్ర వ్యూహాత్మక సమన్వయం, పరస్పర ప్రయోజనకరమైన సహకారం రష్యాతో సంబంధాలకు ప్రధాన స్తంభంగా మారాయి. "అంతర్జాతీయ సంబంధాల ప్రాథమిక నిబంధనలపై మాకు బలమైన అవగాహన ఉంది. ఆధిపత్యం, బలవంతపు విధానానికి వ్యతిరేకత, అక్రమ ఏకపక్ష ఆంక్షలు, 'లాంగ్-ఆర్మ్ అధికార పరిధి', అలాగే జోక్యానికి వ్యతిరేకత వంటి అంశాలపై మాకు స్పష్టమైన అవగాహన ఉంది. సార్వభౌమ దేశాల అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోము" అని వాంగ్ అన్నాడు.

గ్లోబల్ సౌత్ అభివద్ధికి బ్రిక్స్ గ్రూప్, షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్‌ల పెరుగుదల, ప్రభావాన్ని ప్రోత్సహించడానికి, జీ-20, ఆసియా-పసిఫిక్ ఆర్థిక సహకారంతో సహకరించడానికి మాస్కో, బీజింగ్‌ల ఉమ్మడి ప్రయత్నాల ప్రాముఖ్యతను మంత్రి నొక్కిచెప్పాడు. "అంతర్జాతీయ పరిస్థితి ఎలా మారినప్పటికీ, మూడవ దేశాలను లక్ష్యంగా చేసుకోని చైనీస్-రష్యన్ సంబంధాల అలీన (నాన్-అలైన్డ్), ఘర్షణ స్వభావంలేని సారాంశం మారదు" అని వాంగ్ చెప్పాడు. పరస్పర గౌరవం, పరస్పర ప్రయోజనకరమైన సహకారంపై ఇరు దేశాల సంబంధాలు ఆధారపడి ఉన్నాయని ఆయన తెలిపాడు.

రెండు దేశాల మధ్య వాణిజ్య, ఆర్థిక సంబంధాలు బలపడుతున్నాయని దౌత్యవేత్త పేర్కొన్నాడు. రష్యా నుంచి దిగుమతి అవుతున్న వ్యవసాయ, ఆహార ఉత్పత్తుల పరిమాణం పెరుగుతోందని, చైనా కార్లు, స్మార్ట్ ఫోన్‌లు రష్యాలో మరింత ప్రాచుర్యం పొందుతున్నాయని ఆయన హైలైట్ చేశాడు. ఇరు దేశాలు ఇప్పుడు శాస్త్రీయ, సాంకేతిక ఆవిష్కరణలు, ఆటోమొబైల్ తయారీ, క్రాస్-బోర్డర్ ఇ-కామర్స్, వైద్య పరికరాలతో సహా కొత్త రంగాలలో సహకరిస్తున్నాయని వాంగ్ చెప్పాడు.

పవర్ ఆఫ్ సైబీరియా గ్యాస్ పైప్‌లైన్, రష్యా నగరమైన బ్లాగోవెష్‌చెన్స్క్, చైనాలోని హీహెలను కలిపే హైవే బ్రిడ్జ్, అలాగే చైనా ప్రావిన్స్ హీలాంగ్‌జియాంగ్, రష్యా ఫార్ ఈస్ట్ మధ్య రైల్వే ఓవర్‌పాస్ వంటి ప్రధాన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను విజయవంతంగా ప్రారంభించడాన్ని కూడా ఆయన ప్రస్తావించాడు. చైనా తన బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్, యురేషియన్ ఎకనామిక్ యూనియన్ ఏర్పాటుపై సహకారం ఇప్పటికే మొదటి ఫలితాలను అందించిందని విదేశాంగ మంత్రి నొక్కిచెప్పాడు.

ప్రపంచం సమస్త

పెరగనున్న చమురు ధరల షాక్

బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్

ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య పెరుగుతున్న ఘర్షణ ప్రపంచ ఆర్థిక వ్యవస్థను 1970ల తరహా ఇంధన షాక్‌కు గురి చేయగలదని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ గవర్నర్ ఆండ్రూ బెయిలీ గురువారంనాడు గార్డియన్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపాడు. దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడి చేయడం, ఆ తరువాత ఇరాన్ ఇజ్రాయిల్‌పై బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిన కొద్దిసేపటికే ఈ హెచ్చరిక వచ్చింది. మధ్యప్రాచ్యంలో ప్రాంతీయ యుద్ధానికి అవకాశం ఉన్నందున చమురు ధరలు ఇప్పటికే 3 శాతం వరకు పెరిగాయి. డిసెంబర్ డెలివరీ కోసం బ్రెంట్ ఫ్యూచర్స్ 1.91 శాతం పెరిగి బ్యారెల్‌కు 75.31 డాలర్ల వద్ద ఉండగా, నవంబర్ డెలివరీకి యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ క్రూడ్ మధ్యాహ్నంకల్లా బ్యారెల్‌కు 2.21 శాతం పెరిగి 71.65 డాలర్లకి చేరుకుంది.

భౌగోళిక రాజకీయ ఆందోళనలు చాలా తీవ్రమైనవని, అత్యంత దగ్గరగా బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ పరిణామాలను గమనిస్తోందని బెయిలీ చెప్పాడు. "ఏమి జరుగుతుందో విషాదకరం. స్పష్టంగా ఒత్తిళ్లు ఉన్నాయి" అని అన్నారాయన. పరిస్థితులు విషమించిన కారణంగా పెరుగుతున్న ముడి చమురు ధరను నిరోధించడానికి చేయగలిగేదానికి పరిమితులు ఉన్నాయని సెంట్రల్ బ్యాంక్ చీఫ్ హెచ్చరించాడు. విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఈ ప్రాంతం నుంచి ముడి చమురు ప్రవాహానికి అంతరాయం కలిగించే మధ్యప్రాచ్యం అంతటా విస్తత వివాదం ఏర్పడే అవకాశం బలమైన ప్రపంచ-సరఫరా దక్పథాన్ని దెబ్బతీసింది. "మధ్యప్రాచ్యంలోని భౌగోళిక రాజకీయ ప్రమాదాల వల్ల ఏర్పడిన ప్రారంభ చికాకులను అనుసరించి మేం ప్రపంచ మార్కెట్‌లకు కొంత ప్రశాంతంగా తిరిగి రావడాన్ని చూశాం. అయితే, మార్కెట్ భాగస్వాములు రాబోయే ఇజ్రాయెల్ ప్రతిస్పందనపై ఇప్పటికీ ఒక కన్ను ఉంచుతున్నారు" అని ఐజీ



యాప్ జున్ రాంగ్‌లోని మార్కెట్ వ్యూహకర్త బిజినెస్ స్టాండర్డ్ కి చెప్పాడు.

ఈ వారం ప్రారంభంలో, ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) ఇజ్రాయిల్‌పై దాదాపు 200 క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడి గాజా, లెబనాన్‌లపై ఇజ్రాయిల్ బాంబు దాడులకు ప్రతిస్పందనగా, ఇటీవల హమాస్, హిజ్బుల్లా అధిపతులను ఇజ్రాయిల్ డిఫెన్స్ ఫోర్సెస్ చంపినందుకు ప్రతీకారంగా పేర్కొంది. పశ్చిమ జెరూసలేం, అంతకుముందు రోజు, దక్షిణ లెబనాన్‌లోని హిజ్బుల్లాకు వ్యతిరేకంగా భూదాడులను ప్రారంభించింది. ఈ ఆపరేషన్, తీవ్రమైన వైమానిక దాడులతో పాటు, హిజ్బుల్లా ద్వారా క్రాస్-బోర్డర్ రాకెట్, మోర్టార్ దాడులను ఆపడం లక్ష్యంగా ఇజ్రాయిల్ పెట్టుకుంది.గత అక్టోబరులో పశ్చిమ జెరూసలేం పాలస్తీనాకు చెందిన గాజాను ముట్టడించిన తర్వాత, దక్షిణ ఇజ్రాయిల్‌లోకి హమాస్ మిలిటెంట్ గ్రూప్ చేసిన ఘోరమైన చొరబాటుకు ప్రతిస్పందనగా ఇజ్రాయిల్ ఉత్తర సరిహద్దులో హింస పెరిగింది. హిజ్బుల్లా పాలస్తీనియన్లకు మద్దతు ఇవ్వటమే కాకుండా గాజాలో కాల్పుల విరమణ కుదిరినప్పుడు మాత్రమే సరిహద్దు రాకెట్ దాడులను ఆపివేస్తానని ప్రతిజ్ఞ చేసింది. హమాస్‌ను పూర్తిగా "తొలగించడమే" ఇజ్రాయిల్ లక్ష్యంగా ఉంది. వాషింగ్టన్ నుంచి సంధి కోసం బహిరంగంగా చేసిన పిలుపులను అది పదేపదే తిరస్కరించింది.



మాట ఇస్తే నెరవేర్చుతాం

- రూ.2 లక్షల రుణమాఫీతో పాటు.. ఆ పైగా ఉన్న వారికి సైతం త్వరలో మాఫీ: మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

నవతెలంగాణ-కామారెడ్డి

కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే దాన్ని నెరవేరుస్తుందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టంచేశారు. రైతుల రుణమాఫీ చేయబోమని ఎవరూ అనుమానాలు పెట్టుకోవద్దన్నారు. ప్రతి ఒక్కరికి రెండు లక్షల వరకు ఉన్న రుణమాఫీ చేసి తీరుతామని స్పష్టం చేశారు. ఆ పైన ఉన్నవారికి సైతం రూ.2 లక్షలు మాఫీ అవుతాయని, త్వరలో రైతు భరోసా అందించనున్నట్టు తెలిపారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి తన సొంత జిల్లా నిజామాబాద్‌కు వస్తున్న సందర్భంగా కామారెడ్డి నియోజకవర్గంలోని భిక్కనూర్ టోల్ గేట్ వద్ద కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. మహేష్ కుమార్ వెంట ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు ఉన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో తుమ్మల మాట్లాడుతూ.. సన్నవడ్లకు రూ.500 బోనస్ అందిస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో త్వరలో డిజిటల్ కార్డు అందిస్తామని, దాంతోనే హెల్త్ కార్డు, రేషన్ అన్ని సదుపాయాలు పొందుపరుస్తామని చెప్పారు. షబ్బీర్‌అలీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కష్టపడి నాయకులను గెలిపించి పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారని, ఇప్పుడు నాయకులం కష్టపడి కార్యకర్తలను గెలిపించుకుంటామని తెలిపారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం అందరూ కృషి చేయాలని అన్నారు.

ఢిల్లీ లిక్కర్ స్కాం

- సీబీఐ కేసులో కోర్టు ముందుకు కవిత, సహ నిందితులు
- తదుపరి విచారణ 19కి వాయిదా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఎస్సీ, ఎస్టీ ఉప వర్గీకరణ తీర్పును పున:సమీక్షించాలని దాఖలైన రివ్యూ పిటిషన్లను సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తిరస్కరించింది. గతంలో ఎస్సీ, ఎస్టీ ఉపవర్గీకరణకు అనుకూలంగా ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై రివ్యూ చేయాలని, మాలమహానాడు జాతీయ అధ్యక్షులు జి. చెన్నయ్యతో పాటు, మరో 31 పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లు శుక్రవారం సీజేఐ డివై చంద్రచూడ్‌తో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా ఈ పిటిషన్లను తిరస్కరిస్తున్నట్టు సుప్రీం వెల్లడించింది

'ఎస్సీ, ఎస్టీ ఉపవర్గీకరణ తీర్పు పున:సమీక్ష' పిటిషన్లు తిరస్కరణ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో సీబీఐ దాఖలు చేసిన సప్లమెంటరీ చార్జిషీట్‌పై విచారణను రౌస్ అవెన్యూ కోర్టు మరోసారి వాయిదా వేసింది. సీబీఐ చార్జిషీట్‌లోని కొన్ని పేజీలను తెలుగు నుంచి ఇంగ్లీష్‌లోకి అనువాదించి ఇవ్వాలని సీబీఐ అధికారులను గతంలో కోర్టు ఆదేశించింది. అయితే అప్ డేట్ చేసిన కాపీలను దర్యాప్తు సంస్థ నిందితులకు అందించేందుకు మరికొంత సమయం కోరింది. దీంతో తదుపరి విచారణను అక్టోబర్ 19కి వాయిదా వేస్తున్నట్టు ట్రయల్ కోర్టు వెల్లడించింది. అయితే ఈ చార్జిషీట్లపై శుక్రవారం సీబీఐ కోర్టు స్పెషల్ జడ్జ్ కావేరి బవేజా విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా కవితతో పాటు, ఈ కేసులోని సుమారు 40 మంది సహ నిందితులు వర్చువల్ మోడ్‌లో కోర్టు ముందు హాజరయ్యారు. సీబీఐ చార్జిషీట్‌లో స్పష్టంగా లేని పలు పేజీల విషయాన్ని కవిత, సహ నిందితుల తరపు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. గతంలో కోరినప్పటికీ, దర్యాప్తు సంస్థలు మరోసారి పాత కాపీలే సర్వ్ చేశారని నివేదించారు. ఇందుకు సీబీఐ అప్‌డేట్ చేసిన కాపీలు అందించేందుకు కొంత సమయం కావాలని కోరింది. అలాగే ఇదే కేసులో అరబిందో ఫార్మసీ డైరెక్టర్ శరత్ చంద్రారెడ్డి పాత్రపై సీబీఐ దాఖలు చేసిన నాలుగో సప్లమెంటరీ చార్జిషీట్‌లోనూ కొన్ని మార్పులు కోరారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న స్పెషల్ జడ్జ్ కావేరి భవేజా, ప్రతివాదులు అడిగినట్టు స్పష్టతతో కూడిన కాపీలను సప్లై చేయాలని సీబీఐకి ఆదేశించారు.

ఫెర్రీ బోల్తా పడి 87మంది మృతి

గోమా : కాంగోలోని కివూ చెరువులో ఫెర్రీ మునిగి గురువారం 87మంది చనిపోయారని స్థానిక అధికారులు తెలిపారు. దక్షిణ కివూ ప్రావిన్స్‌లోని మినొవా పట్టణం నుండి వస్తున్న ఈ ఫెర్రీ ఉత్తర కివూ రాజధాని గోమా శివార్లలో కిటుకు ఓడరేవుకు సమీపంలో బోల్తా పడింది. మరో 78మంది ఆచూకీ తెలియకుండా పోయారని రాష్ట్ర ప్రభుత్వం తెలియచేసింది. వెలికితీసిన 87 భౌతిక కాయాలను గోమాలోని ఆస్పత్రికి తరలించారు. బతికి బయటపడిన మరో 9మందిని కూడా ఆస్పత్రిలో చేర్చారు. మొత్తంగా బోటులో ఎంతమంది వున్నారన్నది తెలియరాలేదు. కానీ బోటు ఓవర్‌లోడ్‌తో ప్రయాణిస్తోందని స్థానిక వర్గాలు తెలిపాయి. ఓడరేవుకు 700మీటర్ల దూరంలో వుండగా, ఒక్కసారిగా వచ్చిన నీటి కుదుపునకు బోటు తట్టుకోలేకపోయి తిరగబడిందని కిటుకు పోర్ట్ సిబ్బంది చెప్పారు. సాయుధ గ్రూపులు, మిలటరీ మధ్య ఘర్షణల కారణంగా నెలల తరబడి గోమా, మినోవా మధ్య రోడ్డు సంబంధాలు దెబ్బతినడంతో బోట్లలో ప్రయాణించే వారి సంఖ్య పెరిగిపోయింది. బలమైన గాలులు, ఓవర్‌లోడింగ్ కారణంగా బోటు ప్రమాదాలు కూడా తరచుగా చోటు చేసుకుంటున్నాయి.